ఈనాడు

విజయవాడ 21-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 192


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




NISSAN
THE NEW CLASS OF PREMIUMNESS
Plush Suede & Leatherette Seats | Intuitive Floating 20.32 cm Infotainment Screen | Dual Tone Interior
(with Wireless Android Auto™ & Apple CarPlay^)


THE NEW CLASS OF JOYFUL VERSATILITY
Multiple Modular Configurations | Recline & Slide 2nd Row Seats and Removable 3rd Row Seats | 625L+ Boot Space


INDUSTRY-FIRST VIRTUAL SALES ASSISTANT
SCAN TO INTERACT NOW
THE NEW CLASS OF COMFORT & ROOMINESS
Tropicalised AC with 3-Row Vents | 7-Seat Comfort-First Design | Spacious Cabin & Ergonomic Seating

ఈనాడు
విజయవాడ 21-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 192
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ట్రంప్ సుంకాలు చెల్లవు



అధ్యక్షుడికి అమెరికా సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ

- ప్రపంచ దేశాలపై విధించిన భారీ టారిఫ్‌ల రద్దు
- 6:3 మెజారిటీతో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు
- కోర్టు తీర్పుపై మండిపడిన ట్రంప్
- మరింత రెచ్చిపోతూ 10% సుంకం విధిస్తున్నట్లు ప్రకటన
- ధర్మాసనం విదేశీ ప్రభావానికి గురైందని ఆక్షేపణ
- భారత్‌తో ఒప్పందానికి ముప్పేమీ లేదని వెల్లడి

ఆ జడ్జీలను చూసి సిగ్గుపడుతున్నా

సుప్రీంకోర్టు నిర్ణయం దేశానికి అవమానకరం. ఆ జడ్జీలను చూసి సిగ్గుపడుతున్నా. వారి తీర్పు నన్ను తీవ్రంగా నిరాశపరిచింది. ధర్మాసనం విదేశీ ప్రభావానికి గురైనట్లుంది. ఈ కోర్టులను ఏదో ఒకటి చేయాలి. వివిధ దేశాలపై సుంకాల విధింపులో వెనక్కి తగ్గేదే లేదు. అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ)లోని సెక్షన్ 122ని ఉపయోగిస్తూ ప్రపంచ దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తా. భారత్‌తో కుదిరిన ఒప్పందానికి వచ్చే ముప్పేమీ లేదు. – డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలపై ఎడాపెడా భారీ సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సర్వోన్నత న్యాయస్థానంలో శుక్రవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా చట్టసభల(కాంగ్రెస్) అనుమతిలేకుండా విధించిన ఆ సుంకాలను రద్దు చేస్తూ తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం 6:3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. అధ్యక్షుడి అత్యవసర అధికారాల చట్టాన్ని వినియోగిస్తూ ప్రతీకార సుంకాలు విధించడాన్ని కూడా ధర్మాసనం తప్పు పట్టింది. రాజ్యాంగం ప్రకారం చట్టసభలకు మాత్రమే పన్నులు, సుంకాల విధింపు అధికారం ఉంటుందని స్పష్టంచేసింది. 'పన్నులు, సుంకాలు విధించే అధికారాన్ని రాజ్యాంగ నిర్మాతలు కార్యనిర్వాహక శాఖకు ఇవ్వలేదు' అని మెజారిటీ తీర్పు రాసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ పేర్కొన్నారు. అయితే, ఆరుగురు న్యాయమూర్తుల మెజారిటీ తీర్పునకు భిన్నంగా ముగ్గురు జడ్జీలు విడిగా అసమ్మతి తీర్పును రాశారు. టారిఫ్ విధానంలోని మంచి చెడ్డలు ఎలా ఉన్నప్పటికీ అధ్యక్షుడి నిర్ణయం చట్టబద్ధమేనని, గతంలోనూ ఈ తరహా చర్యలు తీసుకున్నారని ముగ్గురు జడ్జీలు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భారత్‌పై అదనంగా విధించిన సుంకాలను, ప్రతీకార సుంకాలను (మిగతా 3లో)

భారత్‌పై ప్రభావమెంత?

ప్రతీకార సుంకాలు రద్దు కావడం వల్ల సగానికిపైగా భారత ఎగుమతులపై 18 శాతం అదనపు సుంకాల భారం తొలగనుంది. దీంతో అత్యధిక ప్రాధాన్య దేశాలపై విధించే ప్రామాణిక సుంకాలు మాత్రమే భారత్‌కు వర్తించే అవకాశం ఉంది. మిగిలిన ఎగుమతులపై ఐఈఈపీఏ సెక్షన్ 232 కింద సుంకాలు కొనసాగుతాయి. ఉక్కు, అల్యూమినియంలపై 50 శాతం, కొన్ని ఆటోమొబైల్ పరికరాలపై 25 శాతం సుంకం వర్తిస్తుంది. ఎగుమతి విలువలో దాదాపు 40 శాతం ఉండే స్మార్ట్ ఫోన్లు, పెట్రోలియం ఉత్పత్తులు, ఔషధాలు సుంకాల నుంచి మినహాయింపు పొందుతాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భారత్.. అమెరికాతో తన వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షించుకునేందుకు వీలు కలిగింది.

7 దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు

భవిష్యత్తు టెక్నాలజీని అందిపుచ్చుకొనేలా విద్యార్థులు, యువతకు ఏఐ, క్వాంటమ్ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు, ప్రభుత్వ కార్యకలాపాల్లో ఆ రెండు సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం ద్వారా ప్రజలకు మరింత వేగంగా, సులభంగా పౌరసేవలు అందించడానికి ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. – రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్రంలో క్వాంటమ్, ఏఐ టెక్నాలజీ విస్తరణే లక్ష్యం
- విద్యార్థులు, యువతకు కొత్త సాంకేతికతల్లో శిక్షణ
- సీఎం చంద్రబాబు సమక్షంలో సంతకాలు



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో భారత్ జెన్– నెక్స్ట్‌జెన్– ఐబీఎం ప్రతినిధులతో ఒప్పంద పత్రాలు మార్చుకున్న రాష్ట్ర అధికారులు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడు దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. ఇందులో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూఎన్ఐసీసీ), ఐబీఎం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, భారత్ జెన్- నెక్స్ట్‌జెన్-ఐబీఎం, కాలిబో ఏఐ, వైజర్, ఐఐటీ మద్రాస్‌లు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై.. దిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. రాష్ట్రంలో ఏఐ, క్వాంటమ్ అనుకూల వాతావరణం పెంపొందించడానికి ఈ ఏడు ఒప్పందాలు బాటలు వేస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయా ఒప్పందాల వివరాలివీ..

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు యూఎన్ఐసీసీతో: క్వాంటమ్, ఏఐ రంగాల్లో రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం యూఎన్ఐసీసీతో ఒప్పందం చేసుకొంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటమ్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సెంటర్‌ను ఏఐ- క్వాంటమ్ డిజిటల్ ఎంబసీగా తీర్చిదిద్దుతారు. ఈ కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ (మిగతా 2లో)

అమరావతి క్వాంటమ్ వ్యాలీపై.. ప్రపంచమంతా మాట్లాడే రోజొస్తుంది

- ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న 'ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026'లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 'కృత్రిమ మేధస్సుతో పోటీతత్వం' అన్న అంశంపై శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి పాల్గొని ప్రసంగించారు. 'ఏపీ ప్రభుత్వం ఏఐ సాంకేతిక విస్తృతికి తీవ్రంగా కృషి చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. గూగుల్ లాంటి సంస్థల రాకతో విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా (మిగతా 2లో)


సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఖాకీ-ఖద్దరు కుమ్మక్కు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసే ఇందుకు ప్రబల తార్కాణం

నిందితుడు అనంతబాబుతో పోలీసుల చెట్టపట్టాలు

అతనికి డీఫాల్ట్ బెయిల్ పళ్లెంలో పెట్టి ఇవ్వడానికి అన్ని ప్రయత్నాలూ చేశారు



- ఇంత చేసిన పోలీసులపై ఇప్పటి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోలేదేం?
- కనీసం షోకాజ్ నోటీసైనా ఇచ్చారా?
- దర్యాప్తు అధికారిపై నియంత్రణ లేని డీజీపీకి కొనసాగే అర్హతెక్కడిది?
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం
- నవంబరు 30లోపు విచారణ పూర్తిచేయాలని ఆదేశం


సుబ్రహ్మణ్యం


అనంతబాబు

ఈనాడు, దిల్లీ: వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 మేలో జరిగిన దళిత యువకుడు, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో ప్రధాన నిందితుడు, ఎమ్మెల్సీ అనంతబాబుతో పోలీసులు పూర్తిగా కుమ్మక్కయ్యారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ఘాటుగా వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారు, పోలీసుల మధ్య కుమ్మక్కుకు ఈ కేసు ప్రబల తార్కాణమని అభిప్రాయపడ్డారు. నిందితుడికి డీఫాల్ట్ బెయిల్‌ను పళ్లెంలో పెట్టి ఇవ్వడానికి పోలీసు అధికారులు అన్ని ప్రయత్నాలూ చేసినట్లు చెప్పారు. ఆ కుట్రలో భాగంగానే ఛార్జిషీట్‌తో పాటు ఎఫ్ఎస్ఎల్ నివేదిక దాఖలు చేయలేదని ఆక్షేపించారు. ఈ మొత్తం వ్యవహారంలో నిందితుడితో పోలీసులు చెట్టపట్టాలేసుకొని తిరిగారని మండిపడ్డారు. ఇంత చేసిన పోలీసు అధికారులపై ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యం చేసిన అధికారుల సస్పెన్షన్ మాట అటుంచి... కనీసం షోకాజ్ నోటీసైనా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. దర్యాప్తు అధికారిపై నియంత్రణ లేని డీజీపీకి పదవిలో కొనసాగే అర్హత ఎక్కడుంటుందని ప్రశ్నించారు. ఈ కేసు విచారణను నవంబరు 30లోపు పూర్తిచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆ బాధ్యతలను సీనియర్ న్యాయాధికారికి అప్పగించి ప్రతివారం విచారణ కొనసాగేలా చూడాలని నిర్దేశించారు. (మిగతా 2లో)

నాడు నీరుగార్చి.. నేడు నిగ్గుతేల్చి..

సుబ్రహ్మణ్యం హత్యకేసులో దాచేసిన 'అనంత' నిజాలు లోపలి పేజీలో
- వైకాపా హయాంలో విచారణ డొల్ల
- అనంతబాబు దంపతులు ఘటనాస్థలంలోనే ఉన్నా దర్యాప్తు లేదు
- తదుపరి విచారణలో నిగ్గుతేల్చిన సిట్

ప్యాక్స్ సిలికా కూటమిలో భారత్



'ప్యాక్స్ సిలికా'లో భారత్ చేరిన సందర్భంగా ఒప్పంద పత్రాలతో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా రాయబారి సెర్గియో గోర్, అమెరికా ఆర్థిక వ్యవహారాల ఉప మంత్రి జాకబ్ హెల్‌బర్గ్ తదితరులు

దిల్లీ: అమెరికా నేతృత్వంలో ఏర్పడిన వ్యూహాత్మక కూటమి 'ప్యాక్స్ సిలికా'లో భాగస్వామిగా భారత్ శుక్రవారం చేరింది. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సంబంధిత ఒప్పందంపై సంతకాలు చేసింది. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా ఆర్థిక వ్యవహారాల ఉప మంత్రి జాకబ్ హెల్‌బర్గ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్యాక్స్ సిలికా కూటమిలోకి భారత్‌కు స్వాగతం పలుకుతూ.. కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ విషయాల్లో ఒక దేశ గుత్తాధిపత్యాన్ని అంతం చేయడానికి ఈ కూటమి ఏర్పడినట్టు హెల్‌బర్గ్ పేర్కొన్నారు. ఒకే దేశంపై ఆధారపడాల్సిన పరిస్థితి కారణంగా కీలక ఖనిజాల సరఫరా విషయంలో బెదిరింపులకు, బ్లాక్‌మెయిల్‌కు గురికావాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం రేర్‌ఎర్త్ ఖనిజాల సరఫరాను నియంత్రిస్తున్న (మిగతా 2లో)

బెంగాల్ 'సర్' విధుల్లో జిల్లా జడ్జీలు

- ప్రస్తుత, రిటైర్డ్ న్యాయాధికారులను కేటాయించండి
- కలకత్తా హైకోర్టుకు సుప్రీంకోర్టు అసాధారణ ఆదేశం
- రాష్ట్రం, ఎన్నికల సంఘం మధ్య విశ్వాసరాహిత్యంపై తీవ్ర విచారం



దిల్లీ: రాజ్యాంగ వ్యవస్థలైన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య విశ్వాస రాహిత్యం నెలకొనడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ రెండు వ్యవస్థల మధ్య నిందల పర్వం కొనసాగడం దురదృష్టకరమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ వివాదాస్పదం కావడాన్ని అసాధారణ పరిస్థితిగా పేర్కొంది. దీనిని సరిచేసేందుకు అసాధారణమైన ఉత్తర్వులు జారీ చేయక తప్పడంలేదని తెలిపింది. 'సర్' ప్రక్రియలో పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రజలకు నమ్మకాన్ని కలిగించేందుకు గాను న్యాయాధికారుల (జిల్లా జడ్జీలు, అదనపు జిల్లా జడ్జీల)ను ఈ విధులకు కేటాయించాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని శుక్రవారం ఆదేశించింది. సర్ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను న్యాయాధికారులు పరిశీలిస్తారని స్పష్టం చేసింది.

- పేర్లు, తల్లిదండ్రులు-పిల్లల వయసులో తేడాలు తదితర సహేతుక వ్యత్యాసాల కారణంగా ఓటరు జాబితాలో చోటు కోల్పోయిన వారి కేసులను పరిశీలించి నిర్ణయం తీసుకోవడంలో న్యాయాధికారులు సహాయపడతారని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పదవిలో కొనసాగుతున్న, ఇప్పటికే పదవీ విరమణ చేసిన న్యాయాధికారులను ఈ విధుల కోసం ఎంపిక చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్‌ను ఆదేశించింది.
- 'సర్' ప్రక్రియ పరిశీలనకు గ్రేడ్ 'ఎ' అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.
- రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఎన్నికల సంఘం అధికారులు, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్, కేంద్ర ప్రభుత్వ అదనపు (మిగతా 2లో)

ఏప్రిల్ 1 నుంచి టోల్‌ప్లాజాల్లో నగదు రహిత చెల్లింపులే.. లోపలి పేజీల్లో

ఇదీ సంగతి!




డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీలకు క్యూఆర్ కోడ్ స్మార్ట్‌కార్డులు

- చిప్‌తో కూడిన కార్డుల కంటే ఇవే మేలని నిర్ణయం
- వీటి సరఫరా నుంచి డెలివరీ వరకు గుత్తేదారుదే బాధ్యత
- ప్రస్తుతం 27 లక్షల కార్డులు పెండింగ్

ఈనాడు – అమరావతి

వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) కార్డులుగా.. ఇకపై క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులను రవాణాశాఖ జారీ చేయనుంది. చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డ్, చిప్ లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్‌కార్డులలో ఏది ఇవ్వాలనే దానిపై సుదీర్ఘ కసరత్తు అనంతరం క్యూఆర్ కోడ్ కార్డులపై మొగ్గుచూపారు. దీంతో 2024 అక్టోబరు నుంచి పెండింగ్ ఉన్న కార్డులన్నీ జారీ కానున్నాయి.



జగన్ ప్రభుత్వంలో బకాయిలు చెల్లించక నిలిపివేత

- రాష్ట్రంలో రోజుకు సగటున 8-10 వేల ఆర్‌సీ, డీఎల్ కార్డులు అవసరమవుతాయి.
- వీటికోసం ఒక్కో కార్డుకు రూ.200 ఫీజుతో పాటు, పోస్టులో పంపేందుకు రూ.35 కలిపి రూ.235 చొప్పున రవాణాశాఖ వసూలుచేస్తుంది.
- వైకాపా హయాంలో బకాయిలు చెల్లించకపోవడంతో గుత్తేదారు తరచూ స్మార్ట్‌కార్డుల సరఫరా ఆపేసేవారు. దీంతో లక్షలసంఖ్యలో కార్డులు పెండింగ్ ఉండేవి.
- చివరకు 2023 ఆగస్టు 1 నుంచి అసలు స్మార్ట్ కార్డుల జారీ విధానమే ఆపేశారు. వీటికి ఫీజు, పోస్టల్ ఛార్జీ వసూలు చేయలేదు.
- కూటమి అధికారంలోకి వచ్చాక.. అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్‌కార్డుల జారీ ఉన్నందున వాటిని మళ్లీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.
- 2024 అక్టోబరు 1 నుంచి రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు, డ్రైవింగ్ లైసెన్సులు పొందిన వారికి ఆర్‌సీ, డీఎల్ స్మార్ట్‌కార్డులు ఇచ్చేందుకు ఫీజులు వసూలుచేయడం ఆరంభించారు.

చిప్ విషయంలో తర్జనభర్జన

- చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డులు ఇవ్వాలా? చిప్ లేకుండా క్యూర్ కోడ్‌తో ఉన్న కార్డులు ఇవ్వాలా అనేదానిపై ఇంతకాలం తర్జనభర్జన జరిగింది.
- చిప్ ఉన్న స్మార్ట్ కార్డుల్లోని (మిగతా 3లో)

పెన్నుతో సెల్‌మోహన్‌రంగా

నాలుగు దశాబ్దాలుగా 6 వేల కలాల సేకరణ


'మొబైల్ పెన్ను'తో కాల్ చేస్తున్న వైవీ మోహన్

ఈనాడు – అమరావతి

అంగుళం పెన్ను నుంచి అడుగు పెన్ను వరకూ ఎప్పుడైనా చూశారా? సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్, విజిటింగ్ కార్డు, రాకెట్, సిరంజి, చేతి గడియారం, నెయిల్‌కట్టర్, స్క్రూడ్రైవర్, బోల్టు, కత్తెర, థర్మామీటర్, కారు, పక్షి ఈక, టూత్ బ్రష్, బండి తాళం, కాలిక్యులేటర్, మొబైల్ ఛార్జర్, టెస్టర్, వాయిస్ రికార్డర్ ఆకృతుల్లో కూడా పెన్నులు ఉంటాయని తెలుసా? విజయవాడ భారతీనగర్‌కు చెందిన వై.వి.మోహన్ ఇదంతా నిజమే అని చూపిస్తున్నారు. వస్త్ర వ్యాపారం చేసే ఆయన పెన్నుల సేకరణను అభిరుచిగా మలుచుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా 6 వేల పెన్నులు (మిగతా 2లో)

అమరావతి క్వాంటమ్ వ్యాలీపై..
ప్రపంచమంతా మాట్లాడే రోజొస్తుంది

(మొదటి పేజీ తరువాయి)


మారుతోంది. మరోవైపు క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన సంపూర్ణ ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నాం. ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాలను కూడా తయారు చేసేలా అడుగులు వేస్తున్నాం. అమరావతి క్వాంటమ్ వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు త్వరలోనే వస్తుంది' అని ధీమా వ్యక్తంచేశారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని, దాన్ని దేశం సాధించి తీరుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. 'నేటి మనిషి దైనందిన జీవితంలో ఏఐ అద్భుతాలను సృష్టిస్తుందన్న విశ్వాసం ఉంది. తారతమ్యాలు లేకుండా పౌరులందరికీ సమాన ప్రయోజనాలు కల్పించేలా సావరిన్ ఏఐని అందించేందుకు ప్రయత్నం


ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

చేస్తున్నాం. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లడంపై ఏపీ దృష్టి సారించింది. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయి. ఆ రంగాల్లో అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఇక్కడ అపార అవకాశాలున్నాయి. ప్రభుత్వపరంగా అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తున్నామ'ని ముఖ్యమంత్రి వివరించారు.

ప్రముఖ సంస్థల అధినేతలతో భేటీ

ఏఐ సమిట్ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ అంతర్జాతీయ కంపెనీల సీఈఓలతో సమావేశమయ్యారు. అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్‌కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహ్మాన్ ఐతుకైర్, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్‌హాల్, ఆధార్ వ్యవస్థాపక సీటీఓ శ్రీకాంత్ నాదముని, కాలిఫోర్నియాకు చెందిన ఖోస్లా వెంచర్స్ ఎండీ వినోద్ ఖోస్లాలతో చంద్రబాబు వరుసగా భేటీ అయ్యారు.



ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలేని సన్మానించి జ్ఞాపిక అందజేసిన సీఎం చంద్రబాబు ★ వరల్డ్ బ్యాంక్ గ్రూప్ ప్రతినిధి మహేష్ ఉత్తమ్ చందానితో భేటీ అయిన సీఎం చంద్రబాబు


దిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కాలిబో ఏఐ సంస్థ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రాష్ట్ర అధికారులు


ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చేసుకున్న ఒప్పంద పత్రాలను సీఎం చంద్రబాబు సమక్షంలో చూపుతున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ డైరెక్టర్ మదన్‌మోహన్ త్రిపాఠి, ఆ సంస్థ ప్రతినిధులు, అధికారులు


యువత శిక్షణకు రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పంద పత్రాలను సీఎం చంద్రబాబు సమక్షంలో చూపుతున్న ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఇతర ప్రతినిధులు

7 దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు

(మొదటి పేజీ తరువాయి)

సమీర్ చౌహాన్‌తోపాటు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష మందికి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ఐబీఎంతో..

క్వాంటమ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో రాష్ట్రంలోని లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఐబీఎంతో ఒప్పందం చేసుకొంది. ఐబీఎం గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, దక్షిణాసియా వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, రీసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీలు పాల్గొన్నారు.

క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు ఎన్ఐఈఎల్ఐటీతో...

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి ఏఐ, క్వాంటమ్ డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఆ సంస్థ ఏపీలో ఏర్పాటు చేస్తుంది. దీనికి మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేంద్రం నుంచి అందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం భూమి, హార్డ్‌వేర్ సమకూరుస్తుంది. అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి అవసరమైన కార్యాచరణను ఈ సంస్థ అమలు చేస్తుంది. ఒప్పందాల కార్యక్రమంలో ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ మదన్‌మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు చేసుకున్న ఒప్పంద పత్రాలను సీఎం చంద్రబాబు సమక్షంలో చూపిస్తున్న యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్, ఆ సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర అధికారులు

ఏఐ స్టాక్ నిర్మాణానికి భారత్ జెన్- నెక్స్ట్ జెన్- ఐబీఎంలతో..

రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్, 5 లేయర్డ్ స్వదేశీ ఏఐ స్టాక్ నిర్మించేందుకు భారత్ జెన్- నెక్స్ట్ జెన్- ఐబీఎంలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థలు వివిధ ప్రభుత్వ సంస్థలకు అవసరమైన సాంకేతిక సేవలు అందించడంతోపాటు, 22 భారతీయ భాషలను అనుసంధానించే ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేస్తాయి. ఒప్పంద కార్యక్రమంలో భారత్ జెన్ సీఈఓ హృషికేశ్ మోహల్‌బాల్, ప్రతినిధి రామకృష్ణ, నెక్స్ట్‌జెన్ సీఈఓ రాజగోపాల్, ఐబీఎం రీసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు.

50 ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ విస్తరణకు కాలిబోతో...

రాష్ట్రంలోని 50 ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీని విస్తరించేలా ఏఐ అకాడమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ రంగాల్లో డిగ్రీ, పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించడం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కోసం ఏఐ శాండ్‌బాక్స్, ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేయడం ఈ సంస్థ లక్ష్యం. ఏఐతో అనుసంధానమైన పాఠ్యాంశాల రూపకల్పన, నైపుణ్య శిక్షణ అంశాలపైనా దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో కాలిబో సంస్థ ప్రతినిధులు రాజ్ వట్టికూటి, అరబిందో సాహు, విపుల్ వలంజీ, పింటో జోయన్స్ జోహన్నెస్ ప్రోడర్‌లు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం వైజర్‌తో..

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కోసం వైజర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది చివరి నాటికి 3.50 లక్షల మంది, 2027 నాటికి 6 లక్షల మంది ఏఐ క్వాంటమ్ అభ్యాసకులను సిద్ధం చేయడం దీని ఉద్దేశం. ఒప్పంద కార్యక్రమంలో ఆ సంస్థ క్వాంటమ్ సొల్యూషన్స్ హెడ్ వర్ధన్ సెహగల్, రాజ్ వట్టికూటి పాల్గొన్నారు.

ఏఐ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తో..

రాష్ట్రంలో ఏఐ ట్యూటర్‌ను ఏర్పాటు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ మద్రాస్‌తో ఎంఓయూ చేసుకొంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్‌ను అందుబాటులోకి తేవడం ఆ సంస్థ ప్రధాన బాధ్యత. ఒప్పంద కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి, ప్రొఫెసర్ మితేష్‌లు పాల్గొన్నారు.


ఇవన్నీ పెన్నులే

పెన్నుతో సెల్‌మోహన్‌రంగా

(మొదటి పేజీ తరువాయి)

సేకరించారు. ఇందులో పాత కాలం ఫౌంటెన్ పెన్నుల నుంచి, విదేశాల నుంచి తెచ్చిన లిమిటెడ్ ఎడిషన్‌లూ ఉన్నాయి. బ్లూ, బ్లాక్, రెడ్, గ్రీన్, ఆరెంజ్, వయొలెట్, పింక్, బ్రౌన్ తదితర రంగుల్లో 3 వేల షేడ్స్‌లో రాసే పెన్నులు అతని అల్మారాలో భద్రంగా ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఆయన ఆర్డర్ ఇచ్చి మరీ చేయించారు. సెల్‌ఫోన్ పెన్నులో రెండు సిమ్‌లు, మెమోరీకార్డు వేసి ఇతరులతో మాట్లాడవచ్చు. 'వైవిధ్యంగా ఏదో ఒకటి చేయాలనే తపనతో ఇలా పెన్నుల సేకరణ మొదలుపెట్టాను. వీటి కోసం ఇప్పటివరకు రూ.లక్షల్లో ఖర్చు చేశాను' అని మోహన్ చెబుతున్నారు.


బోల్ట్ పెన్ను, కేజీ బరువున్న స్టీల్‌పెన్ను

దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా యూత్ కాంగ్రెస్ వ్యవహారశైలి: లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, అమరావతి : యూత్ కాంగ్రెస్ నేతలు ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆందోళన చేసి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవమానకర చర్య అంతర్జాతీయ వేదికపై దేశాన్ని నవ్వులపాలు చేసిందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు దేశం కంటే స్వార్థ ప్రయోజనాలే ఎక్కువని మండిపడ్డారు. ఈ ఘటనను వైకాపా ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. అందుకే ఆ పార్టీని పిల్ల కాంగ్రెస్ అంటారని ఎద్దేవా చేశారు.

మీ స్వార్థ రాజకీయాలకు దేవుణ్ని వాడుకుంటారా?

● వైకాపా నాయకులపై మంత్రి డోలా మండిపాటు

ఈనాడు, అమరావతి: స్వార్థ రాజకీయాల కోసం వైకాపా నాయకులు దేవుడిని వాడుకోవడం దుర్మార్గమని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. నిండు సభలో వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేసి సిగ్గు లేకుండా బుకాయిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

బీసీ సింహ గర్జన సభకు హైకోర్టు అనుమతి

ఈనాడు, అమరావతి: భారత చైతన్య యువజన పార్టీ(బీసీవైపీ) ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా బీసీ సింహ గర్జన పేరుతో ఈనెల 22న నిర్వహించనున్న బహిరంగ సభకు హైకోర్టు షరతులతో అనుమతిచ్చింది. సభ నిర్వహణకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బీసీవైపీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు!

డిజిటల్ మోసం నుంచి ఓసారి రక్షించిన పోలీసులు

15 రోజులకు మళ్లీ కాల్ ● రూ.49 లక్షలు మోసపోయిన వైనం

ఈనాడు, అమరావతి: డిజిటల్ అరెస్టు అనేది లేదని, ఆ పేరుతో వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు ఆ విశ్రాంత ఉద్యోగికి చిలక్కి చెప్పినట్లు చెప్పారు. రూ.72.50 లక్షలు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన అతణ్ని ఆపారు. ఎవరైనా ఇబ్బంది పెడితే.. తమను సంప్రదించాలని భరోసా ఇచ్చి మరీ పంపించారు. 15 రోజుల్లోనే మళ్లీ అలాంటి కాల్ రావడంతో ఈసారి ఆ విశ్రాంత ఉద్యోగి భయపడి, మోసగాళ్లకు రూ.49 లక్షలు బదిలీ చేసేశారు. విజయవాడలో స్థిరపడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి (65)కి గత నెలాఖరులో ఈడీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ కాల్ వచ్చింది. మీపై కేసులున్నాయని బెదిరించారు. యూనిఫాంలో ఉండి వీడియో కాల్ చేసిన ఓ వ్యక్తి తాను దర్యాప్తు అధికారినని, రూ.72.50 లక్షలు ఇస్తే కేసు మాఫీ చేస్తానని అన్నాడు. దీంతో విశ్రాంత ఉద్యోగి విజయవాడ రామచంద్రనగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లారు. తన పేరిట ఉన్న రూ.78 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేసి, అందులో రూ.72.50 లక్షలను మరో ఖాతాకు బదిలీ చేయాలని కోరారు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆ ఖాతా నంబరు పరిశీలిస్తే అది కోల్‌కతాకు చెందినదని తేలింది. దీంతో లావాదేవీ నిలిపేసి, మోసాలపై అవగాహన కల్పించి పంపించారు.

అయినా వినలేదు: తర్వాత విశ్రాంత ఉద్యోగి మళ్లీ బ్యాంకుకు వచ్చి, తాము బెంగళూరుకు మారిపోతున్నామని చెప్పి.. ఎఫ్‌డీ క్లోజ్ చేసి, ఆ మొత్తాన్ని తన పొదుపు ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. అనంతరం నగరంలోని ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచారు. అక్కడి నుంచి మోసగాళ్ల ఖాతాకు రూ.49 లక్షలు బదిలీ చేశారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది ప్రశ్నించినా.. తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నానని చెప్పారు. తీరిగ్గా నాలుగు రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించారు.

ఖాకీ-ఖద్దరు కుమ్మక్కు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పిన సమయంలోగా దాన్ని పూర్తిచేయడానికి వీలుగా సదరు న్యాయాధికారిపై వేరే పనిభారం లేకుండా చూడాలని సూచించారు. మధ్యలో హైకోర్టు స్టే ఇవ్వొద్దని, అలా ఇస్తే పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థ చట్టబద్ధంగా 90 రోజుల్లోపు పూర్తిస్థాయి ఛార్జిషీట్ దాఖలుచేయని కారణంగా తనకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ నిందితుడు 2022 అక్టోబరు 21న దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్.ఓకలతో కూడిన ధర్మాసనం 2022 డిసెంబరు 12న మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. గురువారం ఈ కేసు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. తొలుత అనంతబాబు తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ "కోర్టు ఛార్జిషీట్‌ను తిప్పిపంపిన తర్వాత నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ పొందే హక్కు ఉంటుందా? లేదా? అన్నది ప్రశ్న. అతనికి ఇంతకుముందే మధ్యంతర బెయిల్ ఇచ్చారు. 2022 నుంచి బయటే ఉన్నారు. ఇదివరకు దర్యాప్తు కూడా పూర్తయింది. కానీ మరోసారి విచారణ కొనసాగించి రెండు మూడు రోజుల క్రితం అదనపు ఛార్జిషీట్ దాఖలు చేశారు" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వాదనలను రాష్ట్రప్రభుత్వం తరఫున హాజరైన ప్రేరణాసింగ్, సిద్ధార్థలూథ్రా వ్యతిరేకించారు. "ఇది అత్యంత తీవ్రమైన కేసు. అందువల్ల కోర్టు లోతుగా పరిశీలించాలి. అప్పటి అధికారపార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుతో పోలీసులు కుమ్మక్కయ్యారు. పోలీసులు సకాలంలో ఛార్జిషీట్ దాఖలుచేసినా అందులో ఎఫ్ఎస్ఎల్ నివేదికను జతచేయలేదని కోర్టు దాన్ని తిప్పిపంపింది" అని తెలిపారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ "ఇప్పుడు మాకు విషయం అర్థమైంది. మీ గ్రేట్ పోలీసులను ఒకసారి చూడండి. వాళ్లు నిందితుడితో చెట్టపట్టాలేసుకొని తిరుగుతూ ఉద్దేశపూర్వకంగానే ఎఫ్ఎస్ఎల్ నివేదిక దాఖలు చేయలేదు. గతంలో అతను రాజకీయ పలుకుబడి ఉపయోగించారని మీరు చెబుతున్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేశారు? 2024-26 మధ్య మీ పోలీసులు రెండో ఛార్జిషీట్ మాత్రమే దాఖలుచేశారు. నిర్లక్ష్యం చేసిన పోలీసులపై ఏం చర్య తీసుకున్నారు? ఇంతకాలం దర్యాప్తు పూర్తిచేయని పోలీసు అధికారుల సస్పెన్షన్ మాట అటుంచండి... కనీసం షోకాజ్ నోటీసులైనా జారీచేశారా? దర్యాప్తు అధికారి బాధ్యతలను చూసే ఎస్పీని నియంత్రించే పరిస్థితుల్లో డీజీపీ లేకపోతే ఆయనకు అధికారంలో కొనసాగే అర్హత ఎలా ఉంటుందో చెప్పండి?" అని సిద్ధార్థ లూథ్రాపై ప్రశ్నల వర్షం కురిపించారు. మీకు చేతకాకపోతే దర్యాప్తును ఈ రోజే సీబీఐకి బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. జస్టిస్ బాగ్చి జోక్యం చేసుకుంటూ "మిస్టర్ లూథ్రా... ఇప్పుడు మీరు ఆలోచించాల్సింది నిందితుడి బెయిల్ గురించి కాదు... ముందు ఇలాంటి పోలీసు అధికారుల నుంచి ప్రాసిక్యూషన్‌ను రక్షించడం గురించి. నిర్లక్ష్యం వహించిన పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. లూథ్రా స్పందిస్తూ కొత్త ప్రభుత్వం వచ్చాక ఈ కేసు పునఃదర్యాప్తునకు అనుమతి తీసుకొని 3 నెలల్లోపు పూర్తిస్థాయి ఛార్జిషీట్ దాఖలు చేశామన్నారు. దర్యాప్తు అధికారిని మార్చి యువ అధికారికి బాధ్యతలు అప్పగించినట్లు కోర్టుకు విన్నవించారు. ప్రస్తుతం విచారణ ఏ స్థాయిలో ఉందన్న సీజేఐ ప్రశ్నకు సుబ్రహ్మణ్యం తల్లి తరఫున న్యాయవాది యలమంచిలి శివసంతోష్ బదులిస్తూ "ఇప్పటివరకూ కోర్టు ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడం కానీ, విచారణ మొదలుపెట్టడం కానీ జరగలేదు. విచారణ ఆరునెలల్లోపు పూర్తిచేసేలా ఆదేశించండి. అప్పుడే బాధితుల ప్రయోజనాలకు రక్షణ ఉంటుంది' ' అని విన్నవించారు. ప్రధాన సాక్షులను విచారించేవరకైనా ప్రధాన నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని సిద్ధార్థ లూథ్రా కోరారు. ప్రస్తుతం అతని భార్య ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సీజేఐ స్పందిస్తూ ' 'మీరు అన్నీ కోర్టు రూమ్‌లోనే సెటిల్ చేసుకోవాలనుకుంటున్నారు. కోర్టు బయట ప్రభుత్వం, అధికారులకు ఏ డ్యూటీ లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ మీరు కుమ్మక్కవుతారు... బుజ్జగిస్తారు. ఇక్కడ అన్నీ కావాలంటారు" అని ఆక్షేపించారు. ఈ కేసు విచారణను నవంబరు 30వ తేదీలోపు పూర్తిచేయాలని నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఇదీ సీజేఐ ఉత్తర్వు

"అప్పీల్‌దారు ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్సీ. ఎఫ్ఐఆర్ నం.195/2022లో అతను నిందితుడు. ఈ కోర్టు ఏ వ్యాఖ్యలు చేసినా అది వాది, ప్రతివాదులకు ఇబ్బందికరంగా మారుతుంది. నిందితుడితో పోలీసులు/దర్యాప్తు సంస్థ చెట్టపట్టాలేసుకున్నట్లు స్పష్టమైంది. సీఆర్‌పీసీ సెక్షన్ 167 కింద అతనికి డీఫాల్ట్ బెయిల్ ఇప్పించడానికి అన్ని ప్రయత్నాలూ చేశారు. హైకోర్టు తిరస్కరించడంతో అతను సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2022 డిసెంబరులో ఇక్కడ కేసు విచారణకు వచ్చినప్పుడు లీవ్ గ్రాంట్ చేసి అప్పీల్‌దారుని బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. దాంతో రెండున్నరేళ్లుగా అతను మధ్యంతర బెయిల్ మీదే ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు సిద్ధార్థలూథ్రా చెప్పారు. కానీ అది రాష్ట్ర పోలీసుల నిర్లక్ష్యాన్ని, లేదంటే నేరస్థులకు అందిస్తున్న సహకారాన్ని సూచిస్తోంది. దారుణమైన నేరాల దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది. అయితే కింది ఆదేశాలతో విచారణ ముగిస్తున్నాం.

- ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కేసు ట్రయల్‌ను సీనియర్ న్యాయాధికారికి అప్పగించి, ప్రతివారం విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.
- తదుపరి దర్యాప్తు అవసరమైతే మార్చి 31లోపు పూర్తి చేయాలి.
- అభియోగాల ఖరారును ఏప్రిల్ 18లోపు పూర్తిచేయాలి.
- ప్రాసిక్యూషన్ మొత్తం సాక్ష్యాధారాలను నాలుగు నెలల్లోపు కోర్టుకు సమర్పించాలి.
- తనకు అనుకూలమైన సాక్ష్యాలను సమర్పించుకోవడానికి పిటిషనర్‌కూ రెండు నెలల్లోపు సమయం ఇవ్వాలి"

అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

గ్రహం అనుగ్రహం

21-2-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
చవితి: మ. 2-00 తదుపరి పంచమి
రేవతి: రా 8-15 తదుపరి అశ్విని
వర్జ్యం: ఉ 8-44 నుంచి 10-16 వరకు
అమృత ఘడియలు: సా. 5-57 నుంచి 7-29 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-28 నుంచి 8-00 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.28; **సూర్యాస్తమయం:** సా.5.59

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	31.0
మెదక్	16.4	33.8
ఆదిలాబాద్	17.7	35.8
రాజమహేంద్రవరం	18.0	38.0
నల్గొండ	19.0	31.0
కరీంనగర్	19.0	33.0
అనంతపురం	19.0	35.4
శ్రీకాకుళం	20.0	31.0
కర్నూలు	20.0	36.3
తిరుపతి	20.1	32.6
విశాఖపట్నం	20.4	33.4
విజయవాడ	20.5	32.4
తాడేపల్లిగూడెం	21.0	31.0
కడప	21.0	33.0
నరసాపురం	21.0	35.4
గుంటూరు	22.0	34.0
ఒంగోలు	22.2	32.7
నెల్లూరు	22.8	33.0

ప్యాక్స్ సిలికా కూటమిలో భారత్

(మొదటి పేజీ తరువాయి)

చైనాను దృష్టిలో ఉంచుకునే ఈ మాటలన్నారన్నది సుస్పష్టం. భారత్ చేరడం ఈ కూటమికి బలాన్ని ఇచ్చిందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ అన్నారు. 'మేము కేవలం ఏఐపై సదస్సు నిర్వహించడం లేదు. భవిష్యత్తును నిర్మిస్తున్నాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. సెమీకండక్టర్ల రంగంలో భారత్ సామర్థ్యం పెరిగిందని నొక్కి చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి తుదిమెరుగులు దిద్దే సమయంలో భారత్ ఈ కూటమిలో చేరడం గమనార్హం. "ప్రతిభావంతులైన భారతీయ ఇంజనీర్లు ప్రపంచంలోనే అత్యాధునికమైన టూ నానోమీటర్ చిప్‌ను రూపొందిస్తున్నారు. సెమీకండక్టర్ల రంగంలో నైపుణ్యం కలిగిన పది లక్షల మందికి ఉద్యోగావకాశాలున్నాయి. భారత్‌కు ఇదో గొప్ప అవకాశం" అని వైష్ణవ్ అన్నారు.

బెంగాల్ 'సర్' విధుల్లో జిల్లా జడ్జీలు

(మొదటి పేజీ తరువాయి)

సొలిసిటర్ జనరల్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను శనివారమే సమావేశపరిచి 'సర్' ప్రక్రియలో న్యాయాధికారుల సేవలను వినియోగించుకోవడంపై విధివిధానాలను ఖరారు చేయాలని జస్టిస్ సుజయ్‌పాల్‌కు స్పష్టం చేసింది.

- సహేతుక వ్యత్యాసాలకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలపై న్యాయాధికారుల నిర్ణయాన్ని కోర్టు నిర్ణయంగానే పరిగణించాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.
- 'సర్' విధులకు కేటాయిస్తున్న న్యాయాధికారులకు అవసరమైన భద్రత, ఇతరత్రా సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది.

ట్రంప్ సుంకాలు చెల్లవు

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ తగ్గించిన విషయాన్ని జస్టిస్ బ్రెట్ కవనాఫ్ అసమ్మతి తీర్పులో ప్రస్తావించారు.

ఆ సొమ్ము తిరిగి చెల్లిస్తారా?: ట్రంప్ ఆదేశాల మేరకు దిగుమతిదారుల నుంచి ఇప్పటి వరకు అదనంగా వసూలు చేసిన సుంకాలను ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అసలు ఆ విషయాన్నే ప్రస్తావించలేదు. చాలా కంపెనీలు అదనపు దిగుమతి సుంకాలను తమకు తిరిగి చెల్లించాలంటూ దిగువ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేశాయి. దిగుమతిదారుల నుంచి అదనపు సుంకాలను వసూలు చేయడం ద్వారా గత ఏడాది డిసెంబరు వరకు 13,300 కోట్ల డాలర్లు అమెరికా ఖజానాకు చేరాయని అంచనా. దిగుమతి, ప్రతీకార సుంకాల వసూలును సుప్రీంకోర్టు రద్దు చేయడం వల్ల ఆ మొత్తాల తిరిగి చెల్లింపులో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని అసమ్మతి తీర్పురాసిన జడ్జి జస్టిస్ కవనాఫ్ పేర్కొన్నారు. అదనపు సుంకాల వసూలును నిలిపివేసినా, వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సి వచ్చినా ట్రంప్ ప్రభుత్వ ఆదాయ అంచనాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. వచ్చే పదేళ్లలో అదనపు సుంకాల వసూళ్లు 3లక్షల కోట్ల డాలర్ల మేర ఉంటాయని అంచనా. సుప్రీంకోర్టు తీర్పుపై అమెరికాలోని దిగుమతి కంపెనీల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

వాణిజ్య ఒప్పందాలన్నీ నిరర్థకం!: అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో...బ్రిటన్, జపాన్, ఐరోపా సమాఖ్య, మలేసియా, ఇండొనేసియా, వియత్నాం, భారత్ తదితర దేశాలతో అగ్రరాజ్యం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలన్నీ నిరర్థకంగా మారనున్నాయి. ఆయా దేశాలు ఈ ఒప్పందాలను బుట్టదాఖలు చేసే అవకాశం ఉంది. ట్రంప్ ఇదే తరహా సుంకాలను 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ)లోని సెక్షన్ 301, సెక్షన్ 232 కింద విధించేందుకు ప్రయత్నించవచ్చు. అయితే, అందుకు ప్రజామోదం మళ్లీ పొందాల్సి ఉంటుంది. తత్ఫలితంగా జరిగే జాప్యం మళ్లీ న్యాయపరమైన సవాళ్లను లేవనెత్తే అవకాశం ఉంది. ఆయా సెక్షన్ల కింద విధించే సుంకాలు అన్ని దేశాలకూ ఏకరూపంగా వర్తించవు. తాజా తీర్పు.. వాణిజ్య విషయాల్లో అమెరికా పార్లమెంటుదే పైచేయి అని స్పష్టంచేసింది. సుంకాలను ఆయుధాలుగా ఉపయోగించి ఇష్టారాజ్యం చలాయించే అధ్యక్షుడి ప్రవృత్తికి కళ్లెం వేసింది.



వివిధ దేశాలపై విధించే టారిఫ్‌ల జాబితాను గతేడాది ఏప్రిల్ 2న ప్రదర్శించిన డొనాల్డ్ ట్రంప్

అత్యవసర అధికారాల దుర్వినియోగం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025, ఏప్రిల్ 2న తన దేశ వాణిజ్య లోటు భారీగా పెరిగిపోవడాన్ని జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించారు. దీంతో ఆయన అన్ని రకాల దిగుమతులపై 10 శాతం సుంకం విధించడం ఈ వివాదానికి నేపథ్యంగా నిలిచింది. తదనంతరం వాటిని ఇష్టారీతిగా పెంచుకుంటూ వెళ్లారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న వాణిజ్య లోటు అమెరికా పారిశ్రామిక పునాదుల్ని బలహీన పరిచి ఆర్థిక ముప్పు తలెత్తేందుకు కారణమైందని ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ఈ వాదనను నిపుణులు పూర్తిగా తిరస్కరించారు. 1975 నుంచీ వాణిజ్య లోటు ఉన్నా అమెరికా ఏనాడూ ఇలాంటి తీవ్ర చర్యలకు పాల్పడలేదని విమర్శకుల వాదన. ఐఈఈపీఏని అడ్డుపెట్టుకుని ప్రపంచ దేశాలపై సుంకాలు విధించడాన్ని ఇప్పటికే మూడు కిందిస్థాయి కోర్టులు వ్యతిరేకించాయి.

■ అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన మెక్సికో, కెనడా, చైనాలపై సుంకాలు విధించారు. ఈ సుంకాలను సమర్థించడానికి ట్రంప్ అక్రమ చొరబాట్లను, ఫెంటానిల్ వంటి ఔషధాల అక్రమ రవాణాను సాకుగా చూపి జాతీయ అత్యయిక పరిస్థితిని ప్రకటించారు.

■ కెనడాపై 35 శాతం, మెక్సికోపై 25 శాతం అక్రమ రవాణా సుంకం విధించారు. బ్రెజిల్ నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలను భారీగా పెంచారు.

■ ఐఈఈపీఏని అడ్డుపెట్టుకుని భారత్‌పై కూడా అదనపు సుంకాలు విధించారు. ట్రంప్ తొలుత భారత్ చేసే ఎగుమతులపై 25 శాతం సుంకం విధించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందన్న కారణం చూపి అదనంగా మరో 25 శాతం సుంకం విధించారు. దీంతో భారత్‌పై సుంకాలు 50 శాతానికి చేరాయి. ఈ నెలారంభంలో భారత్-అమెరికా ఒక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారని, ఆ కారణంగా భారత్‌పై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నానని ట్రంప్ ప్రకటించారు.

ట్రంప్ దూకుడుకు కళ్లెంపడుతుందా?

సుప్రీంకోర్టు తీర్పుతో సుంకాల విధింపుపై అధ్యక్షుడు ట్రంప్ వెనక్కితగ్గబోరని, అయితే ఇదివరకటి అంతటి దూకుడుతో కాకుండా కాస్త నెమ్మదించే అవకాశం ఉందని అమెరికా అధికార వర్గాలు పేర్కొన్నాయి. సుప్రీంకోర్టు తీర్పు తమ ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావంపడుతుందని అధ్యక్షుడు ట్రంప్ ఇదివరకు హెచ్చరించారు. అమెరికా ఉత్పత్తులపై భారీ సుంకాలు విధిస్తున్న వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామనే హామీతో ట్రంప్ ఎన్నికల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే.

విశ్రాంత సీఎస్ దినేష్‌కుమార్‌తో ఏకసభ్య కమిటీ

- తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏర్పాటుచేసిన ప్రభుత్వం
- బాధ్యులందరిపై తీసుకోవాల్సిన చర్యలు సిఫార్సు చేయాలని నిర్దేశం
- నెయ్యి టెండర్ల పర్యవేక్షణ, నిబంధనల సడలింపులో లోపాలు, వైఫల్యాలపై సిట్ నివేదిక పరిశీలించాలని ఆదేశం
- 45 రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచన

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరాకు బాధ్యులైన అప్పటి పాలకమండలి సభ్యులు, తితిదే సీనియర్ అధికారులు, ఇతర కార్యనిర్వాహక సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా.. విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఏపీ మాజీ సీఎస్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. నెయ్యి టెండర్ల పర్యవేక్షణ, నిబంధనల సడలింపులో లోపాలు, వైఫల్యాలు, ఉద్దేశపూర్వక విస్మరణలు కల్తీ నెయ్యి సరఫరాకు ప్రధాన కారణమయ్యాయని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సిట్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల ఓ నివేదిక సమర్పించింది. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ నివేదికను పరిశీలించి ఎవరెవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సులు చేయాలని ఈ ఏకసభ్య కమిటీకి ప్రభుత్వం నిర్దేశించింది. 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విధివిధానాలు పేర్కొంది. ఈ మేరకు సీఎస్ కె. విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

నిర్ణయాలు సరిగ్గానే ఉన్నాయా?

◆ నెయ్యి టెండర్ల పర్యవేక్షణ, నిబంధనల సడలింపులో పరిపాలనపరమైన లోపాలు, వైఫల్యాలు, ఉద్దేశపూర్వక విస్మరణలను గుర్తించాలి.

◆ తగిన ఆలోచన, శ్రద్ధతో నిర్ణయాలు తీసుకున్నారా? లేదా? విధివిధానాలకు అనుగుణంగా, సరైన ఔచిత్యంతో నిర్ణయాలు ఉన్నాయా? లేదా? పరిశీలించాలి. ◆ గుర్తించిన లోపాలకు తితిదే అధికారులు, పాలకమండలి సభ్యులు, ఇతర కార్యనిర్వాహక స్థానాల్లో ఉన్నవారి బాధ్యత ఎంతవరకు ఉందో తేల్చాలి? ◆ బాధ్యులపై పరిపాలన పరంగా, క్రమశిక్షణ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేయాలి. ◆ పరిపాలన, పాలన సంబంధిత అంశాలకే పరిశీలన పరిమితం కావాలి.

రికార్డులు అడగొచ్చు.. వివరణలు కోరొచ్చు

◆ ఈ ఏకసభ్య కమిటీ సంబంధిత రికార్డులు అడగొచ్చు. లిఖిపూర్వక వివరణలు కోరొచ్చు. నిపుణుల సాయం పొందొచ్చు. ◆ కమిటీ నివేదిక పూర్తి సిఫార్సులతో ఉండాలి. తదుపరి చర్యల కోసం రాష్ట్రప్రభుత్వం వాటిని పరిశీలిస్తుంది. ◆ కమిటీ కార్యాలయం, ఇతర అంశాలకు తితిదే తగిన ఏర్పాట్లు చేస్తుంది.

ఎవరి పాత్ర ఏంటి?

◆ తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరాలో వైకాపా నేతలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పటి తితిదే బోర్డు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, ఆర్థిక సలహాదారు, ఎకౌంట్స్ అధికారి బాలాజీల ప్రమేయాన్ని సిట్ గుర్తించింది. ఆ వివరాలన్నింటినీ ఓ నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపించింది.

◆ 2019 ఆగస్టులో పక్కాగా రూపొందించిన నెయ్యి సేకరణ నిబంధనలను సింఘాల్, ధర్మారెడ్డి, బాలాజీ మళ్లీ 5 నెలల్లోనే సడలించారని, వారు విచక్షణను విస్మరించారని సిట్ నివేదికలో పేర్కొంది. నిబంధనల సడలింపునకు అప్పటి అధికారుల ఆమోదం, కొనుగోలు కమిటీలో సభ్యులైన చెవిరెడ్డి, భూమన పాత్ర, సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్న నాటి పాలకమండలి ఆమోదం తెలపడం, తర్వాత అక్రమ డెయిరీలకు రాచబాట తదితర అంశాలన్నింటినీ ప్రస్తావించింది. ఏకసభ్య కమిషన్ ఈ అంశాలన్నీ లోతుగా పరిశీలించనుంది.



మత్స్యావతారంలో నారసింహుడు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయంలో అలంకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు మాడవీధుల్లో మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. అవతార విశిష్టతను ప్రధాన పూజారులు భక్తులకు వివరించారు. యాగశాలలో అగ్నిదేవుడి ఆరాధన, సకల దేవతల ఆతిథ్యపర్వాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. -యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే

వైద్య కళాశాలల స్థాపనకు కొత్త నిబంధనలు

- ముసాయిదా సవరణలు విడుదల చేసిన ఎన్ఎంసీ

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల ఏర్పాటు, కొత్త కోర్సుల ప్రారంభం, ప్రస్తుత కోర్సుల్లో సీట్ల పెంపు, మూల్యాంకనం, రేటింగ్‌కు సంబంధించి 2023 నియమావళిలో కీలక సవరణలను ప్రతిపాదిస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కంపెనీల చట్టం-2013 కింద నమోదైన కంపెనీలతో పాటు ఆయా రాష్ట్రాల చట్టాల కింద నమోదైన ట్రస్టులకు కూడా వైద్య కళాశాలల ఏర్పాటుకు అర్హత కల్పించింది. 'దరఖాస్తు సమయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జారీచేసిన ఈసీ చెల్లుబాటులో ఉండాలి. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి అనుబంధ అనుమతి పత్రం (సీవోఏ) తప్పనిసరిగా సమర్పించాలి. గత ఆర్థిక సంవత్సరానికి ఛార్టెడ్ ఎకౌంటెంట్ జారీచేసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించాలి. అవసరమైన పత్రాలు లేని, అసంపూర్ణంగా ఉన్న దరఖాస్తులను ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (ఎంఏఆర్‌బీ) తిరస్కరిస్తుంది. కొత్తగా ఏర్పాటు కానున్న, ఇప్పుడున్న వైద్య కళాశాలలు తప్పనిసరిగా కార్పస్ ఫండ్ నిర్వహించాలి. సంబంధిత ఆధారాలను అడిగినప్పుడు సమర్పించాలి' అని పేర్కొంది. ఈ ముసాయిదాపై అభ్యంతరాలను 30 రోజుల్లో emiarr2026amendment@nmc.org.in ద్వారా పంపాలని ఎన్ఎంసీ సూచించింది.

పీఏసీఎస్ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా చూడండి

ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో.. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆప్కాబ్ ఎండీని సహకార శాఖ కమిషనర్ బాబు కోరారు. పీఏసీఎస్‌ల బలోపేతం, ఉద్యోగుల హెచ్ఆర్ సమస్య పరిశీలనకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించినా వారు సమ్మె విరమించలేదన్నారు. దీంతో కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. పీఏసీఎస్‌లలో పరిపాలన సజావుగా సాగేలా ఇన్‌ఛార్జిలను నియమించాలని సూచించారు.

వైకాపా హయాంలో శ్రీశైలంలోనూ కల్తీ నెయ్యి

- ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు



ఈనాడు, కడప, న్యూస్‌టుడే- రాజంపేట గ్రామీణ: వైకాపా హయాంలో శ్రీశైలం ఆలయానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు ఆ ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ఆరోపించారు. రాజంపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని అన్ని ఆలయాల తరహాలోనే శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కూడా వైకాపా భ్రష్టు పట్టించింది. 2023-24లో వైకాపా సర్కారు విజయా డెయిరీని తప్పించి రాజేష్ కార్పొరేషన్ ద్వారా కల్తీ నెయ్యి సరఫరా చేయించారు. నిబంధనలు సడలించి ట్రేడర్లకు అవకాశం కల్పించారు. అప్పటి జగన్ మంత్రివర్గంలోని ఓ మంత్రి, శాసనసభ్యులు, రాష్ట్ర అధికారి హస్తంతో 2.92 లక్షల కిలోల నెయ్యికి కిలో రూ.549 చొప్పున రూ.16,07,71,950 చెల్లించారు. తిరుమల, శ్రీశైలం తరహాలోనే శ్రీకాళహస్తి, విజయవాడ దుర్గ గుడి, అన్నవరం ఆలయానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందనే అనుమానం ఉంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని సిట్ ద్వారా అన్ని ఆలయాలపై విచారణ జరిపించాలి' అని డిమాండ్ చేశారు. 'శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో అలజడి సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీనిపైనా సమగ్ర దర్యాప్తు చేయించాలి. బ్రహ్మోత్సవాల్లో 6.96 లక్షల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నడక మార్గంలో 1.99 లక్షల మంది చేరుకున్నారు. శివదీక్ష ఇరుముడి దారణ భక్తులు 1.12 లక్షల మంది వచ్చారు. అన్న ప్రసాదాన్ని 1.66 లక్షల మంది స్వీకరించారు. 36 లక్షల లడ్డూలను విక్రయిచాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు చివరి నాలుగు రోజులు 50 గ్రాముల బరువుగల లడ్డూలను 4 లక్షల మందికి ఉచితంగా పంపిణీ చేశాం' అని వివరించారు.

డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీలకు క్యూఆర్ కోడ్ స్మార్ట్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

డేటా తెలియాలంటే చిప్ రీడర్లు కావాలి. రవాణాశాఖ వాటిని కొనుగోలు చేయాలి.

◆ చిప్‌లేని, క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డుల్లో.. కేంద్ర రవాణాశాఖకు చెందిన వాహన్, పరివాహన్ పోర్టళ్లతో లింక్ కావడంతో అప్‌డేటెడ్ సమాచారం ఉంటుంది. ◆ చిప్‌తో కూడిన ఒక్కో కార్డుకు రూ.57, ప్రింటింగ్ ఖర్చులు, పోస్టల్ ఖర్చులు కలిపి మొత్తం రూ.115 వరకు అవుతుంది.

◆ అదే క్యూఆర్ కోడ్‌తో ఉండే కార్డులకు రూ.72 అవుతోంది. ◆ దీంతో క్యూఆర్ కోడ్ స్మార్ట్ కార్డులపైనే మొగ్గుచూపారు. ◆ ఈ కార్డుల సరఫరా, వాటిపై వివరాలను రాష్ట్రస్థాయిలో ఒకే చోట ముద్రించడం, పోస్టులో పంపడం వంటివన్నీ గుత్తేదారుకే అప్పగించనున్నారు.

రద్దయిన కాలంలో వారికీ అవకాశం

◆ త్వరలో టెండర్లు పిలిచి గుత్తేదారును ఎంపిక చేయనున్నారు. ◆ 2024 అక్టోబరు 1 నుంచి గత నెలాఖరు వరకు 27 లక్షల కార్డులు జారీచేయాలి.

◆ 2023 ఆగస్టు నుంచి 2024 సెప్టెంబరు ఆఖరు వరకు కార్డుల జారీని పూర్తిగా ఆపేసిన కాలంలో.. 23 లక్షల కార్డులు ఇవ్వలేదు. అప్పట్లో వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నవాళ్లు, డ్రైవింగ్ లైసెన్స్ పొందినవారిలో ఎవరైనా తమకు ఆర్‌సీ, డీఎల్ కావాలని దరఖాస్తు చేసుకొని, ఫీజు చెల్లిస్తే.. వారికీ క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నారు.

వైకాపా హిందూ వ్యతిరేక వైఖరిపై ప్రజల్లోకి..

- తటస్థ వేదికలపై ఎండగడదాం
- కూటమి మంత్రులు, నేతలతో లోకేశ్ జూమ్ కాన్ఫరెన్స్‌లో నిర్ణయం
- 22 నుంచి 26 వరకు ధార్మిక సంస్థల ప్రతినిధులతో సమావేశాలు

ఈనాడు, అమరావతి: హిందువులు కలియుగ ప్రత్యక్షదైవంగా కొలిచే వేంకటేశ్వరస్వామి విషయంలో వైకాపా చేస్తున్న ఘోర అపచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తటస్థ వేదికలపై ఎండగట్టాలని అధికార కూటమి నిర్ణయించింది. శాసనమండలిలో శుక్రవారం వైకాపా సభ్యులు వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పట్టుకుని నిరసనలు చేయడం హిందువుల మనోభావాల్ని దెబ్బతీయడమేనని మూడు పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేశ్ శుక్రవారం సాయంత్రం మూడు పార్టీలకు చెందిన మంత్రులు, ముఖ్య నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెదేపా నుంచి మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన నుంచి మంత్రులు మనోహర్, దుర్గేష్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ హరిప్రసాద్, భాజపా నుంచి మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. వైకాపా తీరును ఎండగడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో కూటమిలోని మూడు పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు విలేకర్ల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. 22 నుంచి 26 వరకు హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నారు.

హిందువుల మనోభావాలపై దాడి వైకాపా మూలాల్లోనే ఉంది


వైకాపా నాయకుల దృష్టిలో వేంకటేశ్వర స్వామి అంటే కేవలం బొమ్మే కావచ్చని, కానీ కోట్ల మంది హిందువులకు ఆయన ప్రత్యక్ష దైవమని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. స్వామివారి చిత్రపటాలు పట్టుకుని మండలిలోకి రావడమే కాకుండా.. చెప్పులు, బూట్లు వేసుకుని రాలేదని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. భక్తుల మనోభావాలు, నమ్మకాలపై వారికి ఏ మాత్రం గౌరవం లేదని దుయ్యబట్టారు. 'వేంకటేశ్వరస్వామి చిత్రపటాల్ని ఏదో సాధారణ బొమ్మలు పట్టుకున్నట్టుగా తెచ్చారు. హిందువుల మనోభావాలు, నమ్మకాలపై దాడి చేయడం వారి మూలాల్లోనే ఉంది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తిరుమల శ్రీవారివి ఏడు కొండలు కాదు, రెండే అన్నారు. వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదాలు తయారు చేసి ఘోర అపచారానికి ఒడిగట్టారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరానే జరగలేదని శాసనమండలి సాక్షిగా అబద్ధాలు చెప్పారు' అని మండిపడ్డారు. వైకాపా హిందూ వ్యతిరేక వైఖరిని సామాజిక మాధ్యమాల్లోను విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు.



వృద్ధిని అందించే వనరులతోనే సంపద

చిన్న చిన్న ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా డబ్బు కొద్దిమేర ఆదా అవుతుంది తప్ప ధనవంతులు కాలేరు. భవిష్యత్తులో వృద్ధిని, లాభాలను ఇచ్చే వనరులను గుర్తించి వాటిని సమకూర్చుకోవడం ద్వారానే సంపన్నులు అవుతారు.

– ఆస్టిన్ ఎల్ రైట్, ఇన్వెస్టర్



ఈ గొల్లభామ రైతన్న హితుడు!

పంటకు ఆశించే చీడపురుగులు తిని.. రైతులకు మేలు చేసే గొల్లభామ(మిడత) అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో కనిపించింది. దీని శాస్త్రీయనామం మాంటెడ అని.. దాని ముందరి కాళ్లు ప్రార్థన చేస్తున్నట్లు ఉండటంతో 'ప్రేయింగ్ మాంటిస్' అని పిలుస్తారని అనకాపల్లి వ్యవసాయ సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పంటలకు చీడపీడలు కలిగించే పురుగులను తినడం ద్వారా పరోక్షంగా అన్నదాతలకు సాయపడతాయన్నారు. గొల్లభామలు సాధారణంగా పచ్చరంగులో ఉంటాయని, ఇవి మాత్రం పరిసరాలు ఎలా ఉంటే ఆ రంగులో కలిసిపోతాయన్నారు. పురుగు మందుల వాడకం పెరగడం వల్ల ఇవీ అంతరించిపోతూ.. అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయని వివరించారు.

– న్యూస్‌టుడే, నక్కపల్లి


ఈనాడు

సరఫరా గొలుసుల్లో స్థిరత్వంకోసం...

కృత్రిమమేధ అనగానే అల్గారిథమ్‌లు, డేటా, నిపుణ మానవ వనరులు వంటి అంశాలే ఎక్కువగా గుర్తుకొస్తాయి. ఏఐ మీద ఏయే దేశాలు ఎంతెంత పెట్టుబడులు పెడుతున్నాయి, ఎవరెవరు ఎటువంటి విప్లవాత్మక ఆవిష్కరణలు చేస్తున్నారనే విషయాలే బాగా చర్చకు వస్తాయి. కానీ, సాంకేతికంగా ప్రపంచం సాధించే ప్రతి పురోగతికీ కొన్ని భౌతిక పునాదులు ఉంటాయి. ఆ విధంగా చూస్తే- సిలికాన్, అరుదైన ఖనిజాలు, సెమీ కండక్టర్లు, వాటి ఉత్పత్తిలో అత్యాధునిక సామర్థ్యాలు ఏఐకు ప్రాణాధారాలు! ఈ సరఫరా గొలుసుల్లో స్థిరత్వం లేకపోతే ఏఐ ప్రగతి వెలుగులు మసకబారే ముప్పుంది. కృత్రిమమేధ మాత్రమే కాదు- పునరుత్పాదక ఇంధన వనరులు, ఎలక్ట్రానిక్స్, ఈవీ వాహనాలు, యుద్ధ విమానాలు, క్షిపణుల తయారీ తదితరాల్లోనూ అరుదైన ఖనిజాల పాత్ర అద్వితీయమైనది. వాటిపై తనకు ఉన్న గుత్తాధిపత్యాన్ని స్వీయ స్వార్థ భౌగోళిక రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఒక ఆయుధంగా మార్చి ప్రయోగిస్తోంది చైనా! ఈ నేపథ్యంలో 21వ శతాబ్ది ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టు వంటి అరుదైన ఖనిజాల వెలికితీత, శుద్ధి నుంచి అంతిమ ఉత్పత్తులను అందించడం వరకు ఇప్పుడు మిగిలిన దేశాలకు విశ్వసనీయమైన, నియమబద్ధమైన సరఫరా గొలుసులు అత్యవసరం. మిత్రరాజ్యాలతో కలిసి వాటి నిర్మాణానికి పూనుకున్న అమెరికా, అందుకోసం మొన్న డిసెంబరులో 'పాక్స్ సిలికా' పేరిట ఒక వేదికను ముందుకు తెచ్చింది. దేశదేశాల ప్రభుత్వాలు, పరిశ్రమలు, పరిశోధకులను ఒకేచోటకు చేర్చి... ఖనిజ వనరుల సొంతదారులను తయారీదారులతో అనుసంధానించి నమ్మకమైన సరఫరా గొలుసులను సృష్టించేందుకు ఉద్దేశించిన 'పాక్స్ సిలికా'లో ఇండియా తాజాగా భాగస్వామి అయ్యింది. జాతీయ వ్యూహాత్మక, భద్రతా అవసరాల రీత్యా ఇది ఆహ్వానించదగిన పరిణామం!

దశాబ్దాలుగా ప్రపంచ సాంకేతిక సరఫరా గొలుసులన్నీ ఒక మూస పద్ధతిలోనే నిర్మితమయ్యాయి. ఖర్చులు తక్కువగా ఉన్న చోట ఉత్పత్తి చేపట్టడం, సౌలభ్యాన్ని బట్టి ప్రాసెసింగ్ చేయడం, సంకట పరిస్థితులు ఎదురైతే ఏదో ఒక మార్గాంతరం వెతికి తాత్కాలికంగా బయటపడటం... ఇదే ఇప్పటివరకు రివాజైంది. ఆ క్రమంలో అరుదైన లోహాల సరఫరా, సెమీకండక్టర్ చిప్‌ల తయారీ వంటివి కొన్ని చోట్లే కేంద్రీకృతమయ్యాయి. దానివల్ల అంతర్జాతీయ వ్యవహారాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు నవీన పరిశ్రమలకు నిత్యావసరాలైన కీలక ఖనిజాలూ విడిభాగాల అందుబాటులో సమస్యలు ముమ్మరిస్తున్నాయి. వాటిని తొలగించేందుకు ఉద్దేశించిన 'పాక్స్ సిలికా'తో ఇప్పటికే జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, యూకే, యూఏఈ, ఖతార్, ఇజ్రాయెల్ తదితరాలు చేతులు కలిపాయి. చైనా, బ్రెజిల్‌ల తరవాత అత్యధిక పరిమాణంలో అరుదైన ఖనిజ వనరులు కలిగిన దేశమైన ఇండియా చేరిక 'పాక్స్ సిలికా'ను బలోపేతం చేయనుంది. అదే సమయంలో ప్రపంచ ఏఐ విధివిధానాలు, వనరుల సరఫరా వ్యూహాలను నిర్దేశించడంలో ప్రధానపాత్ర పోషించే అవకాశం భారతావనికీ లభిస్తుంది!

భూగర్భ వనరులు అపారంగా ఉన్నప్పటికీ వాటిని పర్యావరణ హితకరంగా వెలికితీసి, శుద్ధి చేసి పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవడంపై గత ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టలేదు. దాంతో అరుదైన లోహాలకోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరాధీనతను తప్పించడానికి నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించిన కేంద్రం- కీలక ఖనిజ సంపదకు ఆలవాలాలైన రాష్ట్రాల్లో గనుల తవ్వకం, ప్రాసెసింగ్ వంటివాటికి ప్రత్యేక కారిడార్ల ఏర్పాటును ఇటీవల ప్రకటించింది. ఇతోధికంగా నిధులను కేటాయిస్తూ, పరిశోధనలూ ఉత్పాదక కార్యకలాపాలను ప్రోత్సహిస్తేనే- పోటీ ప్రపంచంలో సాంకేతిక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకుంటూ అభివృద్ధి బాటలో ఇండియా దూసుకుపోగలుగుతుంది!



అలలు లేని సముద్రం అందంగా ఉంటుందా? జీవితమూ అంతే. కష్టసుఖాలు, ఒడుదొడుకులు అనుభవించినప్పుడే జీవితానికి నిండుదనం వస్తుంది. నొప్పి అంటే తెలియనివారు సుఖాన్ని ఆస్వాదించలేరు.

– బోరిస్ పాస్టర్నాక్, రచయిత

ఆలయం

'లయం' అంటే విధ్వంసం. తీవ్రమైన భూకంపం వచ్చినప్పుడో, పెద్దయెత్తున వరదలు సునామీ లాంటివి ముంచెత్తినప్పుడో సంభవించేది అది. మనుషులతో పాటు, వాళ్ళు నిర్మించుకున్న ఆస్తులన్నింటినీ తనలో లయం చేసుకుంటుంది ప్రకృతి. అలా 'నేను' అనే అహంకారాన్ని పోగొట్టి నిర్వాణాన్ని పొందాలని వేసే తొలి అడుగు ఆలయం. ఇల్లు లేదా నివాసం అని అర్థం వచ్చే 'ఆలయ' అనే సంస్కృత పదం దీనికి మూలం. దేవుడి నివాసంగా భావిస్తూ దాన్ని పవిత్రంగా చూసుకుంటాం. ఆలయం అంటే దేవాలయం ఒక్కటే కాదు. ఆరోగ్యకర సంపూర్ణ జీవనానికి దారిచూపే ప్రతి చోటూ ఆలయమే. ముఖ్యంగా ప్రకృతిని వనరుల సమాహారంగా కాకుండా దైవస్వరూపంగా భావించారు మన పూర్వీకులు. పంచభూతాలకు దైవత్వం ఆపాదించడం వెనక మనిషి మనుగడకు దోహదపడుతున్న ప్రకృతిని కాపాడాలనే గట్టి సంకల్పం దాగిఉంది.

దేవాలయమే కాకుండా మనకి ఇంకా చాలా ఆలయాలు ఉన్నాయి. జీవాత్మకు ఆసరా కావాలంటే దేహం అవసరం. ఆ కాయం ఆరోగ్యంగా, బలిష్ఠంగా ఉండాలంటే తగిన ఆహారం సరైన వేళలో తీసుకోవాలి. ఇంట్లో వండినది కావచ్చు, బయట ఆహారశాల కావచ్చు. అది భోజనాలయం. తినే ఆహారాన్ని పవిత్రంగా, ఇష్టంగా వృథా చేయకుండా తినాలి. కష్టించి దాన్ని పండించిన రైతులను గుర్తుచేసుకుని కృతజ్ఞత తెలిపే పవిత్రస్థలం కూడా భోజనాలయమే!



అంతర్యామి

విద్యాసముపార్జన జరిగే చోటు విద్యాలయం. గురువుల బోధనలు, పుస్తకాల ద్వారా కలిసి మనసు అజ్ఞానంలోంచి బయటపడేసే ప్రదేశమది. నాట్య విషయాలు బోధిస్తూ నాట్యంలో తర్ఫీదు ఇచ్చి నిష్ణాతులను చేసే ఆచార్యులు ఉండే చోటు నాట్యాలయం. శారీరక, మానసిక రుగ్మతలను వైద్యం చేసి స్వస్థత చేకూర్చే ధన్వంతరులు ఉండే స్థలం వైద్యాలయం. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి ఏర్పాటైనవి రక్షకభట నిలయాలు. వీటన్నిటి ఆరంభానికి, అనుమతులకు, పర్యవేక్షణ వగైరా అన్ని విషయాలలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రధాన భూమిక నిర్వహించే ప్రభుత్వ కార్యాలయం కూడా నిజానికి పవిత్రస్థలమే. కానీ, ప్రజోపయోగానికి ఉద్దేశించిన దాని పవిత్రతను ఎంత వరకూ కాపాడుకుంటున్నాం అన్నది ప్రధాన ప్రశ్న!

కాయమే కైలాసం, పనే దైవం అని బసవేశ్వరుడు అన్నాడు. చేసే పనే దైవారాధన అని వివేకానందుడు బోధించాడు. దేవాలయంలో ఎంత భక్తిగా పూజలు చేస్తామో అంతే నిజాయతీగా, నిబద్ధతతో కార్యాలయంలో ఉద్యోగులు పనిచేయాలి. తమ విద్యుక్త ధర్మంగా చేసిన పనికి ప్రతిఫలం వేతన రూపంలో అందుతుంది. అది కాకుండా అనుచిత లాభాలు ఆశించడం కూడని పని. ప్రతిఫలాలు లంచాలుగా ఆశించని కార్యాలయాలలో చేసే పనే దైవారాధన. 'మనసు పవిత్రంగా ఉంటే మన చెంబులోని నీరే గంగ' అంటాడు సంత్ రవిదాస్. 'చిత్తం శివుడి మీద భక్తి మారెక్కడో' అన్నట్లుగా కాకుండా ఎక్కడ ఉంటే అక్కడే పనిని దైవంగా భావించి నిర్వర్తించాలి. అప్పుడు ప్రతి చోటూ దేవాలయమే అవుతుంది, చేస్తున్న పని దైవారాధన అనిపించుకుంటుంది.

– గడ్డం దేవీప్రసాద్

భారత్-బంగ్లా మళ్లీ చేరువవుతాయా?

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా దాదాపు ఏడాదిన్నరపాటు పాలించిన మహమ్మద్ యూనస్- ఇండియాతో మైత్రీబంధాన్ని ఎంతమాత్రమూ కాంక్షించలేదు! జమాతే ఇస్లామీ పార్టీ కనుసన్నల్లో నడుచుకుంటూ దిల్లీతో ఢాకా సంబంధాలను దెబ్బతీశారు. ఆయన పాలనలో జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటూ, ఉభయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇండియాకు చేరువ కావాల్సిన బాధ్యత తారిఖ్ రహమాన్ సారథ్యంలో బంగ్లాలో కొత్తగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంపై ఉంది.

భారత్, బంగ్లాదేశ్ దీర్ఘకాలిక మిత్రదేశాలు. ముఖ్యంగా షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఇరుదేశాల మధ్య బలమైన స్నేహ బంధం ఉండేది. 2024లో ఆమె పదవీచ్యుతురాలయ్యాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేతగా పగ్గాలు చేపట్టిన యూనస్- ఇండియా వ్యతిరేక భావజాలమున్న జమాతే ఇస్లామీకి దాదాపు 'అధికార ప్రతినిధి'లా పనిచేశారు. ఇండియా భద్రతను ప్రమాదంలోకి నెడుతూ, ఈశాన్య భారత రాష్ట్రాల్లో ముష్కర మూకలు, తిరుగుబాటుదారులు బలం పుంజుకునేలా నిర్ణయాలు తీసుకున్నారు.





కొందరు ఉగ్రవాదులను, దిల్లీ అంటే గిట్టని మతఛాందసవాదులను జైళ్ల నుంచి విడుదల చేశారు. తమ దేశంలోని రెడీమేడ్ గార్మెంట్స్ ఫ్యాక్టరీలకు ఇండియా నుంచి ముడిపదార్థాల సరఫరాను అడ్డుకున్నారు. దానివల్ల బంగ్లాలో వందల ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేలమంది మహిళలు ఉపాధి కోల్పోయారు. అరేబియా సముద్రం, ఈశాన్య భారత రాష్ట్రాల విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలతో దిల్లీని యూనస్ కవ్వించారు. పాకిస్థాన్‌కు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. యూనస్ పాలనలో బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై (ప్రధానంగా హిందువులపై) దాడులు పెరిగాయి. ఈ పరిణామాలతో ద్వైపాక్షిక సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. అయితే- యూనస్‌ది ప్రజలు ఎన్నుకున్న సర్కారు కాదు కాబట్టి, ఆ సమయంలో ఢాకాతో సంబంధాల పునర్నిర్మాణంపై దిల్లీ పెద్దగా దృష్టిపెట్టలేదు.

సానుకూల సంకేతాలు

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ రహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అఖండ విజయం సాధించింది. దీంతో- యూనస్ పాలనకు తెరపడి, తారిఖ్ ప్రధానిగా ప్రజాసర్కారు ఏర్పాటైంది. దీన్ని దిల్లీ-ఢాకా సంబంధాల మెరుగుదలకు తొలి అడుగుగా భావించొచ్చు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఇండియాతో మైత్రీబంధాన్నే తాము కోరుకుంటున్నట్లు బీఎన్‌పీ సంకేతాలిస్తోంది. తారిఖ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీని ఆ పార్టీ ఆహ్వానించింది. హసీనాకు దిల్లీ ఆశ్రయం ఇస్తుండటం ద్వైపాక్షిక సంబంధాలకు ప్రతిబంధకం కాబోదని బీఎన్‌పీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ వ్యాఖ్యానించారు. బంగ్లాను అస్థిరపరిచే వ్యాఖ్యలేవీ హసీనా భారత గడ్డపై నుంచి చేయకుండా ఉంటే చాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు! తారిఖ్ కూడా ఎన్నికల ప్రచారంలో దిల్లీ వ్యతిరేక వ్యాఖ్యలకు దూరంగా ఉన్నారు. మరోవైపు- బంగ్లాతో సంబంధాల మెరుగుదలను ఇండియా కూడా కాంక్షిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమిట్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో భేటీ వంటి కారణాలతో తారిఖ్ ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ వెళ్లలేకపోయారు. అయితే ఎన్నికల్లో బీఎన్‌పీ గెలుపు తరవాత తారిఖ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార వేడుకకు ఇండియా తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ హాజరయ్యారు. కుటుంబంతో కలిసి భారత సందర్శనకు రావాలని తారిఖ్‌ను ఆహ్వానిస్తూ ఓం బిర్లా ద్వారా మోదీ లేఖ పంపారు. సుహృద్భావ సంబంధాల దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పేందుకు ఈ పరిణామాలను సంకేతాలుగా భావించొచ్చు. గతంలో బీఎన్‌పీ అధికారంలో ఉన్నప్పుడు దిల్లీతో అంత సఖ్యతగా మెలగకపోవడం ఒకింత ఆందోళనకర అంశమే. ముఖ్యంగా 2001-06 మధ్య జమాతేతో కలిసి బీఎన్‌పీ అధికారాన్ని పంచుకున్నప్పుడు ఇండియా-బంగ్లా సంబంధాలు పెళుసుబారాయి. ఈశాన్య భారత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్న ముష్కర ముఠాలు, తిరుగుబాటుదారులకు అప్పట్లో బంగ్లా ఆశ్రయమిచ్చింది. ప్రస్తుతం తారిఖ్, బీఎన్‌పీ నేతల వ్యవహార శైలిని చూస్తుంటే గతంలో మాదిరిగా కాకుండా, ఇప్పుడు ఇండియాతో సత్సంబంధాలనే వారు కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది.

జమాతే ఒత్తిడికి తలొగ్గొద్దు

ఇండియా, బంగ్లాదేశ్‌లను కేవలం ఇరుగుపొరుగు దేశాల కోణంలో చూడలేం. ప్రాంతీయ భద్రతకు రెండూ కీలకమే. హసీనా అధికారంలో ఉన్నంతకాలం ఇరుదేశాల మధ్య భద్రత, ప్రాంతీయ అనుసంధానత, వాణిజ్యం, పెట్టుబడుల వంటి రంగాల్లో బలమైన సంబంధాలు ఉండేవి. యూనస్ పాలనలో దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దకపోతే బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థకు అపార నష్టం వాటిల్లుతుందన్న సత్యాన్ని తారిఖ్ గుర్తించాలి. అందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలి. భారత ప్రయోజనాలకు వ్యతిరేకంగా యూనస్ తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి! స్వదేశంలో మైనార్టీలపై దాడులను అరికట్టాలి. నదీజలాల విషయంలో వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలి. చైనాగానీ, పాకిస్థాన్‌గానీ ఇండియాకు వ్యతిరేకంగా బంగ్లాను పావుగా వినియోగించుకోకుండా నివారించాలి. సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠపరిచి, అక్రమ వలసలు, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

ఢాకాతో స్నేహబంధం దిల్లీకి కూడా కీలకమే. దానితో సంబంధాలు మెరుగ్గా లేకపోతే, ఉగ్రవాదులు, తీవ్రవాదులు, తిరుగుబాటుదారులు అక్కడ ఆశ్రయం పొంది ఇక్కడ రెచ్చిపోయే ముప్పుంటుంది. దక్షిణాసియాలో భారత్‌కు బంగ్లా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌తో అనుసంధానించే రవాణా నెట్‌వర్క్‌లపై ఇండియా ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టింది. ఈశాన్య భారత్‌ను ప్రాంతీయ సరఫరా గొలుసుల్లో సమ్మిళితం చేసేందుకు అవి దోహదపడతాయి. బంగ్లాకూ అవి ఆర్థికంగా లాభదాయకమే. ప్రస్తుతం జమాతే బంగ్లాదేశ్ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. హసీనాను స్వదేశానికి రప్పించడం, పాక్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం వంటి అంశాల్లో అది బీఎన్‌పీ సర్కారుపై ఒత్తిడి పెంచొచ్చు. దానికి తలొగ్గకుండా, దిల్లీతో సంబంధాల మెరుగుదలకు చర్యలు చేపడితేనే ఢాకా దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు పడతాయి. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి తారిఖ్ నడుచుకోవాలి.

– మండ నవీన్‌కుమార్ గౌడ్

అమ్మ ఒడిలో, అమ్మ నోటినుంచి విని నేర్చుకునే భాష కాబట్టే మనిషి మాట్లాడే మొదటి భాష మాతృభాష అయింది. ఎన్ని భాషలు నేర్చినవారైనా అనుభూతుల్ని, ఆలోచనల్ని అమ్మభాషలో చెప్పినంత గొప్పగా ఇతర భాషల్లో వ్యక్తీకరించలేరు. ఉగ్గుపాలతోనే అమ్మభాషను ఆకళింపు చేసుకుంటారు పిల్లలు. అయినప్పటికీ ఉపాధి కోసమో, వలస వెళ్లినందుకో, ఆధునికులం అనిపించుకోవాలనో ఇతర భాషలు నేర్చుకుంటున్నవాళ్లు మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారు. వాడనిది ఏదైనా ఉనికి కోల్పోవడం సహజం. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో స్థానిక భాషలు అంతరించిపోయే దశకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మాతృభాషల గొప్పదనాన్ని, అవసరాన్ని ప్రపంచానికి గుర్తుచేయడానికి యునెస్కో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా 1999లో ప్రకటించింది.

అమ్మభాషకు జేజేలు



ఈ దినోత్సవ నిర్వహణకు ఫిబ్రవరి 21నే ఎంచుకోవడానికి ఒక కారణముంది. 1952లో బంగ్లాదేశ్‌లో (అప్పటి తూర్పు పాకిస్థాన్) ఉర్దూను ఏకైక జాతీయ భాషగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ అక్కడి విద్యార్థులు ఉద్యమించారు. తమ మాతృభాష 'బెంగాలీ'ని కూడా అధికార భాషగా గుర్తించాలంటూ జరిగిన ఆ ఉద్యమంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ యునెస్కో ఈరోజును అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. భాషా వైవిధ్యాన్ని కాపాడటం, మాతృభాషల వినియోగాన్ని ప్రోత్సహించడం, బహుభాషా విద్యను అభివృద్ధి చేయడం... దీని ప్రధాన ఉద్దేశం. ఒక భాష అంతరించిపోవడమంటే కేవలం మాటలే కాదు, ఆ భాషకు సంబంధించిన జానపద గాథలు, సామెతలు, సాహిత్యం, జ్ఞాన సంపద, సంపూర్ణ సంస్కృతి... అన్నీ కనుమరుగవడం. భాషంటే కేవలం మాట్లాడుకునేదే కాదు. అది ఒక జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రతిబింబించే అద్దం లాంటిది. వాటన్నింటినీ అక్షరబద్ధం చేసి ముందుతరాలకు అందించే మాధ్యమం. ఏ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలైనా అక్కడి భాషతోనే నిలుస్తాయి. ప్రస్తుతం ప్రపంచంలో సుమారు ఏడువేలకు పైగా భాషలు ఉన్నప్పటికీ, వాటిలో అనేకం అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. అందుకే మాతృభాషల సంరక్షణ అనేది జాతి బాధ్యతగా మారింది.

పసిబిడ్డ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం మాతృభాష ద్వారానే ప్రారంభమవుతుంది. అమ్మానాన్నల ఆలనాపాలనా, పెద్దల ముద్దూమురిపాలూ దీవెనలూ... అన్నీ ఆ భాషలోనే చిన్నారి హృదయంలో నాటుకుపోతాయి. మాతృభాషలో విద్యాబోధన జరిగితే పిల్లల్లో అవగాహన, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అనేక పరిశోధనలు నిరూపించాయి. అమ్మభాషలో బలమైన పునాది ఉంటే ఇతర భాషలు నేర్చుకోవడం సులభమవుతుంది. బడిలో ఎలాగూ ఇతర భాషలు నేర్చుకుంటారు కాబట్టి ఇళ్లలో తల్లిదండ్రులు పిల్లలతో తమ మాతృభాషలోనే మాట్లాడాలి. కథలూ పాటలూ పద్యాల్లాంటివి నేర్పాలి. ఇంట్లో, సమాజంలో, విద్యాసంస్థల్లో మాతృభాష వినియోగాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు మాతృభాషల అభివృద్ధికి విధి విధానాలు రూపొందించి, వాటి అమలుకు గట్టి కృషి చేయాలి. న్యాయ, పరిపాలన రంగాల్లో ప్రాంతీయ భాషల వినియోగాన్ని పెంచుతూ ఆయా భాషల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలి.

– డాక్టర్ ప్రసాద్ తోటకూర, డాలస్, అమెరికా

ఖాళీల మేట!

చవకైన, నాణ్యమైన వైద్య వసతుల అందుబాటులో నెలకొన్న అసమానతలను తగ్గించడానికి కేంద్రం ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లను చాలా చోట్ల నెలకొల్పింది. దేశ వ్యాప్తంగా వైద్య విద్యను పటిష్ఠం చేసుకోవడం కూడా వీటి ఏర్పాటు వెనక మరో లక్ష్యం. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంతో పాటు, పరిశోధనల పరంగానూ ఇవి ఎంతో తోడ్పడతాయి. అయితే, సిబ్బంది కొరతతో అవి సతమతమవుతున్నాయి. ఆయా ఎయిమ్స్‌లలోని బోధన సిబ్బందిలో ఖాళీల సంఖ్య...

న్యూదిల్లీ	446
జోధ్‌పుర్ (రాజస్థాన్)	184
మంగళగిరి (ఏపీ)	138
నాగ్‌పుర్ (మహారాష్ట్ర)	135
కల్యాణి (పశ్చిమ్ బెంగాల్)	134
మదురై (తమిళనాడు)	113
రాజ్‌కోట్ (గుజరాత్)	105
రాయ్‌పుర్ (ఛత్తీస్‌గఢ్)	105
భువనేశ్వర్ (ఒడిశా)	99
గోరఖ్‌పుర్ (యూపీ)	96
బీబీనగర్ (తెలంగాణ)	51

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

బోధనలో లోపాలే శాపాలు!

బడిలో పదేళ్లు నేర్చుకున్నా కూడా మన విద్యార్థులు తప్పులు లేకుండా తెలుగు చదవలేకపోతున్నారు. రాయలేకపోతున్నారు. దీనికి చాలా మంది పలు రకాల కారణాలు చెబుతున్నారు. కానీ, వాస్తవంగా లోపం బోధనలో ఉంది.



బడిలో పిల్లలు సరిగ్గా తెలుగును చదవలేక, రాయలేకపోవడానికి కారణం... భాష కాస్త కఠినంగా ఉంటుందని, వ్యాకరణాది నియమాలు క్లిష్టంగా ఉంటాయని పలువురు వాదిస్తారు. భాష స్వచ్ఛతను కాపాడాలనే ధోరణిలో పండితులు పాఠ్యపుస్తకాల్లో పాఠాలు రాస్తున్నారని వారు ఆక్షేపిస్తుంటారు. ఈ సమస్య తమిళనాడులో అస్సలు లేదని వారు చెబుతుంటారు. ఇంకోవైపు తెలుగు వారిలో చాలామందికి, ముఖ్యంగా తల్లిదండ్రులకు మాతృ భాషాభిమానం లేదని, అందువల్లే పిల్లలకు తెలుగు రావడంలేదని ఇంకొందరు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. అయితే, ఇంటా బయటా తెలుగు ధారాళంగా మాట్లాడుతున్న పిల్లలకు, ముఖ్యంగా తెలుగు మాట్లాడే ప్రాంతంలోనే నివసిస్తూ రోజూ బడికి వెళ్తున్న వారికి తెలుగు చదవడం, రాయడం రాకుండా ఉంటుందా? నిజంగా తెలుగు సంక్లిష్టంగా ఉండటం, భాషపై అభిమానం లేకపోవడమే పిల్లలకు ప్రతిబంధకంగా నిలుస్తోందా? ఈ విషయాన్ని మరికాస్త లోతుగా విశ్లేషించాల్సి ఉంది.

పసలేని వాదనలు

అసర్ నివేదికల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2006లో అయిదో తరగతి చదివిన వారిలో 42.3శాతం మంది రెండో తరగతి స్థాయి తెలుగు పాఠాన్ని చదవగలిగారు. 2024కి వచ్చేసరికి అలాంటి వారి సంఖ్య 36.4శాతానికి తగ్గిపోయింది. అదే సమయంలో తమిళనాడులో అయిదో తరగతిలో రెండో తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగినవారు 29.2శాతం నుంచి 35.6శాతానికి పెరిగారు. ఇక కర్ణాటకలో 2006లో అయిదో తరగతిలో పిల్లల్లో 30.9శాతం మంది కన్నడంలో రెండో తరగతి పాఠాన్ని చదవగలిగితే, 2024కి వారు 34శాతం అయ్యారు. కేరళ విషయంలో 2006లో అయిదో తరగతిలో 74.9శాతం మంది మలయాళంలో రెండో తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగితే, 2024కి అలాంటి పిల్లలు 66శాతానికి తగ్గారు. అసర్ నివేదికల ప్రకారం మాతృభాష పరంగా తమిళనాడుతో పోలిస్తే ఏపీ 2006 నుంచి ప్రతి సంవత్సరంగా మెరుగ్గానే ఉంది. కానీ, 2024కు వచ్చేసరికి తమిళనాడు స్థాయికి ఎందుకు పడిపోయింది? కొవిడ్ సమయంలో బడులు పనిచేయకపోవడమే దీనికి కారణం అనుకున్నా, అనంతర కాలంలో మిగిలిన రాష్ట్రాలు పుంజుకున్నాయి. ఏపీలో మాత్రం పరిస్థితి ఎందుకు భిన్నంగా ఉంది? దీనికి పలు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. తమిళులతో పోలిస్తే తెలుగు వారికి మాతృభాషపై అభిమానం లేకపోవడం వల్ల ఆ ప్రభావం స్థానికంగా పిల్లలపై పడుతోందని కొందరు చెబుతారు. తమిళులకు భాషాభిమానం, స్వాభిమానం ఎక్కువని, అక్కడి రాజకీయ పార్టీలూ నాయకులూ సంఘాల ప్రతినిధులు కలిసికట్టుగా తమిళ విస్తృతికి కృషి చేస్తారని వాదిస్తారు. అయితే, బడిఈడు పిల్లలపై ఇలాంటి వాటి ప్రభావం పెద్దగా ఉండదన్నది కాదనలేని సత్యం.

అసర్ నివేదికల ప్రకారం ఆయా సంవత్సరాల్లో పలు దక్షిణాది రాష్ట్రాల్లో అయిదో తరగతిలో ఎంతశాతం మంది పిల్లలు రెండో క్లాసు స్థాయిలో స్థానిక భాషల్లో పాఠ్యాంశాలు చదవగలిగారంటే...

రాష్ట్రం	2006	2012	2018	2024
ఆంధ్రప్రదేశ్	42.3	59.4	59.7	36.4
తమిళనాడు	29.2	29.9	40.7	35.6
కర్ణాటక	30.9	48.5	46	34
కేరళ	74.9	65.2	77.2	66

కార్యాచరణే కీలకం

వాస్తవానికి, బడిలో పాఠాలు ఎలా చెబుతున్నారు? తప్పులు సరిచేస్తున్నారా? బోధన సరైన పద్ధతిలోనే సాగుతోందా? అన్నవాటిపైనే మాతృభాషపై పట్టు సాధించడం ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో కేరళ మెరుగ్గా ఉండటానికి అక్కడి ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థే కారణం. అలాగే తమిళనాడులోని పిల్లలకు తమిళం చదవడం రాకపోవడానికి ఉపాధ్యాయులు, చదువులదే లోపం! లేకపోతే, భాషాభిమానం తీవ్రంగా ఉన్నచోట పిల్లలు తమిళంలో ఎందుకు తడబడుతున్నట్లు? నిజానికి భాష బాగా రావాలంటే దాన్ని చక్కగా బోధించాలి. ఏ విధానంలో చెబితే పిల్లలకు బాగా అవగతమవుతుందో తెలుసుకుని ఆ మార్గంలో ముందుకెళ్లాలి. చాలా చోట్ల ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు దీనిపై తగిన శ్రద్ధ వహించడం లేదని మనకు అర్థమవుతోంది. ఒకవేళ తెలుగు నిజంగా కష్టమైనదే అయితే, 2006-18 మధ్య తమిళనాడు, కర్ణాటకలకన్నా ఏపీలో పిల్లలు ఎందుకు మెరుగ్గా ఉన్నారు? దీని గురించి అంతా ఆలోచించాలి. పిల్లలకు తెలుగుపై పట్టు రావాలంటే ఏం చేయాలన్నదానిపై భాషాభిమానులు, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులు, ప్రభుత్వ వర్గాలు చర్చించాలి. ఆ మేరకు తగిన కార్యాచరణను రూపొందించి అమలులోకి తేవాలి. అప్పుడే తెలుగు భాష కలకాలం పచ్చగా పరిఢవిల్లుతుంది.

డాక్టర్ శ్రీనివాస్ గుంటుపల్లి

ఏలూరు ఆశ్రం వైద్యకళాశాలలో ప్రొఫెసర్

ఈ సూట్‌లు ప్రత్యేకం!

అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు, సముద్రంలో స్కూబా డైవర్లు ప్రత్యేకమైన సూట్‌లు ధరిస్తారు కదా! అవి చూడటానికి భలేగా ఉంటాయి. ఒక్కోసారి మనకూ వేసుకోవాలనిపిస్తుంది కదూ!

అంతరిక్షంలో ఉండే అధిక రేడియేషన్, లోతైన సముద్రంలో ఉండే అతి తక్కువ ఉష్ణోగ్రతలు, ఎక్కువ నీటి పీడనం మొదలైన వాటి నుంచి రక్షించుకోవడానికి ఈ ప్రత్యేకమైన సూట్లు ఉపయోగపడతాయి. అందులో మళ్లీ చాలా రకాలుంటాయి. వ్యోమగాములు ధరించే సూట్లు దాదాపుగా 13-16 పొరలతో తయారుచేస్తారు. అవి అంతరిక్షంలో ఉండే దుమ్ము, ధూళి నుంచి రక్షణ కల్పిస్తాయి. ఆ సూట్లకు వెనకవైపు ఒక బ్యాక్‌ప్యాక్ ఉంటుంది. అది ఆక్సిజన్ అందించడంతోపాటు కార్బన్‌డయాక్సైడ్‌ని తొలగిస్తుంది. పాలికార్బోనేట్‌తో చేసిన హెల్మెట్ రేడియేషన్ నుంచి కాపాడుతుంది.



ట్యూబ్స్‌తో కూడిన ప్రత్యేకమైన లేయర్ వ్యోమగాముల శరీరాన్ని చల్లబరచడానికి నీటిని అందిస్తుంది. సూట్‌కు వెనకవైపు సేఫర్ అనే పరికరం ఉంటుంది. ఒకవేళ వ్యోమగాములు అంతరిక్ష కేంద్రం నుంచి దూరంగా వెళ్తే, తిరిగి రావడానికి సేఫర్‌లో ఉండే చిన్న జెట్స్‌ని ఉపయోగించుకుంటారు. స్కూబా డైవింగ్ సూట్‌లలోనూ చాలా రకాలున్నాయి. స్కూబా అంటే సెల్ఫ్-కంటైన్డ్ అండర్ వాటర్ బ్రీతింగ్ అపరేటస్. డైవింగ్ చేసే వారికి శ్వాస కోసం గాలిని అందించడానికి ప్రత్యేకమైన సిలిండర్ ఉంటుంది. వారు వేసుకునే సూట్‌లో, శరీరం చల్లబడకుండా ఉండటానికి ఒక మందపాటి ఫోమ్ రబ్బరు ఉంటుంది. అలాగే పాదాలకు ఫిన్స్ ధరిస్తారు. నీటి లోపల స్పష్టంగా చూడటానికి ప్రత్యేకంగా తయారుచేసిన మాస్క్‌ను వాడతారు. పైకి తేలకుండా, లోపలికి మునగకుండా ఉండటానికి తేలే నియంత్రణ పరికరం(బీసీడీ) ఉపయోగిస్తారు. ఈ మధ్య ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త రకమైన సూట్‌లను తయారుచేస్తున్నారు.

హాయ్! బుజ్జీ

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల ఆంగ్ల పదాన్ని నేను. నాలోని 2,3,4 అక్షరాలను కలిపితే 'గాలి' అని, 1,2,4 అక్షరాలను కలిపితే 'దూరం' అనే అర్థాన్నిస్తాను నేనెవర్ని?

2. అయిదు అక్షరాల ఆంగ్ల పదాన్ని నేను. మొదటి మూడు అక్షరాలను కలిపితే 'వయసు' అని, 1,4,5 అక్షరాలను కలిపితే 'చీమ' అనే అర్థాన్నిస్తాను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.FAIR 2.AGENT




అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్సీలు

మండలి సాక్షిగా వైకాపా మహాపచారం

శ్రీవారి చిత్రపటాలతో సభలో ఆందోళన

- ఛైర్మన్ వారించినా తగ్గని ఆ పార్టీ సభ్యులు
- మంత్రి లోకేశ్, కూటమి పార్టీల సభ్యుల తీవ్ర అభ్యంతరం
- దేవుణ్ని రాజకీయాల్లోకి లాగుతారా అంటూ ధ్వజం




వేంకటేశ్వరస్వామి చిత్రపటాలతో మండలిలో నిరసన తెలుపుతున్న వైకాపా సభ్యులు ● వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్సీలు శ్రీవారి చిత్రపటాల్ని ప్రదర్శిస్తూ శుక్రవారం మండలిలో ఆందోళనకు దిగడం దుమారం రేపింది. దేవుడి ఫొటోలు పట్టుకుని వైకాపా సభ్యులు సభలో ప్రవర్తించిన తీరుపై విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా స్పందించారు. ఇతర మంత్రులు, కూటమి పార్టీల సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు పోడియం వద్దకు చేరి తమ నిరసన తెలిపారు. దేవుణ్ని రాజకీయాల్లోకి లాగుతారా? బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు.

శుక్రవారం ఉదయం 10.07 గంటలకు మండలి ప్రారంభమైంది. తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చించేందుకు ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ సంస్థ తితిదేకి నెయ్యి సరఫరా అంశంపై చర్చించేందుకు వైకాపా ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, మాధవరావు, ఎస్.మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను ఛైర్మన్ మోషేనురాజు తిరస్కరించి ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చ చేపట్టాలని వైకాపా సభ్యులు వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను, ఇతర ఫ్లకార్డులను చేతపట్టుకుని పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, పాలవలస విక్రాంత్, కుంభా రవిబాబు, కల్పలతా రెడ్డి, వరుదు కల్యాణి, మురుగుడు హనుమంతరావు, రమేష్ యాదవ్ దేవుడి చిత్రపటాలను ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. తిరస్కరించిన తీర్మానంపై చర్చను కోరడం మంచి విధానం కాదని ఛైర్మన్ చెబుతున్నా వైకాపా సభ్యులు ఆందోళన కొనసాగించారు. దేవుడి బొమ్మను తీసేయాలని ఆయన వారిస్తున్నా పట్టించుకోలేదు. వైకాపా సభ్యుల తీరుపై మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా మండిపడ్డారు. దేవుడి చిత్రపటాల్ని పట్టుకుని వైకాపా సభ్యులు సభలోకి రావడం దుర్మార్గపు చర్య. దేశ చరిత్రలోనే ఇలా ఎక్కడా జరగలేదు. శ్రీవారిని రాజకీయాల్లోకి లాగే ఇలాంటి చర్యను అనుమతించకూడదు. దేవుడంటే నమ్మకం, గౌరవం లేదు. కనీస భయం లేదు. వాళ్ల నాయకుడు చెప్పినట్టు నడుచుకుంటున్నారు. వేంకటేశ్వరస్వామి ఫొటోల్ని సభలోకి తీసుకొచ్చి హిందూ ధర్మాన్ని కించపరుస్తూ ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని విరుచుకుపడ్డారు. వైకాపా సభ్యుల తీరును ఖండిస్తూ ఆయన 'హెడ్' ఫోన్‌ను బెంచికేసి కొట్టి నిరసన తెలిపారు. వైకాపా సభ్యుల ఆందోళనతో సభను ఛైర్మన్ వాయిదా వేశారు. వెంటనే వారు స్వామి వారి ఫొటోలను టేబుల్‌పై పడేసి వెళ్లిపోయారు.


మండలి ఛైర్మన్ పోడియం వద్ద వేంకటేశ్వరస్వామి చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న వైకాపా సభ్యులు

మండలి వాయిదాపడ్డ తర్వాత కూటమి పార్టీల నాయకులు తెదేపా శాసనసభాపక్ష కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. వైకాపా సభ్యుల తీరును తీవ్రంగా ఖండించాలని నిర్ణయించారు. ఛైర్మన్ మోషేను రాజును కలిసి తమ నిరసన తెలిపారు. మండలిలో భాజపా పక్షనేత సోము వీర్రాజు ఈ పరిణామాలను పార్టీ అధినాయకత్వానికి ఫోన్‌లో తెలియజేశారు.

5 నిమిషాలే సాగిన సభ

మధ్యాహ్నం 1.07 గంటలకు సభ తిరిగి ప్రారంభమవగానే చెప్పులు, బూట్లు ధరించి శ్రీవారి పటాన్ని సభలోకి తెచ్చి చేసిన అపచారానికి వైకాపా ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలంటూ కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. వైకాపా సభ్యులు ఈసారి సీఎం చంద్రబాబు బూట్లు వేసుకుని వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని పట్టుకున్న ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ పోడియం దగ్గరకు చేరి ఆందోళనకు దిగారు. ఈ ఆందోళన మధ్యనే 'ప్రభుత్వ పాఠశాలల్లో చేనేత యూనిఫాం దుస్తుల'కు సంబంధించి అడిగిన ప్రశ్నను సభ్యుని విన్నపం మేరకు వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. మిగతా ప్రశ్నలకు సమాధానం చెప్పినట్టుగానే భావించాలని సోమవారానికి మండలిని వాయిదా వేశారు. ఇదంతా నిమిషంలోనే జరిగిపోయింది. మొత్తంగా మండలి శుక్రవారం మండలి 5 నిమిషాలే సాగింది.

సభలోకి ఇలా పట్టుకెళ్లడం మొదటిసారి

ఈనాడు, అమరావతి: తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి వైకాపా ఎమ్మెల్సీలు శ్రీవారి చిత్రపటాన్ని శుక్రవారం మండలిలోకి తీసుకురావడం తీవ్ర వివాదాస్పదమైంది. సభలోకి ఇలా దేవుడి చిత్రపటాన్ని తీసుకెళ్లడం ఇదే మొదటిసారి. వైకాపా సభ్యులు ఈ దుస్సంప్రదాయానికి ఒడిగట్టారు. ఉదయం సభ ప్రారంభంకాగానే ఆ పార్టీ నేతలు వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను పట్టుకుని పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. దీంతో మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్ తీవ్రంగా స్పందించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి చిత్రపటాన్ని సభలోకి తీసుకొచ్చి రాజకీయాలకు వినియోగించుకోవడమే తప్పంటే.. చెప్పులు, బూట్లు వేసుకుని ప్రదర్శించడం మహా అపచారమని దుయ్యబట్టారు. సభ వాయిదా పడ్డాక దేవుడి పటాల్ని టేబుల్‌పైనే పడేసి వెళ్లిపోవడం దారుణమని ధ్వజమెత్తారు. దీనిపై వైకాపా నాయకులు క్షమాపణ చెప్పాలని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సంధ్యారాణి, సవిత, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు డిమాండ్ చేశారు. సభ ముగిసిన తర్వాత మండలిలో విపక్షనేత అయిన బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ 'మేం చెప్పులు, బూట్లు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటో పట్టుకెళ్లలేదు' అని వాదించారు. ఆందోళన ముగిశాక తానే ఫొటోల్ని టేబుల్‌పై పెట్టానని కూడా ఆయన పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, లేళ్ల అప్పిరెడ్డి, పాలవలస విక్రాంత్ చెప్పులు, బూట్లు వేసుకుని శ్రీవారి చిత్రపటాన్ని పట్టుకున్న వీడియోలు బయటపడటంతో.. ఆ పార్టీ నేతలు కంగుతిన్నారు. టేబుల్‌పై శ్రీవారి చిత్రపటాలు పడేసిన దృశ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత కూడా బొత్స సత్యనారాయణ అవి ఏవి వీడియోలంటూ వ్యాఖ్యానించారు.

తిరిగి వెళ్లేటప్పుడు శ్రీవారి పటాన్ని విసిరేశారు

- జగన్ ఆదేశాలతోనే ఈ దుశ్చర్య
- కూటమి నేతలు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, సోము వీర్రాజు ధ్వజం

ఈనాడు, అమరావతి: శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని వైకాపా ఎమ్మెల్సీలు ఫ్లకార్డులా ప్రదర్శించడమే కాక.. తిరిగి వెళ్లేటప్పుడు దాన్ని విసిరేశారని కూటమి పార్టీల నేతలు ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, శాసనమండలి భాజపా పక్షనేత సోము వీర్రాజు శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. నారా లోకేశ్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. వైకాపా నేతలు దేవుణ్ని రాజకీయాలకు వాడుకోవడానికి ఇది పరాకాష్ఠ అని కేశవ్ ధ్వజమెత్తారు. ఇది కోట్ల మంది హిందువుల్ని, శ్రీవారి భక్తుల్ని అవమానించడమేనని దుయ్యబట్టారు. హిందువులపై వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. జగన్‌రెడ్డి ఆదేశాలతోనే ఆ పార్టీ ఎమ్మెల్సీలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు, మూడు నెలలుగా కలియుగ దైవం వేంకటేశ్వరస్వామితో వైకాపా నాయకులు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. 'శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీలు శ్రీవారి చిత్రపటాన్ని ఫ్లకార్డులా ప్రదర్శించడం హిందువుల మనోభావాల్ని దెబ్బతీయడమే. వారి దుశ్చర్యను చూసి కడుపు మండిపోయింది. ఓ రాజకీయ పార్టీ ప్రతినిధిగానో, మంత్రిగానో కాకుండా పౌరుడిగా, హిందూ సమాజం నేర్పిన సంప్రదాయంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా ఈ వ్యవహారం మీద స్పందిస్తున్నా' అని కేశవ్ పేర్కొన్నారు. ఈ విషయంలో జగన్ సహా ఆ పార్టీ నేతలు హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

దేవుడి పట్ల అపచారాలు వారికి నిత్యకృత్యమైపోయాయి

'దేవుడి పట్ల అపచారం చేయడం వైకాపా వారికి నిత్యకృత్యమైపోయింది. నూటికి నూరు శాతం ఇది జగన్‌రెడ్డి పర్యవేక్షణలోనే జరిగింది. ఈ విషయాన్ని తేలిగ్గా వదలకూడదు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి' అని దుర్గేష్ పేర్కొన్నారు. 'శ్రీవారి పరకామణిలో చోరీ ఘటనను 11 డాలర్లే కదా.. అని జగన్ తేలికగా మాట్లాడారు. ఈసారి చెప్పులు ధరించి చిత్రపటాన్ని తీసుకెళ్లిన వర్గీయులు ఆయన భావిస్తున్నారా? కిలో నెయ్యి రూ.320 కొనుగోలు చేసినప్పుడే వెంకటేశ్వరస్వామిపై ఆయనకు ఎంతటి భావన ఉందని స్పష్టమైంది. అసలు హిందుత్వం మీద వైకాపా విధానమేంటి' అని సోము వీర్రాజు నిలదీశారు.

హెరిటేజ్ తరఫున మంత్రులు మాట్లాడటమేంటి?

- ఆ సంస్థకు బానిసల్లా మాట్లాడడం ధర్మమేనా?
- వైకాపా నాయకుడు బొత్స సత్యనారాయణ ప్రశ్నలు

ఈనాడు, అమరావతి: 'హెరిటేజ్.. ఓ ప్రైవేట్ సంస్థ. ఆ సంస్థతో ఇందాపూర్‌కు ఉన్న సంబంధంపై శాసనమండలిలో చర్చించాలని అడిగితే.. ఇంతమంది మంత్రులు ఊగిపోవడమేంటి? వీళ్లేమైనా ఆ సంస్థలో డైరెక్టర్లా? ముఖ్యమంత్రి భార్య ఆ సంస్థ ఎండీ కాబట్టి ఆమె సమాధానం చెప్పారు. షి ఈజ్ రైట్. దానిపై మంత్రులు మాట్లాడటమేంటి? ఈ మంత్రులు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా లేక హెరిటేజ్ సంస్థను నడుపుతున్నారా' అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఒక సంస్థకు బానిసల్లా మాట్లాడడం ధర్మమేనా, సిగ్గు అనిపించడం లేదా అని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ



మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'దేవుడి ప్రసాదంలో పంది, జంతు కొవ్వు ఉందని స్వయంగా సీఎం అపవాదు వేశారు కాబట్టే మేం మాట్లాడాం. ధనార్జన కోసం దేవుడిని చంద్రబాబు రాజకీయాల్లోకి లాగారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందనే ఆరోపణపై చర్చ జరగాలి. బడ్జెట్‌పైనా చర్చించాలి. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. కూటమికి చిత్తశుద్ధి ఉంటే. . దేవుడిపై భక్తిభావం ఉంటే చర్చకు రండి' అని బొత్స సవాలు చేశారు. 'మేం బయట నుంచి ఊరేగింపుగా వచ్చాం. రక్షించు గోవిందా.. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించు గోవిందా అని వేంకటేశ్వరస్వామిని కోరుతూ సభలోకి వెళ్లాం. మండలిలో ఆందోళన అయ్యాక నేనే ఆ ఫొటోలన్నీ టేబుల్‌పై పెట్టాను. కూటమి నాయకుల ఆరోపణలు సరికాదు. ఆధారాలుంటే చూపించమనండి. ఈ విషయంలో మేమెందుకు క్షమాపణ చెప్పాలి' అని బొత్స ప్రశ్నించారు.

వేంకటేశ్వరస్వామి ఫొటోలతో వైకాపా ఎమ్మెల్సీల ప్రదర్శన

- బ్యానర్, ఫ్లకార్డులను అనుమతించకపోవడంపై భద్రతా సిబ్బందితో వాగ్వాదం

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్సీలు శుక్రవారం వేంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని అసెంబ్లీకి ప్రదర్శనగా వచ్చారు. అసెంబ్లీ సమీపంలోని కూడలి వద్దకు చేరుకుని అక్కడి నుంచి అందరూ ఒక పెద్ద బ్యానర్, దేవుడి ఫొటోలు, ఫ్లకార్డులు పట్టుకుని 'రక్షించు గోవిందా గోవిందా, తిరుపతి లడ్డూ అంశం, ఇందాపూర్ పేరుతో హెరిటేజ్ చేసిన దోపిడీపై సభలో వెంటనే చర్చ చేపట్టాలి. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన డొల్ల బడ్జెట్‌పైనా చర్చించాలి' అంటూ నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు నడుచుకుంటూ వచ్చారు. వీళ్లంతా అసెంబ్లీలో ప్రవేశించే సమయంలో.. ఫ్లకార్డులు, బ్యానర్లు తీసుకువెళ్లరాదని, అనుమతి లేదని అసెంబ్లీ ప్రధానద్వారం వద్ద భద్రతా సిబ్బంది అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్సీలు ముందుకు కదలగా సిబ్బంది వారిని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో కొందరు ఎమ్మెల్సీలు వాగ్వాదానికి దిగారు. చివరికి వారి చేతుల్లో ఉన్న బ్యానర్, కొన్ని ఫ్లకార్డులను భద్రతా సిబ్బంది తీసేసుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఫొటోలను కొందరు ఎమ్మెల్సీలు జేబుల్లో పెట్టుకుని లోపలికి తీసుకువెళ్లారు.

రాజకీయం కోసమే హెరిటేజ్‌ను చర్చలోకి తీసుకొచ్చారు

- భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు

ఈనాడు, అమరావతి: హెరిటేజ్‌కూ తిరుమలకు సంబంధం లేదని, కేవలం రాజకీయం కోసమే ఆ సంస్థ పేరును వైకాపా సభ్యులు తెరపైకి తీసుకువచ్చారని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ సభకు రాకపోతే కనీసం తన పార్టీ ఎమ్మెల్యేలనైనా పంపాలన్నారు. 'సభకు రాకపోతే ఆ ఎమ్మెల్యేలు.. రేపు ఎన్నికలకు వెళ్లినప్పుడు ప్రజలకు ఏం చెప్పి ఓట్లు అడుగుతారు? అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలను ప్రజలు తిరిగి ఎందుకు ఎన్నుకుంటారు' అని ప్రశ్నించారు.

హిందూ జాతికి క్షమాపణలు చెప్పాలి

– ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి

"మండలిలో వైకాపా ఎమ్మెల్సీల ప్రవర్తన హిందూ సమాజం తలదించుకొనేలా ఉంది. వారు వేంకటేశ్వరస్వామిని అవమానించారు. జగన్ ఆదేశాలతో ఇదంతా జరిగింది. మండలి ఛైర్మన్ ఈ వ్యవహారంపై ఏంచర్యలు తీసుకుంటారో చూస్తాం"

మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి

– బొమ్మిడి నాయకర్, జనసేన ఎమ్మెల్యే

"శ్రీవారి చిత్రపటాన్ని ఫ్లకార్డుగా వాడి మహాపచారం చేసిన వైకాపా ఎమ్మెల్సీలపై ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి. వైకాపా వాళ్లకు దేవుడంటే భయం, భక్తి లేవు. హిందూ విశ్వాసాలపై గౌరవం లేదు"

హెరిటేజ్‌ను ప్రస్తావిస్తూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు

– సవిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి

"శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడిన ఘటన నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి హెరిటేజ్‌ను ప్రస్తావిస్తూ వైకాపా నాయకులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. తితిదేకు హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేదు."

శ్రీవేంకటేశ్వరస్వామి ఫొటోల్ని ఫ్లకార్డులా వాడటం దుర్మార్గం

– గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

'వైకాపా ఎమ్మెల్సీలు శ్రీవేంకటేశ్వరస్వామి ఫొటోల్ని సభలో ఫ్లకార్డులా వాడటం దుర్మార్గం. స్వామి వారి చిత్రపటాన్ని ఒకరు తలకిందులుగా పట్టుకున్నారు. మరొక సభ్యుడు ఆందోళన ముగియగానే టేబుల్‌పై పడేశారు. వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించారు. దేవుడి పట్ల భక్తి-భయం లేకుండా ప్రవర్తిస్తున్నారు'

హిందువులను రెచ్చగొట్టేందుకే.. వేంకటేశ్వరస్వామి ఫొటోలతో వైకాపా నిరసన

- భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా సభ్యులు రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి వేంకటేశ్వరస్వామి ఫొటోలతో శాసనమండలిలో నిరసనకు దిగడం.. సభలో గందరగోళం సృష్టించి ప్రజల దృష్టి మళ్లించాలని ప్రయత్నించడం సరికాదని భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్‌నారాయణ మండిపడ్డారు. భక్తుల ఆరాధ్య దైవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం సమర్థనీయం కాదని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దేవుడ్ని రాజకీయాల్లోకి లాగడం ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను అవమానించడమే. ఇది కేవలం సభను అడ్డుకోవడమే కాదు. హిందూ సమాజం భావోద్వేగాలను రెచ్చగొట్టే చర్య. ఏపీ శాసనమండలిలో జరిగిన ఘటనలు రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక దురదృష్టకరమైన అధ్యాయంగా మిగిలిపోతాయి. శాసనసభ, శాసనమండలి వేదికలు రాజకీయ పరస్పర విమర్శలకు మాత్రమే పరిమితం కావాలి. దైవాన్ని రాజకీయ ఆయుధంగా మార్చే ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదు.' అని జయప్రకాశ్ వ్యాఖ్యానించారు.

రప్పా రప్పా అని రోడ్లపైకి వస్తే కటకటాలే

- హింసను ప్రేరేపించడానికి ఇప్పుడున్నది జగన్ కాదు
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌ల కట్టడికి త్వరలో ప్రత్యేక చట్టం
- హోం మంత్రి అనిత



ఈనాడు, అమరావతి: 'రోడ్లపై కత్తులతో కేకులు కట్ చేసి రప్పా రప్పా అని మాట్లాడితే చూస్తూ ఊరుకుని హింసను ప్రేరేపించడానికి ఇక్కడున్నది జగన్ కాదు..ముఖ్యమంత్రి చంద్రబాబు అని గుర్తుంచుకోవాలి. మూగజీవాల తలలు నరికి వాటితో అభిషేకాలు చేస్తామంటే ఇది రాజారెడ్డి రాజ్యాంగం కాదు.. చంద్రబాబు అమలు చేస్తున్నది అంబేడ్కర్ రాజ్యాంగమని గమనించాలి. తప్పు చేస్తే శిక్ష తప్పదని అసెంబ్లీ వేదికగా హెచ్చరిస్తున్నాం. గీత దాటితే ఎంతటి వారికైనా కటకటాలే. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు' అని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. శాసనసభలో శుక్రవారం హోంశాఖ పద్దుపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు.

- 'సామాజిక మాధ్యమాల్లో ప్రజాప్రతినిధులపై మానసిక దాడి చేస్తూ పెడుతున్న పోస్టింగ్‌ల కట్టడికి ప్రత్యేక చట్టం తీసుకురాబోతున్నాం. మంత్రుల ఉప సంఘం సమావేశంలోనూ ఇప్పటికే చర్చించాం. వైకాపా ప్రభుత్వం పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పోలీసులంటే సీఎం పర్యటనకు పరదాలు కట్టడానికి, అక్రమ అరెస్టులు చేయడానికే అన్నట్లుగా వారిని తయారు చేశారు. కేసుల్లో పరిశోధన, దర్యాప్తు వంటివి పూర్తిగా పక్కనపెట్టారు. నేరస్థుల వేలిముద్రలు గుర్తించే వ్యవస్థకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారు. మనసు చంపుకుని పని చేయడం ఇష్టం లేక చాలామంది ఇళ్లకు పరిమితమయ్యారు' అని ఆమె వివరించారు.

జగన్ అసెంబ్లీకి వెళ్లేందుకు 2 వేల మందితో బందోబస్తు

'తాడేపల్లి ప్యాలెస్ నుంచి జగన్ అసెంబ్లీకి రావడానికి బందోబస్తు కోసం 2 వేల మంది, తాడేపల్లిలో ఆయన ఇంటి భద్రతకు మరో 900 మంది పోలీసు సిబ్బందిని గత ప్రభుత్వంలో వినియోగించేవారు. 2014-19 మధ్య కాలంలో ఏర్పాటు చేసిన 14 వేల సీసీ కెమెరాలను అలంకారప్రాయం చేశారు. ఉపాధి అవకాశాల్లేక యువత గంజాయికి ఆకర్షితులయ్యారు. శాంతి భద్రతల సమస్యల కారణంగానే గత ప్రభుత్వంలో ఒక్క పెట్టుబడి కూడా రాలేదు. దిశ పోలీస్ స్టేషన్లు పెట్టి వాటికి చట్టబద్ధత కల్పించని అసమర్థులు గత పాలకులు' అని హోంమంత్రి మండిపడ్డారు.

గత ప్రభుత్వం పెట్టిన హింసను మరచిపోడానికి లేదు

'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసుశాఖలో ప్రక్షాళన ప్రారంభించి వ్యవస్థను పటిష్ఠం చేశాం. వైకాపా ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ తదితరులను ఎంత హింసించారో చూశాం. ఇదే శాసనసభ వేదికగా చంద్రబాబు కన్నీళ్లు పెట్టుకున్నారు. మాస్క్ అడిగినందుకు దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను రోడ్డుకీడ్చి ఆయన మరణానికి గత ప్రభుత్వం కారణమైంది. ఇవేవీ మరచిపోడానికి లేదు. నేరాలకు, గంజాయికి ఒకప్పుడు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఏపీలో ఇప్పుడు అనూహ్య మార్పులు తీసుకొస్తున్నాం. ఏఐ అనుసంధానంతో కేసుల దర్యాప్తుల్లో మంచి ఫలితాలు రావడంతో ఇతర రాష్ట్రాల పోలీసులు వచ్చి అధ్యయనం చేస్తున్నారు. గంజాయి నియంత్రణలో చాలావరకు విజయవంతమయ్యాం' అని మంత్రి అనిత వివరించారు.

నన్ను కొట్టింది మరచిపోయారా?

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

శాసనసభలో హోంశాఖ పద్దుపై శుక్రవారం చర్చ సందర్భంగా ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. తెదేపా, జనసేన నేతలను వైకాపా ప్రభుత్వంలో ఏ విధంగా ఇబ్బందులు పెట్టి అక్రమంగా కేసులు బనాయించారో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వివరించారు. ఈ సందర్భంగా ఆమె.. ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు పేరు ప్రస్తావించలేదు. దీంతో స్పీకర్ స్థానంలో నుంచి సభ నడిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ జోక్యం చేసుకున్నారు. 'నన్ను కొట్టింది మరచిపోయారా?' అంటూ గుర్తు చేశారు. దీంతో సభలో ఒక్కసారి నవ్వులు విరిశాయి. మరచిపోలేదని, తరువాత మీ పేరే ఉందని హోం మంత్రి బదులిచ్చారు.

పులివెందుల ఎమ్మెల్యే.. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయరేం?

- మిగిలిన యాజమాన్యాలదీ 20-25 ఏళ్లుగా ఇదే తీరు
- నాడు భూములిచ్చిన రైతులు.. ఇప్పుడు కూలీలయ్యారు
- ఎమ్మెల్యే యరపతినేని

ఈనాడు, అమరావతి: పులివెందుల ఎమ్మెల్యేకు చెందిన సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్.. దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో రైతుల నుంచి 1,150 ఎకరాలు 2005లో కొనుగోలు చేసిందని, 20 ఏళ్లు దాటినా ఇంకా ఎందుకు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయలేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రశ్నించారు. అప్పట్లో ఎకరా రూ.లక్ష నుంచి రూ.2 లక్షలతో కొనుగోలు చేశారని, ఇప్పుడా రైతులంతా కూలీలు అయ్యారని పేర్కొన్నారు. ఇతర సిమెంట్ పరిశ్రమలు కూడా ఇలాగే వ్యవహరిస్తున్నందున వీటిపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించాలని కోరారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాలలో గురజాల నియోజకవర్గంలో సిమెంట్ కర్మాగారాలకు భూముల అంశంపై.. ఎమ్మెల్యే యరపతినేని పలు విషయాలు ప్రస్తావించారు. 'అంబుజా సిమెంట్స్‌కు 1997-98లో 2 వేల ఎకరాలు కేటాయించారు. తర్వాత అది అల్ట్రాటెక్‌గా, ఇప్పుడు అదానీగా మారింది. నాడు ఎకరా రూ.65-70 వేలకే రైతులు విక్రయించారు. ఇప్పుడు ఎకరా రూ.30 లక్షలకు చేరింది. ఇప్పటికీ అక్కడ పరిశ్రమ లేదు. 25 ఏళ్ల కిందట మైహోం సిమెంట్స్ 1,200 ఎకరాలు కొనుగోలు చేసింది. రాజపుష్ప సిమెంట్స్ చేతిలో 500 ఎకరాలు, ఇమామి సిమెంట్స్ చేతిలో 1,200 ఎకరాలు 20 ఏళ్లుగా ఉన్నాయి. ఇవేవీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. మొత్తం ఆరు వేల ఎకరాల భూమి నిరుపయోగంగా ఉంది. ఆ పరిశ్రమలు చేతులు మారుతున్నాయి. వాళ్లు బ్యాంకు రుణాలు తెచ్చుకుంటున్నారు. భూమి కేటాయించాక రెండు, మూడేళ్లలో పరిశ్రమ పెట్టాలనే నిబంధన ఎందుకు అమలు చేయడంలేదు? ఆ భూములు రైతులకు ఇస్తే వాళ్లు సాగుచేసుకుంటారు. పరిశ్రమ పెడతామన్నప్పుడు తిరిగి ఇస్తారు. యాజమాన్యాలతో మాట్లాడి ఏదో ఒకటి తేల్చాలి' అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు.

- 20-25 ఏళ్లుగా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడం అన్యాయమేనని, వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై సమీక్షలు చేశామని, సేల్ అగ్రిమెంట్ చేసుకున్నవాటి రద్దుకు నోటీసులు పంపామని చెప్పారు. యాజమాన్యాలతో చర్చించి, యాక్షన్ ప్లాన్ తీసుకుంటామని, వాటిని అమలు చేయకపోతే.. కేటాయింపులు రద్దుచేస్తామని తెలిపారు. ఆయా కంపెనీలు ఇచ్చిన డీపీఆర్‌లను కూడా సమగ్రంగా పరిశీలిస్తామన్నారు.

బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం

రాష్ట్రంలో అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి బౌద్ధ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విభజనకు ముందు ఏపీలో 65 చోట్ల తవ్వకాలు జరగ్గా, విభజన తర్వాత 3 చోట్ల తవ్వకాలు జరిపినట్లు మంత్రి వివరించారు. పురావస్తు తవ్వకాలపై అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. తెలంగాణ నుంచి మనకు రావాల్సిన పురావస్తు సంపద కోసం మన అధికారుల బృందం, అక్కడి అధికారులతో చర్చలు జరుపుతోందని చెప్పారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన 50,939 ప్రాచీన శాసనాలు, శిల్పాలు, నాణాలు హైదరాబాద్‌లో ఉన్నాయని, వాటిని ఇక్కడకు తెచ్చుకోవాల్సి ఉందని తెలిపారు. పురావస్తు శాఖకు ప్రభుత్వం పెద్దఎత్తున బడ్జెట్ కేటాయించాలని కోరారు. తమిళనాడులో రూ.100 కోట్లు కేటాయించారని చెప్పారు. బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు (బేబీనాయన) మాట్లాడుతూ.. బొబ్బిలి మండలం చిత్రకోట బొడ్డవలస గ్రామంలో బౌద్ధులు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయని, అక్కడ పురావస్తుశాఖ అధికారులు అన్వేషణ చేయాలని కోరారు.

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుపై సంప్రదిస్తున్నాం

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



'కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు అంశంపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ అంశం హైకోర్టులోనే పెండింగులో ఉంది. జిల్లాల్లో వివిధ న్యాయస్థానాలకు భవనాల నిర్మాణ విషయం కూడా హైకోర్టు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.130 కోట్లు అదనంగా బడ్జెట్‌లో కేటాయించాం' అని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శాసనసభలో శుక్రవారం న్యాయశాఖకు బడ్జెట్ కేటాయింపులపై చర్చకు ఆయన సమాధానం ఇచ్చారు. 'జగన్ పరిపాలన మళ్లీ రాకూడదు. ఆ రోజుల్లో శాంతిభద్రతలు దారుణంగా ఉండేవి. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబును స్కిల్ కేసులో అరెస్టు చేసి పాత పోలీసు వాహనంలో కర్నూలు నుంచి రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. ఆ సందర్భంలో జిల్లాలోని తెదేపా నాయకులందరినీ ముందుగా అరెస్టు చేశారు. నంద్యాల కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నా కావాలని రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. చంద్రబాబు స్కిల్ కేసులో నిజాయతీగా బయటపడ్డారు' అని మంత్రి వివరించారు.


MH 14 MF 7056
Scan to experience
The Tayron R-Line
For all your *ands*
Ex-showroom introductory price ₹ 46 99 000*
4EVER CARE**
4 year Standard Warranty
4 year Road Side Assistance
3 Free Services
Exchange through
Certified Pre-Owned
Call 1800 102 0909
volkswagen.co.in
*Price mentioned is ex-showroom introductory price . Terms and conditions apply. Images are for representation purpose. Features and may vary. The dark shade on the glass is due to the lighting effect. **3 Free services applicable on 1 000 km, 7 500 km and 15 000 km.
accessories shown may not be a part of standard equipment and are subject to change without prior notice. Actual colour of the car Only labour charges are free with servicing. To know more visit your nearest dealership.
Authorised Dealers: Volkswagen Vijayawada: (0866) 2454524, 8886691748; Volkswagen Guntur: (0863) 2330001, 7799711129; Karimnagar: 8929482330; Volkswagen Warangal: 8929482330; Volkswagen Khammam: 8929482330; Volkswagen Bhimavaram: 8929478576; Volkswagen Kurnool: 8929478576; Volkswagen Rajahmundry: 9160680000; Volkswagen Hitec City: 8588821702; (Gachibowli): 8588821702; Volkswagen Himayatnagar: 9160680000; Volkswagen Mehdipatnam: 9160680000; Volkswagen Volkswagen Mahbubnagar - 8247213110.
Volkswagen Tirupati: 8929478576; Volkswagen Visakhapatnam: 9160680000; Volkswagen Nellore: 7799711102; Volkswagen 8886691749; Volkswagen Ongole: 7799711125; Volkswagen Kukatpally City Store: 7799996272; Volkswagen Anantapur: Volkswagen Deccan (L B Nagar): 9160680000; Volkswagen Hyderabad (Banjara Hills): 9121391213; Volkswagen Hyderabad Secunderabad: 9873484014; Volkswagen Somajiguda: 9873484014; Volkswagen SP Road: 9121391213.

మూడుముళ్లు పడేదాకా
ఫోను ముచ్చట్లు బంద్

ఈరోజుల్లో పెళ్లి కుదిరిందంటే చాలు.. కాబోయే వధూవరులిద్దరూ ఫోన్లలో ముచ్చట్లు మొదలుపెట్టేసి అన్ని విషయాలు మాట్లాడేసుకొంటున్నారు. ఇటువంటి ధోరణితో చాలా సందర్భాల్లో అపోహలు తలెత్తి పెళ్లి దాకా రాకముందే విడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని బాలోద్ జిల్లాలో సేన్ సమాజం కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజికవర్గానికి చెందిన వధూవరులిద్దరూ నిశ్చితార్థం తర్వాత పెళ్లయ్యేదాకా ఫోన్లలో మాట్లాడుకోవడంపై నిషేధం విధించింది. ఫోన్లు కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని, అందుకే సమాజ సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సేన్ కమ్యూనిటీ బాలోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కౌశిక్ తెలిపారు. నిశ్చితార్థం జరిగాక యువతీ యువకులు కుటుంబసభ్యుల సమక్షంలో మాట్లాడుకోవడంపై ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.



తుక్కులో 10 తులాల బంగారం
వెనక్కు ఇచ్చిన ఖాన్ సాబ్



ఫరీదాబాద్: హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఓ కుటుంబం తుక్కు సామాన్లతోపాటు ఇంట్లో దాచిన 10 తులాల బంగారం కూడా పొరపాటున ఇచ్చేయగా.. తుక్కు వ్యాపారి ఆ నగలను జాగ్రత్తగా బాధిత కుటుంబానికి అందజేశారు. జీవితబీమా ఏజెంటు అశోక్‌శర్మ కుటుంబం గతేడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాకు వెళుతూ ఇంట్లోని బంగారాన్ని ఓ సంచిలో పెట్టి తుక్కు సామాన్లలో దాచి వెళ్లింది. తిరిగి వచ్చాక ఆ విషయమే మరిచిపోయారు. కొన్ని నెలల తర్వాత ఇల్లు శుభ్రం చేసే క్రమంలో తుక్కు వ్యాపారికి ఆ సామాన్లు అలాగే విక్రయించేశారు. అశోక్‌శర్మ కుటుంబికులకు నగల సంగతి దీపావళి పండగ సమయానికి గుర్తుకొచ్చింది. పొరపాటు జరిగిందంటూ తుక్కు వ్యాపారి హాజీ అఖ్తర్ ఖాన్ వద్దకు అశోక్‌శర్మ పరుగు తీశారు. అలాంటిదేమీ చూడలేదనడంతో ఆయన నిరాశగా వెనుదిరిగి వచ్చారు. నగల కోసం తన గిడ్డంగిలో వెదుకుతూనే ఉన్న అఖ్తర్‌ఖాన్‌కు నాలుగు నెలల తర్వాత ఆభరణాల సంచి కంటపడింది. నగర ఏసీపీ జితేశ్ మల్హోత్ర సమక్షంలో అశోక్ శర్మకు శుక్రవారం అఖ్తర్ ఆ నగలు అందజేశారు. "ఖాన్ సాబ్ మా కుటుంబానికి చేసిన మేలు నేను ఎప్పటికీ మరచిపోలేను" అని శర్మ చెప్పగా.. "అది ఇతరుల సొత్తు. నాకు తెలియకుండా కొంతకాలం నా వద్ద ఉంది. తెలిశాక వెనక్కు ఇవ్వడం నా బాధ్యత" అని అఖ్తర్‌ఖాన్ అన్నారు.

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌తో 250 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులకు హామీ
కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: భారత్ ఆధ్వర్యంలో దిల్లీ వేదికగా జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌తో మౌలిక వసతుల రంగంలో 250 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులకు హామీలు లభించాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వీసీ/డీప్‌టెక్ సాంకేతికతలపై 20 బిలియన్ డాలర్ల మేర వ్యయం చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారనీ పేర్కొన్నారు. ఈ శిఖరాగ్ర సదస్సులో 5 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారని వెల్లడించారు. సమిట్ దిల్లీ డిక్లరేషన్‌పై 70కి పైగా దేశాలు ఇప్పటికే సంతకాలు చేశాయన్నారు. ఈ సంఖ్య 80 దాటే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తుది సంఖ్యను శనివారం వెల్లడిస్తామన్నారు. కృత్రిమ మేధ అంశంలో ప్రధానమైన దేశాలన్నీ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయని తెలిపారు.





ఎదుగుదల అంటే..?

ఎదుగుదల అంటే మిమ్మల్ని మీరు మరింత కష్టపెట్టుకునేలా విధులు నిర్వహించడం కాదు. బాధ్యతలు లేదా సవాళ్లు పెరుగుతున్నప్పుడు కూడా స్పష్టతతో, స్థిరంగా తన విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తిగా మారడమే నిజమైన ఎదుగుదల.
– లీలా హర్మోజీ, ఆంత్రప్రెన్యూర్

సీఈవోలు, విదేశీ నేతలతో
ప్రధాని మోదీ వరుస భేటీలు

దిల్లీ: ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు విదేశీ నేతలు, కీలక కంపెనీల సీఈవోలతో దిల్లీలో వరుస భేటీలతో ప్రధాని మోదీ శుక్రవారం తీరిక లేకుండా గడిపారు. 16 ఏఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సీఈవోలు, వ్యవస్థాపకులతో రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో ఉన్నత విద్య అభ్యసనాన్ని ప్రోత్సహించడం వంటి అంశాల్లో ఏఐని వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలపై అందులో చర్చించారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె, స్లొవేకియా అధ్యక్షుడు పీటర్ పెలెగ్రిని, లీక్టెన్‌స్టీన్ యువరాజు అలోయిస్, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులామ్‌లతో మోదీ విడివిడిగా భేటీ అయ్యారు. పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై వారితో సమాలోచనలు జరిపారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ఏఐ వినియోగంలో ఐరాస పోషించాల్సిన నిర్మాణాత్మక పాత్ర గురించి వారిద్దరూ చర్చించారు.



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె

ఏఐ సమిట్ వద్ద యువజన కాంగ్రెస్ నిరసన

- చొక్కాలు విప్పి ఆందోళన
- నలుగురి అరెస్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు శుక్రవారం నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టడం కలకలం సృష్టించింది. సమిట్ ఎగ్జిబిషన్ హాలు నంబరు-5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీ-షర్టులు వారి చేతుల్లో కనిపించాయి. నిరసనకారులతో అక్కడున్న కొంత మంది వాగ్వాదానికి దిగారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై.. కొందరు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తిలక్ మార్గ్ స్టేషన్‌కు తరలించారు. ఐవైసీ కార్యకర్తల్లో నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయినవారిలో తెలంగాణకు చెందిన నరసింహా యాదవ్ కూడా ఉన్నారు. నిరసన వ్యవహారంలో ఐవైసీ జాతీయాధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌ను పోలీసులు పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ప్రశ్నించారు. తాము శాంతియుతంగానే నిరసన చేపట్టామని ఉదయ్‌భాను చిబ్ అన్నారు. ఏఐ సమిట్‌కు ఐవైసీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.



ఆందోళన చేస్తున్న యువజన కాంగ్రెస్ నేతలు

రాహుల్ ఆదేశాల మేరకే..: భాజపా

ఏఐ ఇంపాక్ట్ సమిట్ వద్ద ఐవైసీ నిరసనలపై భాజపా మండిపడింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకే.. అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిష్ఠాత్మక సదస్సు వద్ద ఇలాంటి అనుచిత ఆందోళన చేపట్టారని ఆరోపించింది. భాజపా విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది.

ఏప్రిల్ 1 నుంచి టోల్‌ప్లాజాల్లో నగదు రహిత చెల్లింపులే!

దిల్లీ: ఇకపై టోల్‌ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేసే యోచనలో ఉన్నట్లు జాతీయ రహదారుల అథారిటీ(ఎన్‌హెచ్ఏఐ) వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి పూర్తిగా డిజిటల్ చెల్లింపులకు మారేలా ప్రణాళికలు వేస్తున్నట్లు తెలిపింది. టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్‌తో కానీ... యూపీఐతో కానీ ప్లాజా ఫీజును చెల్లించే వెసులుబాటు కల్పించనున్నట్లు వివరించింది. టోల్ ప్లాజాల ఫీజుల కార్యకలాపాల్ని, వాటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, డిజిటల్ రూపంలో వచ్చిన చెల్లింపులను ఏకీకృతం చేయాలనే లక్ష్యంతో ఈ మార్పును ప్రతిపాదించినట్లు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది.

ఇరాన్‌పై పరిమిత స్థాయి దాడులు!
అవకాశాలను పరిశీలిస్తున్నాం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌పై పరిమిత స్థాయి దాడులకు దిగే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు. ఇరు దేశాల మధ్య అణు ఒప్పందం సంబంధిత చర్చలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో ఆయన ఈ వ్యాఖ్య చేసినట్లు తెలుస్తోంది. 10-15 రోజుల్లోగా తమతో అణు ఒప్పందం కుదుర్చుకోకపోతే.. టెహ్రాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ గురువారం హెచ్చరించారు. ఇరాన్ విషయంలో తనలో సహనం నశించిందని చెప్పారు. "ఇరాన్ మాతో కలిస్తే మంచిది. కలవకపోయినా మంచిదే. కానీ, ఆ తర్వాత పరిణామాలు వేరుగా ఉంటాయి. ఎక్కువ రోజులు సాగదీయలేం. ఇరాన్ కచ్చితంగా ఒప్పందానికి రావాలి. అలా జరగకపోతే, దారుణమైన పరిణామాలు ఉంటాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు- ఇరాన్ మాత్రం అణ్వస్త్రాల విషయంలో అమెరికాతో ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని భావిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు.. ఇరాన్‌పై దాడులకు తమ దేశంలోని రెండు కీలక స్థావరాలను వాడొద్దని అగ్రరాజ్యానికి బ్రిటన్ తేల్చిచెప్పింది.

వ్యాపారి ఇంట్లో రహస్య గోడ
దానివెనుక రూ.కోట్ల బంగారం

- ఐటీ దాడుల్లో గుట్టు రట్టు

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌లోని ఒక వ్యాపారి ఇంట్లో రహస్య గోడ.. దానివెనుక రూ.కోట్లు విలువచేసే బంగారమున్న స్ట్రాంగ్ రూమ్ బయటపడ్డాయి. దీన్ని చూసి సోదాలకు వెళ్లిన ఐటీ అధికారులు విస్తుపోయారు. ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజ్ సంస్థ కన్హా గ్రూపుపై భారీగా పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో మొత్తం ఆరు నగరాల్లో ఉన్న 33 కార్యాలయాల్లో బుధవారం నుంచి ఈ తనిఖీలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజుల్లో గ్రూపు యజమాని ఇల్లు, ఆఫీసులో అనుమానాస్పద దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మూడోరోజైన శుక్రవారం జరిగిన సోదాల్లో రహస్య గోడ గుట్టు రట్టయింది. గోడను బద్దలుకొట్టి చూడగా.. అక్కడున్న గదిలో రూ.కోట్ల విలువచేసే బంగారు నగలు కనిపించాయి. ఈ మొత్తాన్ని లెక్కిస్తున్నారు. భారీగా వెలుగుచూసిన ఈ సంపద దర్యాప్తు తీరునే మార్చివేయనుందని అధికారులు తెలిపారు. ఇది కేవలం పన్ను ఎగవేత కిందికి రాదని, ప్రభుత్వం కళ్లు గప్పి సంపదను దాచిపెట్టడానికి వేసిన పక్కా ప్రణాళికగా వెల్లడించారు. బంగారంతోపాటు రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రూపునకు చెందిన పది బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. వాటిలోనూ లెక్కలు చూపని నగదు, బంగారం ఉండొచ్చని భావిస్తున్నారు. మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులను విక్రయించే కన్హా గ్రూపును 2008లో నట్వర్‌లాల్ స్థాపించారు. ఈ సంస్థ యజమానులు రూ.100 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడి, ఆ మొత్తాన్ని లగ్జరీ హోటళ్లలో పెట్టుబడిగా పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా హోటళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు.



33 మంది చిన్నారులపై లైంగిక దాడి..
మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష

- ఉత్తర్‌ప్రదేశ్ కోర్టు సంచలన తీర్పు



దిల్లీ: పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు సరఫరా చేసిన నరరూప రాక్షసుల పాపం పండింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా అభివర్ణించిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని పోక్సో కోర్టు నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిందితుడు రామ్‌భవాన్ చిత్రకూట్ జిల్లాలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేసే సమయంలో తన భార్య దుర్గావతితో కలసి 2010-2020 మధ్య బాలురపై లైంగిక అఘాయిత్యాలకు పాల్పడ్డాడు. వారి బాధితుల్లో మూడేళ్ల వయసు చిన్నారులూ ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, కానుకల పేరిట పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఆ అకృత్యాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు సరఫరా చేశారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది.

గౌరవ్ కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగడం తప్పు

- కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక వ్యాఖ్య


గువాహటీ: అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్‌తో పాటు ఆయన కుటుంబానికి పాకిస్థాన్‌తో సంబంధాలున్నాయని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పదే పదే ఆరోపించడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. గొగొయ్ కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగడం సరికాదని అన్నారు. హిమంతవి తప్పుడు రాజకీయాలని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేయడానికి రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రియాంక అస్సాం వెళ్లారు. ఈ సందర్భంగా గువాహటి శివారు సోనాపుర్‌లోని జుబీన్ క్షేత్రా వద్ద దివంగత గాయకుడు జుబీన్ గర్గ్‌కు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'రాజకీయాల్లో రెండు రకాల నాయకులు ఉంటారు. ఒకరు సానుకూల నాయకులు కాగా.. మరొకరు విద్వేషపూరిత రాజకీయాలు చేసేవారు. గౌరవ్ గొగొయ్ ప్రేమపూరిత రాజకీయాలు చేస్తున్నారు' అని పేర్కొన్నారు. పదేళ్ల నాటి అంశాలు కాదు, రానున్న అయిదేళ్ల అభివృద్ధి ప్రణాళిక గురించి హిమంత మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదైన 2018 నాటి పరువు నష్టం కేసు గురించి ప్రియాంక స్పందిస్తూ.. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో అత్యధిక కేసులు ఎదుర్కోవడం గౌరవ చిహ్నంగా మారిందన్నారు. సత్యం, అభివృద్ధి, ప్రజల కోసం నిలబడేవారు ప్రభుత్వం నుంచి తప్పుడు కేసులను ఎదుర్కొంటున్నారనే దానికి రాహుల్‌పై కేసులే నిదర్శనమన్నారు.



జుబీన్ గర్గ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ప్రియాంక

17వ అంతస్తు పైనుంచి పడి..
మిలియనీర్ అనుమానాస్పద మృతి

ఇంటర్నెట్‌డెస్క్: ప్రముఖ ఫ్యాషన్ డిజైన్ కంపెనీ సహ వ్యవస్థాపకుడు క్వెంటిన్ గ్రిఫిత్స్(58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో అపార్ట్‌మెంట్ 17వ అంతస్తు బాల్కనీ నుంచి కిందపడ్డారు. బ్రిటన్ జాతీయుడైన క్వెంటిన్ 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఏఎస్‌వోఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. తర్వాత అది బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదిగింది. క్వెంటిన్ తన మొదటి భార్య నుంచి విడాకులు తీసుకున్న తర్వాత 2007లో థాయ్‌లాండ్‌కు మకాం మార్చి.. అక్కడి మహిళను వివాహం చేసుకున్నారు. తర్వాత వారిద్దరు కూడా విడిపోయారు. ఆయనకు ముగ్గురు పిల్లలు. క్వెంటిన్‌కు, థాయ్ మాజీ భార్యకు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇద్దరూ కలిసి నడిపిన సంస్థ నుంచి ఈ మిలియనీర్ రూ.6 కోట్లు దొంగిలించారని ఆమె ఆరోపించారు. అలాగే తనకు తెలియకుండా భూమి, షేర్లను విక్రయించేందుకు దొంగ పత్రాలను సృష్టించారని ఫిర్యాదు చేయడంతో ఆయన అరెస్టయ్యారు. కానీ తనపై వచ్చిన ఆరోపణలను క్వెంటిన్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం గమనార్హం.



క్వెంటిన్ గ్రిఫిత్స్

బిట్‌కాయిన్ కుంభకోణం కేసులో..
శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాకు బెయిల్



ముంబయి: బిట్‌కాయిన్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాకు స్వల్ప ఊరట లభించింది. శుక్రవారం ఈ కేసు విచారణకు హాజరైన రాజ్ కుంద్రాకు ముంబయి ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణల సమయంలో కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న పీఎంఎల్ఏ కోర్టు.. గత నెలలో రాజ్ కుంద్రాకు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఆయన కోర్టుకు హాజరయ్యారు. 2021 నుంచి ఈడీ విచారణకు తన క్లయింట్ సహకరిస్తున్నారని, కేసుకు సంబంధించిన పత్రాలన్నీ ఇప్పటికే దర్యాప్తు సంస్థ వద్ద ఉండటంతో ఆయన్ను అదుపులోకి తీసుకునే అవసరం లేదని రాజ్‌కుంద్రా తరఫు న్యాయవాది ప్రశాంత్ పాటిల్ కోర్టుకు తెలిపారు. బెయిల్‌ను మంజూరు చేయవల్సిందిగా అభ్యర్థించగా... అందుకు కోర్టు అంగీకరించింది. ఈ కేసులో సూత్రధారి అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్‌కుంద్రా రూ.150 కోట్ల విలువైన 285 బిట్‌కాయిన్లు అందుకున్నట్లు ఈడీ వెల్లడించింది. ఈ లావాదేవీలను, బిట్‌కాయిన్ వ్యాలెట్ అడ్రస్‌లను తెలపడానికి చాలా అవకాశాలు ఉన్నప్పటికీ రాజ్‌కుంద్రా ఆ పని చేయలేదని ఈడీ ఛార్జిషీట్‌లో పేర్కొంది.

రాజకీయ దురుద్దేశంతోనే నాపై కేసు పెట్టారు
రాహుల్‌గాంధీ

సుల్తాన్‌పుర్: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ కోర్టుకు హాజరయ్యారు. 2018 నాటి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి భాజపా అధ్యక్షుడు అమిత్‌షాపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆ పార్టీ స్థానిక నేత విజయ్ మిశ్ర వేసిన పరువునష్టం దావా కేసులో రాహుల్ తన వాంగ్మూలాన్ని నమోదుచేశారు. "నా పరువు, పార్టీ ప్రతిష్ఠను దెబ్బ తీయడమే లక్ష్యంగా, రాజకీయ దురుద్దేశంతోనే నాపై ఆరోపణలు చేశారు. ఎవరినీ అవమానించే పదాలను, కించపరిచేలా భాషను నేను ఉపయోగించలేదు" అని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయమూర్తి శుభం వర్మ ఎదుట రాహుల్ వెల్లడించారు. తన వాదనలు వినిపించేందుకు ఆధారాలు సమర్పించాలని రాహుల్‌ని కోరుతూ తదుపరి విచారణను వచ్చేనెల 9కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు వెల్లడించింది.

ఎన్‌ఎస్‌యూఐ కొత్త అధ్యక్షుడిగా వినోద్ జాఖడ్

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) నూతన అధ్యక్షుడిగా వినోద్ జాఖడ్‌ను నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తర్వులు జారీ చేసినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఓ ప్రకటనలో తెలిపింది. వినోద్ వెంటనే బాధ్యతలు చేపట్టనున్నట్లు పేర్కొంది.

24 నుంచి కాంగ్రెస్ కిసాన్ సమ్మేళనాలు

దిల్లీ: భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంతో రైతులపై పడే దుష్ప్రభావాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కిసాన్ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. శుక్రవారం ఇక్కడ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ భేటీకి ఒప్పందంతో తీవ్రంగా నష్టపోయే కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలకు చెందిన కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఈ నెల 24న భోపాల్‌లో నిర్వహించే మొదటి కిసాన్ సమ్మేళనానికి రాహుల్, ఖర్గేలు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వచ్చే నెల 7న మహారాష్ట్రలోని యవత్మాల్‌లో రెండో సమ్మేళనం, 9న రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో మూడో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ప్రోత్సహించింది..
భాజపా నివారించింది

చొరబాట్లపై అమిత్ షా



నాథన్‌పుర్ (అస్సాం): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం రెండో దశ దేశవ్యాప్త ఉజ్వల గ్రామ పథకం (వీవీపీ) అస్సాం నుంచి ప్రారంభించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో ఆయన రెండు రోజుల పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తన పాలనా కాలంలో దేశంలోకి చొరబాట్లను నిరోధించడంలో విఫలమైందని ఆరోపించారు. వీవీపీ పథకం సరిహద్దు ప్రాంతాల నుంచి వలసల్ని నిలువరించి చొరబాట్లను నివారిస్తుందని అన్నారు. దేశ సరిహద్దులోని గ్రామాల అభివృద్ధికి ప్రధాని మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రెండో దశ వీవీపీ పథకం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల సరిహద్దుల్లో ఉన్న 17 జిల్లాల్లోని 1954 గ్రామాలకు వర్తిస్తుందన్నారు. నాథన్‌పుర్ గ్రామంలో ఒక బహిరంగసభలో మాట్లాడుతూ ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దేశ సరిహద్దుల్ని బార్లా తెరిచి అస్సాంలోకి చొరబాట్లను ప్రోత్సహించిందని అన్నారు. ఈ సమస్యను సీఎం హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం ప్రభావవంతంగా పరిష్కరించిందని పేర్కొన్నారు. అస్సాంను గతంలో పాలించిన కాంగ్రెస్ ఎలాంటి అభివృద్ధి పథకాలనూ ప్రవేశపెట్టలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిరోజూ 14 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. భాజపా ప్రభుత్వం చొరబాట్లను, హింసను, ఉగ్రవాదాన్ని నిలువరించిందన్నారు. అనంతరం అమిత్ షా నాథన్‌పుర్ గ్రామ సమీపంలోని బంగ్లాదేశ్ సరిహద్దును పరిశీలించారు. సరిహద్దులో ఒక మర్రి మొక్కను నాటారు.

ఇంటి పక్కనే సార్వజనిక చెత్తకుండీ, మూత్రశాల...
రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే: దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఆరోగ్యకరమైన, గౌరవప్రదమైన జీవనం సాగించే హక్కును భారత రాజ్యాంగం ప్రతి వ్యక్తికీ కల్పించిందనీ, ఇంటి పక్కనే సార్వజనిక మూత్రశాల, బహిరంగ చెత్త కుండీ ఉండటం ఆ హక్కును ఉల్లంఘించడమేనని దిల్లీ హైకోర్టు శుక్రవారం పేర్కొంది. ఆరోగ్యకరమైన జీవితానికి పరిశుభ్రమైన పరిసరాలు కీలకమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ బన్సల్ ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా అన్నారు. ఇంటి పరిసరాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం లేకపోవడం గౌరవంగా బతికే హక్కుకు విఘాతం కలిగిస్తుందని ఆయన స్పష్టంచేశారు. తన ఇంటికి ఆనుకొని ఒక అనధికారిక చెత్తకుండీని, బహిరంగ మూత్రశాలను ఏర్పాటు చేయడంపై ఓ న్యాయవాది వేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన ఇంటి పక్కన ఉన్న చెత్త కుండీని ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న 150 కుటుంబాలు ఉపయోగిస్తున్నాయని, పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం సృష్టించాల్సిందిగా ఎన్నిసార్లు అభ్యర్థించినా పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషనర్ ఇంటి పక్కన ఉన్న చెత్త కుండీని, మూత్రశాలను తక్షణం తొలగించాల్సిందిగా కోర్టు ఆదేశించింది.



ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసు..
లొంగిపోవాలని జైదీప్‌ను ఆదేశించిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో దోషి, భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్ సోదరుడు జైదీప్ సెంగర్‌ను జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సిందిగా దిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఘటనకు సంబంధించి బాధితురాలి తండ్రి.. 'కస్టడీ' మృతి కేసులో దోషిగా తేలిన నేపథ్యంలో ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు వెల్లడించింది. పదేళ్ల శిక్షను నిలిపేసిన తర్వాత, అనారోగ్య సమస్యల కారణంగా మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలని కోరుతూ జైదీప్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవిందర్ దుడేజాల ధర్మాసనం విచారిస్తోంది. "2024 జులైలో జైదీప్‌కు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను చివరిసారిగా గత ఏడాది ఏప్రిల్‌లో పొడిగించారు. అప్పటి నుంచి అతడి శిక్షను పొడిగించడం లేదా నిలిపివేయడంపై ఎటువంటి ఉత్తర్వులను న్యాయస్థానం జారీ చేయలేదు. బెయిల్ గడువును పొడిగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకొనే ముందు లొంగిపోవాలని జైదీప్‌ను ఆదేశిస్తున్నాం'' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసును వచ్చే వారం విచారించనున్నట్లు తెలిపింది. 2017లో కుల్దీప్ సింగ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018లో బాధితురాలి తండ్రి కస్టడీలో మృతిచెందిన కేసులో 2020 మార్చి 13న కుల్దీప్, జైదీప్‌లకు పదేళ్ల జైలు శిక్ష పడింది.



సుప్రీం నిషేధం ఎత్తివేతతో 11 ఏళ్ల తర్వాత ఎడ్ల పోటీలు

పంజాబ్‌లోని లుధియానా జిల్లా కిలా రాయ్‌పుర్‌లో ఫిబ్రవరి 17తో మొదలై మూడు రోజులపాటు గ్రామీణ ఒలింపిక్ క్రీడలు ఘనంగా జరిగాయి. కబడ్డీ, హాకీ, లాంగ్‌జంప్, హైజంప్, టగ్ ఆఫ్ వార్, వృద్ధులకు పరుగుపందెం వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. సుప్రీం కోర్టు విధించిన నిషేధం ఎత్తివేశాక 11 ఏళ్ల తర్వాత జరిగిన ఎడ్లబండ్ల పోటీలు హైలైట్‌గా నిలిచాయి. ఈ పందేల్లో పాల్గొన్న ఎద్దులకు బ్రహ్మాస్త్ర, అఫ్లాతూన్, రాకెట్ లాంటి భిన్నమైన పేర్లు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. పోటీల్లో గెలిచిన ఎడ్లకు మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతి కింద రూ.లక్షన్నర, మూడో బహుమతిగా రూ.1,25,000, నాలుగో బహుమతి కింద రూ.లక్ష నగదు అందజేశారు. ఎడ్లబండ్ల పందేలపై ఉన్న నిషేధం ఎత్తివేతలో ఆప్ ప్రభుత్వం కీలకపాత్ర పోషించినందుకు గర్వంగా ఉందని పంజాబ్ శాసనసభ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధవా తెలిపారు.

చేతులు కోసుకొంటున్న విద్యార్థులు
ఛత్తీస్‌గఢ్‌లో షాకింగ్ ఘటన

ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లాలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కురూద్ బ్లాకు పరిధిలోని దహదహా గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని 6 - 8 తరగతుల విద్యార్థులు దాదాపు 35 మంది చేతులు కోసుకొంటున్నారు. బ్లేడ్లు, పిన్నులు, ఫోర్కుల సాయంతో వీరు చేతులను గాయపరుచుకొంటున్నారు. గత రెండు నెలలుగా విద్యార్థులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పునీత్ రామ్ సాహు చెబుతున్నారు. ఈ సమాచారం అందుకున్న జిల్లా కలెక్టరు అబినాశ్ మిశ్ర దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి, ప్రిన్సిపల్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు దర్యాప్తు బృందం పాఠశాలకు చేరుకొని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను విచారిస్తోంది. దర్యాప్తు నివేదిక అందిన తర్వాతే అసలు కారణం తెలుస్తుందని డీఈవో అభయ్ జైస్వాల్ తెలిపారు.



వసుంధర

vasundhara@eenadu.in



మెరుగైన జీర్ణక్రియకు మండూకాసనం

చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్ పైన ప్రశాంతంగా కూర్చోండి. ఆపై వజ్రాసనంలోకి రావాలి. ఇప్పుడు మోకాళ్లను దూరంగా చాపాలి. అరచేతుల్ని ఫొటోలో చూపినట్లు కాళ్లకింద ఉంచాలి. ఆపై కళ్లను మూసి శ్వాస నిదానంగా తీసుకుంటూ నడుము నిటారుగా పెట్టి కూర్చోవాలి. ఈ ఆసనంలో 15-20 సెకన్లు ఉండాలి. తర్వాత కాళ్లను చాచి విశ్రాంతి తీసుకోవాలి.

జాగ్రత్తలు: మోకాళ్ల నొప్పులు ఉన్నవాళ్లు, మోకాళ్లు, మడమలకు సర్జరీలు అయినవాళ్లు చేయకూడదు.

ఉపయోగాలు: జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీర సమతౌల్యతకు దోహదం చేస్తుంది. వెన్నెముక అడుగు భాగంలో ఉండే మూలాధార చక్రాన్ని ఉత్తేజపరుస్తుంది. పెల్విక్ ప్రాంతానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. తొడ భాగంలో బరువు తగ్గడానికి సహకరిస్తుంది.

ఆహారం: పండ్లు, గింజలు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి సాత్విక ఆహారం తీసుకోవాలి. మసాలాలు, శీతల పానీయాలు, ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారానికి దూరంగా ఉండాలి. **- శిరీష, యోగ గురు**

బంగారం - వెండి



20న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,60,160	1,43,550	2,59,498
విజయవాడ	1,54,035	1,43,150	2,58,000
ప్రొద్దుటూరు	1,54,100	1,41,770	2,53,500
రాజమహేంద్రవరం	1,57,370	1,44,250	2,70,000
విశాఖపట్నం	1,55,700	1,43,150	2,59,000
తమిళనాడు	----	1,44,200	2,70,000



నీటికి పోషకాల తోడు!

ఎండలు పెరుగుతున్నాయి. పిల్లల నుంచి పెద్దలవరకూ అందరూ శరీరానికి నీరు ఎక్కువగా అందించాల్సిందే. అలాగని బాటిళ్లకొద్దీ నీటిని తాగడం కాదు, నీటి శాతంతోపాటు పోషకాలూ ఉండే ఆహారం తీసుకుంటే మేలు.

- నీరు పుష్కలంగా ఉండే వాటిలో మొదట వచ్చేది పుచ్చకాయ. దీన్లో 90 శాతం నీరే ఉంటుంది. నీటిలో లైకోపిన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్. రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచి గుండె వ్యాధుల్ని తగ్గించడంలో సాయపడుతుంది.
- దోసకాయలో క్యాలరీలు తక్కువ, నీరు అధికం. శరీరంలో నీటి శాతం పడిపోకుండా కాపాడుతుంది. దీన్లో అధిక మోతాదులో ఉండే పొటాషియం... బీపీ నిలకడగా ఉండేలా చేస్తుంది.
- సిట్రస్ పండ్లలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తనాళాల ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- బెర్రీల్లో నీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి గుండెను రక్షిస్తాయి. వీటిల్లోని పాలీఫినాల్స్ కొవ్వుల సమతుల్యత, ధమనుల ఆరోగ్యానికి సాయపడతాయి.
- టొమాటోల్లో నీరు పుష్కలంగా ఉండటంతోపాటు లైకోపిన్, పొటాషియం అధికంగా లభిస్తాయి. గుండె ఆరోగ్యానికీ, రక్తపోటు నియంత్రణకు మేలు చేస్తాయి.
- గుమ్మడి, సొర లాంటి కూరగాయల్లో నీటితోపాటు హృదయనాళ ఆరోగ్యానికి మేలుచేసే పోషకాలు ఉంటాయి.

ఆ క్యాన్సర్ చికిత్సను ఇక్కడా అందించాలని...

అమెరికాలో ఆధునిక వైద్యాన్ని నేర్చుకోవాలని కలలుగన్నారు మాధురి ఉసిరికల. భారత్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి '90ల చివర్లో అమెరికాలో అడుగుపెట్టారామె. ఆపై బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణురాలిగా... వేల మంది ఆయుష్షుని పెంచారు. ఈ విభాగంలో పరిశోధనలూ చేశారు. హైదరాబాద్‌లో తాజాగా జరిగిన బయో ఆసియా సదస్సులో పాల్గొన్న ఆమెను 'వసుంధర' పలకరించింది.

అమ్మానాన్నలది ఆంధ్రప్రదేశ్. నాన్న ఇంజినీర్. ఆయన ఉద్యోగరీత్యా కుటుంబం దిల్లీలో స్థిరపడింది. నేను పుట్టి పెరిగింది అక్కడే. దిల్లీలోని లేడీ హార్డింగ్ కాలేజీ నుంచి మెడిసిన్ పూర్తిచేశా. తర్వాత ఇంటర్నల్ మెడిసిన్‌లో రెసిడెన్సీ(ఎండీ) చేయడానికి అమెరికా వెళ్లాను. అప్పటికి పెళ్లి కాలేదు. ఒక్కదాన్నే వెళ్లాను. అంతా కొత్తగా ఉండేది. వ్యక్తిగత జీవితంలోనే కాదు, వృత్తిలో కూడా. భారత్‌లో పేషెంట్‌ని క్లినికల్‌గా గమనించి చికిత్స ఇస్తారు. అక్కడ పరీక్షించి నిర్ధారించాకే చికిత్స. అలాగే పేషెంట్‌తో మాట్లాడే తీరు కూడా వేరుగా ఉంటుంది. అన్ని పనులూ ఒంటరిగానే చేసుకుంటూ, స్వతంత్రంగా బతకడమూ నేర్చుకున్నా. హెమటాలజీ, ఆంకాలజీలో ఫెలోషిప్ తర్వాత బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో సూపర్ ఫెలోషిప్ చేశాను. రెసిడెన్సీ సమయంలో ఒక్కోసారి 36 గంటలు నిర్విరామంగా పనిచేయాల్సి వచ్చేది.



మాధురి

చికిత్స నుంచి పరిశోధనల వరకూ...

వాండర్‌బిల్ట్ యూనివర్సిటీలో చదువుకున్నాక అక్కడే ఫ్యాకల్టీగా చేరి ఆరేళ్లు పని చేశాను. పనిచేస్తూ లుకేమియా, లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్ పేషెంట్లకు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేశాను. తర్వాత కాలంలో వచ్చిన కార్-టి సెల్ థెరపీలో పట్టు సాధించా. కెరియర్‌లో సుదీర్ఘకాలం డల్లాస్, టెక్సాస్‌లోని యూటీ సౌత్‌వెస్టర్న్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సేవలు అందించా. ఆ సమయంలో వివిధ క్లినికల్ ట్రయల్స్‌లోనూ భాగమయ్యా. ఇరవై ఏళ్లపాటు చికిత్స, బోధన రంగంలో ఉన్నాను. ఎంత కష్టమైనా వృత్తిలో సంతృప్తి మరిపిస్తుంది. రెండు మూడు నెలలకు మించి బతకరనుకున్నప్పుడు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత పదేళ్లకుపైగా జీవించినవాళ్లు ఉన్నారు. పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం, వాళ్ల పెళ్లిళ్లు... ఇలా ఎన్నో చూస్తారు. సంతోషంగా ఉండే ఫొటోల్ని నాకు పంపుతారు. అవి చూశాక తిరిగి రీఛార్జ్ అవుతా. 2022లో ఆక్టినియమ్ ఫార్మా కంపెనీలో చేరా. వైస్ ప్రెసిడెంట్ హోదాలో 'బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్, 'సెల్ థెరపీ' విభాగాల క్లినికల్ ట్రయల్స్‌కు నేతృత్వం వహిస్తున్నా. వైద్యురాలిగా, ప్రొఫెసర్‌గా కంటే ఇంకా పెద్ద స్థాయిలో సేవలు అందించే అవకాశం ఉండటంతో ఇటుగా వచ్చా. రేడియోఫార్మాస్యూటికల్స్ చికిత్సా విధానం పాశ్చాత్య దేశాల్లో చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది భారత్‌లో ఇంకా అంత ప్రాచుర్యంలోకి రాలేదు. దీన్ని ఇక్కడకు తీసుకురావాలనేది నా ప్రయత్నం. మా సంస్థ ఇక్కడ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తోంది.

మల్టీటాస్కింగ్ అలా చేస్తా...


ప్రస్తుతం టెక్సాస్‌లోని డల్లాస్‌లో ఉంటున్నాం. భర్త ఫైనాన్స్ ప్రొఫెసర్. మాకు ఇద్దరు పిల్లలు. అమ్మ, అత్తమామలు హైదరాబాద్‌లోనే ఉంటారు. తరచూ ఇక్కడికి వచ్చి వెళ్తుంటా. మేం ఉండే చోట భారతీయులు ఎక్కువ. మన పండుగలూ, సంస్కృతీ సంప్రదాయాలు బాగా కనిపిస్తాయి.

- నా విజయానికి కారణం మల్టీ టాస్కింగ్. దీన్లో ఫోకస్ ప్రధానం. మన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఒక పనిచేస్తున్నప్పుడు అందుకు ఎంత సమయం పడుతుందో ముందే నిర్దేశించుకుని అంతసేపూ మరేదీ ఆలోచించకూడదు. అప్పుడే 100 శాతం న్యాయం చేసినట్లు. అది కచ్చితంగా విజయవంతమవుతుంది.

గ్రామీణ మహిళకి ఏఐ సఖి!

అందరూ గ్రామీణ మహిళలే. వాళ్లెవరూ పెద్దగా చదువుకోలేదు. హస్తకళలు, వృత్తి పనులకు చెందినవాళ్లే. అయితేనేం, తాజా ఏఐ ఇండియా ఇంపాక్ట్ సదస్సులో టాటా సంస్థ చేపట్టిన వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. దైనందిన జీవన సౌలభ్యానికీ వృత్తి వ్యాపారాల్లో ఎదగడానికీ ఏఐని ఎలా వాడాలో తెలుసుకోవడమే కాదు, ఉపయోగించారు కూడా!





ఏఐ... ప్రస్తుతం ఈ పదం వింటే టెక్నాలజీలో ఆరితేరిన ఉద్దండులూ కాస్త భయపడుతున్నారు. సంబంధిత టూల్స్ నేర్చుకోవడానికి టెక్ విద్యార్థులూ వెనకడుగు వేస్తున్నారు. అయితే, కృత్రిమ మేధ అన్నది ఓ భూతం కాదనీ దాన్ని మన అదుపాజ్ఞల్లోనే ఉంచి చక్కగా ఉపయోగించుకోవాలనీ, సామాన్యులకీ చేరువ చేయాలన్నదే తాజా సదస్సు ప్రధానోద్దేశం. అందులో భాగంగానే టాటా సంస్థ మహిళల కోసం 'ఏఐ సఖి ఇమ్మర్షన్ ప్రోగ్రామ్'ను చేపట్టింది. అలయన్స్ ఫర్ గ్లోబల్ గుడ్, జెండర్ ఈక్విటీ అండ్ ఈక్వాలిటీ సీఐఐ ఛైర్‌పర్సన్ స్మృతి ఇరానీ, టీసీఎస్ సీఓఓ ఆర్తి సుబ్రమణియన్‌ల నాయకత్వంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో 1553 మంది గ్రామీణ మహిళలు పాల్గొని, విజయవంతంగా ఏఐని వాడటం విశేషం!

బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్, గుజరాత్, దిల్లీ ఎన్‌సీఆర్... ఈ ఆరు రాష్ట్రాలకు చెందిన మహిళలు ఈ ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. వీళ్లందరినీ కళాకారిణులు, డిజిటల్ అక్షరాస్యత- ప్రాథమిక, అధునాతన అన్న మూడు వర్గాలుగా విభజించారు. ప్రతి బృందంలో చేతి వృత్తులవాళ్లు, గ్రామస్థాయి వ్యవస్థాపకులు, స్వయం సహాయక బృంద నాయకులు, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు ఉన్నారు.

ప్రతి ఐదుగురికీ ఓ టీచర్‌ను ఏర్పాటుచేశారు. కొత్త డిజైన్లు సృష్టించడం, మార్కెటింగ్ మెటీరియల్స్ రూపకల్పన, ప్రభుత్వ పథకాలను అర్థం చేసుకోవడం, డాక్యుమెంట్లను ఎలా అనువదించాలి, సొంత ఫోన్లలోనే అప్లికేషన్లు వాడటం... అదీ వాళ్ల మాతృభాషల్లోనే ఏఐను ఉపయోగించడం నేర్పించారట. అలా వీళ్లంతా కలిసి కేవలం రెండున్నర గంటల్లోనే 4,727 ఏఐ ఆధారిత పనులు చేయగలిగారట. పట్టచిత్ర, మధుబని, ధోక్రా కళాకారులు డిజైన్లకోసం కృత్రిమ మేధని వాడితే, స్వయం సహాయక సంఘాలు వస్తువుల్ని గుర్తించడం, ప్రభుత్వ పథకాలను నావిగేట్ చేయడం, మార్కెటింగ్, కమ్యూనికేషన్ కోసం ఏఐను ఉపయోగించారట.

దీన్నిబట్టి యూపీఐ పేమెంట్ల మాదిరిగానే గ్రామీణ మహిళలు ఏఐ టూల్స్‌తో తమ వృత్తి నైపుణ్యాల్ని పెంచుకోవడం పెద్ద కష్టమేం కాదు అన్నది అర్థమవుతోంది. అంతేకాదు, స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తూ శక్తిమంతంగా ఎదగాలంటే సామాన్య మహిళలూ ఏఐని తమ జీవితంలో భాగం చేసుకోవాల్సిందే!

వెదురుతో ఆకట్టుకుంటున్నారు!



కవ్వాల్ వెదురు ఉత్పత్తులు... ప్రస్తుతం ప్రపంచ గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ కళలకు జీవం పోసేది సాధారణ గిరిజన మహిళలే. ప్రకృతికి దగ్గరగా బతకడంతోపాటు దాన్నే వాళ్ల ఆదాయ వనరుగానూ మార్చుకుని పర్యావరణానికి మేలు చేస్తున్నారు.

చుట్టూ అడవి... పులులు తిరుగుతాయి... ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకు ముప్పే. అయినా ఆ అడవినే నమ్ముకుని జీవిస్తున్నాయి 70 గిరిజన కుటుంబాలు. వీళ్లది జన్నారం మండలం ఇంధన్‌పల్లిలోని నాయకపుగూడ. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో ఉంది. ఇక్కడ గిరిజనులు తమ బతుకుదెరువు కోసం వెదురుని సేకరించడానికి పులులు తిరిగే అభయారణ్యంలోకి వెళుతుంటారు. అలా తెచ్చిన వెదురుతో మొదట్లో తడికలు మాత్రమే తయారుచేసేవారు. వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపడానికి హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ గతేడాది ముందుకొచ్చింది. వెదురుతో వివిధ రకాల ఉత్పత్తుల్ని తయారుచేయడంలో శిక్షణిచ్చేందుకు శిక్షణా కేంద్రాన్నీ ఏర్పాటు చేసింది. అందులో నెలరోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తుంది. అనంతరం ముడి సరకుని సరఫరా చేస్తుంది. అంతేకాదు, ఏటా చుట్టుపక్కల గూడెంలలో సర్వేలు నిర్వహించి ఆయా రంగాల్లో మహిళలకు శిక్షణ ఇస్తుంటుందీ సంస్థ. అలా ఇప్పటివరకు 70 మంది మహిళలు శిక్షణ తీసుకుని వెదురుతో కనువిందు చేసే కళాకృతుల్ని చేస్తున్నారు. వీటికి ఈడీఐఐ (ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది.

- పూదరి సత్యనారాయణ, జన్నారం



మా గూడెంలో నెల రోజులు శిక్షణ కేంద్రాన్ని నిర్వహించి వెదురుతో కళాకృతులను చేయడం నేర్పించారు. గతంలో తడికలు తయారుచేసేవాళ్లం. వాటితో నెలకు రూ.3వేలు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు రూ.9వేలు సంపాదిస్తున్నా. ప్రస్తుతం అలంకరణ వస్తువులతోపాటు, కిచెన్ సామగ్రి, ఫొటో ఫ్రేమ్‌లు, బుట్టలు, సోఫా సెట్లు, శుభకార్యాలకు కావల్సిన డెకరేషన్లు తయారుచేస్తున్నాం. వీటి ధర మార్కెట్‌లో రూ.15వేలు పలుకుతుంది. ఈ శిక్షణ మాకు ఉపాధిని కల్పించడమే కాదు, మాలో ఆత్మస్థైర్యాన్ని తీసుకొచ్చింది. ఈ కేంద్రంలో ప్రతిరోజూ శిక్షణ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి.

- రాయ అనసూయ.

సౌలభ్యం

పాదాలు... జాగ్రత్త!

కొత్త చెప్పులు వేసుకున్నామంటే బొబ్బలు ఖాయం. ఎక్కువ దూరం నడిచినా, స్టైల్‌గా కనిపించాలని హీల్స్ వేసినా ఇవి పలకరించేస్తాయి. ఈ సమస్య కొన్నాళ్లు నొప్పితో పోయేదా? తరవాత మచ్చల రూపంలోనూ వేధిస్తుంది. అందుకే జాగ్రత్త తీసుకోవాలి.



ప్లాస్టర్ వేయండి

కొత్త చెప్పులు వేసుకోవడం... వాటితో బొబ్బలు రావడం ఆపై అవస్థలు మామూలుగా ఉండవు కదూ! బ్యాండెయిడ్ వేసి నయం చేసుకోవాలని చూసినా ఆ తిప్పలూ తక్కువేం కాదు. రాపిడికి అది పూర్తిగా ఊడిపోతుంది. గాయానికే ఒరుసుకుపోయి నొప్పి. చిక్కు వద్దంటే బ్లిస్టర్ ప్రివెన్షన్ టేప్ లేదా షూ బైట్ ప్రొటెక్టర్ ఉండాల్సిందే. ముందే వేసుకుంటే గాయాలు కావు. పైగా రాపిడికి త్వరగా ఊడవు, వాటర్ ప్రూఫ్. అప్పటికే గాయమైనా వేసుకోవచ్చు. చెమట, బ్యాక్టీరియాల నుంచి కాపాడతాయి. సమస్య వచ్చే వీలున్న ప్రాంతాల్లో అతికించేయండి.



షూలకీ ఉన్నాయ్

చెప్పులు లేదా షూ అలవాటయ్యేదాకా రోజూ ప్లాస్టర్ ఏం వేసుకుంటాం? మర్చిపోయామో ఇకంతే సంగతులు అంటారా? అయితే షూ బైట్ ప్రొటెక్టర్ ప్యాడ్స్ తెచ్చుకోండి. దీన్ని షూ వెనక భాగంలో అతికించుకుంటే సరి. ఒరిపిడి కాకుండా కాపాడుతూనే పాదానికి హాయినిస్తుంది. ఇవి గాయాలు కాకుండా కాపాడటమే కాదు, మడమలకి నొప్పి రాకుండానూ చూస్తాయట.



తొడిగేద్దాం

చాలాసేపు నిలబడాల్సి వచ్చినా, ఎక్కువ దూరాలు నడవాలన్నా మన ఎంపిక షూనే! కానీ నడిచీ నడిచీ కూడా పాదాల వేళ్ల మధ్య రాపిడి జరుగుతుంది. బొబ్బలు, కాయలు వచ్చేస్తాయి. ఇక పాయింటెడ్ షూ, హీల్స్ వేసుకునే వాళ్ల సంగతైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాలివేళ్లన్నీ నొక్కుకు పోయినట్లుగా అయిపోయి తెగ ఇబ్బంది పెడతాయి. అలాంటివాళ్లు ఈ టో ప్రొటెక్టర్లను తెచ్చుకోవచ్చు. సిలికాన్‌తో చేసినవే కాదు, కాటన్‌వీ దొరుకుతున్నాయి. పాదాల వేళ్లకు తగిలించడమే. గాలి తగిలేలా చేస్తూనే రాపిడి జరగకుండానూ కాపాడతాయి. కావాలంటే ప్రయత్నించండి మరి.



జడ సన్నమవుతోందా?

ఎప్పుడో నాలుగు వెంట్రుకలంటే సరే! అదే పనిగా ఊడుతుంటేనే అమ్మాయిల మనసు చివుక్కుమంటుంది. అవును మరి... పెరగడానికి ఏళ్లు తీసుకుంటుంది. అదే ఊడుతూ పోతే దెబ్బకు జడ చిక్కిపోతుంది. అది చూసి మరీ బాధపడుతుంటాం. ఒత్తిడి, పోషకాహార లోపం, హార్మోనుల్లో మార్పులు, రసాయనిక ఉత్పత్తులు... ఇలా ఎన్నో కారణాలు దీనిమీద ప్రభావం చూపుతుంటాయి. అయితే చిన్న మార్పులు చేసుకుని చూడండి... పరిష్కారం దొరుకుతుంది.

- వెంట్రుకలు కెరటిన్ అనే ప్రొటీన్‌తో తయారవుతాయి. కాబట్టి, ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్ డి, ఫోలిక్ యాసిడ్ వంటివి ఆహారంలో లేకపోతే కుదుళ్లు బలహీనమవుతాయి. అందుకే గుడ్లు, పప్పుధాన్యాలు, క్యారెట్, పాలకూర, పాలపదార్థాలతోపాటు విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాల్ని తీసుకోవాలి.


- కొన్నిసార్లు ఆహారమే అన్ని పోషకాలనూ అందించలేదు. బయోటిన్, కొలాజెన్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఎ, బి విటమిన్లు సప్లిమెంట్ల రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. నిపుణుల సలహాతో తీసుకోండి.
- ఒత్తిడి ఇప్పుడు ప్రతిఒక్కరికీ సహజమైపోయింది. దీని ప్రభావం పడేదీ కురుల మీదే! అందుకని యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు వంటివి చేయండి. ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి. హార్మోనుల మీదా సానుకూల ప్రభావం చూపుతాయి.
- వెంట్రుకలు ఆరోగ్యంగా పెరగాలంటే పోషకాలు అందాలి. అంటే మెరుగైన రక్తప్రసరణ కూడా అవసరమే. కాబట్టి, రోజూ మాడుని తప్పనిసరిగా మర్దనా చేసుకోవాలి. వారంలో రెండు రోజులైనా కొబ్బరినూనె వంటివి పట్టిస్తే మేలు. కలరింగ్, హీట్ స్టైలింగ్‌లకు వీలైనంత దూరంగా ఉండండి. రసాయనాల్లేని మైల్డ్ షాంపూలనే ఎంచుకోండి. అయినా లాభం లేకపోతుంటే... నిపుణుల సాయం కోరండి.

జీవితాలు అందంగా మారుతున్నాయ్!

అసలే నక్సల్ ప్రభావిత ప్రాంతాలు. దానికితోడు పేదరికం. అలాంటివాళ్ల జీవితాల్లో 'అందం' కొత్త వెలుగులు తీసుకొస్తోంది. ఎలాగంటే...

ఝార్ఖండ్‌లోని పలాము, లాతేహార్ జిల్లాల్లో గిరిజన గ్రామాలెక్కువ. పైగా చుట్టూ అడవులు, కొండ ప్రాంతాలే. జీవనాధారానికీ వాటిపైనే ఆధారపడేవారు అక్కడి ప్రజలు. వాళ్ల జీవితాల్ని మార్చాలనుకున్నారు పలాము టైగర్ రిజర్వ్ అధికారులు. అందుకే స్థానిక అమ్మాయిలకు వృత్తి నైపుణ్యాలను నేర్పించాలనుకున్నారు. అందులో భాగంగా కొందరిని ఎంపిక చేసి, బ్యుటీషియన్లుగా శిక్షణనిస్తున్నారు. కోర్సు పూర్తయ్యాక రుణం అందేలా చేసి, సొంతంగా బ్యూటీపార్లర్లు ఏర్పాటు చేసుకునేలా కూడా సాయపడుతున్నారు. ఈ అమ్మాయిలూ నేర్చుకోవడానికే పరిమితం కావట్లేదు. తోటివారికీ శిక్షణనిస్తున్నారు. 'మా గ్రామం అడవుల్లో ఏ మూలనో ఉంటుంది. ఈ శిక్షణ ఊరు దాటి ప్రపంచాన్ని చూసే అవకాశమిచ్చింది. నా కాళ్లమీద నేను నిలబడగలనన్న ధైర్యాన్నీ ఇచ్చింది. మరికొందరినీ తీర్చిదిద్దుతా' అంటోంది శిక్షణ తీసుకుంటోన్న రీమా కుమారి. 'పలాము టైగర్ రిజర్వ్ చుట్టుపక్కల గ్రామాలన్నీ దశాబ్దాలుగా నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా పేరొందాయి. దీంతో అక్కడివాళ్లు త్వరగా ఇతర ప్రాంతాల వాళ్లతో కలవరు. ఉద్యోగావకాశాలూ తక్కువే. వాళ్లకి ఉపాధి కల్పించాలనుకున్నాం. దీని కోసం సర్వేలెన్నో చేశాం. యువత ఆసక్తి చూపడంతో శిక్షణ కార్యక్రమాలను మొదలుపెట్టాం' అంటున్నారు అధికారులు. ఇప్పటికే కొంతమంది అమ్మాయిలు బ్యుటీషియన్ శిక్షణ పూర్తిచేసుకున్నారు. తమ జీవితాలు ఇక అందంగా మారతాయని సంబరపడుతున్నారు.

ఈటీవీ భారత్ - యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి




మీకు తెలుసా!



పురుషులతో పోలిస్తే మహిళల చర్మం 25% సన్నితంగానూ పలుచగానూ ఉంటుందట. అందువల్లే కొలాజెన్ ఉత్పత్తి తగ్గి త్వరగా వృద్ధాప్యఛాయలు కనిపిస్తాయట. దీనికి కారణం హార్మోన్ల హెచ్చుతగ్గులే అని అధ్యయనాలు చెబుతున్నాయి.

సాయంతో... ఆరోగ్యం!

ఆరోగ్యానికి ఏం చేయాలో తెలుసు కానీ, సమయం ఉండటంలేదు... నేటి మహిళల నుంచి వచ్చే సాధారణ సమాధానం ఇది. మీ సమస్య సమయమే అయితే, అందుకు ప్రత్యామ్నాయాలూ ఉన్నాయి. ఎదుటివారిని ఆప్యాయంగా పలకరిస్తూ, అవసరంలో ఉన్నవాళ్లకి సాయం చేస్తే మనమూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటాం అంటున్నాయి అధ్యయనాలు.



సాటి మనిషికి సాయం చేయడం అంటే... అది అవతలవారికి మేలనుకుంటాం. కానీ చేసిన వ్యక్తికీ దీంతో లాభమేనట. 27 అధ్యయనాల్ని లోతుగా పరిశీలించగా ఎదుటివారిపై దయనీ, ప్రేమనీ ప్రదర్శించినప్పుడు వాటిని చూపిన వ్యక్తికే ఎక్కువ సంతోషమని తేలింది. సానుకూల దృక్పథంతో సమానమైన ప్రభావం దీన్లో ఉంటుందట. అధికాదాయం వల్లకంటే కూడా ఈ విధంగానే ఎక్కువగా సంతోషం లభిస్తుందట. అదెలా అంటే...

- ఆందోళన, ఒత్తిడితో బాధపడేవాళ్లలో దాతృత్వంవల్ల అవి తగ్గినట్లు ఓ అధ్యయనంలో తేలింది. బీపీ, శరీరంలో వాపు సూచీలు తగ్గుతున్నట్లు గుర్తించారు. దీనివల్ల గుండె జబ్బులు దూరమవుతాయి. న్యూరోకెమికల్ మార్పులవల్లనే ఇవన్నీ జరుగుతాయట. సాయం చేసిన సంతోషంలో ఆక్సిటోసిన్, డోపమైన్, సెరోటోనిన్... విడుదలవుతాయి. ఇవి ఆందోళనను తగ్గిస్తాయి.
- దయతో ఉండటంవల్ల మెదడులో ఒక భాగంలో సానుకూలత మొదలై... అది మిగిలిన విభాగాలపైనా మంచి ప్రభావం చూపిస్తుంది. వాపుని పెంచడంలో తోడ్పడే సీటీఆర్ఏ జన్యువులు అయిదు వారాలపాటు దాతృత్వం చూపినవాళ్లలో తక్కువగా స్పందించినట్లు తేలింది. 'మనం జన్యువుల్ని మార్చుకోలేం కానీ, సామాజిక ప్రపంచాన్ని మార్చుకోవచ్చు. దానివల్ల ఏ జన్యువులు చురుగ్గా ఉండాలో నిర్ణయమవుతుంది' అని చెబుతారు వైద్యులు.
- చాలామంది 'నా స్వభావం ఇంతే' అనుకుంటారు. కానీ మంచిగా ఉండటాన్నీ నేర్చుకోవచ్చంటున్నారు మానసిక నిపుణులు. మంచి పనులు ఎంత ఎక్కువగా చేస్తే అంతలా అలవాటు అవుతాయట. మంచి చేస్తే డోపమైన్ విడుదలవ్వడం తద్వారా సంతోషంగా ఉండటం, మళ్లీ ఎవరికైనా మేలు చేయాలనిపించడం... ఇది ఒక లింకులా ఉంటుంది. ఒకరికోసం సాయం చేసినప్పుడు సంతోషం కలుగుతుంది. కొన్నాళ్లకు ఇది మెదడుకు అలవాటు అవుతుంది. దాంతో సాయపడటం సహజమైన అలవాటుగా మారుతుంది. ఒక మంచి తల్లిగా, కూతురిగా, సహోద్యోగిగా, స్నేహితురాలిగా ఉండటమే దీనికి ఉత్తమ మార్గం అని చెబుతున్నాయి అధ్యయనాలు. కుటుంబసభ్యులకీ ఇది అలవాటు చేయండి మరి!

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

టీ20 ప్రపంచకప్‌లో ఉత్కంఠభరితంగా సాగిన గ్రూప్ దశకు తెరపడింది. ఇక సూపర్ సమరాలకు రంగం సిద్ధమైంది. గ్రూప్ దశను దాటిన ఎనిమిది జట్ల మధ్య శనివారం నుంచే సూపర్-8 పోరు. ఉత్తమ ప్రదర్శనతో ఈ దశకు చేరిన జట్లు.. సెమీస్ బెర్తుల కోసం హోరాహోరీగా తలపడతాయనడంలో సందేహం లేదు. సూపర్-8 దశ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్, న్యూజిలాండ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

ఛాంపియన్

సూపర్ ఆరంభం ఎవరిదో?

తొలి పోరులో పాక్‌తో కివీస్ ఢీ

రాత్రి 7 నుంచి



కొలంబో

టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తులను తేల్చే సూపర్-8 దశకు శనివారమే శ్రీకారం. లీగ్ దశలో గ్రూప్-ఎ, డిల నుంచి రెండో స్థానంతో ముందంజ వేసిన పాకిస్థాన్, న్యూజిలాండ్ శనివారం తలపడబోతున్నాయి. ఈ రెండు జట్లూ గ్రూప్ దశలో ఒక్కో మ్యాచ్ ఓడాయి. పాక్.. భారత్‌కు తలవంచగా, న్యూజిలాండ్.. దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. సమవుజ్జీల్లా కనిపిస్తున్న రెండు జట్ల మధ్య మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారో అంచనా వేయడం కష్టమే.

పాక్ ఉపయోగించుకుంటుందా?: గ్రూప్ దశలో పాక్ గొప్ప ప్రదర్శనేమీ చేయలేదు. భారత్ చేతిలో చిత్తయింది. నెదర్లాండ్స్‌పై అతి కష్టం మీద గెలిచింది. ఆ జట్టుతో పోలిస్తే న్యూజిలాండ్ మెరుగ్గా ఆడింది.

49 టీ20ల్లో పాకిస్థాన్, న్యూజిలాండ్ తలపడ్డ మ్యాచ్‌లు. 24 మ్యాచ్‌ల్లో పాక్ నెగ్గితే.. 23సార్లు కివీస్ గెలిచింది. 2 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు.

కానీ పాక్‌కు కొన్ని సానుకూలతలున్నాయి. ఆ జట్టు కొలంబోనే సొంత వేదికగా చేసుకుని అక్కడే మ్యాచ్‌లు ఆడుతుండడంతో పరిస్థితులు, పిచ్‌పై వారికి పూర్తి అవగాహన ఉంది. మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌కు తోడు అబ్రార్ అహ్మద్, మహ్మద్ నవాజ్, సయిమ్ అయూబ్, సల్మాన్ ఆఘాలతో ఆ జట్టుకు తిరుగులేని స్పిన్ బలం ఉంది. కొలంబోలో స్పిన్నర్లు విజృంభిస్తున్న నేపథ్యంలో కివీస్ బ్యాటర్లకు సవాలు తప్పకపోవచ్చు. పాక్ ప్రధాన పేసర్ షహీన్ అఫ్రిది ఫామ్‌లో లేకపోవడంతో తుది జట్టులో చోటు కష్టమే. సల్మాన్ మీర్జాకే ఆడే అవకాశముంది. బ్యాటింగ్‌లో పాక్ బలహీనంగా కనిపిస్తోంది. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఫర్హాన్ మీదే ఎక్కువ ఆశలు ఉన్నాయి. సయిమ్ అయూబ్, సల్మాన్ ఆఘా, బాబర్ అజామ్ టోర్నీలో పెద్దగా రాణించలేదు. గత మ్యాచ్‌లో షాదాబ్ మెరిశాడు. కివీస్‌కు బ్యాటింగే పెద్ద బలం. విధ్వంసక ఓపెనర్లు సీఫర్ట్, అలెన్‌లకు తోడు రచిన్, ఫిలిప్స్, చాప్‌మన్, మిచెల్ మంచి లయలో ఉన్నారు. స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధి కొలంబో పిచ్‌ను ఎంతమేర సద్వినియోగం చేసుకుంటారో చూడాలి. వీరికి తోడు ఫిలిప్స్, రచిన్ కూడా కొన్ని ఓవర్లు వేసే అవకాశముంది. హెన్రీ, డఫీ, నీషమ్ పేస్ బాధ్యతలు పంచుకుంటారు.

తుది జట్లు (అంచనా)... పాకిస్థాన్: సయిమ్ అయూబ్, ఫర్హాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), బాబర్ అజామ్, ఖవాజా నఫే, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, నవాజ్/అష్రాఫ్, సల్మాన్ మీర్జా, ఉస్మాన్ తారిఖ్, అబ్రార్ అహ్మద్; **న్యూజిలాండ్:** టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డరిల్ మిచెల్, శాంట్నర్ (కెప్టెన్), జిమ్మీ నీషమ్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోధి, జాకబ్ డఫీ.

సూపర్-8 ఇలా ఎందుకంటే?

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 దశలో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన జట్లన్నీ గ్రూప్-1లో ఉంటే.. రెండో స్థానం సాధించిన జట్టు గ్రూప్-2లో చోటు దక్కించుకున్నాయి. సూపర్-8లో ఏ జట్టు ఏ గ్రూప్‌లో ఉండాలన్నది టోర్నీ ఆరంభానికి ముందే నిర్ణయమైంది. టీ20 ర్యాంకింగ్ ఆధారంగా టాప్-8 జట్లకు సీడింగ్ ఇచ్చారు. బేసి సంఖ్య ర్యాంకుల్లో ఉన్న భారత్ (1), ఆస్ట్రేలియా (3), దక్షిణాఫ్రికా (5), వెస్టిండీస్ (7) వరుసగా ఎక్స్1, ఎక్స్2, ఎక్స్3, ఎక్స్4 సీడింగ్స్‌తో గ్రూప్-1లో చోటు దక్కించుకున్నాయి. సరి సంఖ్య ర్యాంకుల్లో ఉన్న ఇంగ్లాండ్ (2), న్యూజిలాండ్ (4), పాకిస్థాన్ (6), శ్రీలంక (8) జట్లకు వరుసగా వై1, వై2, వై3, వై4 సీడింగ్స్ ఇచ్చి గ్రూప్-2లో పెట్టారు. వీటిలో ఏ జట్టయినా సూపర్-8కు అర్హత సాధించకపోతే.. దాని సీడింగ్‌ను టాప్-8 వెలుపల ఉండి, ముందంజ వేసిన జట్టుకు కేటాయించాలన్నది నిబంధన. ఆ ప్రకారమే ఆస్ట్రేలియా సీడింగ్ అయిన ఎక్స్-2ను జింబాబ్వే సొంతం చేసుకుంది. గ్రూప్-1లో చోటు సంపాదించింది.

సూపర్-8 షెడ్యూల్

తేదీ	గ్రూప్	మ్యాచ్	వేదిక	సమయం
ఫిబ్రవరి 21	గ్రూప్-2	పాకిస్థాన్ × న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7
22	గ్రూప్-2	శ్రీలంక × ఇంగ్లాండ్	పల్లెకెలె	మ॥ 3
	గ్రూప్-1	భారత్ × దక్షిణాఫ్రికా	అహ్మదాబాద్	రాత్రి 7
23	గ్రూప్-1	వెస్టిండీస్ × జింబాబ్వే	ముంబయి	రాత్రి 7
24	గ్రూప్-2	పాకిస్థాన్ × ఇంగ్లాండ్	పల్లెకెలె	రాత్రి 7
25	గ్రూప్-2	శ్రీలంక × న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7
26	గ్రూప్-1	వెస్టిండీస్ × దక్షిణాఫ్రికా	అహ్మదాబాద్	మ॥ 3
	గ్రూప్-1	భారత్ × జింబాబ్వే	చెన్నై	రాత్రి 7
27	గ్రూప్-2	ఇంగ్లాండ్ × న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7
28	గ్రూప్-2	శ్రీలంక × పాకిస్థాన్	పల్లెకెలె	రాత్రి 7
మార్చి 1	గ్రూప్-1	దక్షిణాఫ్రికా × జింబాబ్వే	దిల్లీ	మ॥ 3
	గ్రూప్-1	భారత్ × వెస్టిండీస్	కోల్‌కతా	రాత్రి 7



అహ్మదాబాద్‌లో ప్రాక్టీస్ సందర్భంగా టీమ్‌ఇండియా

దాయాదుల పోరు.. రికార్డుల హోరు

దిల్లీ: భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య నైపుణ్యం, పోటీతత్వంలో అంతరం పెరుగుతున్నా.. అభిమానుల ఆసక్తి మాత్రం ఏమాత్రం తగ్గడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. గత ఆదివారం కొలంబో వేదికగా దాయాదుల మధ్య జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్ వీక్షణ పరంగా మునుపటి రికార్డులన్నింటినీ తిరగరాసింది. పోట్టి కప్పు అధికారిక డిజిటల్, ప్రసార భాగస్వామి జియోహాట్‌స్టార్ వివరాల ప్రకారం భారత్, పాక్ మ్యాచ్‌ను 16.3 కోట్ల మంది వీక్షించారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఒక మ్యాచ్‌ను ఈస్థాయిలో వీక్షించడం ఇదే తొలిసారి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్ కంటే దాయాదుల పోరుకే ఎక్కువ వీక్షణలు లభించడం విశేషం. 2024లో అమెరికా వేదికగా జరిగిన భారత్, పాక్ మ్యాచ్‌తో పోల్చుకుంటే కొలంబో పోరు డిజిటల్ వీక్షణలు 56 శాతం వృద్ధిని కనబరిచాయి.

ఫైనల్లో ఇండియా-ఎ



రాధ 4/19

బ్యాంకాక్: మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో ఇండియా-ఎ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కెప్టెన్ రాధ యాదవ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరచడంతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఇండియా-ఎ అయిదు వికెట్ల తేడాతో శ్రీలంక-ఎపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక-ఎ 19.4 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రాధ (4/19), ప్రేమ రావత్ (2/9), తనుజ (2/20) విజృంభించి శ్రీలంక-ఎను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అనంతరం ఇండియా-ఎ 13.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వృంద (42; 20 బంతుల్లో 8×4), అనుష్కశర్మ (27; 18 బంతుల్లో 5×4), రాధ యాదవ్ (31 నాటౌట్; 18 బంతుల్లో 7×4) సత్తాచాటి జట్టుకు విజయాన్ని అందించారు. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్-ఎతో ఇండియా-ఎ తలపడనుంది.

ఆస్ట్రేలియా కొసమెరుపు

- ఒమన్‌పై ఘనవిజయం
- మెరిసిన జంపా, మార్ష్



పల్లెకెలె: టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు దూరమైన మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా.. విజయంతో టోర్నీని ముగించింది. శుక్రవారం గ్రూప్-బి ఆఖరి పోరులో ఆసీస్ 9 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా (4/21), మ్యాక్స్‌వెల్ (2/13), బార్ట్‌లెట్ (2/27) ధాటికి ఒమన్ 16.2 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. వసీమ్ అలీ (32; 33 బంతుల్లో 4×4) టాప్ స్కోరర్. కెప్టెన్ మిచెల్ మార్ష్ (64 నాటౌట్; 33 బంతుల్లో 7×4, 4×6), ట్రావిస్ హెడ్ (32; 19 బంతుల్లో 6×4) మెరుపులతో కంగారూ జట్టు 9.4 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. 4 మ్యాచ్‌ల్లో ఆసీస్ రెండు విజయాలు సాధించగా.. ఒమన్ నాలుగు మ్యాచ్‌లూ ఓడింది.

మార్ష్ మోత: స్వల్ప ఛేదనలో ఆసీస్ అదరగొట్టింది. తొలి ఓవర్ నుంచే మార్ష్ మోత మొదలైంది. షఫీఖ్ వేసిన ఈ ఓవర్లో అతడు మూడు ఫోర్లు కొట్టాడు. ఆ తర్వాతి ఓవర్లో జై పదేద్రాకు ఓ సిక్స్, ఫోర్ వడ్డించాడు. 4వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా జోరందుకున్నాడు. 6 ఓవర్లకు 73/0తో ఆస్ట్రేలియా లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఈ క్రమంలో మార్ష్.. 26 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. హెడ్ ఔటైనా.. ఇంగ్లిస్ (12 నాటౌట్)తో కలిసి మార్ష్ పని పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా 62 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి ఒమన్ ఏమాత్రం నిలవలేకపోయింది. బార్ట్‌లెట్ వేసిన ఇన్నింగ్స్ ఓవర్ తొలి బంతికే ఆ జట్టు ఓపెనర్ కలీమ్ (0) వికెట్ చేజార్చుకుంది. 3 ఓవర్లకు 20/1తో ఒమన్ కాస్త పుంజుకున్నా.. తర్వాత మళ్లీ తడబడింది. స్పిన్నర్లు ఆడమ్ జంపా, మ్యాక్స్‌వెల్ విజృంభించడంతో ఒమన్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. వసీమ్ అలీ నిలవడంతో ఆ జట్టు స్కోరు 100 అందుకుంది. 17వ ఓవర్ తొలి రెండు బంతులకు షకీల్ (3), షఫీఖ్ (0)లను ఔట్ చేసిన జంపా.. ఒమన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఒమన్ ఇన్నింగ్స్: ఆమీర్ కలీమ్ (బి) బార్ట్‌లెట్ 0; జతిందర్ (బి) బార్ట్‌లెట్ 17; కరణ్ (బి) ఎలీస్ 12; హమ్మద్ మీర్జా (బి) జంపా 16; వసీమ్ అలీ (బి) మ్యాక్స్‌వెల్ 32; నదీమ్ ఎల్బీ (బి) జంపా 2; వినాయక్ శుక్లా (సి) గ్రీన్ (బి) స్టాయినిస్ 9; జితేన్ రామనంది ఎల్బీ (బి) మ్యాక్స్‌వెల్ 1; షకీల్ (సి) బార్ట్‌లెట్ (బి) జంపా 3; వదేద్రా నాటౌట్ 4; షఫీఖ్ జాన్ (బి) జంపా 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (16.2 ఓవర్లలో ఆలౌట్) 104; **వికెట్ల పతనం:** 1-0, 2-24, 3-39, 4-59, 5-69, 6-86, 7-89, 8-100, 9-104; **బౌలింగ్:** బార్ట్‌లెట్ 4-0-27-2; స్టాయినిస్ 2-0-16-1; ఎలీస్ 2-0-14-1; గ్రీన్ 2-0-11-0; ఆడమ్ జంపా 3.2-0-21-4; మ్యాక్స్‌వెల్ 3-0-13-2

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ నాటౌట్ 64; ట్రావిస్ హెడ్ (సి) అండ్ (బి) షకీల్ అహ్మద్ 32; ఇంగ్లిస్ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (9.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 108; **వికెట్ల పతనం:** 1-93; **బౌలింగ్:** షఫీఖ్ 2-0-30-0; జై ఒదేద్రా 2-0-21-0; షకీల్ అహ్మద్ 4-0-29-1; వసీమ్ అలీ 1-0-18-0; జితేన్ 0.4-0-10-0

20 జట్లతో టీ20 ప్రపంచకప్.. అందులో 10 జట్లు పసికూనలే..! పెద్ద జట్లు రికార్డుల మోత మోగించడానికి తప్ప.. ఈ జట్లను ఆడించడం వల్ల ఏం ఆసక్తి ఉంటుంది..? టోర్నీ ఆరంభంలో ఇలా అనుకుని ఉంటే ఆశ్చర్యం లేదు..! లీగ్ దశ చివరకు వచ్చేసరికి.. పెద్దగా అనుభవం లేకున్నా భలే ఆడాయే ఈ చిన్న జట్లు అనిపించే ఉంటుంది! కూనలు ఆడిన ఆట అలాంటిది మరి. అసలు పోటీ ఇస్తాయా అనుకున్న జట్లు అసాధారణ ప్రదర్శన చేశాయి. పెద్ద జట్లను ఓడించినంత పనిచేశాయి. ఇంకాస్త పోరాడివుంటే టోర్నీ సంచలనాలతో మోతెక్కిపోయేది. కూనలకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలన్న సందేశాన్ని ఇచ్చిన ఈ టోర్నీలో కొన్ని మెరుపులు...

ఈనాడు క్రీడావిభాగం

చిన్నోళ్ల చమక్



నేపాల్ జిగేల్

"నా కెరీర్‌లో ఓటమి గురించి ఇంతలా భయపడలేదు. హ్యారీ బ్రూక్ నా దగ్గరకు వచ్చి ఈ రోజు మనం ఓడిపోతే అంతకన్నా అవమానం మరొకటి ఉండదన్నాడు. అంత గొప్పగా పోరాడిన వారికి సెల్యూట్".. నేపాల్‌తో మ్యాచ్ అనంతరం జోస్ బట్లర్ మాటలివి. నేపాల్ ఎంత అద్భుతంగా పోరాడిందో అతడి మాటలతోనే స్పష్టమవుతోంది. ఆ మ్యాచ్‌లో 185 పరుగుల ఛేదనలో నేపాల్ కేవలం 4 పరుగుల తేడాతో ఓడిపోయింది. జోఫ్రా ఆర్చర్, అడిల్ రషీద్, సామ్ కరన్ వంటి స్టార్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న పసికూన.. ఇంగ్లాండ్‌ను ఓడించినంత పనిచేసింది. చివరి ఓవర్లో నేపాల్‌కు పది పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు అయిదు పరుగులే చేసింది. ఎంతో అనుభవం ఉన్న, ఇలాంటి ఒత్తిడి మ్యాచ్‌లు ఎన్నో ఆడిన సామ్ కరన్ ఇంగ్లాండ్‌ను ఓటమి నుంచి బయటపడేశాడు. కానీ ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న, అంతర్జాతీయ లీగ్‌లు పెద్దగా ఆడని నేపాల్ ఆటగాళ్లు ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో ఆ స్థాయిలో పోరాడటం అద్భుతమే. విజయం సాధించివుంటే మరింత ఆత్మవిశ్వాసంతో ఆ జట్టు ప్రయాణం సాగేది. ఓ విజయం (స్కాట్లాండ్‌పై)తో టోర్నీని ముగించిన నేపాల్.. ప్రపంచ క్రికెట్లో వేగంగా ఎదగగల జట్టు అని నిరూపించింది. దీపేంద్ర సింగ్ ఐరీ (169 పరుగులు), రోహిత్ పౌడెల్ (83 పరుగులు), నందన్ కుమార్ (5 వికెట్లు) ఆ జట్టులో ఆకట్టుకున్నారు.

అ'మెరిక'..



అమెరికాతో మ్యాచ్ అనగానే టీమ్ ఇండియా ఎంత తేడాతో గెలుస్తుందని అంతా చూశారు. కానీ మ్యాచ్ ఆరంభమైన కొద్దిసేపటికి అసలు భారత్ గెలుస్తుందా అన్న సందేహం కలిగింది. 77 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి భారత్‌ను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది అమెరికా. సూపర్ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లను మోస్తరు స్కోరుకే పరిమితం చేయడంలో అమెరికా బౌలర్లు సఫలమయ్యారు. అభిషేక్‌ను ప్రణాళిక ప్రకారం ఔట్ చేయడమే కాక మిగతా బ్యాటర్లను కట్టడి చేసి అమెరికా ఆశ్చర్యపరిచింది. సూర్యకుమార్ మెరుపు ఇన్నింగ్స్ ఆడకపోతే మ్యాచ్‌లో అమెరికాకు విజయావకాశాలు మెరుగ్గానే ఉండేవి. 162 పరుగుల ఛేదనలో ఆ జట్టు 132 పరుగులు చేసింది. నిలకడగా మ్యాచ్‌లు ఆడే అవకాశం లేకున్నా, స్వదేశంలో ఓ మోస్తరు సదుపాయాలే ఉన్నా.. పెద్ద జట్లతో ఎప్పుడో గానీ ఆడే అవకాశమున్న అమెరికా ఈ టోర్నీలో గొప్ప ప్రదర్శన చేసింది. అందుకు ప్రధాన కారణం భారత సంతతి ఆటగాళ్లే. 2024 టీ20 ప్రపంచకప్‌లో, ఈసారి టోర్నీలో రెండేసి విజయాలతో ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకుంటోంది. సౌరభ్ నేత్రావల్కర్, సాయితేజ ముక్కమల్ల, కెప్టెన్ మోనాంక్ పటేల్, శుభమ్ రంజానె వంటి ఆటగాళ్లు ప్రతిభ చాటుకున్నారు.

కంగారూలనే కొట్టారు..



ఆస్ట్రేలియా అంటే టైటిల్ ఫేవరెట్. సూపర్-8లో కచ్చితంగా ఉంటుందని భావించిన ఆ జట్టు లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. కారణం జింబాబ్వే. ఆ ఒక్క మ్యాచే కాదు.. గ్రూప్ దశ అంతటా ఆ జట్టు ఆట అద్భుతం. అజేయంగా నిలిచి గ్రూప్-బిలో అగ్రస్థానంలో నిలిచి ఘనంగా సూపర్-8లో అడుగుపెట్టింది. ఒకప్పుడు మేటి జట్లకు షాకిస్తూ, ఆ జట్ల స్థాయికి ఎదిగేలా కనిపించిన జట్టు.. దేశంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభం కారణంగా పతనమైంది. ఇప్పుడు మళ్లీ పాత రోజులను గుర్తుచేసింది. ఆస్ట్రేలియాను ఆ జట్టు 21 పరుగుల తేడాతో ఓడించడం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఏదో ఒక విభాగం కాదు.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని రంగాల్లో కంగారూ జట్టుపై పైచేయి సాధించింది. ముజరబాని నాలుగు వికెట్లతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో బెన్ ద్వార్షుయిస్ కొట్టిన బంతిని మున్యోంగా పట్టిన క్యాచ్.. టోర్నీలోనే ఉత్తమ క్యాచ్‌ల్లో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఆసీస్‌నే కాదు.. ఆ తర్వాత ఆతిథ్య శ్రీలంకను సైతం ఓడించి సూపర్-8లోని జట్లకు గట్టి హెచ్చరికలు పంపింది జింబాబ్వే. కెప్టెన్ సికందర్ రజా, బెనెట్, మరుమాని, మసకద్జా, మున్యోంగా, ముజరబాని, ఎవాన్స్, బర్ల్, క్రీమర్‌లతో ఆ జట్టు లైనప్ శక్తిమంతంగా కనిపిస్తోంది. సూపర్-8లో గ్రూప్-1లోని భారత్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలకు ఈ జట్టుతో ముప్పే.



ఇటలీ తొలి గోల్..

ఫుట్‌బాల్ ప్రధాన ఆటగా కొనసాగుతున్న ఇటలీలో క్రికెట్ జట్టు తయారవడమే గొప్ప. ప్రపంచకప్‌నకూ అర్హత సాధించి.. క్రికెట్‌లో తన ప్రయాణం మొదలైందని పెద్ద వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేసింది. నేపాల్‌పై పది వికెట్లతో నెగ్గి.. టీ20 ప్రపంచకప్‌లో విజయాల ఖాతా తెరిచింది. మోస్కా సోదరులు అర్ధసెంచరీలతో మెరిశారు. ఆంథోనీ మోస్కా (32 బంతుల్లో 62) ఇన్నింగ్స్ మ్యాచ్‌లో హైలైట్. బెన్ మానెంటి అద్భుత గణాంకాలు (4-0-9-2) నమోదు చేశాడు. అతడు మిగతా మ్యాచ్‌ల్లోనూ ఆకట్టుకున్నాడు. ఇంగ్లాండ్‌తో 203 పరుగుల ఛేదనలో ఇటలీ 178 వరకు వెళ్లిందంటే బెన్ (25 బంతుల్లో 60), స్టీవార్ట్ (23 బంతుల్లో 45)లే కారణం. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో సరిపెట్టుకున్నప్పటికీ.. ఈ ప్రదర్శన ఆ జట్టుకు ఎంతో ఉత్సాహాన్నిచ్చేదే. రాబోయే ఏళ్లలో మరింత మెరుగవ్వాలని ఇటలీ పట్టుదలగా ఉంది.



నెదర్లాండ్స్ త్రుటిలో..

నెదర్లాండ్స్ టోర్నీకి ఆసక్తికర ఆరంభాన్నిచ్చింది. ఆ జట్టు విజయం సాధించలేదు కానీ.. తొలి రోజే పాకిస్థాన్‌కు ముచ్చెటములు పట్టించింది. పాకిస్థాన్‌కు 148 పరుగుల లక్ష్యం నిర్దేశించిన డచ్ జట్టు.. అద్భుత బౌలింగ్‌తో 18 ఓవర్ల దాకా మ్యాచ్‌లో నిలిచింది. అనుభవం తక్కువైన జట్టు చివరి 2 ఓవర్లలో 29 పరుగులు సమర్పించుకుని ఓటమివైపు నిలిచింది. వాన్ బీక్ వేసిన 19 ఓవర్లో ఫహీమ్ అష్రాఫ్ మూడు సిక్సర్లు, ఒక ఫోర్ సహా 24 పరుగులు రాబట్టాడు. ఆ ఒక్క ఓవర్‌ను కట్టడి చేసివుంటే పాక్.. సూపర్-8 చేరడం కష్టంగా మారేది. ఈ టోర్నీలో ఒకే విజయం (నమీబియాపై)తో నెదర్లాండ్స్ టోర్నీని ముగించింది. భారత్‌తో చివరి మ్యాచ్ అనంతరం నెదర్లాండ్స్ ఆల్‌రౌండర్ బాస్ డెలీడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ప్రపంచకప్ సమయంలోనే మాపై దృష్టి ఉంటుంది. అలా కాకుండా మాతో పెద్ద జట్లు సిరీస్‌లు ఆడితే మా ఆట మెరుగుపడుతుంది. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే జట్లు నెదర్లాండ్స్‌తో కనీసం వార్మప్ మ్యాచ్‌లైనా ఆడితే.. ఉభయతారకంగా ఉంటుంది. ఆర్థికంగా కూడా మేం పుంజుకోవడానికి పెద్ద జట్లు సహకరించాలి" అని డెలీడ్ చెప్పడం చిన్న జట్ల పరిస్థితిని తెలియజేస్తోంది.

ప్రపంచకప్‌ల్లో చిన్న జట్లు ఉంటే మజా ఏముంటుంది అని అనుకునే వారికి కూనలు ఈ టోర్నీతో కనువిప్పు కలిగించాయి. వాటితో పెద్ద జట్లు అప్పుడప్పుడు ఆడితే.. ఆ టీమ్స్ ఆర్థికంగా, ఆట పరంగా మెరుగుపడటంతో పాటు ప్రపంచ క్రికెట్లో పోటీ పెరిగి.. అభిమానుల్లో ఆసక్తి రెట్టింపవడం ఖాయం.

మధ్యాహ్నం 1.45 నుంచి

సిరీస్ పట్టేయాలని..

నేడే ఆస్ట్రేలియాతో భారత్ మూడో టీ20




అడిలైడ్: భారత మహిళల క్రికెట్ జట్టుకు సవాల్. ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవాలనే పట్టుదలతో ఉన్న హర్మన్‌ప్రీత్ బృందం.. శనివారం మూడో టీ20లో పోటీకి సై అంటోంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచి జోరు మీద కనిపించిన భారత్.. రెండో టీ20లో తడబడి ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో ఆసీస్‌పై గెలవాలంటే బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించాల్సి ఉంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ శుభారంభం ఇవ్వడం కీలకం. ఈ సిరీస్‌లో తొలి రెండు టీ20ల్లో స్మృతి, షెఫాలి బాగానే ఆరంభించినా.. నిలదొక్కుని భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఆష్లీ గార్డ్‌నర్, సోఫీ మోలనూ, కిమ్ గార్త్‌లను భారత బ్యాటర్లు దీటుగా ఎదుర్కోవాల్సి ఉంది. కీలక మ్యాచ్‌లో హర్మన్ ప్రీత్, జెమీమా, రిచా ఘోష్ రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో రేణుక సింగ్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ ఆకట్టుకుంటున్నారు. ఇదే జోరు మూడో టీ20లోనూ కొనసాగించాలి. మిడిల్ ఓవర్లలో ప్రభావం చూపించే బాధ్యత దీప్తి, శ్రీచరణిలపైనే ఉంది. జార్జియా వోల్, బెత్ మూనీ తదితరులతో బలంగా ఉన్న ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను భారత బౌలర్లు ఎలా అడ్డుకుంటారో చూడాలి.

మెరుగైన ప్రదర్శనపై భారత్ దృష్టి

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో స్పెయిన్‌తో మ్యాచ్ నేడు

హోబర్ట్: స్వదేశంలో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన భారత హాకీ జట్టు విదేశీ గడ్డపై మెరుగైన ప్రదర్శనపై దృష్టిసారించింది. శనివారం హోబర్ట్‌లో ప్రారంభంకానున్న లీగ్‌లో స్పెయిన్‌తో భారత్ తన పోరాటాన్ని మొదలుపెట్టనుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ గైర్హాజరీలో మిడ్ ఫీల్డర్ హార్దిక్‌సింగ్ నేతృత్వంలో బరిలో దిగుతున్న భారత్ సరికొత్తగా ఆరంభించాలని పట్టుదలగా ఉంది. ఈనెల 25 వరకు జరిగే ఈ లీగ్‌లో ఆస్ట్రేలియా, భారత్, స్పెయిన్ జట్లు తలపడతాయి. శనివారం స్పెయిన్, ఆదివారం ఆసీస్‌ను భారత్ ఢీకొంటుంది. ఈనెల 24న స్పెయిన్, 25న ఆసీస్‌తో భారత్ మరోసారి పోటీపడుతుంది. ఇటీవల సొంతగడ్డపై అర్జెంటీనా, బెల్జియం చేతిలో పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకున్న భారత్.. హోబర్ట్‌లో పుంజుకోవాలని భావిస్తోంది.

అన్న, తమ్ముడు.. ఓ సమరం






అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్ సూపర్-8 మ్యాచ్‌లో భాగంగా ఆదివారం భారత్-దక్షిణాఫ్రికా తలపడబోతున్నాయి. ఈ మ్యాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. దక్షిణాఫ్రికా క్రికెట్ బ్రదర్స్ మోర్నీ మోర్కెల్, అల్బీ మోర్కెల్ మధ్య పోటీ జరగబోతోంది. టీమ్‌ఇండియాకు మోర్నీ బౌలింగ్ కోచ్‌గా ఉండగా.. దక్షిణాఫ్రికా ప్రత్యేక సలహాదారుగా అల్బీ సేవలందిస్తున్నాడు. "మేమిద్దరం ఎక్కువగా మాట్లాడుకోం. మాలో ఎవరు పైచేయి సాధిస్తామో అని మాకన్నా అమ్మకు చాలా కంగారుగా ఉంది. ఎవరికి మద్దతు ఇవ్వాలో తెలియని పరిస్థితి ఆమెది" అని అల్బీ పేర్కొన్నాడు. ఒకే జట్టుకు సోదరులు ఆడిన సందర్భాలు చరిత్రలో చాలా ఉన్నాయి. కానీ ఇలా అంతర్జాతీయ స్థాయిలో వేర్వేరు జట్లకు కోచింగ్ బృందంలో ఉండడం బహుశా ఇదే తొలిసారి. కోల్‌కతా డెర్బీ క్రికెట్ మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ జట్లకు సోదరులు ప్రణబ్ నంది, పలాష్ నంది కోచ్‌లుగా వ్యవహరించారు. ఫుట్‌బాల్‌లో 1966లో బాబీ, జాక్ బ్రదర్స్ ఇంగ్లిష్ లీగ్‌లో వేర్వేరు జట్లకు పని చేశారు. మిడిల్‌బరోకు జాక్, ప్రెస్టన్ నార్త్ ఎండ్ జట్టుకు బాబీ మేనేజర్లుగా సేవలందించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (శనివారం) సాయంత్రం: 6.16

సహరి: (ఆదివారం) ఉదయం: 5.12





సూపరో.. సూపరు..

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన 'సిద్ధార్థ- 2026' ఆద్యంతం ఆకట్టుకుంది. ఆవిష్కరణలు, ఫ్యాషన్‌షోలు, యువత కేరింతల మధ్య కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. - కానూరు, న్యూస్‌టుడే

ఈనాడు అమరావతి ఎన్టీఆర్

సేంద్రియ.. ప్రకృతిసాగు మేళాల ఏర్పాట్లపై సమీక్ష

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 21న ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెంలో 'సేంద్రియ మేళా', 22న విజయవాడ ఐజీఎం స్టేడియంలో ప్రకృతి వ్యవసాయ మేళా నిర్వహించనున్నారు. [illegible] ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం వర్చువల్‌గా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతు-నిపుణుల పరస్పర చర్చా వేదికల ద్వారా సందేహాల నివృత్తితో పాటు, మేధోమథనానికి అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. సమీక్షలో రెవెన్యూ, ప్రకృతి వ్యవసాయ విభాగం, ఉద్యాన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలువలకు 2,858 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ప్రకాశం బ్యారేజీ నుంచి పంట కాలువలకు శుక్రవారం 2,858 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు ప్రధాన కాలువకు 502, పశ్చిమ కాలువకు 2,212, గుంటూరు ఛానల్‌కు 144 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కాలువ నుంచి కేఈబీ కాల్వకు 302, బందరు కాల్వకు 200 క్యూసెక్కులు చొప్పున ఇస్తున్నారు.

వైద్య సిబ్బంది.. సమయపాలన తప్పొద్దు



రోగులు, వారి బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఈనాడు, అమరావతి: వైద్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలనీ, నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. రోగులకు అత్యవసర వైద్య సేవలను 24 గంటలూ సమర్థంగా అందించాలనీ.. రోగులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాల శుభ్రత, భద్రత, ఔషధాల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. ప్రతి రోగికీ సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఓపీ, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఔషధ పంపిణీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడి సేవల తీరును తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావుకు సూచించారు.

అద్దె ఖాతాల నిందితులకు 3 రోజుల కస్టడీ

ఈనాడు - అమరావతి: అద్దె ఖాతాల కేసులో నిందితులను.. కోర్టు కస్టడీకి ఇచ్చింది. ఈమేరకు నగరంలోని మూడో ఏజేసీజే కోర్టు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన మ్యూల్ ఎకౌంట్స్ వ్యవహారంలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న రవికుమార్ (ఏ1), స్టీవెన్ (ఏ2), బాజి (ఏ3), శివ దుర్గాప్రసాద్ (ఏ4)లను సోమవారం నుంచి మూడు రోజులపాటు కస్టడీకి అనుమతించింది. నిందితుల నుంచి నేరానికి సంబంధించి మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందనీ, ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సైబర్ పోలీసులు పిటిషన్ దాఖలు చేయగా దీనిపై న్యాయాధికారి తిరుమలరావు ఉత్తర్వులు ఇచ్చారు.

మత్తుకు చిక్కొద్దు.. చిక్కుల్లో పడొద్దు

డ్రగ్స్, బెట్టింగ్స్, రుణ యాప్‌లతో జాగ్రత్త

ఈనాడు, అమరావతి - కానూరు, న్యూస్‌టుడే



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్, సైకాలజిస్ట్ బి.ప్రసాద్‌బాబు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.భూలక్ష్మి, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిశోర్‌కుమార్

మాదక ద్రవ్యాల బారినపడి యువత జీవితాలను కోల్పోతున్నారని ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత సరదాగా ఆరంభించి.. తర్వాత మత్తు నుంచి బయటకు రాలేకుంటారు.. కూరుకుపోతున్నారన్నారు. చక్కటి చదివి.. మంచి కొలువులు సాధించిన వాళ్లు మత్తులో కూరుకుపోయి.. భవిత లేకుండా చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. 'ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో పోరంకిలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో.. 'మాదక ద్రవ్యాలు, బెట్టింగ్, రుణ యాప్‌లతో భవిష్యత్తు అంధకారం' అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్, సైకాలజిస్ట్ బి.ప్రసాద్‌బాబు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.భూలక్ష్మి, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సిహెచ్.కె.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. ప్రస్తుతం.. మాదక ద్రవ్యాలు, బెట్టింగ్, రుణ యాప్‌లతో విద్యార్థుల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతున్నాయి.. విద్యార్థులు, వారి కుటుంబాలు ఎలా కుంగిపోతున్నాయో వివరించారు.

సరదాగా ఆరంభం.. జీవితాలు చిన్నాభిన్నం..



కె. నగేష్‌బాబు ఈగల్ ఎస్పీ

★ జీవితంలో ప్రయత్నిస్తే ఏ అలవాటు నుంచైనా బయటపడొచ్చు కానీ.. మాదక ద్రవ్యాల బారినపడితే మాత్రం అంత తేలికగా బయటకు రాలేరు. డ్రగ్స్ అనేది భయంకరమైన అలవాటు. ★ మానవ వనరులతోనే దేశ, రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యం. అందుకే.. యువతరాన్ని కబళిస్తున్న డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం ఈగల్‌ను ఏర్పాటు చేసింది. ప్రతి కళాశాలలో విద్యార్థులతో ఈగల్ క్లబ్‌లను పెడుతున్నాం. ★ మంచి, చెడులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులదే. ★ 'ఈనాడు' ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సులు చాలా అవసరం. ★ విద్యార్థులకు సరైన ఆలోచనా విధానం ఉండాలి. లేదంటే దారితప్పే వీలుంది. ★ ఏటా రూ.2 కోట్ల ప్యాకేజీతో కొలువు సాధించిన ఓ కుర్రాడు.. స్నేహితుల ప్రోత్సాహంతో సరదాగా డ్రగ్స్‌కు అలవడి.. జీవితాన్ని పాడుచేసుకున్నాడు. ఇలాంటి ఉదంతాలు చూస్తే.. చాలా బాధేస్తోంది.

చట్టాలు కఠినం..

★ ఒకసారి డ్రగ్స్ కేసులో పేరు నమోదైతే.. జీవితాంతం వెంటాడుతుంది. ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, వీసా రావు. డ్రగ్స్ విక్రయించే వారితోపాటు బంధువులు, స్నేహితుల ఆస్తులు, బ్యాంక్ ఖాతాలన్నీ సీజ్ చేస్తారు.

ప్రతి విద్యార్థీ ఈగల్ అంబాసిడర్...

★ ప్రతి విద్యార్థి ఈగల్ అంబాసిడర్‌గా మారాలి. ★ డ్రగ్స్ గురించి ఎలాంటి సమాచారం తెలపాలన్నా, ఎవరినైనా వీటి బారి నుంచి రక్షించాలన్నా.. 1972కు ఫోన్ చేసి తెలపండి. ★ సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయి. భయపడక్కర్లేదు.

జీవితాలను కబళిస్తాయ్... భద్రం మిత్రమా..



విద్యార్థులు తెలిసీ తెలియక బెట్టింగ్, రుణయాప్‌ల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్నేహితులు, పరిసరాల ప్రభావం, హార్మోన్ల అసమతుల్యతతో బలహీనులై.. మత్తు, బెట్టింగ్స్, రుణ యాప్‌లకు అలవడుతున్నారు. ఒత్తిడి, ఆందోళనతో చివరికి మానసికంగా కుంగిపోతున్నారు. కొన్నిసార్లు పరిస్థితి విషమించి ఆత్మహత్యలకూ దారితీస్తోంది. విద్యార్థి దశలో డిప్రెషన్ ఎక్కువై.. చివరికి సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదం ఉంది. అందుకే సరదాగానైనా.. మత్తు, బెట్టింగ్స్ జోలికి వెళ్లొద్దు. అవే జీవితాలను కబళిస్తున్నాయని గుర్తుపెట్టుకోండి.

– బి.ప్రసాద్‌బాబు, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్, సైకాలజిస్ట్

హేళన మరిచి.. హేమాహేమీలుగా నిలిచి..

సత్తాచాటిన కృష్ణా వర్సిటీ నెట్‌బాల్ జట్టు

న్యూస్‌టుడే, రుద్రవరం (మచిలీపట్నంరూరల్)

ఆలిండియా స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ అది. ఒక్క మ్యాచ్ కూడా గెలవలేరని హేళనలు.. కాకలు తీరిన క్రీడాకారిణులు లేరు.. ఆటలో నైపుణ్యానికి అప్పటి వరకు గుర్తింపే లేదు. ఈ పరిస్థితుల్లో బరిలోకి అడుగు పెట్టిన కృష్ణా యూనివర్సిటీ నెట్‌బాల్ జట్టు అదరగొట్టింది. జాతీయస్థాయిలో 60 యూనివర్సిటీల నుంచి పాల్గొన్న క్రీడాకారిణులతో తలపడి తృతీయ స్థానంలో నిలిచింది. ప్రవేశమే లేని ఆటలో రాణించి జాతీయ స్థాయిలో సత్తాచాటారు. గెలవాలనే కసి, రోజుకు 9గంటల సాధన వారికి గుర్తింపు తెచ్చింది.



కృష్ణా యూనివర్సిటీకి ఆలిండియా స్థాయిలో కబడ్డీ క్రీడలో మంచి గుర్తింపు ఉంది. క్రీడాకారులు జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచే అవకాశం ఉంది. కబడ్డీ క్రీడ నిర్వహిస్తామని అడిగితే ఆలిండియా స్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించేందుకు అనుమతి లభించింది. జట్టును తయారు చేసుకోవటం, తర్ఫీదు ఇవ్వడం వంటి అంశాలతో పాటు నిర్వహణ బాధ్యత తలకెత్తుకున్నందుకు పోటీల్లో మెరుగైన స్థానం పొందడం సవాలుగా నిలిచింది.

నెట్‌బాల్ క్రీడను రాష్ట్ర విద్యార్థులు సీరియస్‌గా తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో తోటి యూనివర్సిటీల నుంచే హేళనలు ఎదురయ్యాయి. ఒక్క మ్యాచ్ గెలిచినా గొప్పే అంటూ పెదవి విరిచారు. కానీ అంచనాలను తలకిందులు చేస్తూ నాకౌట్‌లో నాలుగు జట్లపై, లీగ్‌లో రెండు జట్లపై విజయాలు సాధించిన కృష్ణా వర్సిటీ జట్టు జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి విమర్శకులకు దీటైన జవాబునిచ్చింది.

జట్టును విజయాల బాట పట్టించడానికి కోచ్ శివరామ్ నడుం బిగించారు. తెల్లవారుజామున 5గంటల నుంచి ఉ.10గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7గంటల వరకు క్రీడాకారిణులకు కఠోర శిక్షణ ఇచ్చారు.

రేయింబవళ్లు శ్రమించి..

శిక్షణతోనే శివరామ్ బాధ్యతలు తీరిపోలేదు. క్రీడాకారిణులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించారు. గెలుపు కోసం వారిని మానసికంగా సిద్ధం చేశారు. చేరుకున్న స్థానంతో సంతృప్తి లభించినా జాతీయస్థాయి ఛాంపియన్ కావడం కష్టమేమీ కాదన్న ధైర్యాన్ని ఈ టోర్నమెంట్ నింపింది.



శివరాం, కోచ్

★ **క్రీడాకారిణులకు ఉజ్వల భవిష్యత్తు:** ఈ విజయంతో జట్టులోని కొందరు క్రీడాకారిణులకు ఖేలో ఇండియా జట్టులో చోటు దక్కుతుందని భావిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా రాణిస్తే వచ్చే గుర్తింపు వారి జీవితాంతం ఉపయోగపడుతుంది.

కొండపల్లి బొమ్మ పోటీతో కళాకారులకు ప్రోత్సాహం



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బొమ్మ పోటీ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం కళాకారులకు ఎంతో ప్రోత్సాహకరమని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అన్నారు. జిల్లా పరిపాలన, పర్యాటక శాఖ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సంయుక్తంగా బొమ్మల పోటీ- 2026 నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలను కళాకారులకు వివరించారు. జేసీ మాట్లాడుతూ పోటీలో పాల్గొనే కళాకారులు 20, 21న దరఖాస్తులు సమర్పించాలని, 22 నుంచి మార్చి 8 వరకూ కళాకారులు రూపొందించిన బొమ్మలను అందజేయాలన్నారు. మార్చి 9న అధికారుల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన బొమ్మలను ప్రకటిస్తామని, కళాకారులకు బహుమతులు అందజేస్తామన్నారు. విభాగాల వారీగా గెలుపొందిన వారందరికీ కలిపి మొత్తం రూ.లక్ష విలువైన బహుమతులు ఉంటాయన్నారు. పలువురు అధికారులు, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ కళాకారులు పాల్గొన్నారు.

స్పందిస్తే దాతలు... సమృద్ధిగా వసతులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలనేది విద్యా శాఖ లక్ష్యం. అందుకు ఉపాధ్యాయులను నియమించడంతో పాటు వసతులు కల్పించడమే కాకుండా వివిధ పథకాలు కూడా అమలు చేస్తోంది. ఇంకా కొన్నిచోట్ల మౌలిక సౌకర్యాల కొరత ఉంది. దాతల సహకారంతో ఆయా వసతులు కల్పించాలనే లక్ష్యంతో విద్యాంజలి-2 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

అందుబాటులో విద్యాంజలి పోర్టల్

సుమారు 2500 పాఠశాలలు...



★ ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుమారు 2500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. దాదాపు రెండు లక్షల యాభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

★ బడులకు కావాల్సిన అదనపు గదులు, మరమ్మతులు, ఫర్నిచర్, సభా వేదికలు, క్రీడా మైదానాల అభివృద్ధి, వంట గదులు, సైన్స్ ల్యాబ్‌లు, సైకిల్ స్టాండ్ల నిర్మాణం, విద్యా సామగ్రి, టీవీ, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఆర్వో ప్లాంట్లు తదితర వివరాలను ప్రధానోపాధ్యాయులు విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయాలి.

ఇప్పటికే దీనిపై జిల్లా స్థాయిలో ఎంఈవోలు, విద్యా కమిటీ ఛైర్మన్లు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. వారంతా మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

★ ముందుగా గ్రామస్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా కమిటీ ఛైర్మన్లతో ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహిస్తారు. బడికి ఏ వసతులు కావాలి? ఆ పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు ఎవరనేది గుర్తిస్తారు. వారితో మాట్లాడి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతారు.

★ ఎవరైనా స్పందిస్తే.. 'విద్యాంజలి' పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కావాలి. వసతులు కల్పించడమే కాదు.. వివిధ రంగాల్లో స్థిర పడిన వారు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవచ్చు. దాతలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొనే అవకాశం ఉంటుంది.

అందరూ భాగస్వాములే..

పూర్వ విద్యార్థులు, దాతలు, ప్రవాసాంధ్రులను పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్నదే లక్ష్యం. ఫలితంగా మరిన్ని వసతులు సమకూరుతాయి. - ఎస్.అశోక్ బాబు, సమగ్ర శిక్షా ఏఎంవో

– విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

ముక్త్యాల ఎత్తిపోతలకు నిధుల కానుక

ఈనాడు, అమరావతి



నిర్మాణ దశలోని పథకం

మెట్ట ప్రాంత సాగు కష్టాలు తీర్చేందుకు వేగంగా నిర్మితం అవుతున్న ముక్త్యాల ఎత్తిపోతలకు తాజా బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. భూసేకరణ, పైపులైన్ల ఏర్పాటు తదితర పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించింది. దీంతో ప్రాజెక్టు వేగంగా అందుబాటులోకి రానుంది.

ఆగస్టుకు దరిచేరనున్న ప్రాజెక్టు

రూ.50 కోట్లు పక్కా...

★ తాజాగా కృష్ణా డెల్టాకు రూ.200 కోట్లు కేటాయించగా సింహభాగం నిధులు ముక్త్యాల ఎత్తిపోతలకు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. ఇతర ప్రాజెక్టులు కూడా ఉండడంతో రూ.50 కోట్లు తప్పక రావచ్చని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ★ 21 కిమీ మేర పైపులైన్ వేయాలి. అందుబాటులోని భూమిలో 11 కిమీ మేర పైపులైన్ వేశారు. ఇంకా 50 ఎకరాల భూసేకరణకు రూ.20 కోట్లు అవసరం. తాజా కేటాయింపులతో భూసేకరణ పూర్తిచేయనున్నారు. మిగిలిన మొత్తంతో హెడ్‌వర్క్స్, పైపులైన్లు ఏర్పాటుచేస్తారు. ఆగస్టు నాటికి ప్రాజెక్టు సమకూరుస్తామని అధికారులు చెబుతున్నారు.

30%

రూ.312 కోట్ల అంచనా వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట పరిధిలో 38,000 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం. ఇప్పటికే 30 శాతం పనులయ్యాయి.

అన్నదాతలకు ఊరట...

ఉమ్మడి ఖమ్మం జిల్లా చెరువు మాధవరం నుంచి ఏటా వెయ్యి క్యూసెక్కుల నీరు డీవీఆర్ కెనాల్ ద్వారా రావాలి. ఈ నీటితో నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలకు నీరందాలి. రాష్ట్ర విభజన తర్వాత 500 క్యూసెక్కులూ రాక వారి వేదన వర్ణనాతీతం. ఈ పథకం పూర్తి చేసి వేదాద్రి, ఇతర ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తెస్తే నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలకు నీటి సమస్య ఉండదు.

దండిగా జీతాలు.. దండగ ఖర్చులు..

న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు, నందిగామ

పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ ఆలయ హోదాను 2023లో ఆర్‌జేసీ అధికారి నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయికి తగ్గించి మూడేళ్లు అయింది. ఖర్చులు తగ్గిపోతాయని దేవాదాయశాఖ అధికారులు ఈ మేరకు నిర్ణయించారు. ఇప్పటికీ ఆర్జేసీ స్థాయిలో క్యాడర్ స్ట్రెంత్ ఉద్యోగులు కొనసాగుతున్నారు. ఆ మేరకు అమ్మవారి ఆదాయం అదనంగా ఖర్చు అవుతోంది. ప్రస్తుతం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఇన్‌ఛార్జి డీసీగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆవిరైపోతున్న తిరుపతమ్మ ఆదాయం

★ ఇంజినీరింగ్ విభాగంలో అవసరానికి మించి అధికారులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆలయం వద్ద ప్రస్తుతం ఎటువంటి నిర్మాణ పనులు జరగట్లేదు. డీసీ స్థాయి ఆలయంలో డీఈ ఉంటే సరిపోతుంది. కానీ ఈఈ స్థాయి అధికారి పని చేస్తున్నారు. పలు విభాగాలు, ఆలయంలో ఆర్జేసీ క్యాడర్‌లో ఉద్యోగులు అవసరానికి మించి విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల జీతాలకు ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది.

రాబడి పెంపుపై దృష్టి..

ఆలయం స్థాయికి తగ్గట్లుగా ఉద్యోగులు ఉండేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అదనంగా ఉన్న సిబ్బందిని తగ్గిస్తాం. ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటాం. - మహేశ్వరరెడ్డి, ఈవో

అమ్మవారికి ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు దృష్టి సారించట్లేదు.

ఉచిత దర్శనాలతో..

2022-23లో ఆదాయం రూ.14.74 కోట్లు ఉంది. 23-24లో రూ.15.62 కోట్లు వచ్చింది. ఈ ఏడాది జనవరి వరకు రూ.11.43 కోట్లు సమకూరింది. ఇక ఖర్చు ఏడాదికి సుమారుగా రూ.16కోట్ల వరకు అవుతోంది. వైకాపా ప్రభుత్వంలో అనాలోచితంగా మునేరు అవతల కల్యాణ మండపం తదితర నిర్మాణాలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.14 కోట్లు తీసి ఖర్చు చేశారు. వీటిపై ఏడాదికి వడ్డీ రూపంలో వచ్చే రూ.కోటి ఆదాయం తగ్గింది. సిఫార్సు దర్శనాలతో టిక్కెట్ల ఆదాయం తగ్గుతోంది. పలు వ్యాపారాలకు నిర్వహించే పాటల సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. పాట ఖరారైన 72గంటల్లో డబ్బులు చెల్లించట్లేదు. ఏడాది చివరిలో చెల్లిస్తూ అమ్మవారి ఆదాయానికి గండికొడుతున్నారు.

శిలాఫలకంపై.. కనిపించని బందరు ఎంపీ పేరు

✪ వివాదాస్పదంగా.. కృష్ణా జిల్లా ఎస్పీ తీరు ✪ లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు..

✪ ఆగమేఘాలపై సాయంత్రానికి శిలాఫలకం తొలగింపు

ఈనాడు, అమరావతి: కృష్ణా జిల్లా బాపులపాడు మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని హనుమాన్‌జంక్షన్‌లో శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎంపీ వల్లభనేని బాలశౌరికి కనీసం సమాచారం ఇవ్వకపోగా.. ఆయన పేరు కూడా శిలాఫలకంపై రాయకుండా.. ప్రారంభోత్సవం చేసేశారు. కేవలం ఎమ్మెల్యే, ఎస్పీ, ఇతర పోలీసు అధికారుల పేర్లను మాత్రమే శిలాఫలకంపై ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం కచ్చితంగా స్థానిక ఎంపీ పేరు శిలాఫలకంపై ఉండాలి. ఆయనకు సమాచారమిచ్చి.. కార్యక్రమానికి ఆహ్వానించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంపై జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కావాలనే ఎంపీ పేరును శిలాఫలకంపై వేయలేదని మండిపడ్డారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తీరు వివాదాస్పదంగా ఉందని నేతలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఎంపీ బాలశౌరి పేరు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం



శుక్రవారం రాత్రి తొలగించారిలా..

కలెక్టర్ బాలాజీకి తాఖీదు.. లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీకి ఈ వ్యవహారంపై ఎంపీ వర్గీయులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జిల్లాలో ప్రొటోకాల్ సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన కలెక్టర్ బాలాజీకి సైతం దీనిపై తాఖీదు వచ్చినట్లు సమాచారం. దీంతో ఆగమేఘాలపై శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి తొలగించారు. ఈ ఘటనపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను ప్రివిలేజ్ కమిటీ పిలిచి వివరణ కోరే వీలుంది.

వేదికపైనే నిలదీసిన చలమలశెట్టి.. జనసేన గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్ ఈ కార్యక్రమం జరుగుతున్న వేదికపైనే ఎంపీ పేరు ఎందుకు లేదని.. పోలీసులను నిలదీశారు. ప్రొటోకాల్ పాటించకపోవడం సరికాదని స్పష్టం చేసి.. వేదిక దిగి వెళ్లిపోయారు. అనంతరం సమావేశం నిర్వహించి.. ఈ చర్యను ఎండగట్టారు. ఇలాంటి చర్యలు మానుకోవాలంటూ సూచించారు.

ఆ సంతకం.. అసలైనదేనా?

మునిరాజా అప్పు ఇచ్చినట్లుగా ఉన్న ప్రామిసరీ నోటుపై దృష్టి

ఈనాడు - అమరావతి:

అసెంబ్లీ కార్యాలయం సహాయ సెక్షన్ అధికారి (ఏఎస్‌వో) మునిరాజా కేసులో పోలీసులు వేగాన్ని పెంచారు. తన ఇంటిని దక్కించుకునేందుకు సహోద్యోగులతో కలసి కుట్రపన్నాడనీ, తన సంతకాన్ని సైతం ఫోర్జరీ చేశాడని బాధితురాలు పోలీసులకు అందజేసిన ప్రామిసరీ నోటుపై దృష్టి సారించారు. ఇందులో సాక్షులుగా రవిపాల్, హరిబాబు, జుబేదా సంతకాలు చేసినట్లు ఉంది. బాధితురాలు చెబుతున్నట్లు అది నకిలీదా? అనే కోణంలో లోతుగా విచారణ చేస్తున్నారు. అందులో మునిరాజా రెండు రూపాయల వడ్డీకి రూ.52 లక్షలు ఇచ్చినట్లు రాసి ఉంది. సంతకం అసలైనదా? కాదా? అని నిర్ధారించుకునేందుకు ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపనున్నట్లు తెలిసింది. దీనిపైనా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిందితుడి నెల జీతం రూ.60-70 వేలు ఉంటుంది. అయినా ఇంత పెద్దమొత్తంలో అప్పుగా ఇవ్వడంపై నిజానిజాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రామిసరీ నోటును అడ్డం పెట్టుకుని నిందితుడు కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నట్లు బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తాన్ని మునిరాజా నగదు రూపంలో ఎలా ఇచ్చాడనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. నిందితుడు ప్రభుత్వ ఉద్యోగి కూడా అయినందున ఈ కేసులో ఏసీబీ జోక్యం చేసుకుంటే మరిన్ని వివరాలు బయటకు వచ్చే వీలుంది.

☛ నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నిందితుడు మునిరాజా అస్వస్థతకు గురయ్యాడు. గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో జైలులో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జైలు అధికారులు భద్రత నడుమ తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు.

తెలుగు గొప్పతనాన్ని చాటిచెప్పేలా.. ఆంధ్రగీతి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు జాతికి నీరాజనాలు పలికేలా 'ఆంధ్ర గీతి' గ్రంథం ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు అన్నారు. శుక్రవారం విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో వంద 'గాథలు', స్వీయ అంగ్లానువాదం, వడ్డి చిత్రాలతో కవిత (గాథాళి) ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం, మండలి వెంకట కృష్ణారావు శత జయంతి మహోత్సవం సందర్భంగా జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు, శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ తదితరులు డాక్టర్ జి.వి.పూర్ణచంద్ రచించిన 'ఆంధ్రగీతి' తెలుగు భాషా గ్రంథ కావ్యం గ్రంథావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ.. ఇంద్రధనస్సు చూసి ఎవరి అనుభూతిని వారు అనందం పొందుతారని, ఆంధ్రగీతి చదువుతున్నప్పుడు కూడా అలాంటి అనుభూతినే పొందుతారని అన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పేలా పూర్ణచందు గ్రంథం ఉందని ప్రశంసించారు. తప్పకుండా భావితరాలు చదవవలసిన పుస్తకం అని సూచించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కవులు, రచయితలు తెలుగు భాష గొప్పతనాన్ని చాటేలా సాహిత్యాన్ని సృష్టించాలని అన్నారు. ఆంధ్రగీతి గ్రంథాన్ని తన తండ్రి వెంకట కృష్ణారావుకు అంకితం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. రచయిత పూర్ణచందు మాట్లాడుతూ.. మెత్తని మాట తీరు, సేవా మూర్తి, ప్రజల మధ్య నిలిచిన దీన బాంధవుడు మండలి వెంకట కృష్ణారావు అని అన్నారు. గ్రంథాన్ని ఆయనకు అంకితం ఇవ్వడం ఆనందంగా ఉందని వెల్లడించారు. సభకు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కవి, విశ్లేషకుడు మూసునూరి వెంకటేశ్వర్లు, సాహితీ విశ్లేషకుడు గుమ్మా సాంబశివరావు, మిసి కవిత ఉద్యమ సారథి రావి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన వినండి.. అన్నదాతను ఆదుకోండి



ఏవో శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రామకోటేశ్వరరావు, బాధిత రైతులు

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లాలో 3,500.. రాష్ట్ర వ్యాప్తంగా 25,000 ఎకరాల ఇనాం భూములున్నాయి. సుమారు 5 లక్షల మంది బాధితులున్నారు. ఆ భూములు 22-ఏ నిషిద్ధ జాబితాలో ఉన్నాయి. పలు తంగా వాటిని విక్రయించి పిల్లల చదువులు, ఆరోగ్య ఖర్చులు, వివాహాలకు వాడుకునే వీలు లేదు. బ్యాంకు రుణాలూ ఇవ్వరు. ఫలితంగా యజమానులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. నిషిద్ధ జాబితా నుంచి తొలగించాలని కోరుతున్నారు. శుక్రవారం ఉమ్మడి కృష్ణా జిల్లా బాధితులు ఏపీ ఇనాం భూ బాధితుల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాటకొండ రామకోటేశ్వరరావు నేతృత్వంలో విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. బాధిత రైతులు సీహెచ్.వి.నరసింహారావు, గద్దె సుధీర్, అచ్యుత రామారావు, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, బాగం సాయి ప్రసాద్, కొంగర సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది రోజు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు



మాట్లాడుతున్న ఛైర్మన్ శ్రీనివాసులు, పక్కన ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఉగాది పర్వదినాన చిన్నారులకు దేవాలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించేందుకు నిర్ణయించినట్లు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు(హెచ్‌డీపీటీ) ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహా మండపంలో శుక్రవారం నిర్వహించిన దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులు, అర్చకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల హెచ్‌డీపీటీ కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉగాది రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామన్నారు. దీప, ధూప నైవేద్యాలు నోచుకోని ఆలయాలను గుర్తించి ప్రతిరోజూ దీపం వెలిగించే కార్యక్రమాన్ని కూడా రూపొందించామన్నారు. గోవులు, కృష్ణా పుష్కరాల దృష్ట్యా పెట్టుకుని నదీతీరంలో దేవతావృక్షాలను నాటే కార్యక్రమం కూడా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ.. హెచ్‌డీపీటీ చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలకు తమ దేవస్థానం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. దేవస్థానం తరఫున ప్రచార రథాన్ని కూడా పంపేందుకు సిద్ధమని తెలిపారు. రాష్ట్ర పాంతీయమిదేశ్ వెంగమాంబ గోపాలకృష్ణ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ చేపట్టే కార్యక్రమాలను సమీక్షించి ప్రకటించారు. కార్యక్రమంలో దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద్ శర్మ, హెచ్‌డీపీటీ కోఆర్డినేటర్ కొండలరావు పాల్గొన్నారు.

సాగర్ జలాల విడుదలకు వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్: 'నాగార్జున సాగర్ ఎడమ కాలువ రెండు, మూడు జోన్లలో వేసిన ఆరుతడి పంటలు ఎండి పోతున్నాయి. తెలంగాణ నుంచి తక్షణమే సాగర్ జలాలు విడుదల చేయించి పంటలు సంరక్షించండి. రైతులను ఆదుకోండి' అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ఎన్.ఎస్.పి. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, వైస్‌ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు కోరారు. నగరంలోని వివిధ కార్యాలయంలో శుక్రవారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆళ్ల మాట్లాడుతూ.. మూడో జోన్‌కు 14 టీఎంసీల నీటి కోటా ఉండగా, ఇప్పటి వరకు 3 టీఎంసీలను మంజూరు చేశారన్నారు. తీవ్ర నీటి ఎద్దడి దృష్ట్యా అంచనాల ప్రకారం సగటున 101 కిలోమీటరుకు 15 రోజులు నిరంతరంగా 1800 క్యూసెక్కుల జలాలు విడుదల చేయించాలని కోరారు. రెండో జోన్‌లోని మధిర, బోనకల్, వైరా, డోర్నకల్ ప్రాంత కాల్వలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయించి, వరి పంటను రక్షించాలని అన్నారు. దీనిపై మంత్రి స్పందించి సాగర్ జలాల విడుదలకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆళ్ల తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన డీసీ ఛైర్మన్లు గంద్రప్రసాద్, కఠారి కోటేశ్వరరావు, సీహెచ్.సుభాష్, ఇ.గోపాలరావు, ఆర్.చంద్రశేఖర్, ఇ.శోభన్ బాబు, కానూరు హనుమంతరావు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం రిటైల్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

భోజనశాల నిర్మాణానికి రూ.10 లక్షల వితరణ



భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు అందించిన విరాళంతో భోజనశాల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ ఏడాది జనవరి 11న పాఠశాలలో 65 ఏళ్లుగా విద్యాబోధన చేసిన పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో శాశ్వత వసతి కల్పించాలన్న ఉద్దేశంతో భోజనశాల నిర్మాణం చేయాలని తీర్మానించారు. ఆ మేరకు రూ.10 లక్షలు వితరణగా అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఊటుకూరు రామారావు(నాని), సర్పంచి సంగెపు లలిత, విద్యా కమిటీ ఛైర్మన్ ఆదూరి ఆంజనేయులు, హెచ్‌ఎం ఎం.దుర్గాప్రసాద్, పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఉత్సాహంగా జాతీయ స్థాయి టెక్నో ఫెస్టివల్



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఐబీటీఎం మాజీ డైరెక్టర్ దేశ్‌ముఖ్, ఉప కులపతి వెంకటేశ్వరరావు తదితరులు



మెకానికల్ విభాగం విద్యార్థుల రోబో వారియర్స్ ప్రదర్శన

కానూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐబీటీఎం మాజీ డైరెక్టర్ జి.దేశ్‌ముఖ్ సూచించారు. శుక్రవారం సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన సిద్ధార్థ-2026 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పృత్వి విద్యార్థులలో ప్రతిభ కనబరిచేలా కృషి చేయాల రంగా టెక్నికల్ విభాగాలలో పట్ట పదార్థాలతో సృజనాత్మకత నిర్మాణం, విద్యార్థులు సిల్వర్ బాంబ్ అనే పోటీ, గది నుంచి విముక్తి సవాల్, సాంకేతిక యాత్ర, విద్యుత్తు పోస్టర్ ప్రదర్శన, ప్రోగ్రామింగ్ పోటీ, యాంత్రిక విభాగాల ప్రదర్శన పోటీలో జాతీయస్థాయిలో వివిధ కళాశాలల నుంచి 2,500 పైగా విద్యార్థులు మొదటి రోజు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణం మొత్తం విద్యార్థులతో కళకళలాడింది. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ఏపీ రత్నప్రసాద్, బావినేని పాండురంగారావు, సివిల్ విభాగాధిపతి డి.మల్లికార్జున, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. డైనమిక్ వాల్వ్స్ లిమిటెడ్ ఏరోస్పేస్ డైరెక్టర్ పీవీఎస్ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు నేర్చుకునే తత్వం, ధైర్యం, విస్తృత దృక్పథం వంటివి అలవర్చుకోవాలన్నారు. గ్లోబల్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ డైరెక్టర్ పిపురాల్ల మాట్లాడుతూ.. నూతన ప్రయోగాలు చేసేందుకు పరిశోధనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా...


4 నుంచి తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు



వేడుకల గోడపత్రులు ఆవిష్కరిస్తున్న ఈవో మహేశ్వరరెడ్డి, అర్చకులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్లు మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. పెనుగంచిప్రోలులో ఆలయం వద్ద తిరునాళ్ల గోడపత్రులను ఈవో, అర్చకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈవో మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేవాలయంలో బుధవారం ఉదయం 6.19 గంటలకు అఖండ జ్యోతిప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 5న రాత్రి 7.02 గంటలకు అమ్మవారి రథోత్సవం, 6న రాత్రి 10.02 గంటలకు 90 అడుగుల ఇనుప దివ్య ప్రభోత్సవం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారన్నారు. 7న అనిగండ్లపాడు అమ్మవారి వంశీకులు కొల్లా వారి ఇంటి నుంచి పసుపు-కుంకుమల బండ్లు బయలుదేరి పెనుగంచిప్రోలులోని ఆలయానికి వస్తాయన్నారు. అమ్మవారి పుట్టింటి వారు పసుపు, కుంకుమ సమర్పిస్తారని పేర్కొన్నారు. 8న ఉదయం నుంచి భక్తులు బోనాలు సమర్పిస్తారన్నారు. ఉత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపీబాబు, అర్చకుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన ఎండీ బాధ్యతల స్వీకరణ



సంతకాలు చేస్తున్న బాల సుబ్రహ్మణ్యం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఆర్టీసీ హౌస్‌లో శుక్రవారం ఆర్టీసీ నూతన ఎండీగా ఎన్. బాల సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు బస్సులను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రయాణికుల భద్రతే ముఖ్యమని.. వారికి అసౌకర్యం కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ.అప్పలరాజు, జి.వి.రవివర్మ, ఆర్టీసీ అధికారులు, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఫీజు తిరిగి చెల్లించాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థి చెల్లించిన ఫీజును తిరిగి ఇవ్వాలని శాశ్వత లోక్‌అదాలత్ శుక్రవారం తీర్పు చెప్పింది. లోక్ అదాలత్ కార్యాలయం వెల్లడించిన వివరాల మేరకు.. నగరంలోని ఈడేపల్లికి చెందిన వై.సీతారామయ్య తన కుమారుడు అగస్త్యను ఇంటర్మీడియట్ కోర్సు నిమిత్తం విజయవాడ లబ్బీపేటలోని ఫిట్‌జి విద్యా సంస్థలో చేర్పించారు. కోర్సుతో పాటు ఇతర వసతులకు సంబంధించి మొత్తం రూ.89,500 చెల్లించారు. ఒకే గదిలో ఆరుగురు విద్యార్థులను ఉంచడం, భోజనం, అల్పాహారం లాంటి వసతులు సరిగ్గాలేవని చేర్చిన రెండు రోజులకే కళాశాలకు వెళ్లి తమ కుమారుడిని తీసుకెళ్లిపోతానని, రెండు రోజులకు అయిన ఖర్చులు మినహాయించుకుని తిరిగివ్వాలని అడగ్గా విద్యా సంస్థ ప్రతినిధులు స్పందించలేదు. దీంతో న్యాయవాది ద్వారా నోటీసు పంపించారు. అయినా ఫీజు వాపసు ఇవ్వకపోవడంతో శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం ఫీజు రూ.89,500ను వడ్డీతో సహా చెల్లించాలని, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.2వేలు కలిపి ఫిర్యాదికి ఇవ్వాలని ఆదేశిస్తూ శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ ఓ.వెంకటనాగేశ్వరరావు, సభ్యులు ఎస్.నరసింహారావులు తీర్పు చెప్పారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వైద్య శిబిరం నిర్వహణ


మహిళలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వెస్ట్ మాధవరంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'వైద్యానికి దూరం.. వెస్ట్ మాధవరం' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. మరలా ఇలాంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌ను తీవ్రంగా హెచ్చరించారు.

ఆటోక్యాడ్‌పై శిక్షణ తరగతులు


విద్యార్థినికి ధ్రువపత్రం అందిస్తున్న సమన్వయకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యంలో ఆటోక్యాడ్‌పై శిక్షణ తరగతులను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య, విభాగాధిపతి వెంకట రమణ, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? వేమిరెడ్డిపల్లిలో ప్రధాన రహదారి వెంట విద్యుత్తు నియంత్రిక ఎత్తు తక్కువలో ఉంది. - గ్రామస్థులు

✔ రోడ్డు వేయడం వల్ల నియంత్రిక ఎత్తు తగ్గింది. కొత్తగా విద్యుత్తు స్తంభాలు వేస్తున్నాం. త్వరలో వాటిపైకి మారుస్తాం. - ఎస్. విజయ్ భాస్కర్, ఏఈ, విస్సన్నపేట - న్యూస్‌టుడే, విస్సన్నపేట

స్పందన: తిరువూరు 12వ వార్డులోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుందని స్థానికుడు అరవిందరావు సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

★ తిరువూరు 8వ వార్డులోని డ్రెయిన్‌లో మురుగు పారుదల లేదని స్థానికుడు మాధవరావు సమస్యను 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

పొదలు తొలగించారు

జి.కొండూరు: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మునగపాడు వెళ్లే బైపాస్ రహదారికి ఇరు వైపులా ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. 'ముళ్ల పొదలు తొలగించరూ..' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందితో ముళ్ల పొదలను తొలగించారు.

బూత్‌ల పటిష్టతతో పార్టీ బలోపేతం

మైలవరం: బూత్‌ల పరిధిలో కమిటీలను నియమించుకోవడం ద్వారా పటిష్ఠమవుతాయని, దీంతో పార్టీ బలోపేతం ఉంటుందని ఏఎంసీ మాజీ ఛైర్మన్ నక్కల ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల పరిధి చిలుకూరువారిగూడెంలో ఆయన నివాసంలో బూత్‌ల బలోపేత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

మారుతున్న పల్లె రూపురేఖలు

మైలవరం, న్యూస్‌టుడే

మరోసారి పల్లెకు పండగొచ్చింది. సిమెంటు రోడ్లతో అంతర్గత రహదారులకు నూతన కళ తెచ్చింది. వైకాపా హయాంలో అంతగా ప్రాధాన్యం దక్కని సీసీ రోడ్ల ఏర్పాటుకు విడతల వారీగా కూటమి ప్రభుత్వంలో పనులు సాగుతున్నాయి. సీసీ రహదారులతో గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్ద పీట వేసినట్లైనని భావిస్తుండగా, అనుబంధంగా పక్కా మురుగు కాలువల నిర్మాణం సాగితే రోడ్ల నాణ్యత పెరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.


మైలవరం దేవుని చెరువులో సీసీ రోడ్డు వేస్తున్న కూలీలు

ఎమ్మెల్యే సూచనలతో..

మైలవరం నియోజకవర్గంలో గతేడాది పల్లె పండగ-1.0లో పెద్ద ఎత్తున సీసీ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో జోరుగా సాగుతున్న పనులతో గ్రామాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. మొదటి విడతలో కేటాయించిన నిధులతో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో ఒక్కో మండలానికి సుమారు రూ.5 కోట్ల వరకు పనులు విభజించారు. దాంతో ఇబ్బందికరంగా ఉన్న రహదారులకు తొలి విడతలోనే మోక్షం కలిగింది. ఇప్పటికే గ్రామాల్లో ప్రధాన అంతర్గత మార్గాలు సీసీ రహదారులుగా మారగా, ఇరుకు రోడ్లకూ రెండో విడతలో విముక్తి కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగానే 20 లో ఒక్కో మండలానికి సుమారు రూ.1.50 కోట్ల వరకు నిధులు ఇచ్చి

రూ.11.52 కోట్ల అంచనాలతో రెండో విడత పల్లె పండగ

మైలవరం నియోజకవర్గంలో ఇలా.. (వివరాలు)

మొదటి విడత అంచనా	రూ.31.27 కోట్లు
మొదలు పెట్టిన పనులు	227
పూర్తి అయినవి	214
నిర్మాణ విస్తీర్ణం	46.16 కి.మీ
రెండో విడత అంచనా	రూ.11.52 కోట్లు
పనుల సంఖ్య	55
నిర్మాణ విస్తీర్ణం	10.75 కి.మీ

చెల్లింపుల్లో కొంత జాప్యంతో, రెండో విడత నిదానంగా మొదలైనా ప్రస్తుతం ఆయా పనులు ఊపందుకున్నాయి.

పనుల పూర్తికి చర్యలు

మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. అందుకు సంబంధించి దాదాపు 90 శాతానికి పైగా బిల్లులకు చెల్లింపులు చేశాం. రెండో విడత పనులు జనవరి నెలలోనే మొదలయ్యాయి. మార్చి చివరి నాటికి పనులన్నింటినీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశాం. - వెంకన్న, పంచాయతీరాజ్ డీఈ, మైలవరం

సిమెంటు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం


కార్యక్రమంలో లోకేశ్వరరావు, ప్రసాద్ తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలోని ఎస్టీ కాలనీలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సౌజన్యంతో చేపట్టిన రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూటమి నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ లోకేశ్వరరావు, ముసునూరు ప్రసాద్, సంగాయి నాగలక్ష్మి, వెంపటి మేనక, మేకపాం స్టాలిన్, ప్రభాకర్, సుదర్, ముని, షేక్ షాజిద్, రంగా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

మైలవరం, న్యూస్‌టుడే: నెలవారీ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని చంద్రాల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఈ నెల 21న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామ్మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు మేలు


మైలవరం: లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేస్తున్న ఆర్థిక సాయం పేదలకెంతో మేలు కలుగుతుందని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైలవరం నియోజకవర్గ పరిధిలో రూ.13.65 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని కంగరా లక్ష్మీపురం గ్రామంలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని వెంకటేశ్వరరావు, నాయకులు గరిమెళ్ల బాష్, రవి, పాగుట్ల రమేష్, బాజాపేట రాంబాబు, తుమ్మలపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.


కంగరా లక్ష్మీపురం: రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో...

సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాల ఏర్పాటుకు చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో కూటమి ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఆగ్రోస్ సంస్థ చైర్మన్ ఆకారపు దేవదత్ తెలిపారు. తిరువూరు మండలం కాకర్ల గ్రామంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న సేంద్రియ పద్ధతులు, ఉపయోగిస్తున్న పరికరాలు, పంటల నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరువూరులో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం ప్రత్యేక విక్రయశాల ఏర్పాటుకు మున్సిపల్ అధికారులతో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. సుంకర కృష్ణమోహన్, సగ్గుర్తి సుభాష్ చంద్రబోస్, నెక్కలపు మధుబాబు, తాళ్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.


పంట పరిశీలిస్తున్న దేవదత్, కూటమి నాయకులు

జిల్లా స్థాయి సేంద్రియ మేళాకు సర్వం సిద్ధం

ఎ.కొండూరు: మండల పరిధి కృష్ణారావుపాలెం గ్రామంలోని నాని స్పిరిచువల్ స్ప్రింగ్ విద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సేంద్రియ మేళాను విజయవంతం చేయాలని తిరువూరు ఆర్డీవో కె.మాధురి, మండల తహసీల్దార్ అరవింద్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు కోరారు. అనంతరం ఆయా ఏర్పాట్లను వారు శుక్రవారం పరిశీలించారు. అక్కడున్న సిబ్బందికిసూచనలు చేశారు.


ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆర్డీవో మాధురి, ఇతర అధికారులు

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


మహిళా పోలీసులు సత్కరిస్తున్న స్థానిక అధికారులు, సిబ్బంది

గంపలగూడెం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగం కుటుంబ ఆర్థిక, ఆరోగ్య స్థితులను కాపాడడంలో మానవత్వాన్ని కోల్పోతారని సీఐ కె.గిరిబాబు, ఎస్సై జి.అనిల్ స్పష్టం చేశారు. మండలంలో మూడు రోజులుగా జరుగుతున్న 'డ్రగ్స్‌పై దండయాత్ర' శుక్రవారం ముగిసింది. చివరి రోజు రాజవరంలో సీఐ, ఎస్సై పర్యవేక్షణలో మహిళా పోలీసుల సైకిల్ యాత్ర జరిగింది. గ్రామస్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సైకిల్ యాత్రలో పాల్గొన్న మహిళా ఎస్సై జడల రేవతి, హెడ్ కానిస్టేబుల్ జి.హైమావతి, కానిస్టేబుళ్లు సీహెచ్.త్రివేణి, వి.ఉషారాణి, ఎస్కేజేబీ తెలుగు స్థానిక పోలీసులు సత్కరించారు. డ్రగ్స్ వ్యతిరేకంగా సైకిల్ యాత్ర చేస్తున్నందుకు అభినందించారు.

డేవిడ్ రాజు మృతి పార్టీకి తీరని లోటు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : తెదేపా నాయకుడు బల్లి డేవిడ్ రాజు మృతి పార్టీకి తీరని లోటు అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పాత నాగులూరు గ్రామానికి చెందిన డేవిడ్ రాజు ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే ఆయన నివాసానికి శుక్రవారం వచ్చి డేవిడ్ రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కె.విజయబాబు, జె.వేణుగోపాల్ రెడ్డి, ఎం.నాగేశ్వరరెడ్డి, పి.మోహన మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : ఏళ్లుగా నివాసం ఉంటున్నా ఎటువంటి మౌలిక వసతులు లేవని నెహ్రూనగర్ వాసులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ వద్ద వాపోయారు. ఈ మేరకు శుక్రవారం అక్కడి వారంతా గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన్ను కలిశారు. తామంతా 1974 నుంచి కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద ఉన్న ప్రాంతంలో ఉంటున్నామని తెలిపారు. దానికి నెహ్రూనగర్‌గా నామకరణం చేసుకున్నామన్నారు. సీసీ రహదారులు, ఇళ్ల పట్టాలు లేవని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకోవాలని కోరారు.

పాఠశాల పునరుద్ధరిస్తే మేలు

తిరువూరులోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలను కొన్నేళ్ల కిందట మూసేయడంతో స్థానిక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దూర ప్రాంతంలోని బడికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దీన్ని పునరుద్ధరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు



మురుగు.. రాకపోకలకు పాట్లు

మండల పరిధిలోని రేపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కన డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పలువురు విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎ.కొండూరు



జీవాల దాహం.. తీర్చాల్సిన సమయం



కొండపల్లి దామెర్ల వారి వీధి ప్రారంభంలో ఈ చిత్రం గురువారం కన్పించింది. ఒక ఆవు దూడలతో కలసి మంచినీటి కుళాయి వాల్వ్ వద్ద తన దాహాన్ని తీర్చుకుంటోంది. ఈ విధంగా మూగ జీవాలు దాహం తీర్చుకొనే సంఘటనలు పురపాలిక పరిధిలో అనేక దర్శనమిస్తుంటాయి. అధికారులు స్పందించి పురపాలిక ఆధ్వర్యంలో నీటి తొట్లను ఏర్పాటు చేసి జీవాల దాహం తీర్చాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, కొండపల్లి

ఆధార్ సేవలు.. జనాలకు కష్టాలు

ఆధార్ ఆధునీకరణకు ప్రజలు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. కొండపల్లి పురపాలిక ఇబ్రహీంపట్నం ఏ.కాలనీ తపాలా కేంద్రంలోనే అధికారిక ఆధార్ అప్‌డేట్ సేవలు ప్రజలకు కొంతకాలంగా అందుతున్నాయి. అయితే అక్కడ సర్వర్ మొరాయించడంతో రోజుల తరబడి ప్రజలు తిరగాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తపాలా కార్యాలయంలోనే కాకుండా ఇతర చోట్ల ఆధార్ అప్‌డేట్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి



ప్రమాదకరంగా నియంత్రిక

చెరువు మాధవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. గ్రామంలో కేజీపై రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో రోడ్డు పక్కన నియంత్రిక ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దాన్ని మార్చితే మేలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



తెలుగు భాష ఔన్నత్యంపై క్విజ్ పోటీలు


పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : అంతర్జాతీయ మాతృభాషా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోత్సవం నిర్వహించినట్లు హెచ్ఎం ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు మందపాటి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు భాష ఔన్నత్యంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన బాలబాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

మైలవరం: పాఠశాల దశ నుంచే విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈవో ఎల్.బాలు సూచించారు. మండలంలోని కొత్తచంద్రగూడెం జడ్పీ హైస్కూల్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. ప్రధానోపాధ్యాయురాలు జి.శివపార్వతి, ఉపాధ్యాయులు గాంధీ, సుమిత్రాదేవి, రవికుమార్, సూర్య, రాజ్యలక్ష్మి, రమాదేవి, రామకృష్ణ, హర్షనందిని పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలు

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

కొండపల్లి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం స్థానిక జామియా, షాబుఖారీ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం దీక్ష అనంతరం దీక్షాపరులకు ముస్లిం పెద్దలు గంజి పంపిణీ చేశారు. దీక్షాదారులకు హలీమ్ వంటి బలమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచామని కూటమి నాయకుడు అఫ్సర్ తెలిపారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లింలు శుక్రవారం సాయంత్రం గంపలగూడెం మసీదులో సామూహికంగా ఇఫ్తార్ విందును స్వీకరించారు. మసీదులో మత గురువు ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, ఖురాన్ సందేశం అందించారు.


గంపలగూడెం మసీదులో విందు ఆరగిస్తున్న ముస్లింలు

పుట్టలమ్మ- మారెమ్మ విగ్రహాల ఊరేగింపు


ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే : స్థానిక పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో పుట్టలమ్మ, మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు.

ముత్యాలమ్మ గుడిలో శుభదుర్గ, కామాక్షి వ్రతాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని గ్రామ దేవత ముత్యాలమ్మ గుడిలో శుక్రవారం భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక శుభదుర్గ, కామాక్షి వ్రతాలు, రామాయణ పఠనం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చన, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

'డిమాండ్లు పరిష్కరించకుంటే సేవలు నిలిపేస్తాం'

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మైలవరం నియోజకవర్గం పరిధిలోని సహకార సంఘాలు చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా శుక్రవారం తక్షణమే తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే సహకార సంఘాల్లో పూర్తిగా సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం ఆర్గనైజర్లు సీహెచ్ కిషోర్, సాంబశివరావు, సతీష్ పాల్గొన్నారు.


జి.కొండూరు : మానవహారంగా ఏర్పడిన ఉద్యోగులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ స్థాయిలో సహకార సంఘాల ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. తిరువూరు కేడీసీసీబీ వద్ద నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. జేఏసీ నాయకులు బొల్లినేని. రఘురామ్, పుణ్యపు మురళీకృష్ణ, గద్దె. ప్రసాద్, రామశేషు, నరసింహారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నిక


శంకర్, కృష్ణయ్యను సత్కరిస్తున్న తిరువూరు సీపీఐ శ్రేణులు

తిరువూరు, న్యూస్‌టుడే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా తిరువూరుకు చెందిన దోనేపూడి శంకర్ ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో దోనేపూడి శంకర్, తూము. కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. నాగుల్‌మీరా, వెంకటేశ్వరావు, త్యాగరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు దీక్షలు

కొండపల్లి, న్యూస్‌టుడే : క్రషర్, సిమెంటు లారీల ద్వారా వ్యాపించే దుమ్ము, ధూళి నుంచి కాపాడాలంటూ కొండపల్లి అరుణానగర్ వాసులు చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. తమ సమస్యకు పరిష్కారం లభించే వరకూ ఈ నిరసన దీక్షలు ఆగవని స్థానికులు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు స్థానికులను కలిసి వారు తెలిపిన వివరాలను తెలుసుకున్నారు.

వృద్ధుడిపై దాడి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : జ్యోతిష్యం చెప్పించుకోవడానికి వచ్చి మిన్నయ్య అనే వృద్ధుడిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదైంది. సూర్యారావుపేట పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లపూడికి చెందిన కొండపల్లి మిన్నయ్య (60) చుట్టుగుంట విశాలాంధ్ర రోడ్డులో దుర్గాదేవి జ్యోతిషాలయం నిర్వహిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 3న ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి వచ్చి తన ఇంటికి వాస్తు సరిగా లేదని, అక్కడికి వచ్చి జాతకం చెప్పాలని కోరారు. దానికి మిన్నయ్య నిరాకరించడంతో మరో ఇద్దరిని తీసుకువచ్చారు. ముగ్గురూ కలిసి అతనిపై దాడి చేశారు. కిన్నెర శంకర్ తమను పంపాడని, అతని విషయంలో అతిగా జోక్యం చేసుకుంటే చంపుతామని బెదిరించారు. బాధితుడు భయపడి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. ఇంతలో ముగ్గురూ అక్కడ నుంచి పారిపోయాడు. దీనిపై బాధితుడు మిన్నయ్య గురువారం రాత్రి సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కారు నడిపిన యువకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం పాత రేపూడికి చెందిన యువకులు మద్యం మత్తులో కారు నడుపుతూ శుక్రవారం విస్సన్నపేటలో బీభత్సం సృష్టించారు. స్థానిక శ్రీరామ్ థియేటర్ దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్ వరకు రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను ఢీకొడుతూ దూసుకెళ్లారు. ఈ సంఘటనలో పట్టణానికి చెందిన తండ్రి, కుమారుడితో పాటు మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పలువురికి ప్రాణాపాయం తప్పింది. ఈ నేపథ్యంలో కారును అడ్డుకునేందుకు ప్రజలు వెంబడించారు. అతి వేగంతో నూజివీడు రోడ్డులోని విద్యుత్తు స్తంభాలను ఢీకొట్టి కారు నిలిచిపోయింది. విస్సన్నపేట ఎస్సై అర్జున్ రాజు, సిబ్బంది విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మద్యం మత్తులో కారు నడిపిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.


కారును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బహిరంగ ప్రకటన

అజ్ఞాతంలోకి ఎమ్మెల్సీ అనంతబాబు దంపతులు

ఈనాడు, కాకినాడ: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబు మెడకు ఉచ్చు బిగుసుకుంది. ఇప్పటికే ఆయన భార్యను విచారించేందుకు సిట్ నోటీసు జారీచేసిన నేపథ్యంలో అరెస్టు చేస్తారనే భయంతో హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసిన ఆమె... పోలీసులకు కనిపించకుండా పరారీలో ఉన్నారు. మరోవైపు సిట్ అనుబంధ ఛార్జిషీట్ వేయడం, సుప్రీంకోర్టు వేగంగా ట్రయల్స్ చేపట్టాలని ఆదేశించడంతో ఎమ్మెల్సీ అనంతబాబు కూడా శుక్రవారం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గన్‌మెన్‌కు సమాచారం ఇవ్వకుండా ఎక్కడికో వెళ్లిపోయారు. దీంతో వారు ఈ విషయాన్ని అల్లూరి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

నేడు వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటన

వినుకొండ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండలో సీఎం చంద్రబాబు శనివారం పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.40 గంటలకు వినుకొండకు చేరుకుంటారు. పట్టణంలోని ఎన్నెస్పీ మైదానంలో నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. స్వచ్ఛరథం ప్రారంభించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. మధ్యాహ్నం 3.05 గంటలకు తెదేపా కార్యకర్తలతో సమావేశమవుతారు. 4.35 గంటలకు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలిస్తారు. తిరిగి 5.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లిలోని నివాసానికి వెళ్తారు.

పలు జిల్లాలకు వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో శనివారంలోగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శని, ఆదివారాల్లో వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడొచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి.

లాసెట్-26కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పీజీ లాసెట్-26కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లాసెట్ కన్వీనర్, మహిళా వర్సిటీ న్యాయవిభాగం ఆచార్యులు సీతాకుమారి తెలిపారు. 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థులు వచ్చేనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని, అపరాధ రుసుముతో మార్చి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 4న ప్రవేశ పరీక్ష ఉంటుందని, వివరాలకు https://cets.apsche.ap.gov.in/ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆమె సూచించారు.

నాడు నీరుగార్చి.. నేడు నిగ్గుతేల్చి..

- సుబ్రహ్మణ్యం హత్యకేసులో దాచేసిన 'అనంత' నిజాలు



అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ అలియాస్ రోజా

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్యచేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన కేసు విచారణను వైకాపా హయాంలో పోలీసులు ఉద్దేశపూర్వకంగానే నీరుగార్చారు. ప్రధాన నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ (అనంతబాబు), ఆయన భార్య లక్ష్మీదుర్గ అలియాస్ రోజాపై ఉన్న ఆధారాలు బయటపడకుండా చేశారు. హత్యలో ఇతరుల ప్రమేయం, కేసు నిరూపణకు సాంకేతిక సాక్ష్యాలను సేకరించలేదు. తాజాగా సిట్ విచారణలో ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి. అప్పటి సీసీటీవీ ఫుటేజీలను సేకరించి విశ్లేషించారు. రెండో నిందితురాలిగా అనంతబాబు భార్యను చేర్చి కేసు నమోదు చేశారు.

కేసు తారుమారు చేయాలని..

2022 మే 19 రాత్రి పదిగంటల సమయంలో ఎమ్మెల్సీ అనంతబాబు తన దగ్గర డ్రైవర్‌గా పనిచేసి మానేసిన సుబ్రహ్మణ్యాన్ని కారులో తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టి చంపారు. తొలుత రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు చిత్రీకరించాలని పన్నాగం పన్ని మృతుని తల్లిదండ్రులకూ అదే చెప్పారు. సుబ్రహ్మణ్యం ఒంటిపై గాయాలు చూసి ఇది హత్యేనని వారు నిలదీయడం, ఎస్సీ సంఘాల ఆందోళనతో సర్పవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. సాక్షుల విచారణ, శరీరంపై 31 గాయాలు, అంతర్గతంగా మరో మూడు తీవ్ర గాయాలున్నట్లు పంచనామా నివేదిక ఉన్నా.. తానే హత్య చేశానని అనంతబాబు ఒప్పుకొంటే తప్ప కేసు నమోదు చేయలేదు. ఎమ్మెల్సీకి ఇంకొందరు సాయం చేశారని, వారిని అరెస్టు చేయాలని సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు ఫిర్యాదుచేసినా పోలీసులు పట్టించుకోలేదు.

సీసీటీవీ ఫుటేజీలు మాయం

హత్య జరిగిన మూడు రోజులకు గానీ కేసు నమోదు చేయలేదు. అప్పటికే అనంతబాబు నివాసముండే శంకర్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో కొన్ని సీసీటీవీ ఫుటేజీలను మాయం చేశారు.

★ గతంలో వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల నుంచి 60 ఫుటేజీలు సేకరించారు. 18 మాత్రమే.. ఏపీ విజయవాడలోని ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. దృశ్యాలు నాణ్యంగా లేకపోవడం, లీకేజీగా ఉండటంతో పూర్తిస్థాయిలో విశ్లేషించలేమని, కొంత సమాచారమే ఇవ్వగలమని వారు తెలిపారు. ఆధునిక పరికరాలున్న సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా పోలీసులు నాన్చారు.

★ కేసు విచారణ, నిరూపణకు అవసరమైన సెల్ టవర్ డంప్, సీడీఆర్‌లు తీసుకోలేదు. లోపభూయిష్టంగా ఛార్జిషీట్ వేశారు.

వందల గంటల వీడియోలు వడపోస్తే..

కీలకమైన సీసీటీవీ ఫుటేజీలను సిట్ సేకరించింది. హత్యకు ముందు, తర్వాతి రోజుల దృశ్యాలన్నీ వందల గంటలుండగా నిశితంగా పరిశీలించి హైదరాబాద్, చెన్నై సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అనంతబాబు, ఆయన భార్య కలిసి హత్య జరిగిన ప్రదేశం, అనంతరం అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు శాస్త్రీయ నివేదిక ఇచ్చింది.

ఫోరెన్సిక్ అధికారులు ఏం చెప్పారంటే..

★ సుబ్రహ్మణ్యం శరీరంపై చీలికలు, దెబ్బలున్నాయి. రెండు మూడు బలమైన వస్తువులతో దాడి చేశారు.

★ భుజం దగ్గర చేతి గోళ్ల రక్కులున్నాయి.

★ హత్యలో ఇద్దరు ముగ్గురు పాల్గొనే అవకాశం ఉంది.

★ తీవ్రగాయాలు, షాక్, భయం, ఒత్తిడి కలిసి మరణానికి దారితీసి ఉండొచ్చు.

ఆది నుంచి నిర్లక్ష్యమే

సుబ్రహ్మణ్యం హత్యకేసులో అప్పటి పోలీసులు ఆది నుంచి నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, డీఎస్పీ భీమారావు, సీఐ ఉన్నికృష్ణన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అప్పటి ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'ఎమ్మెల్సీ అనంతబాబు గారు క్షణికావేశంలో సుబ్రహ్మణ్యాన్ని నెట్టడం వల్ల అపార్ట్‌మెంట్ డ్రైనేజీలో పడటంతో తలకు ఇనుపగ్రిల్ తగిలి చనిపోయాడు' అని నమ్మబలికే ప్రయత్నం చేశారు. మృతుని శరీరంపై గాయాలు ఎక్కువగా ఉండటంతో కుటుంబసభ్యులు, దళిత సంఘాల ఆందోళనతో హత్యకేసుగా మార్చారు. ఇప్పుడు వాళ్లంతా చిక్కుల్లో పడ్డారు.



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, గ్రామస్థులు

భారతి సిమెంట్ పరిశ్రమ వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు, రైతుల ధర్నా

న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

కమలాపురం, న్యూస్‌టుడే: భారతి సిమెంట్ పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయకపోతే సహించమని.. ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని గ్రామస్థులతోపాటు కాంట్రాక్ట్ ఉద్యోగులు హెచ్చరించారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలం నల్లింగాయపల్లె వద్ద ఉన్న భారతి సిమెంట్ పరిశ్రమ ఎదుట శుక్రవారం వారంతా ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోయిన బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన వారికి డిపాజిట్ డబ్బులు ఇవ్వాలని.. దత్తత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. నియోజకవర్గ తెదేపా నాయకులు మద్దతు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్మికులు, రైతుల ఆందోళన కొనసాగింది. 2016 నుంచి 2025 వరకు పలుమార్లు ధర్నా చేసి పరిశ్రమ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి ఇటీవల డిమాండ్ నోటీసు ఇచ్చామని పరిష్కరించకపోగా పది మంది కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు వైకాపా నాయకులు పరిశ్రమ యాజమాన్యానికి మద్దతుగా పరిశ్రమలోనికి వెళ్లేందుకు యత్నించగా కార్మికులు, రైతులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపడంతో వ్యవహారం సద్దుమణిగింది. సమాచారం అందుకున్న పరిశ్రమ డైరెక్టర్ జేజే రెడ్డి అక్కడికి చేరుకుని కాంట్రాక్టు కార్మికులు, రైతులతో మాట్లాడారు. వినతిపత్రం స్వీకరించారు. పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్ భార్గవరెడ్డి. మండల కన్వీనర్లు రాఘవరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లారెడ్డి, మాజీ సర్పంచి బోగాది, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు వేదికగా అమరావతి

- 2వ అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో హోంమంత్రి అనిత



క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత. చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, క్రీడల విభాగం ఐజీ కేవీ మోహన్‌రావు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు వేదికగా నిలుస్తుందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాజధానిలో నిర్మించబోయే క్రీడా నగరం (స్పోర్ట్స్ సిటీ) వీటన్నింటికీ ప్రధాన కేంద్రం కానుందని పేర్కొన్నారు. 2వ అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ.. నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో తలమునకలయ్యే పోలీసు, భద్రతా బలగాల సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని చాటడానికి, శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహిళా పోలీసులకు కూడా ఇదే తరహాలో ప్రత్యేకంగా స్పోర్ట్స్‌మీట్ ఏర్పాటు చేయాలని డీజీపీకి సూచించారు. అనంతరం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. పోలీసు దళాల ఐక్యత, క్రమశిక్షణకు ప్రతీకగా ఈ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ నిలుస్తుందన్నారు. ఈ పోటీలకు ఆతిథ్యమివ్వడం ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖకు గొప్ప గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొనబోయే జట్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మధుసూదనరెడ్డి, క్రీడల విభాగం ఐజీ కేవీ మోహన్‌రావు, డీఐజీ అన్బురాజన్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

మొత్తం 10 జట్లు.. 5 రోజులు పోటీలు

★ ఈ క్రికెట్ పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల పోలీసు జట్లు, ఎన్ఎస్‌జీ, ఐటీబీపీ విభాగాలకు చెందిన జట్లు తలపడనున్నాయి. మూలపాడులోని ఏసీఏ మైదానంలో ఈ నెల 24 వరకూ మొత్తం 5 రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి.

★ తొలి రోజైన శుక్రవారం ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో అండమాన్ నికోబార్.. కర్ణాటక, ఐటీబీపీ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో కర్ణాటక జట్టు గెలుపొందాయి.

ఎవరికీ బర్డ్ ఫ్లూ సోకలేదు

- 54 నమూనాల్లోనూ నెగెటివ్ ఫలితమే
- వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి

ఈనాడు, అమరావతి: చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతోపాటు రాష్ట్రంలో ఎక్కడా మనుషులకు బర్డ్ ఫ్లూ సోకలేదని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఓ యువకుడికి బర్డ్ ఫ్లూ సోకిందనే ప్రచారం వాస్తవం కాదని, ఎవరూ ఆందోళన చెందొద్దని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వ్యక్తితో పాటు అనుమానిత లక్షణాలున్న 54 మంది నమూనాలను తిరుపతిలోని స్విమ్స్ వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షిస్తే అన్నీ నెగెటివ్ అని ఫలితం వచ్చిందని వెల్లడించారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కోళ్లకు వచ్చిన బర్డ్ ఫ్లూ మనుషులకు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రభావిత ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో పనిచేసేవారికి మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ముందస్తుగా చిత్తూరు, మదనపల్లె ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలు సిద్ధం చేశామన్నారు. సరైన రీతిలో ఉడికించి వండిన కోడి మాంసం, గుడ్లు తినడం సురక్షితమేనని కమిషనర్ తెలిపారు.

శాఖల బడ్జెట్ డిమాండ్లపై ఓటింగ్‌లో లేని మంత్రులు

- మంత్రులు లేకుండానే ఓటింగ్ పూర్తి
- ఆ సమయంలో ఉన్న ఎమ్మెల్యేలు 40లోపే!

ఈనాడు, అమరావతి: సంబంధిత మంత్రులు లేకుండానే శుక్రవారం శాసనసభలో వారి శాఖల బడ్జెట్ డిమాండ్లు, గ్రాంట్లపై ఓటింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురైంది. శాఖలవారీగా బడ్జెట్ డిమాండ్, గ్రాంట్లపై చర్చ, ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం మొదలైంది. తొలి రోజు హోం, రెవెన్యూ, విద్యుత్, న్యాయశాఖల డిమాండ్లు, గ్రాంట్లపై చర్చ చేపట్టారు. హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తమ శాఖల బడ్జెట్ డిమాండ్లను సభ ముందుంచి, ఆమోదించాలని కోరారు. నాలుగు శాఖలపై చర్చ ముగిశాక చివర్లో.. స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ఓటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఫరూక్ తప్ప మిగిలిన ముగ్గురూ సభలో లేరు. సాంకేతికంగా ఓటింగ్ సమయంలో ఆయా మంత్రులు సభలో ఉండాలనే నిబంధన లేకపోయినా, ఈ ప్రక్రియలో వాళ్లు పూర్తిగా భాగస్వాములు కావడం సంప్రదాయంగా వస్తోంది. దీనిపై అసెంబ్లీ లాబీల్లో చర్చ జరిగింది. ఆ సమయంలో సభలో ఎమ్మెల్యేలూ 40 మంది లోపే ఉన్నారు. ఈ నాలుగు శాఖల బడ్జెట్ మొత్తం రూ.28వేల కోట్లకు పైగా ఉంది. ఇంత కీలక సమయంలో సంబంధిత మంత్రులు ముగ్గురు, చాలా మంది ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం చర్చనీయాంశమైంది. 'సభలో సభ్యులు మాట్లాడుతున్నపుడు మంత్రులు సభలోనే ఉండాలి. వాళ్ల సలహాలు, సూచనలను నోట్ చేసుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నా మంత్రులు మాత్రం ఇలా చేస్తున్నారని కొందరు ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించారు.

4 శాఖల బడ్జెట్ కేటాయింపులకు శాసనసభ ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శుక్రవారం హోం, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు రెవెన్యూ, ఇంధన, న్యాయ శాఖలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులకు ఆమోదం లభించింది. హోం, విపత్తుల నిర్వహణకు ఆ శాఖ మంత్రి అనిత రూ.9,164.94 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌కు, మంత్రి అనగాని సత్యప్రసాద్ స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ వ్యవహారాలకు రూ.3,867.52 కోట్లతో ప్రవేశపెట్టిన పద్దుకు సభ ఆమోదం తెలిపింది. ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.13,942.67 కోట్లతో ప్రతిపాదించిన ఆ శాఖ బడ్జెట్‌కు, న్యాయశాఖకు ఆ మంత్రి ఎండీ ఫరూక్ రూ.1,352.49 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు చర్చల అనంతరం సభ ఆమోదం తెలియజేసింది.

హైడ్రాలజీ చీఫ్ ఇంజినీరుగా తిరుమలరావు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ హైడ్రాలజీ చీఫ్ ఇంజినీరుగా ఎస్.తిరుమలరావును బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన మానవ వనరుల అభివృద్ధి విభాగం చీఫ్ ఇంజినీరుగా ఉన్నారు. ధవళేశ్వరంలోని గోదావరి డెల్టా ఎస్ఈ కె.గోపీనాథ్‌ను గుంటూరు నీరు ప్రగతి సూపరింటెండెంట్ ఇంజినీరుగా బదిలీ చేశారు. ధవళేశ్వరంలో ఈఈగా ఉన్న జి.శ్రీనివాసరావుకు గోదావరి డెల్టా వ్యవస్థ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

- రూ.13,942 కోట్ల రాయితీలు అందిస్తున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈనాడు, అమరావతి: 'అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ వ్యవస్థను ఎన్డీయే ప్రభుత్వం గాడిలో పెడుతోంది. ఛార్జీలను దేశంలోని తొలిసారి 13 పైసలు ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. ప్రజాసంక్షేమానికి ఈ బడ్జెట్‌లో విద్యుత్ సబ్సిడీల కోసమే రూ.13,942 కోట్లు కేటాయించాం. వ్యవసాయ అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు ఇస్తున్నాం' అని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం శాసనసభలో ఇంధన రంగ బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చకు సమాధానమిచ్చారు. మంత్రి చెప్పిన వివరాలివి.

● జగన్ హయంలో విద్యుత్ రంగం అప్పులు రూ.1,22,000 కోట్లకు పెరిగాయి. 9 సార్లు ట్రూ అప్ ఛార్జీల రూపేణా ప్రజలపై రూ.33 వేల కోట్ల భారం మోపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులతో వచ్చిన పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారు. 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ రంగంపై శ్వేతపత్రం వెలువరించి వ్యవస్థను గాడిలో పెడుతున్నాం.

● 22 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఆక్వా రైతుల సంక్షేమానికి యూనిట్ రూ.1.50కే అందిస్తున్నాం. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలు చేస్తున్నాం. చేనేత మగ్గాలకు, ధోబీలకు, సెలూన్లకు రాయితీ ఇస్తున్నాం. ఏప్రిల్ ఒకటి నుంచి హ్యాండ్లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వబోతున్నాం. అన్ని వర్గాలకూ 24 గంటలు నిరంతరాయంగా కరెంటు ఇస్తున్నాం.

● ఏపీ జెన్‌కో 6 వేల మెగావాట్ల ఉత్పత్తితో రికార్డు సాధించింది. యూనిట్ కొనుగోలు ధరను రూ.6.35కు తగ్గించి రూ.340 కోట్లు ఆదా చేశాం.

జగన్ ప్రభుత్వంలో అన్నీ కుంభకోణాలే

ఈ చర్చలో ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ 'దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికింది చంద్రబాబే. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో తెదేపా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ మిగులు రాష్ట్రంగా తీర్చిదిద్దాం. అప్పుడే పునరుత్పాదక ఇంధన శక్తిని 7 గిగావాట్లకు పెంచిన ఘనత చంద్రబాబుదే' అని పేర్కొన్నారు. 'జగన్ హయాంలో పీపీఏలను రద్దు చేసి వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. కమీషన్లు దండుకొని పీపీఏలు కుదుర్చుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లలోనూ కుంభకోణాలకు పాల్పడ్డారు. 9 సార్లు బిల్లులు పెంచారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక రాయితీలు వర్తింపజేస్తున్నార'ని ఆయన వివరించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ జగన్ హయాంలో విద్యుత్ రంగానికి రూ.1,29,000 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు.

ద్వాక్రా నిధులు దోచేసిన.. వైకాపా నేతలపై క్రిమినల్ కేసులు పెట్టాలి

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల నిధుల దుర్వినియోగంలో కుట్రదారులైన వైకాపా నేతలపై కఠినచర్యలు తీసుకోవాలని, వారి ఆస్తులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు. శాసనసభలో శుక్రవారం '2019-24 మధ్య డ్వాక్రా సంఘాల నిధుల దుర్వినియోగం' అంశానికి సంబంధించి బూర్ల రామాంజనేయులు ఇచ్చిన నోటీసుపై చర్చ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం సీసీలు, వీఓఏలు, ఏపీఎంలపై చర్యలు తీసుకుంటే సరిపోదని, వీటి వెనుకున్న సూత్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐఎఫ్ కింద కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చిన నిధుల్లో రూ.1,082 కోట్లు మాయమయ్యాయని తెలిపారు. కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్లలో రూ.130 కోట్లు, బ్యాంక్ లింకేజీల్లో రూ.38 కోట్లు, స్త్రీనిధిలో రూ.12.40 కోట్లు, ఉన్నతి పథకంలో రూ.2.31 కోట్లు దుర్వినియోగమైనట్లు చెప్పారు. సిబ్బంది రూ.6.54 కోట్లు దారిమళ్లించారని పేర్కొన్నారు. ఎన్నడూలేనట్లుగా వైకాపా ప్రభుత్వంలో రూ.237 కోట్ల మేర ఎన్‌పీఏలు ఏర్పడ్డాయన్నారు.

ప్రతి సభ్యురాలికి వివరాలన్నీ తెలిసేలా ఏర్పాట్లు: మంత్రి

గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల సొమ్ము పెద్దఎత్తున దుర్వినియోగంకాగా, ఇప్పుడు అందులోని లోపాలను సరిచేస్తున్నామని సెర్ప్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నాడు సంఘాల సమావేశాలు నిర్వహించకపోవడంతో సభ్యులు కట్టిన సొమ్ము బ్యాంకుల్లో జమకాక, మళ్లీమళ్లీ కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు డిజిటల్, మాన్యువల్ బుక్ కీపింగ్ పెట్టామని, మన డబ్బులు.. మన లెక్కలు అనే యాప్ అందుబాటులోకి తెచ్చామని, దీనివల్ల ఎంత చెల్లించారు, ఎంత బకాయి ఉంది అనేది ప్రతి సభ్యురాలికి తెలిసేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్రమాలు చేసినవారిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు పెట్టామని, ఇంకా లోతుగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

నదులు కలుషితం చేయకుండా కఠిన చట్టాలు

ఈనాడు, అమరావతి: నదులు, పంట కాలువలు కలుషితం చేయకుండా చట్టాలను కఠినతరం చేసేలా ఆలోచన చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరిని కాలుష్య రహితంగా చేసేందుకు ప్రణాళిక అమలు చేయాలని కోరారు.

● గోదావరి పుష్కరాల నాటికి అవసరమైన అన్ని రోడ్ల అభివృద్ధి, వంతెనల నిర్మాణం పూర్తిచేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. రాయదుర్గం వద్ద రైల్వే వంతెన పూర్తిచేసేందుకు రూ.51.75 కోట్లతో ప్రతిపాదన పంపామని, అది మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు.

ఉత్తరాంధ్రలో ఎక్కువగా అరుదైన ఖనిజాలు

అరుదైన ఖనిజాలు ఉత్తరాంధ్రలో ఎక్కువగా ఉన్నాయని, కేంద్రం నాలుగు రాష్ట్రాల్లో ఏర్పాటుచేస్తున్న కారిడార్‌తో ఏపీకి మేలు కలుగుతుందని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు మాట్లాడుతూ రేర్‌ఎర్త్ మినరల్స్ తవ్వకాలు చేసే ఐఆర్ఈఎల్ సంస్థ.. శ్రీకాకుళంలో ప్లాంట్ ఏర్పాటుచేస్తే పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందని తెలిపారు.

● జూన్, జులై నాటికి సీతంపేట, దోర్నాల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు పూర్తిచేయనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సీతంపేట ఆసుపత్రికి స్పెషలిస్ట్ వైద్యులను కేటాయించాలని కోరారు.

పదేళ్ల కిందట ఇచ్చిన.. ఇంటి స్థలాలకు హక్కులు కల్పిస్తాం

శాసనసభలో మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: 'జగన్ ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేశాం. ప్రభుత్వం పదేళ్ల కిందట ఇచ్చిన ఎసైన్డ్ ఇంటి స్థలాలపై హక్కులు కల్పించబోతున్నాం. ఇనాం భూముల సమస్యకు మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే పరిష్కారం చూపబోతోంది' అని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం శాసనసభలో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు 1,70,000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను అనుయాయుల పేరిట స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. వారికి నచ్చని వారి భూములను 22ఏ జాబితాలో పెట్టించారు. ఇలాంటి ఎన్నో అక్రమాలను ఎన్డీయే ప్రభుత్వం సరిదిద్దుతోంది' అని మంత్రి తెలిపారు. రెవెన్యూ మంత్రి చెప్పిన విషయాలు ఇలా ఉన్నాయి...

● రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల ఎకరాల భూములు ఉంటే 1.80 కోట్ల ఎకరాలు 22 ఏ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితా నుంచి భూములను వెలికితీసే ప్రక్రియ సరళతరం చేసేలా అధికారాలు బదలాయించాం.

● ఒక వేళ ఏదైనా భూమిని 22 ఏ జాబితాలో చేర్చాలంటే ఆ పట్టాదారుడికి ఈకేవైసీ ద్వారా నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలి.

● ఇప్పటివరకు 22,30,000 పాసు పుస్తకాలు సిద్ధమయ్యాయి. వీటిలో కొన్నింటిలో తప్పులు వచ్చాయి. వాటిని సరిదిద్దించాం.

ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టం తీసుకురావాలి

ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టం తీసుకురావాలి. కర్ణాటక, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే వాటి సొంత చట్టం తయారు చేసుకున్నాయి. దీని వల్ల ఆదాయం ఎక్కువ వస్తుంది. కేంద్ర చట్టాన్ని సవరించుకుంటేనే మనకు మేలు' అని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

11 లక్షల మంది పింఛన్లు.. వైకాపా ప్రభుత్వం తొలగించింది



– కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్‌శాఖ మంత్రి

"వైకాపా ప్రభుత్వం 11 లక్షల మంది పింఛన్లు తొలగించింది. పేదల పింఛన్లు, డ్వాక్రా మహిళలకు రుణాల అంశంపై జగన్ అసత్యాలు చెబుతున్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించడానికే ఇలా చేస్తున్నారు"

తితిదే బోర్డు ఛైర్మన్లుగా.. అన్యమతస్థుల్ని నియమించిన చరిత్ర జగన్‌ది

– పంచుమర్తి అనురాధ, శాసనమండలి చీఫ్‌విప్

"తితిదే బోర్డు ఛైర్మన్లుగా అన్యమతస్థుల్ని నియమించిన చరిత్ర జగన్‌ది. మండలిలో ఆందోళన చేస్తున్న సభ్యుల్ని సస్పెండ్ చేయకుండా ఛైర్మన్ వాయిదా వేస్తున్నారు. చెప్పులు వేసుకొని శ్రీవారి చిత్రపటాల్ని ప్రదర్శించడానికి వైకాపా మహిళా ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కల్పలతారెడ్డి తదితరులకు బుద్ధి లేదా?"

గురువారమే శ్రీవారి చిత్రపటాల్ని మండలికి తెచ్చారు

– కావలి గ్రీష్మ, తెదేపా ఎమ్మెల్సీ

"గురువారమే శ్రీవారి చిత్రపటాల్ని వైకాపా వాళ్లు శాసనమండలికి తెచ్చారు. అప్పుడే ఛైర్మన్ మందలించి ఉంటే ఇప్పుడీ పరిస్థితి వచ్చేది కాదు."

శ్రీవారి చిత్రపటాన్ని విసిరేయడం సరికాదు...

– గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్సీ

"చెప్పులు వేసుకొని శ్రీవారి చిత్రపటాన్ని ప్రదర్శించడం. మండలి వాయిదా పడగానే దాన్ని విసిరిపారేయడం సరికాదు. ఇది భక్తుల మనోభావాల్ని దెబ్బతీయడమే. ఒక విషయాన్ని పట్టుకొని నాలుగు రోజులుగా మండలిని వైకాపా సభ్యులు అడ్డుకుంటున్నారు"

రాష్ట్ర భవిష్యత్తుకు నష్టం

– బొర్రా గోపిమూర్తి, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

"ఎలాంటి చర్చ లేకుండా మండలి వాయిదాపడటం రాష్ట్ర భవిష్యత్తుకు తీరని నష్టం. రైతులు, చిరుద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు ఇలా ఎందరో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. బడ్జెట్‌లో పీఆర్సీ ప్రస్తావన లేదు. వీటి గురించి చర్చించాలి"

దౌర్జన్యాలు చేసే వారు బయటకు రావాలంటే వణుకుపుట్టాలి

–హోంశాఖ పద్దుపై చర్చ సందర్భంగా యరపతినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, గురజాల

'విధి నిర్వహణలో ఉన్న పోలీసులను దుర్భాషలాడి దౌర్జన్యాలు చేస్తున్న వారు ఇళ్ల నుంచి మళ్లీ బయటకు రావాలంటే వణుకు పుట్టే విధంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. దౌర్జన్యాలతో రాజకీయాలు చేస్తామంటే సరికాదు. ఇలాంటి వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి'

సోషల్ మీడియాలో మానసిక దాడి చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి

–మాధవిరెడ్డి, ఎమ్మెల్యే, కడప

'సోషల్ మీడియాలో ప్రజాప్రతినిధుల మనోభావాలను దెబ్బతీసేలా చేస్తున్న పోస్టింగ్‌లపై, యూట్యూబ్ ఛానళ్లు కొన్ని రేటింగ్ పెంచుకోడానికి చేస్తున్న మానసిక దాడిపై చర్యలు తీసుకోడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి.'

సైబర్ నేరాల కేసుల్లో రికవరీ పెరగాలి

–ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యే, కనిగిరి

'సైబర్ నేరాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవడంతోపాటు ఈ కేసుల్లో రికవరీ పెరిగేలా హోంశాఖ తగు ఏర్పాట్లు చేయాలి'

ఆయేషా హత్య కేసు మూసివేత

- ఘటన జరిగి చాలా ఏళ్లు.. కొత్త సాక్ష్యాలు లేవన్న సీబీఐ
- కోర్టుకు తుది నివేదిక సమర్పించిన కేంద్ర దర్యాప్తు సంస్థ
- ఆమోదించి.. కేసును మూసేస్తున్నట్టు న్యాయస్థానం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సంచలనం కలిగించిన బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసును మూసివేస్తున్నట్లు సీబీఐ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ గత ఏడాది తుది నివేదికను హైకోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను విజయవాడలోని సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ ఆమోదిస్తూ.. శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. కేసును మూసేయడానికి ముందు ఆయేషా మీరా తల్లిదండ్రుల అభిప్రాయాన్ని కోర్టు తెలుసుకుంది. సీబీఐ నివేదికపై తాము ప్రొటెస్ట్ పిటిషన్, ప్రైవేటు కేసు దాఖలు చేయడం లాంటివేవీ చేయట్లేదని ఆయేషా మీరా తల్లిదండ్రులు కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే దోషి ఎవరనేది సీబీఐ తేల్చకపోవడంతో కేసును మూసేశారు.

ఆరేళ్ల కొనసాగిన సీబీఐ దర్యాప్తు

2019లో మొదలైన సీబీఐ దర్యాప్తు.. 2025 అక్టోబరు వరకు సుదీర్ఘంగా ఆరేళ్ల సాగింది. పోలీసులను సైతం సీబీఐ విచారించింది. మృతురాలి శరీర భాగాలను వెలికితీయించి.. రెండోసారి పోస్టుమార్టం చేయించింది. అన్నింటినీ క్రోడీకరించి గత ఏడాది తుది నివేదికను హైకోర్టుకు సమర్పించింది. గతంలో దర్యాప్తు చేసిన అధికారులు సేకరించిన సాక్ష్యాలే ఉన్నాయని.. అవి సత్యంబాబే నిందితుడని తెలుపుతున్నాయని, వాటిని గతంలో హైకోర్టు కొట్టివేసిందని సీబీఐ నివేదికలో పేర్కొంది. హత్య జరిగి చాలా ఏళ్లు కావడంతో.. అంతకుమించి కొత్త సాక్ష్యాలు ఏవీ లేవని వెల్లడించింది.

ఎన్నో మలుపులు తిరిగిన కేసు

2007 డిసెంబరు 27న రాత్రి ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతిగృహంలో ఆయేషా మీరా హత్యకు గురైంది. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు సత్యంబాబును నిందితుడిగా తేల్చారు. విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు సత్యంబాబును దోషిగా తేల్చి.. శిక్ష ఖరారు చేసింది. కానీ ఈ కేసును 2017లో హైకోర్టు కొట్టేసింది. సత్యంబాబును నిర్దోషిగా విడుదల చేసింది. కేసును తిరిగి విచారించాలని, అసలు నేరస్థులను పట్టుకోవాలని ఆయేషా మీరా తల్లి అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేశారు. అనంతరం ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. 11 నెలలపాటు దర్యాప్తు చేసిన సిట్.. దిగువ కోర్టులో కేసు ఆధారాలు ధ్వంసమయ్యాయని హైకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో దర్యాప్తును 2019లో సీబీఐకి హైకోర్టు బదిలీ చేసింది.

27న ఆయేషా శరీర అవశేషాల అప్పగింత

రీ పోస్టుమార్టం కోసం సీబీఐ తీసుకున్న మృతురాలి శరీర అవశేషాలను తిరిగి తమకు అప్పగించాలని ఆమె తల్లిదండ్రులు దాఖలుచేసిన పిటిషన్‌పై న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు మృతురాలి తల్లిదండ్రులు, సీబీఐ తరఫున దర్యాప్తు అధికారి కోర్టుకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. న్యాయస్థానంలో గుర్తింపు పంచనామా నిర్వహించిన తర్వాత.. వాహనాన్ని సమకూర్చి భద్రత మధ్య అవశేషాలను తెనాలి తరలించాలన్నారు. అక్కడ వారి మతాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని, ప్రభుత్వ అధికారులు హాజరుకావాలని.. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరించాలని సీబీఐ కోర్టు ఆదేశించింది.

రంగుల రబ్బర్ చేప



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో రంగుల రబ్బర్ ఫిష్ అబ్బురపరిచింది. ఈ చేపలు మన వద్ద అరుదుగా దొరుకుతాయి. రంగులతో ఉండే ఈ రకాలు ఇక్కడ దొరకడం ఇదే మొదటిసారని స్థానిక మత్స్యకారులు తెలిపారు. వీటి చర్మం రబ్బర్‌ను పోలి ఉంటుందన్నారు. 'ఇతర దేశాల్లో వీటి చర్మాన్ని పూర్తిగా తొలగించి.. మాంసాన్ని వండుకొని తింటారు. మన వద్ద మాత్రం ఎవరూ తినరు. న్యూజిలాండ్ తీరంలో ఎక్కువగా దొరుకుతాయి' అని మత్స్యశాఖ ఏడీ సిద్ధార్థవర్ధన్ తెలిపారు. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

రాంబాబు అనే కుక్కకూ ఓ రోజొస్తుంది

- గుంటూరులో మీడియాతో అంబటి రాంబాబు



ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-గోరంట్ల: 'గుర్తుంచుకోండి. ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది. రాంబాబు అనే కుక్కకూ ఒక రోజొస్తుంది. గుర్తుంచుకోండి చంద్రబాబూ. నా ఇంటి వద్ద ఏడెనిమిది గంటలు రౌడీయిజం చేస్తుంటే పోలీసులు కాపలా కాశారు. ఇంత దుర్మార్గమైన కార్యక్రమం చేసి నన్ను 18 రోజులు జైల్లో పెట్టారు. కేసులు పెడితే, జైలుకు పంపితే భయపడతానా? 18 మాసాల తర్వాత బెయిలు వచ్చినా చెక్కుచెదరను. రెడ్‌బుక్‌లో ఇంతవరకే రాశారా! పోలీసుల సహకారంతో చంపేయాలనీ చూసినట్లు నాకు సమాచారం ఉంది' అని మాజీమంత్రి, గుంటూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడారు. 'తెలుగుదేశం వాళ్లు ఓ ఫ్లెక్సీ కడితే వెళ్లాను. అది మంచి సంప్రదాయం కాదని చెప్పాను. చించేసే అవకాశం ఉన్నా చింపలేదు. మర్నాడు మా పార్టీ రాష్ట్ర స్థాయి పిలుపులో భాగంగా వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్లి వస్తుంటే కర్రలు, రాళ్లతో నా కారుపై దాడిచేసి బూతులు తిట్టారు. క్షణికావేశంలో నేనూ పొరపాటున తప్పుగా మాట్లాడా. ఇంటికొచ్చి బాధపడి ప్రెస్‌మీట్ పెట్టినా ఏడు గంటలు నా ఇంటివద్ద కరాళ నృత్యం చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు లోపలికి వచ్చి నన్ను గోడదూకి పారిపొమ్మన్నారు. పారిపోవడం కంటే చచ్చిపోవడం మేలని చెప్పా. స్టేషన్‌లో తెల్లవారుజామున 2.30 గంటలకు నన్ను నిద్రలేపి పైకి తీసుకెళ్లి కొట్టడానికి ప్రయత్నించారు. కూర్చోబెట్టి కాళ్లు పగలదీశారు. వాళ్లెవరో నాకు తెలుసు. న్యాయస్థానానికి వెళతా' అని తెలిపారు.

దాడులకు లైసెన్సు ఇస్తారా?

'అసభ్యంగా మాట్లాడినందుకే ఈ రాష్ట్రంలో దాడులు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. నేను పొరపాటున మాట్లాడా. తప్పే. నేను క్షణికావేశంలో అంటే దాడులు చేసుకునేందుకు లైసెన్సు ఇస్తారా?' అని రాంబాబు ప్రశ్నించారు.

జగన్‌తో అంబటి భేటీ


అంబటి రాంబాబు శుక్రవారం మాజీ సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. రాజమహేంద్రవరం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటి బుధవారం విడుదలయ్యారు. జగన్‌ను తాడేపల్లిలో కలిసి మాట్లాడారు. గుంటూరులో తన ఇంటిపై జరిగిన దాడి, పోలీసులు తనపై వ్యవహరించిన తీరు, కేసుల నమోదు తదితర అంశాలను అంబటి జగన్‌కు వివరించారు. కొందరు పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని జగన్ వ్యాఖ్యానించారు. అంబటితోపాటు ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఉన్నారు.

అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాపై కేసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 19న రాంబాబు.. జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో రాజామహేంద్రవరం నుంచి గుంటూరుకు భారీ కాన్వాయ్‌తో నగరం మీదుగా ర్యాలీగా వెళ్లడం, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించడంపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలో సెక్షన్-30 పోలీసు చట్టం అమల్లో ఉన్నందున ఎలాంటి ర్యాలీలూ నిర్వహించవద్దని పోలీసులు సూచించారు. వాటిని బేఖాతరు చేస్తూ ర్యాలీ చేపట్టడంపై ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపీ కొట్టడాన్ని అడ్డుకుంటే.. ప్రొఫెసర్‌నే కొట్టాడు!

ఈనాడు, బెంగళూరు: ఫోన్‌లో చూసి పరీక్ష రాస్తున్న వైద్య విద్యార్థిని అడ్డుకోవడంతో అతను ప్రొఫెసర్‌పై దాడికి దిగాడు. ఈ ఘటన కర్ణాటకలోని కలబురగిలోని ఓ ప్రైవేటు హోమియోపతి కళాశాలలో చోటుచేసుకుంది. కళాశాలలో శుక్రవారం ఇంటర్నల్ పరీక్ష నిర్వహించారు. షహబాజ్ అనే విద్యార్థి పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తెచ్చుకున్నాడు. ఆపై ఫోన్ చూస్తూ పరీక్ష రాస్తుండటంతో పర్యవేక్షకుడైన ప్రొఫెసర్ డాక్టర్ శివరాజ్‌కుమార్ గమనించి.. పరీక్ష పత్రాలు తీసుకొని, అతన్ని గది నుంచి బయటకు పంపారు. ఈ సమయంలో షహబాజ్ శివరాజ్‌కుమార్‌పై చేయి చేసుకున్నాడు. ఈ ఘటన కళాశాల సీసీటీవీ ఫుటేజ్‌లలో నమోదైంది. ఆ తర్వాత సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో కళాశాల యాజమాన్యం సదరు విద్యార్థిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. రానున్న పరీక్షలకు హాజరు కావద్దని తాఖీదులు ఇచ్చింది.



ఆచార్యుడిపై దాడి చేస్తున్న విద్యార్థి

సముద్రపు ఇసుక మైనింగ్ పేరుతో విశ్రాంత ఐఏఎస్ మోసం

- ప్రవాస భారతీయుడికి 5 లక్షల డాలర్లకు టోకరా.. సీసీఎస్‌లో కేసు

ఈనాడు, హైదరాబాద్: ఇండోనేసియాలో సముద్రపు ఇసుక మైనింగ్ పేరుతో ప్రవాసభారతీయుడిని మోసగించిన విశ్రాంత ఐఏఎస్ నిర్వాకమిది. పెట్టుబడి పేరిట 14 ఏళ్ల క్రితం 5లక్షల అమెరికా డాలర్లు కాజేసి ఇప్పటికీ ఇవ్వకుండా మోసగిస్తున్నారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. వైజాగ్‌లోని వాల్తేరుకు చెందిన విక్రమాదిత్య బొప్పూడి 1991లో అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లోని ప్రైమ్ సొల్యూషన్స్ కంపెనీ సీఈవో. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ దయాచారి పొన్నెకంటితో విక్రమాదిత్యకు 2012లో పరిచయం ఏర్పడింది. తాను ఆయిల్, శాండ్, ఐరన్‌ఓర్ మైనింగ్, ఎనర్జీ తదితర ప్రపంచస్థాయి వాణిజ్యరంగాల్లో పనిచేస్తున్నట్లు అప్పట్లో దయాచారి చెప్పుకొచ్చారు. ఓ రోజు ఇండోనేసియాలో సముద్రపు ఇసుక మైనింగ్ ప్రాజెక్టుకు అనుమతులు చివరిదశకు చేరుకున్నాయని.. పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయని విక్రమాదిత్యకు ఆశచూపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని చారికి చెందిన అపిండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన చారి సూచించిన బ్యాంకు ఖాతాలకు 5లక్షల అమెరికా డాలర్లను బదిలీ చేశారు. ఈ మేరకు 2012 జులై 5న జాయింట్ వెంచర్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నారు. రోజులు గడిచినా షేర్ సర్టిఫికెట్లను పంపించకపోవడంతో విక్రమాదిత్యకు అనుమానం కలిగింది. 2015లో హైదరాబాద్‌కు వచ్చి ఆరా తీయగా అప్పటి నుంచి ఏదో ఒక కారణం చెప్పి చారి తప్పించుకుంటున్నాడు. మరోవైపు విశ్రాంత ఐఏఎస్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లో ఇదే తరహా మోసంపై కేసు నమోదైనట్లు తెలుసుకున్న విక్రమాదిత్య తాజాగా ఫిర్యాదు చేశారు.

కూతురితో తండ్రి అసభ్య ప్రవర్తన

- పాఠశాలలో నిర్వహించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో బాలికకు అవగాహన
- ఉపాధ్యాయురాలికి మొరపెట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: కూతుర్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఏడాదిగా భార్య దూరం కాగా అప్పటినుంచి కూతుర్ని వేధించసాగాడు. వీటన్నింటినీ ఆ బాలిక మౌనంగా భరిస్తూ వస్తోంది. అయితే ఈ నెల 19న పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఉపాధ్యాయురాలు అవగాహన కల్పించారు. దీంతో ఆప్యాయంగా తాకడం, దురుద్దేశపూర్వకంగా ముట్టుకోవడానికి గల తేడా బాలికకు అర్థమైంది. అంతే ఒక్కసారిగా తనకు ఎదురవుతున్న వేధింపులను ఉపాధ్యాయురాలికి వివరించి కంటతడి పెట్టింది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ శివారులోని వైఎస్సార్‌కాలనీ(జక్కంపూడి కాలనీ)లో నివసించే పెయింటర్‌కు ఒక్క కుమార్తె(13). స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. దంపతుల మధ్య విబేధాలు తలెత్తడంతో భార్య ఏడాది క్రితం వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో తండ్రి మద్యానికి బానిసై తరచూ కూతుర్ని వేధిస్తున్నాడు. మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. చివరికి బాలిక ఈ విషయాన్ని ఉపాధ్యాయురాలికి చెప్పడంతో ఆమె సాయంతో పిల్లల సంరక్షణ కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. వారు బాలికను కృష్ణలంకలోని ప్రజ్వల వసతిగృహానికి తరలించారు. కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా తండ్రిపై పోక్సో కేసు నమోదు చేశారు.

వేలానికి బుట్టా రేణుక దంపతుల ఆస్తులు

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు కుచ్చుటోపీ

ఈనాడు, కర్నూలు: కర్నూలు వైకాపా మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠ శివల ఆస్తులను వేలం వేయాలని ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్ణయించింది. ఆ సంస్థ నుంచి వారు గతంలో సుమారు రూ.340 కోట్ల రుణం తీసుకున్నారు. కొంతకాలం వాయిదాలు చెల్లించినా, తర్వాత మానేశారు. దీంతో రూ.782.07 కోట్ల వరకు బకాయిపడ్డారు. నోటీసులు పంపినా ఇరువర్గాలకు ప్రత్యామ్నాయ ఒప్పందం కుదరలేదు. దీంతో వారు తనఖా పెట్టిన ఆస్తులను వేలం వేసే ప్రక్రియను ప్రారంభించారు. తాజాగా హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలోని సర్వే నంబరు 1009, ఫేజ్-6లో వారికి ఉన్న 3,833.28 చదరపు గజాల స్థలాన్ని వేలం వేసేందుకు ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ బెంగళూరు బ్రాంచి శుక్రవారం వేలం ప్రకటన జారీచేసింది. అందులో మెరిడియన్ పాఠశాల భవనం కూడా ఉంది. ఆ ఆస్తి విలువ రూ.65 కోట్లుగా నిర్ణయించారు. ఈ ఏడాది మార్చి 23 వరకు ఈ-బిడ్ ఫారం దాఖలు చేసేందుకు అనుమతించి మార్చి 24న ఈ-వేలం వేస్తామని ప్రకటించారు.

డిస్కమ్‌లకు రూ.1,500 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని డిస్కమ్‌లకు ప్రభుత్వం రూ.1,500 కోట్లు విడుదల చేసింది. 2025-26 నాలుగో త్రైమాసిక అడ్వాన్స్ టారిఫ్ సబ్సిడీ కింద ఈ నిధుల విడుదలకు పరిపాలన అనుమతులిస్తూ శుక్రవారం ఉత్తర్వు జారీచేసింది.

మరోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి బెంగళూరుకు వెళ్లారు. మంగళవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన.. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం తిరిగి బెంగళూరుకు వెళ్లారు.

యువిక దరఖాస్తులకు ఇస్రో ఆహ్వానం

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థుల నుంచి యువ విజ్ఞాన కార్యక్రమానికి (యువిక) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇస్రో అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైజ్ఞానిక శాస్త్రంతో పాటు అంతరిక్ష పరిజ్ఞానం, దాని అనువర్తనాలపై క్విజ్ రూపంలో పిల్లలను పరీక్షిస్తారు. దీనికి ఫిబ్రవరి 27 నుంచి మార్చి 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 2026 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న భారతీయ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఏఐ సమిట్‌లో కాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: దిల్లీలో ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఏఐ సమిట్‌ను నిర్వహిస్తూ ప్రపంచ సాంకేతిక రంగంలో దేశం తన సత్తా చాటుతుంటే.. కాంగ్రెస్ పార్టీ దేశ గౌరవం కంటే అల్లర్లకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. భారత మండపం సమిట్ వేదిక వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి రభస చేయడం హేయమైన చర్య అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇది ప్రపంచ వేదికపై భారత దేశ ప్రతిష్ఠను దిగజార్చడానికి చేసిన ఉద్దేశపూర్వక కుట్ర. దేశం గ్లోబల్ టెక్ పవర్ హౌస్‌గా ఎదుగుతుంటే.. కాంగ్రెస్ ప్రవర్తన భారత్ వెనుకబడాలని కోరుకునే శక్తులకు వత్తాసు పలికేలా ఉంది. రాజకీయం ముఖ్యమా.. దేశం ముఖ్యమా..? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుంది. కానీ దేశ ప్రతిష్ఠ దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. దేశానికి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు వద్దు' అని మాధవ్ తెలిపారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సుందర్ పిచాయ్‌ను ఆహ్వానించాలి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) శతాబ్ది ఉత్సవాలు ఏప్రిల్ 26న నిర్వహించనున్నామని, దీనికి గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌ను తీసుకురాగలిగితే.. ఈ ఉత్సవాలకు మరింత గుర్తింపు వస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్‌లో గంటా మాట్లాడుతూ.. విశాఖకు గూగుల్ వచ్చినందున, సీఎం, విద్యాశాఖ మంత్రితో మాట్లాడి సీఈవో సుందర్ పిచాయ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని కోరారు. విశాఖ ఏఐ హబ్ అవుతున్నందున గూగుల్, ఏయూ మధ్య ఒప్పందం జరిగేలా కూడా చూడాలని పేర్కొన్నారు. వందేళ్ల ఉత్సవానికి రూ.వంద కోట్ల నిధులిచ్చి, వర్సిటీలో ఐకానిక్ భవనం కట్టాలని, లేకపోతే గుర్తుగా రీసెర్చ్ ఫండ్‌గా పెట్టాలని కోరారు. ఏప్రిల్ 26 నాటికి సుందర్ పిచాయ్ రాలేకపోతే, ఈ ఏడాదిలో ఎప్పుడైనా ఆయన ఏయూకు వచ్చేలా చూడాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఏయూకు సుందర్ పిచాయ్‌ను రప్పించే బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును.. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కోరారు. రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టే ఆయన రమ్మంటే రావాలి కదా అని డిప్యూటీ స్పీకర్ సరదాగా వ్యాఖ్యానించారు.



జ్ఞానం అందించడం వరకే ఉపాధ్యాయుడి పాత్ర

విద్యార్థులకు జ్ఞానాన్ని, మార్గాన్ని అందించడం వరకే ఉపాధ్యాయుల పాత్ర. వాటిని వినియోగించుకుని ముందుకు సాగడం విద్యార్థుల బాధ్యత. ఈ క్రమంలో విద్యార్థులు ఎంతగా శ్రమిస్తే అంత గొప్ప ఫలితాన్ని సాధిస్తారు.
– మైక్ ఎన్లీ, ఇన్‌ఫ్లుయెన్సర్

ఏకధాటిగా 15 వేల క్యూబిక్ మీటర్ల రాఫ్ట్ ఫౌండేషన్

- హైకోర్టు భవన నిర్మాణంలో కీలక అడుగు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షణలో అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని మంత్రి పి.నారాయణ తెలిపారు. శరవేగంగా జరుగుతున్న హైకోర్టు నిర్మాణంలో భాగంగా శుక్రవారం చేపట్టిన ఏకధాటిగా 15 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ ఫౌండేషన్ (రాఫ్ట్) పనులను మంత్రి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏజీఐసీఎల్) ఎండీ శ్రీనివాస్ ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మొత్తం హైకోర్టు భవనాల నిర్మాణంలో 65 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటును వినియోగిస్తున్నామని, ఇప్పటికే 15 వేల క్యూబిక్ మీటర్లు పూర్తి చేశామని చెప్పారు. బేస్‌మెంట్+గ్రౌండ్+8 అంతస్తులుగా 50.4 మీటర్ల ఎత్తులో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా హైకోర్టు భవనాన్ని తీర్చిదిద్దుతున్నామని, 2027 డిసెంబరు నాటికి హైకోర్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ఆయన వివరించారు. రాజధానిలో అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 4,026 ఇళ్లు నిర్మిస్తున్నామని, వాటిలో 3,500 నిర్మాణాలను ఈ ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేసి అప్పగిస్తామన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సచివాలయాల పరిశీలన

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణంలో భాగంగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల రాజధానులు నయా రాయ్‌పూర్, హైదరాబాద్‌లలోని ఆయా రాష్ట్ర సచివాలయాల పరిశీలనకు అధికారుల బృందాల్ని పంపనున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల్లో ఏ శాఖకు ఎంత స్థలం కేటాయించాలన్న అంశంపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. ఆ వివరాలను నారాయణ విలేకరులకు వివరించారు. 'ఐకానిక్ భవనాల నిర్మాణం, పార్కింగ్, శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు, వారికి కావాల్సిన స్థలం, సదుపాయాలపై చర్చించాలని అధికారులకు సూచించాం. 2014-19 మధ్యలో 52.72 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాను నిర్దేశించాం. తదనుగుణంగా భవనాల ఆకృతులు సిద్ధం కాగా.. ఆయితే, ప్రస్తుత అవసరాలపై పూర్తిగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించడంతో మా కమిటీ వాటిపై దృష్టి పెట్టింది. సోమవారం మరోసారి భేటీ అయ్యి, ఆయా అంశాలపై చర్చిస్తాం' అని నారాయణ వెల్లడించారు. సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, డీబీవీ స్వామి, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ కాంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికారాబాద్‌లో కాంగ్రెస్ శిక్షణ శిబిరం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ), నగర కాంగ్రెస్ అధ్యక్షులకు శనివారం నుంచి మార్చి 2వ తేదీ వరకు వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సూచనల మేరకు శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరై ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తారు. శిక్షణ ముగిసేలోగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరై ప్రసంగిస్తారని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.



సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ లలితకు భూముల పత్రాలు అందజేస్తున్న రైతు ఉమామహేశ్వరరావు కుటుంబసభ్యులు

రాజధానికి 20 ఎకరాలిచ్చిన హైదరాబాద్ వాసి

అమరావతి, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధానికి రెండోవిడత భూ సమీకరణకు ఆనందంగా భూములు ఇస్తున్నామని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వెలినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎండ్రాయిలో ఆయనకున్న 20.60 ఎకరాల భూముల పత్రాలను శుక్రవారం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ లలితకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు.. రాజధాని విశ్వనగరంగా ఏర్పడటానికి దోహదం చేస్తుందన్నారు. శుక్రవారం సమీకరణకు మొత్తంగా 31.26 ఎకరాలు రైతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

దక్షిణ భారత ఛార్టర్డ్ ఎకౌంటెంట్స్ ప్రాంతీయ మండలి అధ్యక్షుడిగా ముప్పాళ్ల సుబ్బారావు



గుంటూరు (పట్నంబజారు), **న్యూస్‌టుడే:** దక్షిణ భారత ఛార్టర్డ్ ఎకౌంటెంట్స్ ప్రాంతీయ మండలి అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా బండారుపల్లికి చెందిన ప్రముఖ ఛార్టర్డ్ ఎకౌంటెంట్ ముప్పాళ్ల సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం చెన్నైలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించినట్లు సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛార్టర్డ్ ఎకౌంటెన్సీ రంగంలో యువతను మరింతగా ప్రోత్సహించి, వారు రాణించేందుకు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు.



అలాంటివారికి దూరంగా ఉండండి

హోదా, దర్పం ప్రదర్శిస్తూ ఆనందించే వ్యక్తులకు దూరంగా ఉండండి. బదులుగా విలువలను పాటించే వ్యక్తులతో స్నేహం చేయండి. తమకు తెలిసిన గొప్ప విషయాలనూ భేషజాలు లేకుండా పంచుకునే వారితో కలుపుగోలుగా ఉండండి.
– వాలా అఫ్సర్, కాలమిస్టు

సముద్ర భద్రతకు ఉమ్మడి కార్యాచరణ బృందాలు

- ఐవోఎన్ఎస్ సమావేశంలో నిర్ణయం
- సింపోజియం అధ్యక్ష పదవి స్వీకరించిన భారత నేవీ చీఫ్



ఐవోఎన్ఎస్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న వివిధ దేశాల నావికా దళాధిపతులు

ఈనాడు, విశాఖపట్నం: సముద్ర భద్రత, సమాచార మార్పిడి, విపత్తుల్లో ఉపశమన చర్యలు, పరస్పర సహకారంపై ఉమ్మడి కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేయాలని హిందూ మహాసముద్ర నావల్ సింపోజియం (ఐవోఎన్ఎస్) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో ఐఎఫ్ఆర్, మిలాన్, సింపోజియం పేరిట నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో ఐవోఎన్ఎస్ సమావేశం ఓ హోటల్‌లో జరిగింది. దీనికి హిందూ మహాసముద్ర తీర దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 33 దేశాల నావికాదళ అధిపతులు, సముద్ర భద్రతా సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అట్లాంటిక్ నుంచి పసిఫిక్ వరకు విస్తరించిన హిందూ మహాసాగర ప్రాంతంలో సముద్ర సహకారం, భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఒమన్ ఐవోఎన్ఎస్ వర్కింగ్ గ్రూపులో చేరగా, సారూప్యత కలిగిన నావికా దళాల సంఖ్య పెరగడాన్ని సింపోజియం స్వాగతించింది.

16 ఏళ్ల తర్వాత తిరిగి భారత్‌కు

ఈ సింపోజియానికి అధ్యక్ష పదవిని భారత్ చేపట్టింది.



సింపోజియం అధ్యక్ష పదవిని స్వీకరిస్తున్న భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్‌కుమార్ త్రిపాఠి (కుడి వైపు)

రాయల్ నేవీ నుంచి ఐవోఎన్ఎస్ అధ్యక్ష పదవిని భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్‌కుమార్ త్రిపాఠి స్వీకరించారు. అధ్యక్ష బాధ్యతను భారత్ సమర్థంగా నిర్వర్తించేందుకు అందరూ సహకరించాలని, ఐవోఎన్ఎస్ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ బాధ్యతలతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో సాగర సుస్థిరతకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. 16 ఏళ్ల తర్వాత తిరిగి మళ్లీ భారత్‌కు ఐవోఎన్ఎస్ అధ్యక్ష పదవి దక్కింది. 2008 నుంచి 2010 వరకు ప్రారంభ అధ్యక్ష పదవిని చేపట్టిన భారత్, ఇప్పుడు వృత్తిపరమైన సముద్ర సహకారం కోసం ఈ వేదికను ముందుకు తీసుకెళ్తుందని దినేశ్‌కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం సభ్య నావికాదళాల పరస్పర సహకారానికి, సమాచార మార్పిడికి భారత నావికాదళం మెరుగుపరిచిన ఐవోఎన్ఎస్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. దీనిలో ఫిలిప్పీన్స్‌ను పరిశీలక దేశంగా చేర్చారు. ఐవోఎన్ఎస్ మారిటైమ్ ఎక్సర్‌సైజ్ (ఐఎంఈఎక్స్) నిర్వహణతో పాటు నావికాదళాలు, సముద్ర భద్రతా సంస్థల సిబ్బంది భాగస్వామ్యంతో 'మహాసాగర్' లక్ష్యాలను చేరుకునేలా భారత్ శక్తిమేర కృషి చేస్తుందని త్రిపాఠి వివరించారు.

పాఠశాల స్థాయి నుంచే వాణిజ్య విద్య

- అప్పుడే సీఏపై అవగాహన పెరుగుతుంది
- సీఏ ప్రాక్టీసులో ఏఐది కీలకపాత్ర
- ఐసీఏఐ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్

ఈనాడు, విశాఖపట్నం: విద్యార్థులు ఛార్టర్డ్ ఎకౌంటెంట్ (సీఏ) కోర్సు వైపు ఆకర్షితులయ్యేలా పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పిస్తే ఈ కోర్సులో చేరే వారి శాతం పెరుగుతుందని 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)' అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ అభిప్రాయపడ్డారు. ఈ కోర్సుపై పిల్లలు, వారి తల్లిదండ్రులకు సరైన అవగాహన లేదన్నారు. నలభై ఏళ్ల కిందట ఎలా ఉందో నేడూ అదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. పాఠశాల స్థాయిలో 6-9 తరగతుల విద్యార్థులకు వాణిజ్య విద్యపై కొన్ని పాఠ్యాంశాలను పరిచయం చేయాలని, పది ఉత్తీర్ణులయ్యేసరికి పన్నులు, ఆర్థిక అంశాలపై ఒక అవగాహనకు వచ్చేలా ఉండాలని సూచించారు. దీనిపై రూపొందించిన ప్రత్యేక సిలబస్‌ను ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. శుక్రవారం విశాఖపట్నంలోని ఐసీఏఐ శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రసన్నకుమార్ ప్రత్యేకంగా మాట్లాడారు.



ప్రసన్నకుమార్

పది రోజుల్లో చేసే పనితో ఏఐతో గంటలోనే..

కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన చాలా మంది వృత్తి నిపుణుల్లో ఉంది. సీఏ చదివిన వారికి ఆ పరిస్థితి లేదు. దీన్ని ఒక సహాయకారిగా ఉపయోగించుకుంటున్నాం. సీఏ ప్రాక్టీసుకు ఏఐ తప్పనిసరి. రెండేళ్లుగా అందరూ పాటిస్తున్నారు. దీంతో నేర్చుకోవడం తప్పనిసరైంది. ఇందుకోసం ప్రత్యేక టూల్స్ ఉపయోగిస్తుండగా మా సంస్థ కొన్నింటిని అభివృద్ధి చేసి సభ్యులకు అందజేస్తుంది. గతంలో పది రోజుల్లో చేయాల్సిన పని ఇప్పుడు గంటలో చేస్తున్నాం. ఆ ఫలితాలు ఎంత కచ్చితంగా వచ్చాయనేది విశ్లేషించుకుంటాం.

పరిశోధనలకు..

ఐసీఏఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కింద ఓ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. మార్చిలో ఐసీఏఐ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తాం. ఇందులో ఆర్థిక అంశాలతో కూడిన అనేక పరిశోధనలు చేస్తాం. ఉదాహరణకు డేటా సెంటర్ వస్తే ఆదాయం, ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రయోజనాల పెరుగుదల ఎలా ఉంటుందో శోధిస్తాం. సాంకేతిక సాయంతో చట్టాలు అందరికీ అర్థమయ్యేలా చూస్తాం. ఇప్పటికే ఏపీలో ఐదు చట్టాలకు సంబంధించి సంస్కరణలు సూచించాం.

కాలానుగుణంగా మార్పులు

ఈ కోర్సులో కాలానుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నాం. గతంలో పదేళ్లకు ఒకసారి మారేవి. ఇప్పుడు సాంకేతిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకటి, రెండేళ్లకు చేస్తున్నాం. ప్రస్తుతానికి కొత్త సిలబస్ అవసరం లేదు. సిలబస్, శిక్షణ తగ్గించేది లేదు.

ఉపకారవేతనాలతో..

రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి ఉపకార వేతనాలు ఇస్తున్నాం. సీఏ ఉత్తీర్ణులయితే చాలు.. ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం. డ్వాక్రా సంఘాలకు సమావేశాలు నిర్వహించి, ఆర్థిక మోసాలు జరిగే తీరును వివరిస్తున్నాం. కాల్ సహాయత కార్యక్రమం ద్వారా సందేహాలు నివృత్తి చేస్తున్నాం. చాట్‌జీపీటీలా మా సంస్థ సొంతంగా రూపొందించిన యాప్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా.. రాజధానిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ

- 15 లక్షలకుపైగా పుస్తకాలతో.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేలా చర్యలు
- విద్యాశాఖ సమీక్షలో మంత్రి లోకేశ్



పాఠశాల విద్యాశాఖ సమీక్షలో సెంట్రల్ లైబ్రరీ భవన నమూనా పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక వసతులతో జ్ఞాన కేంద్రంగా రాజధాని అమరావతిలో నిర్మించబోయే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ.. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా ఉండాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సెంట్రల్ లైబ్రరీ భవన నమూనా, వీడియోను చూసి పలు సూచనలు చేశారు. లోకేశ్ మాట్లాడుతూ 'రాజధానిలో నిర్మించే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ రాష్ట్ర ఘన చరిత్ర, వారసత్వానికి చిహ్నంగా నిలవాలి. చారిత్రక గ్రంథాలు భద్రపరిచే భవనం, ఆడిటోరియం ఇతర వసతులతోపాటు 15 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ఇది విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడాలి' అని మంత్రి ఆదేశించారు.

పదో తరగతి పరీక్షలు, అభ్యసన సామర్థ్యాలపై ఆరా..


ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు.. క్లిక్కర్ వీడియోలు, పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలపైనా మంత్రి సమీక్షించారు. పాఠశాలల్లో ఏఐ ట్యూటర్ వినియోగం, నిడమర్రు పాఠశాల అభివృద్ధి పనులతోపాటు.. పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం, డీఎస్సీ తదితర అంశాలపైనా చర్చించారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, పబ్లిక్ లైబ్రరీస్ సంచాలకుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 192 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈతరం

youthpage@eenadu.in

అమెరికాలో పిల్లలకు.. ఆర్థిక పాఠాలు!



చాలామందికి అర్థం చేసుకోవడం కష్టంగా అనిపించే ఆర్థిక అంశాలపై.. ఆ అమ్మాయికి ఏడేళ్ల వయసు నుంచే ఆసక్తి మొదలైంది! అమ్మానాన్నల సాయంతో స్టాక్‌మార్కెట్‌పై పట్టు సాధించింది. అప్పటి నుంచే పెట్టుబడుల బాటలో పయనిస్తూ.. ఇప్పుడు ఏకంగా పిల్లలకు స్టాక్‌మార్కెట్ పాఠాలు బోధించే స్థాయికి ఎదిగింది. ఇందుకోసం ఓ అకాడమీనే స్థాపించింది. అమెరికాలో ఉంటున్న ఈ తెలుగమ్మాయి గురించి మనమూ తెలుసుకుందామా!

శాన్వి గుళ్లపల్లి తండ్రి రవి యూఎస్‌లో ఓ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఈమె తల్లి దివ్యలక్ష్మి జాస్తి. చాలాఏళ్లుగా వీరు అమెరికాలో ఉంటున్నా.. స్వస్థలం ఏలూరుతోనూ తెలుగునేలతోనూ సంబంధాలు అలాగే ఉన్నాయి. శాన్వికి చిన్ననాటి నుంచి డబ్బు సంబంధిత విషయాలపై ఆసక్తి ఎక్కువ. అలా ఏడేళ్ల వయసు నుంచే ఫైనాన్స్, స్టాక్ మార్కెట్ గురించి నేర్చుకుంది. పెట్టుబడుల మెలకువలపై పట్టు సాధించింది. రెండేళ్ల క్రితం అనుకోకుండా న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వెళ్లి స్వయంగా పరిశీలించే అవకాశం దక్కింది తనకు. ఆ అనుభవం ఆమెను ఆర్థిక అంశాలవైపు మరింతగా పయనించేలా చేసింది. అప్పటి నుంచి వాల్‌స్ట్రీట్ జర్నల్, ఫైనాన్షియల్ టైమ్స్ చదువుతూ సోషల్ మీడియాలో వీక్లీ మార్కెట్ అప్‌డేట్ వీడియోలు పోస్ట్ చేస్తోంది.

తనకు ఇంతగా ఆసక్తి ఉన్న సబ్జెక్టు గురించి పిల్లలకు, విద్యార్థులకు అంతగా పరిచయం లేకపోవడాన్ని శాన్వి గమనించింది. దీంతో వారికి మరింతగా డబ్బు గురించి తెలియాలి అనే ఉద్దేశంతో 'శాన్వి ఫైనాన్స్ అకాడమీ'ను స్థాపించింది. లాభాపేక్ష లేని ఈ సంస్థ ద్వారా విద్యార్థులకు డబ్బు పాఠాలు చెబుతోంది. సంపాదన, ఖర్చులు, పెట్టుబడులు, రిస్క్‌లు, అన్నీ నేర్పిస్తూ.. వారిని భవిష్యత్తుకు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం వయసుల వారీగా బోధించాల్సిన అంశాలను స్వయంగా తానే తయారుచేసుకుంది. విద్యార్థుల కోసం ఇప్పటికే అనేక వర్క్‌షాప్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమాల ద్వారా ఏమాత్రం ఆదాయం వచ్చినా దాన్ని దానధర్మాలకు కేటాయిస్తోంది. ఇప్పటికే తన గురించి అమెరికాలోని స్థానిక పత్రికల్లో కథనాలు వచ్చాయి. ప్రస్తుతం కార్యకలాపాలను తాను నివసించే సౌత్‌లేక్, టెక్సాస్‌లో నిర్వహిస్తుండగా.. వాటిని మరింతగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమెరికాలోని మరిన్ని నగరాల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు.. ఈ వేసవిలో విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు కూడా చేపట్టబోతోంది!

మరి ఈ యంగ్ ఫైనాన్స్ నిపుణురాలికి మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దాం.

పెళ్లి బాధలు



'సప్త సముద్రాలు ఈదినవాడు పిల్ల కాలువలో పడ్డట్టు' ఈ పిల్ల వలలో పడిపోయా నేను. బీటెక్ పూర్తయ్యాక ఆరంకెల జీతంతో ఉద్యోగం రావడంతో బంధువులంతా 'బెల్లం చుట్టూ ఈగల్లా' చేరి మా సంబంధమంటే మా సంబంధం ఉందని ఒకటే గోల. అత్యాశతో ఎనిమిది అంకెల కట్నం ఇస్తేనే చేసుకుంటా అని 'ఆకాశానికి నిచ్చెన' వేశా! 'పెరుగుట విరుగుట కొరకే' అన్న విషయం తర్వాత కానీ నాకు అర్థం కాలేదు. వయసు పెరిగేకొద్దీ వచ్చే సంబంధాలు తరిగిపోయాయి. ఎంత 'దున్నపోతు మీద వాన కురిసినట్టు' పట్టించుకోకుండా ఉందామన్నా కుదర్లేదు. అలాంటి టైమ్‌లో వచ్చిందో సంబంధం. కళ్లు చెదిరిపోయే కట్నకానుకలు ఆఫర్ చేసే సరికి 'గుడ్డెద్దు చేలో పడ్డట్టు' ఒప్పేసుకున్నా. ధూందాంగా పెళ్లయిపోయింది. రెండోరోజు నుంచే నాకు టార్చర్ మొదలైపోయింది. 'ఎడ్డెం అంటే తెడ్డం అనే రకం' ఆమె. 'రాజు తలచుకుంటే దెబ్బలు కొదవా', భార్య తలచుకుంటే బాధలు కరువా చెప్పండి? దాంతో గంటకో గొడవ, రోజుకో అలకగా సాగిపోతోంది సంసారం. 'తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు'.. అష్టకష్టాలు పెట్టడంలో అర్ధాంగి ఆరితేరిపోయింది. ఆర్థిక లాభాలు చూసి ఆశపడకూడదని నాకు అర్థమయ్యేసరికి బాగా లేటైపోయింది!

– ఎస్.శివ వరప్రసాద్, యాదాద్రి భువనగిరి

ఏదో సరదాకి!

ఇలా చేస్తే..



ఫిట్‌గా కనిపించడానికి మనం పడే కష్టం అంతా ఇంతా కాదు. క్లిష్టమైన డైట్లు పాటించేస్తూ, జిమ్‌లో కసరత్తులు చేస్తుంటాం. కానీ మరీ ఇంత శ్రమ పడకుండా బరువు తగ్గి, ఫిట్‌గా అయ్యే మార్గం ఒకటి నిపుణులు సూచిస్తున్నారు.. అదే 21-21-21 రూల్.

ఫిట్‌నెస్

తేలికపాటి వ్యాయామం

దీనిలో మొదట 21 రోజులు చిన్నచిన్న వ్యాయామాలపై దృష్టి పెట్టాలి. అంటే చిన్నప్పుడు స్కూల్లో చేసేవాళ్లం చూడండి.. జంపింగ్, స్ట్రెచింగ్ వంటివి. దీనివల్ల శరీరంలో కండరాలు అన్నీ కదలడానికి అలవాటుపడతాయి. 20-30 నిమిషాలు నడవడం మంచిది. సాధ్యమైనంతవరకూ మెట్లను వాడాలి. అదే సమయంలో రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి.

ఆహారం

తర్వాత 21 రోజులు తీసుకునే ఆహారంపై పూర్తి జాగ్రత్త వహించాలి. శరీర అవసరాలకు తగినట్లుగా ప్రొటీన్, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు తీసుకోవాలి. జంక్‌ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉండాలి. ఇంట్లో వండుకున్న వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి. తొందరగా జీర్ణం కాని పదార్థాలను రాత్రి సమయంలో తీసుకోకూడదు.

క్రమశిక్షణ

చివరి 21 రోజులు అలవాట్లపై దృష్టి పెట్టాలి. మద్యం, ధూమపానం వంటివి చేయకూడదు. బ్రేక్ సమయాల్లో బ్లాక్, గ్రీన్ టీలను తీసుకోవాలి. అనారోగ్యకరమైన అలవాట్లకు చెక్ పెట్టేయాలి. ఇలా ప్రతిరోజూ క్రమశిక్షణగా చేయడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతూ ఉండటంతో ఈ రూల్‌ను చాలా మంది పాటిస్తున్నారు.

అన్ని గంటలా!



మీకు తెలుసా?

ఉదయం లేచింది మొదలు.. నిద్రతో కళ్లు మూతలు పడేవరకు ఏదో ఒకలా ఫోన్ చూడాల్సిందే. లేదంటే ఫోన్ చేతిలో ఉంటేనే అసలు కదలని మనసులు కొందరివి. కానీ అలా నిరంతరం చేతిలో ఫోన్‌తో సమయాన్ని వృథా చేసుకోవడం అంత మంచిది కాదని మనకు తెలుసు. నేటి యువత సంవత్సరానికి దాదాపు 1,095 గంటల సమయాన్ని సోషల్ మీడియాలోనే గడుపుతున్నారని ఇటీవల ఓ నివేదికలో తేలింది. అన్ని గంటలంటే మాటలా! అందులో సగం సమయాన్నైనా ఏదైనా స్కిల్ నేర్చుకోవడానికి, సొంత పనులకు ఉపయోగించుకుంటే భవిష్యత్తు బంగారుమయమవుతుందిగా.. ఏమంటారు?

గంగపుత్రులకు.. స్మార్ట్ జాకెట్

అతడు పుట్టిపెరిగింది గంగమ్మ ఒడిలోనే. సముద్రం ఒడ్డున చేపల వేటతో జీవనం సాగిస్తూ సంతోషంగా కాలం గడిపే కుటుంబాలను చూశాడు. కానీ ఆ సంద్రంలోనే జాడ గల్లంతయ్యి మనుషులు తిరిగి రాకపోవడమూ చూశాడు. ఉన్నారో లేదో తెలియక.. వస్తారో రారో అనే ఆందోళనలో పిల్లాపాపలతో గుమ్మంలో వేచి చూసే ఆడపడుచులను చూసి చలించిపోయాడు. వేటకు వెళ్లిన మత్స్యకారులు కచ్చితంగా తిరిగి రావాలని భావించాడు. అందుకు తనేం చేయగలడో ఆలోచించాడు. అలా రూపుదిద్దుకున్నదే 'స్మార్ట్ జాకెట్'.. అనకాపల్లి జిల్లా పూడిమడకకు చెందిన దాడి తేజ రూపొందించిన ఈ ఆవిష్కరణ గురించి అతడి మాటల్లోనే..



'మాది మత్స్యకార కుటుంబం. మా ఊరి నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో ఏడాదికి కనీసం 6 నుంచి 8 మంది చనిపోతుంటారు. దేశం మొత్తంమీద ఇలా 600 మరణాలు సంభవిస్తున్నాయనేది అధికారిక లెక్క. అనధికారికంగా ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. కొందరు పొరపాటున సరిహద్దులు దాటి, పొరుగు దేశాల జైళ్లలో మగ్గిపోతున్నారు. మనది సుదీర్ఘ సముద్ర తీరమున్న దేశం. తుపాను ప్రభావమూ ఎక్కువే. తీరానికి సమీపంలో మత్స్య సంపద తగ్గిపోవడంతో మత్స్యకారులు సముద్రంలో మరింత లోపలకు వెళ్లాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఇప్పటికీ తెరచాపలనే వాడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఏటా మా జాలరుల మరణాలు పెరుగుతుండటం చూస్తే తట్టుకోలేకపోయా. ఇవన్నీ చూసి ఏదైనా చేయాలి అనిపించింది. అప్పుడే 'అలర్ట్ 24' అంకుర సంస్థ నా మదిలో మెదిలింది.

బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, వివిధ సంస్థల్లో పనిచేశా. రెండేళ్ల క్రితం వేటకు వెళ్లిన నా స్నేహితుడు ఒకరు తప్పిపోయాడు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఆ బాధతో ఇక ఉద్యోగంలో కొనసాగలేకపోయా. నా ఆలోచనలకు రూపునివ్వాలని గట్టిగా సంకల్పించా. 2024లో ఉద్యోగం మానేసి, అప్పటి నుంచి మత్స్యకారులను కాపాడే 'స్మార్ట్ జాకెట్' తయారీపై పనిచేస్తున్నా. 2025లో కంపెనీని రిజిస్టర్ చేశా. ప్రస్తుతం అయిదుగురం కలిసి పనిచేస్తున్నాం. ఒక్కొక్కరిది ఒక్కో రాష్ట్రం. అందరూ గంగపుత్రులే.

ఆచూకీ తెలిసేలా..

మత్స్యకారులు ఈ జాకెట్‌ను ధరిస్తే.. ఎప్పుడు, ఎక్కడ ఉన్నారో కచ్చితంగా తెలుసుకోవచ్చు. వారు నీటిలో పడిపోతే వెంటనే అలర్ట్ వస్తుంది. వారితో మాట్లాడేందుకూ అవకాశముంది. ఏ ప్రమాదంలో ఉన్నారో తెలుసుకునేందుకు కస్టమ్ అలర్టింగ్ సిస్టమ్‌ను రూపొందించాం. వారిలో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. అందుకే వినియోగించేందుకు వీలుగా కీప్యాడ్ ఫోన్ మాదిరి.. అనలాగ్ సిస్టమ్ ఉపయోగించాం. అందులో ఎమర్జెన్సీ బటన్, రాత్రిపూట కనిపించేందుకు ఎల్ఈడీ లైట్, వాయిస్ మానిటరింగ్ సిస్టమ్ ఉంటాయి. నెట్‌వర్క్ సరిగా లేని సమయంలోనూ జీపీఎస్ ట్రాకింగ్, స్మార్ట్ సెన్సార్లు, ఆటోమేటిక్ డిస్ట్రెస్ సిగ్నలింగ్‌ను ఉపయోగించి.. తీర ప్రాంత అధికారులు, పోలీసులు, అంబులెన్సు విభాగాలతో సంప్రదించడానికి అవకాశముంటుంది.

ఇప్పటికే స్మార్ట్‌జాకెట్‌తో 70సార్లు సముద్రం లోతుల్లో ట్రయల్స్ నిర్వహించాం. పేటెంట్ కోసం దరఖాస్తు చేశాం. ప్రస్తుత వెర్షన్‌లో స్మార్ట్‌జాకెట్ నుంచి ఏమైనా అలర్ట్స్ ఉంటే మాకు వస్తాయి. అలా కాకుండా.. మారిటైం డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెర్షన్-2లో నేరుగా కోస్ట్‌గార్డ్స్, సమీపంలోని ఓడలకు సమాచారం వెళ్తుంది.

● కేంద్ర పోర్టు, షిప్పింగ్, వాటర్‌వేస్ మంత్రిత్వశాఖ, ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలోని నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్, వాటర్‌వేస్, కోస్ట్స్ (ఎన్‌టీసీపీడబ్ల్యూసీ) నుంచి మా అంకుర గుర్తింపు పొందింది. అడ్వాన్స్‌డ్ వెర్షన్ (వెర్షన్-2) అభివృద్ధి చేయడానికి ఐఐటీ మద్రాస్ సహకారం అందించనుంది. ఫిలిప్పీన్స్ ఇన్నోవేషన్ సొసైటీ నుంచి ఉత్తమ సముద్ర ఉత్పత్తిగా ప్రత్యేక అవార్డు సాధించింది స్మార్ట్ జాకెట్. దీన్ని పరిగణించి అభివృద్ధి చేసి ఇవ్వడానికి తాజాగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని కంపెనీలతో ఎంవోయూ చేసుకున్నాం. ప్రభుత్వాలకు సైతం ప్రతిపాదనలు పంపిస్తున్నాం. ఇప్పటికే ఈ ఆవిష్కరణ పెట్టుబడిదారులను ఆకట్టుకుంటోంది.

● ఐఐఎం విశాఖలోని ఇంక్యుబేటర్‌లో జెనిసిస్ గ్రాంట్ ప్రోగ్రాంకు మా అంకుర సంస్థ ఎంపికైంది. కార్యకలాపాలను విస్తరించడానికి, మరింత అభివృద్ధి చేయడానికి రూ.2 లక్షల నిధితోపాటు మార్గనిర్దేశం చేశారు. భవిష్యత్తులో బహుళ అత్యవసర పరిస్థితులను పరిష్కరించగల కేంద్రీకృత స్మార్ట్ అలర్ట్ ఎకోసిస్టమ్‌ను రూపొందించేందుకు కృషి చేస్తున్నాం.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

కోపంతో రాజీనామా



కంపెనీ పాలసీతో విసుగు చెంది ఉండొచ్చు, పని వాతావరణం నచ్చక పోయి ఉండొచ్చు, కారణాలు ఏవైతేనేం.. యువతలో కోపంతో చెప్పాపెట్టకుండా ఉద్యోగాలు మానేయడం పెరుగుతోందట. దీన్నే 'రివెంజ్ క్విట్టింగ్' అంటున్నారు. ఇందులో ఉద్యోగులు కంపెనీకి ఎలాంటి ముందస్తు సమాచారం తెలియజేయకుండా మానేస్తున్నారు. 2025 మార్చిలో అమెరికాలోని 3,600 మందిపై చేసిన మాన్‌స్టర్ సర్వే ప్రకారం 47శాతం మంది రకరకాలైన కారణాలతో నోటీస్ ఇవ్వకుండా ఉద్యోగాన్ని మానేసినట్లు తెలిసింది. అంతేకాకుండా 57శాతం మంది తమతోటి ఎంప్లాయిస్ కూడా ఇలా మధ్యలోనే ఉద్యోగాన్ని వదిలేయడాన్ని చూశామని చెబుతున్నారు. ఈ ధోరణి కేవలం జెన్‌జీలలోనే కాదు, మిలీనియల్స్‌లోనూ పెరుగుతోంది.

హాకీలాంటిది.. కానీ కాదు! ఉత్తర అమెరికాలో ప్రాచుర్యం పొందిన ఆ ఆట.. ఇప్పుడు మన దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించింది.. అదే లాక్రోస్! నెట్‌తో కూడిన స్టిక్‌తో బాల్‌ను గోల్ పాయింట్‌లో వేయడం దీని ప్రత్యేకత. ఇప్పుడిప్పుడే తెలుగు రాష్ట్రాల్లో పాపులర్ అవుతున్న ఈ ఆట భారత జట్టు కెప్టెన్ ఎవరో తెలుసా.. మహబూబ్‌నగర్ జిల్లా యువకుడు అనుదీప్‌రెడ్డి! ఆటలో చేరిన కొన్నాళ్లకే సారథ్యం వహిస్తూ అదరగొడుతున్నాడు.

పరిచయమైంది.. ఇక పనిపడతాం!



మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుదీప్‌రెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. చిన్నతనం నుంచి క్రీడలంటే ఇష్టపడే అనుదీప్.. ముందు హాకీ ఆడేవాడు. ఒకరోజు అనుకోకుండా సామాజిక మాధ్యమాల్లో లాక్రోస్ ఆటను చూశాడు. అప్పటి నుంచి దీనిపై ఆసక్తి పెరిగి ఆడటం మొదలుపెట్టాడు. రెండేళ్ల క్రితమే దీన్ని ఒలింపిక్స్‌లో కూడా చేర్చారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో వందలాది మంది లాక్రోస్ క్రీడాకారులు తయారవుతున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు సౌదీ అరేబియాలో జరిగిన ఆసియా లాక్రోస్ గేమ్స్‌లో అనుదీప్ సారథ్యంలోని భారత జట్టు సత్తా చాటింది. ఫైనల్ మ్యాచ్‌లో 9-2 గోల్స్ చేసి ఇరాక్‌ను ఓడించి స్వర్ణం సాధించింది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లో జరిగిన పోటీల్లో వివిధ స్థాయుల్లో ఆడి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిన ఈ కుర్రాడు.. బృందం తరఫున జపాన్ ఇంటర్నేషనల్ గేమ్‌కి వెళ్లి వచ్చాడు. అంతకు ముందు సింగపూర్‌లో అంతర్జాతీయ క్రీడాకారులతో కలిసి సాధన చేశాడు. 12 మంది క్రీడాకారుల్లో బాగా రాణించడంతో ఇతడిని జట్టు సారథిగా నియమించారు. ప్రస్తుతం డిఫెండర్‌గా ఉన్నాడు. 2028లో జరిగే ఒలింపిక్స్‌లో ఆడి దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాడు!

– మహమ్మద్ షుకూర్, మహబూబ్‌నగర్

ఖర్చులు ఆపే ఛాలెంజ్

యువత తమ ఖర్చులను అదుపులో ఉంచుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తూ ఉంటారు. అలా తాజాగా ట్రెండింగ్‌లోకి వచ్చిందే 'నో స్పెండ్ ఛాలెంజ్-2026'. అనవసర ఖర్చులను మానేసేందుకు ఇప్పుడు చాలామంది దీన్ని యాక్సెప్ట్ చేస్తున్నారు. మన ఆర్థిక అలవాట్లపై అవగాహన పెంచుకునేందుకు, కంట్రోల్ తెచ్చుకునేందుకు, సరైన పద్ధతులను అలవాటు చేసుకునేందుకు.. ఇదో మార్గంగా భావిస్తున్నారు.



● ఒక 24 గంటలపాటు అసలు ఏమీ ఖర్చు చేయకూడదు. ఇంట్లో ఉన్న పదార్థాలతోనే వండుకుని తినాలి. ఆన్‌లైన్‌లో ఎటువంటి వస్తువులూ ఆర్డర్ పెట్టకూడదు.

● ఆ తర్వాత ఒక వీకెండ్ మొత్తం డబ్బులు బయటకు తీయకుండా ఉండాలి.. ఇది కొంచెం కష్టమే అయినా చేస్తున్నారు. బయటకు వెళ్లడానికి బదులు వాకింగ్‌కి వెళ్లడం, ఇంట్లోనే వర్క్ఔట్ చేయడం, సినిమాలు కూడా టీవీలో, ఓటీటీలో చూస్తున్నారు. టైమ్‌పాస్ కోసం చదవడం, రాయడం, ఇల్లు సర్దుకోవడం వంటివి చేస్తున్నారు. ఫ్రెండ్స్‌ను కలిసినా ఖర్చు లేకుండా మాత్రమే!

● తర్వాత ఈ జాబితాలో పాంట్రీ ఛాలెంజ్ వస్తుంది. అంటే ఒక వారం నుంచి రెండు వారాలపాటు సరకులు ఏవీ కొనకూడదు.. మరీ ఉప్పు, నూనె లాంటి అవసరమైనవి తప్ప. మన రూంలో ఉన్నవి, సగం సగం వాడి పక్కన పెట్టిన వాటిని ఫినిష్ చేశాకే షాపింగ్‌కి వెళ్లాలి.

● ఆపైన.. క్యాష్ ఓన్లీ వారం. అంటే దేనికి ఖర్చు పెట్టినా చేతిలో ఉన్న అమౌంట్‌తోనే కట్టాలి. క్రెడిట్/డెబిట్ కార్డు, యూపీఐ వంటివి వాడకూడదు. దీనివల్ల మైండ్‌ఫుల్ ఎక్స్‌పెండిచర్ పెరుగుతుంది.

● మనవద్ద ఉన్న సబ్‌స్క్రిప్షన్స్‌ను ఓ 30 రోజులపాటు ఆపేయాలి. అవి లేకుండా ఉండటానికి అలవాటుపడాలి. అవి లేకపోయినా మనకేం తేడా తెలియడం లేదు అంటే పూర్తిగా మానేయొచ్చు.

● 30 నుంచి 90 రోజులపాటు కొత్త దుస్తులు, యాక్సెసరీలు.. ఏవీ కొనకూడదు. ఉన్నవే వేసుకోవాలి. ట్రెండ్ ఆధారిత షాపింగ్ మానేయాలి. దీని వల్ల డబ్బు ఆదాతోపాటు ప్రశాంతత కూడా సొంతం! మరి మీరు వీటిలో ఏది వెంటనే మొదలుపెడతారో చూడండి!

కలంకారీ.. కోర్సెట్ కుర్తీ





గబగబా ఆఫీసుకు తయారవ్వాలి.. కానీ అందంగా కనిపించాలి. జీన్సులూ ప్యాంటులూ వేయాలి.. అయినా జుంకాలతో అవి మ్యాచ్ అవ్వాలి. మన అమ్మాయిల డిమాండ్లకు లెక్కేం ఉంది చెప్పండి! అందుకే ఆఫీసైనా, కాలేజైనా సరిగ్గా సెట్ అయ్యేలా ఈ షార్ట్ కుర్తీలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. అంతే కాదు కలంకారీ డిజైన్లతో ఆకట్టుకుంటున్న ఇవి.. కోర్సెట్ మోడల్‌లో లభ్యమవుతున్నాయి. ఎంత వదులుగా ఉండాలో నిర్ణయించుకుని, చక్కగా కనిపించేలా చేస్తున్నాయి. రాబోతున్న సమ్మర్‌కి తగిన విధంగా ప్యూర్ కాటన్ ఫ్యాబ్రిక్‌తో మెరుస్తున్న ఇవి.. మీకూ నచ్చాయా!

వెళ్లిపోవద్దు

నిప్పు కణికలనైనా
అరచేతిలో పట్టుకోగలను
కానీ నీ నిర్లక్ష్యాన్ని మాత్రం
అర క్షణమైనా తట్టుకోలేను
ప్రపంచం మాయమైనా
పట్టింపు లేదు
నువ్వు చూపు తిప్పుకొంటే
ప్రాణం ఊరుకోదు
ఎందుకంత చిన్నచూపు?
ప్రేమించడమేనా నా తప్పు?

- ఎస్.మహిమ, కోడూరు

అతిగా ఆలోచించొద్దు

యువ బంధాలు



రవి, సాధనలకు ఈ మధ్యనే పెళ్లయింది. అబ్బాయికి విదేశాల్లో మంచి ఉద్యోగం, పెళ్లి తర్వాత అమ్మాయి అక్కడికి వెళ్లింది. అతికొద్ది కాలంలోనే ఆమెను వెంటపెట్టుకుని అతడు తిరిగి ఇండియా వచ్చేయాల్సి వచ్చింది. ఇద్దరి మధ్యా పొరపొచ్చాలే ఇందుకు కారణం. ఎవరు ఏమంటున్నారంటే..

రవి : ప్రతి విషయాన్నీ విమర్శలాగే తీసుకుంటుంది. కాంప్లిమెంట్ ఇచ్చినా వెటకారం అనుకుంటుంది. ఇంట్లోనే ఉంటున్నాను అని ఫీలవుతుంది, కానీ ఉద్యోగం చేయడానికి ఇష్టపడదు. చిన్న చిన్న అంశాలకు కూడా గట్టిగా అరవడం, ఏడవడం చేస్తుంది. ఏం మాట్లాడితే ఏం గొడవ వస్తుందో అనే కంగారులో బతుకుతున్నాను. కూర్చుని మాట్లాడుకుని సెట్ చేసుకుందాం అని ప్రయత్నించినా వినట్లేదు. నన్ను బయట వ్యక్తిలా చూస్తుంది, అన్నీ నెగెటివ్‌గా తీసుకుంటూ ఉంటే ఏం చేయాలో తెలియడం లేదు.

సాధన : నాకు ఏవిధంగా సపోర్ట్ చేయడం లేదు, అన్నీ వాళ్ల అమ్మానాన్నలతోనే మాట్లాడతాడు. ఎప్పుడూ అలా ఉండు, ఇది కట్టుకో అని చెబుతూ ఉంటాడు. నాకేం తెలియదు అన్నట్టు ఫీలవుతున్నాడేమో అనిపిస్తుంది. నేను మాట అంటే పడలేను. ఏం తప్పు చేశానని నన్ను జడ్జ్ చేయడానికి? తను ఎప్పుడూ వర్క్‌లో బిజీగా ఉంటాడు, ఊరు కాని ఊరులో అమ్మానాన్నలకు దూరంగా ఇంత దూరం తనకోసమేగా వచ్చాను. మరి అంత ప్రేమ, సపోర్ట్ నాకు ఇవ్వకపోతే ఎలా ఉండాలి తనతో?

నిపుణులు : మీరు చెబుతున్న కంప్లైంట్స్, ఇచ్చిన ఇతర వివరాల ఆధారంగా.. అమ్మాయి ఒంటరితనం కారణంగా ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌లోకి జారిపోయినట్టుగా అనిపిస్తుంది. ఆ సమయంలో అబ్బాయి తను కోరుకున్న విధంగా రెస్పాండ్ కాకపోవడం వల్ల సమస్య మరింత ముదిరి ఇతర విషయాలకూ పాకింది. ముందు మీ పెళ్లి లక్ష్యం ఏంటో తెలుసుకోండి. ఒకరితో ఒకరు సంతోషంగా జీవించాలని వివాహం చేసుకున్నారు. ఎటువంటి ఆర్థిక, అనారోగ్య సమస్యలూ లేవు, పెద్దలు - పిల్లల బాధ్యతలు లేవు. ఈ సమయంలో లేనిపోని అపార్థాల ద్వారా విలువైన సమయం వృథా అవుతుంది. ఒకరితో ఒకరు సమయం గడపడం, ప్రతి విషయాన్నీ పాజిటివ్‌గా మాత్రమే చూడటం ప్రాక్టీస్ చేయండి. దేనికి గొడవ రావొచ్చో అంచనా వేసి ఆ ట్రిగ్గర్స్‌ను అవాయిడ్ చేయండి. యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన వ్యాపకాలు అలవాటు చేసుకోండి. దాంపత్య జీవితం మీదా దృష్టి పెట్టండి. చిన్న చిన్న సర్‌ప్రైజ్‌లు ఇచ్చుకోవడం, ఒకరికొకరు ఎక్కువ అటెన్షన్ ఇవ్వడం ద్వారా పరిస్థితి తప్పక మెరుగుపడుతుంది.



– అర్చన నండూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

(యువతీయువకుల పేర్లు మార్చాం)

డబల్ రొట్టె

90ల్లోకి వెళ్దామా..

నేను నిక్కర్లు తొడుక్కునే రోజులవి. రోజూ సాయంత్రం మా వీధిలోకి ఒక చిన్న చెక్కపెట్టెతో ఓ మనిషి వచ్చేవాడు. ఆ పెట్టె మూత తీస్తుంటే.. లోపల నుంచి వచ్చే వేడి వేడి డబల్ రొట్టె వాసన నా గుండెను తాకేది! 'డబల్ రొట్టె.. డబల్ రొట్టె..' అనే అతని కేక వినపడగానే పరుగెత్తుకెళ్లాలి అనిపించేది. కానీ అప్పట్లో మన పరిస్థితి వేరు. డబ్బులు అంతగా ఉండేవి కావు. ఇంట్లో అడుగుదాం అన్నా.. వచ్చే సమాధానం తెలిసి, అడిగేవాడ్ని కాదు. కానీ ఆ రొట్టె తినాలని మాత్రం చాలా ఆత్రంగా ఉండేది.

ఓరోజు ఇంటికి దూరపు చుట్టాలు వచ్చారు. వెళ్తూ వెళ్తూ ఏమైనా కొనుక్కోమని చిల్లర డబ్బులు ఇచ్చారు. అవి చూసి నాకు కలిగిన సంతోషం మాటల్లో చెప్పలేను! రాత్రి నిద్రపోయేటప్పుడు.. ఆ డబల్ రొట్టే కలలోకొచ్చింది.

కానీ మరుసటి రోజు అతను రాలేదు.



వీధి ఖాళీగా కనిపించింది. నా చేతిలోని చిల్లర నా వంక జాలిగా చూసింది. అదేంటో ఆ తర్వాత కూడా.. నా దగ్గర డబ్బులున్నప్పుడు అతడు వచ్చేవాడు కాదు. లేనప్పుడు మాత్రం 'డబల్ రొట్టె..' అనుకుంటూ అరిచేవాడు. తనివితీరా తిన్న రోజులు తక్కువ.

కాలం గడిచింది. ఇప్పుడు నేను రొట్టెకు కాదు.. ఓ బేకరీకి యజమానిని.

కానీ.. ఆ చెక్కపెట్టె లోంచి వచ్చే ఆ చిన్ననాటి రొట్టె వాసనను మాత్రం మళ్లీ చవిచూడలేకపోతున్నా.

మొన్నొక రోజు ఓ పిల్లాడు బేకరీ ఎదురుగా నిల్చుని తదేకంగా చూస్తున్నాడు. దగ్గరకు పిలిచి ఓ డబల్‌రొట్టె చేతిలో పెట్టాను. తను నవ్వాడు, నేనూ నవ్వుతూ.. 'టీలో ముంచి తింటే ఇంకా బావుంటుంది' అని చెప్పాను.


తనకైనా చిన్ననాటి ఆశ తీరాలని!

– వద్ది శ్రీనాథ్, వెంకటాపురం, ములుగు జిల్లా

కొంటె కొటేషన్



1. యాక్షన్ చేయకు శ్రీపతి.. లాగుతోంది నీ శ్రీమతి. – అద్విక్
2. ముందు గొయ్యి.. వెనక లాగే చెయ్యి. – లద్దగిరి లక్ష్మీదేవి, కర్నూలు
3. ఎక్కడికి వెళ్తావు నా పతి.. పక్కనే ఉండగా నీ సతి – మమత, హన్మకొండ
4. ప్రేమలో ఉన్నప్పుడు కేక్‌వాక్.. పెళ్లయ్యాక బ్యాక్ మూన్‌వాక్. – హరిత, ఏలూరు
5. చిన్నదానికే అలకా?.. అందుకే పట్టా నీ పిలక. – చుండూరి సత్య
6. వెళ్లకు మామా.. లాగకు భామా.. – ఎ.ఎ.నాగేంద్ర



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ఈనాడు సినిమా



రామ్ చరణ్

కొత్త సినిమాలతో అగ్ర తారలంతా సెట్స్‌లో బిజీ బిజీ. రానున్న నెలల్లో వరుసగా వాళ్ల పుట్టిన రోజులు. ఆయా సినిమాల ప్రచార చిత్రాల విడుదలకు ఇంతకు మించిన మంచి తరుణం ఏముంటుంది? అభిమానుల్లోనూ అవే అంచనాలు. ఏ హీరో సందడి ఎలా ఉంటుందో చూడాలి మరి!

పుట్టినరోజు పసందుగా...

అభిమానుల్ని అలరించడానికి తారల సన్నాహాలు



అల్లు అర్జున్

అగ్రతారల పుట్టినరోజు పండుగలంటే వాళ్ల అభిమానులకూ సంబరమే. ఆ రోజు ఆయా తారల సినిమాలకు సంబంధించిన కొత్త సంగతులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. సినిమాలు అప్పటికే సెట్స్‌పై ఉన్నట్టైతే... వాటి లుక్స్, పాటలు, లేదంటే టీజర్లు, ట్రైలర్లూ విడుదలవుతూ ఉంటాయి. మార్చిలో రామ్‌చరణ్, ఏప్రిల్‌లో అల్లు అర్జున్, మేలో ఎన్టీఆర్ బర్త్‌డేలు ఉన్నాయి. కొత్త సినిమాలతో మంచి లైనప్‌తో ఉన్నారు ఈ హీరోలంతా. వీళ్ల సినిమాల సందడి కోసం అభిమానులంతా ఇప్పుడు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

ప్రత్యేకమైన జాగ్రత్తలతో..

ఒక లుక్ చాలు... సినిమాపై మరిన్ని అంచనాలు పెరగడానికి! ఒక పాట సినిమా మార్కెట్‌నే ప్రభావితం చేస్తుంది. టీజర్, ట్రైలర్‌తోనే ఆ సినిమాని థియేటర్‌లో చూడాలో వద్దో ప్రేక్షకులు నిర్ణయించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ఆ విషయాలపైన చిత్రబృందాలు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకొంటున్నాయి. వాటికోసమే ప్రత్యేకమైన బృందాల్ని నియమించి నెలలపాటు కసరత్తులు చేయిస్తుంటాయి. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న అగ్ర తారల సినిమాలన్నీ కూడా ఆ పనిలోనే ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు ఇప్పటికే ఆ చిత్రబృందం ప్రకటించింది. మార్చి 27 రామ్‌చరణ్ పుట్టినరోజు. అప్పటికి సినిమా విడుదలకు నెల రోజుల సమయం ఉంటుంది. ప్రచారంలో జోరు పెంచే సమయం కూడా అదే. మరి ఆ సందర్భంలో టీజర్‌ని విడుదల చేస్తారేమో చూడాలి. మరోవైపు తదుపరి సుకుమార్ దర్శకత్వంలో చేయనున్న సినిమాకి సంబంధించిన కొత్త సంగతులూ ఏవైనా వినిపించే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే 'పెద్ది'లోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకూ చిత్ర బృందం సన్నాహాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. మరో అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఆ సినిమా పేరు కానీ, ఇతరత్రా ప్రచార చిత్రం కానీ ఇప్పటిదాకా విడుదల కాలేదు. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజుని పురస్కరించుకుని ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న అట్లీ సినిమా పేరుని, ప్రచార చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త సినిమాకి సంబంధించిన కొత్త విశేషాల్నీ ఈ సందర్భంగానే విడుదల చేస్తారని ప్రచారం సాగుతోంది. అందుకు సంబంధించిన పనులూ మొదలైనట్టు తెలుస్తోంది.



మేలో ఎన్టీఆర్ హంగామా

తెలుగులో రూపుదిద్దుకొంటున్న భారీ ప్రాజెక్టుల్లో మరొకటి ఎన్టీఆర్ - ప్రశాంత్‌నీల్ చిత్రం. 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లిన ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. వడివడిగా చిత్రీకరణ చేసుకొంటున్న ఈ సినిమాకి సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి విషయాలు బయటకి రాలేదు. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ విడుదలయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా పేరుపై కూడా అప్పుడే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మార్చి 27న శ్రీరామనవమి పండగ సందర్భంగా కూడా కొత్త సినిమాల ప్రచార హంగామా కొనసాగే అవకాశాలున్నాయి. రామాయణం ఆధారంగానే మహేశ్‌బాబు - రాజమౌళి కలయికలో 'వారణాసి' రూపొందుతోంది. ఇందులో మహేశ్‌బాబు శ్రీరాముడిగా కనిపించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముడి అవతారంలో మహేశ్ కనిపించారంటే అభిమానులకు పండగ మరింత ప్రత్యేకం అవుతుంది. కథానాయకులంతా తమ కొత్త సినిమాల్ని జోరుగా ముందుకు నడిపిస్తుంటే.. అభిమానులు అంతే హుషారుగా ఆయా సినిమాల సందడి కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రేమలో పడాలనిపించింది!



ప్రభాస్

అందరూ తనను యాక్షన్ కథానాయకుడిగానే చూసినా... తనకి ప్రేమకథలన్నా ఎంతో ఇష్టమన్నారు అగ్ర కథానాయకుడు ప్రభాస్. ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా చూసినప్పుడు ప్రేమలో పడాలనిపించిందని చెప్పారు. సంతోష్ శోభన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆ చిత్రబృందంతో కలిసి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు ప్రభాస్. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు. ప్రేమకథల్లో తనకి 'గీతాంజలి' సినిమా అంటే ఎంతో ఇష్టమని, తరచూ చూస్తుంటానని చెప్పారు. 'గీతాంజలి', 'ఏమాయ చేసావె' సినిమాలు చూసినప్పుడు ప్రేమలో పడాలనిపించినట్టే, 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడూ అదే అనుభూతి కలిగిందని చెప్పారు ప్రభాస్. తన ఆహారపు అలవాట్లు, ఇతర రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టడం గురించి ఈ ఇంటర్వ్యూలో చర్చకొచ్చింది. సంతోశ్ శోభన్ అడిగిన ఓ ప్రశ్నకు ప్రభాస్ స్పందిస్తూ... 'ఆదిపురుష్' సినిమా సెట్‌లో జరిగిన ఓ ఆసక్తికరమైన సంఘటన గురించి చెప్పుకొచ్చారు. "ముంబయిలో చిత్రీకరణ జరుగుతున్నప్పుడు చెన్నై వంటకాల్ని తెప్పిస్తానని చెప్పా. సెట్‌లో అందరూ స్థానికంగానే తమిళ వంటకాల్ని తయారు చేయించి తెప్పిస్తున్నానేమో అనుకున్నారు. నేను చెన్నైలోనే తయారు చేయించి, ఫ్లైట్‌లో ఆహారాన్ని తెప్పిస్తున్నట్టు తెలుసుకుని అందరూ ఆశ్చర్యంగా చూశార"ని చెప్పారు ప్రభాస్.

ఈసారి యుద్ధం వేరు.. కుతంత్రాలు వేరు!



యశ్

ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' ఒకటి. 'కేజీఎఫ్' విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి వస్తున్న బహుభాషా చిత్రమిది. గీతూ మోహన్ దాస్ తెరకెక్కించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మించాయి. కియారా అడ్వాణీ కథానాయిక. నయనతార, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్, తారా సుతారియా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మార్చి 19న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో శుక్రవారం టీజర్‌ని విడుదల చేశారు. 'ఈసారి యుద్ధం వేరు.. వాళ్ల కుతంత్రాలు వేరు.. అందరితో విరోధం పెట్టుకుని బతకలేం.. పట్టుదల వదిలేయ్ రాయ" అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం హింస.. రక్తపాతంతోనే సాగింది. దీంట్లో పలువురు నాయికలున్నా.. ఏ ఒక్కరి పాత్రనీ టీజర్‌లో చూపించలేదు. ప్రచార చిత్రమంతా వైల్డ్ యాక్షనే కనిపించింది. గీతూ మోహన్‌దాస్ స్టైలిష్ టేకింగ్.. విజువల్స్.. నేపథ్య సంగీతం.. అన్నీ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయి. టీజర్ ఆఖర్లో యశ్ యంగ్ లుక్‌లో కనిపించిన తీరు ఆసక్తిరేకెత్తించింది. మరి తనిందులో ద్విపాత్రాభినయం చేస్తున్నాడా? లేక రెండు గెటప్పుల్లో కనువిందు చేయనున్నారా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతమందిస్తుండగా.. రాజీవ్ రవి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

వీర రాజా వీర గీతానికి.. క్రెడిట్స్ ఇవ్వడానికి రెహమాన్ అంగీకారం



'పొన్నియిన్ సెల్వన్ 2' చిత్రంలోని 'వీర రాజా వీర' అనే గీతానికి డగర్ బ్రదర్స్‌కు క్రెడిట్ ఇవ్వడానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సుప్రీంకోర్టులో అంగీకరించారు. శుక్రవారం కేసుని విచారించిన ధర్మాసనం సవరించిన క్రెడిట్‌లు అయిదు వారాలలోపు అన్ని సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ కనిపించాలని ఆదేశించింది. "ధర్మాసనం చెప్పిన కారణాలతోనే కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం పార్టీలను ఒప్పించాము. దీనికి రెహమాన్ అంగీకరించారు. అన్ని ఓటీటీలకు సంబంధించిన క్రెడిట్‌లను.. 'డగర్వాణీ సంప్రదాయం ధ్రుపద్, తొలిసారి రికార్డ్ చేసిన దివంగత ఉస్తాద్ ఎం ఫయాజుద్దీన్, ఆయన మేనల్లుడు ఉస్తాద్ ఫయాజ్ వసీఫుద్దీన్ డగర్‌'గా క్రెడిట్ ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో 'వీర రాజా వీర'ను తాము సంగీతం అందించిన 'శివస్తుతి' నుంచి కాపీ చేశారని డగర్ పేర్కొన్నారు. తాజాగా దీనిపై ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది.

చెప్పకూడని కథే కానీ..!



బాబీ డేఒల్

ప్రతినాయక పాత్రలతో వెండితెరపై.. మరోవైపు ఓటీటీ వేదికగా కూడా ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ నటుడు బాబీ డేఒల్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బందర్'. దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్ తెరకెక్కించారు. నిఖిల్ ద్వివేది నిర్మించారు. గతేడాది టొరంటో చిత్రోత్సవంలో ప్రదర్శితమైన ఈ సినిమాకు సినీ ప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా దీన్ని మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు తెలుపుతూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను పంచుకున్నారు బాబీ డేఒల్. "చెప్పకూడని కథ. కానీ ప్రేక్షకులు కచ్చితంగా తెలుసుకోవాలి" అనే వ్యాఖ్యను జోడించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో సన్యా మల్హోత్రా, రాజ్ బి.శెట్టి, జితేంద్ర జోషి తదితరులు నటించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో సమర్ అనే ఓ టీవీ స్టార్‌గా కనిపించనున్నారు బాబీ.

వారం ఆలస్యం... మృత్యుంజయ్



శ్రీవిష్ణు

కథానాయకుడు శ్రీవిష్ణు 'మృత్యుంజయ్' సినిమా వాయిదా పడింది. ఈనెల 27నే తెరపైకి రావాల్సిన ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా మార్చి 6న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం కొత్త విడుదల తేదీతో కూడిన ప్రత్యేక పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. పాటలు, వినోదం లేకుండా సాగే అచ్చమైన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. హుసేన్ షా కిరణ్ తెరకెక్కించారు. రెబా మోనికా జాన్ కీలక పాత్ర పోషించింది. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఇక మరోవైపు శ్రీవిష్ణు నటించిన మరో కొత్త సినిమా 'విష్ణు విన్యాసం' ఈనెల 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే.

చిత్రీకరణ పూర్తి.. విడుదలకు రెడీ



హవీశ్

'నేను రెడీ' చిత్రంతో ఈ వేసవికి థియేటర్లలో సందడి చేయనున్నారు హీరో హవీశ్. ఆయన.. కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాని త్రినాథ రావు నక్కిన తెరకెక్కించారు. నిఖిల కోనేరు నిర్మాత. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో షూట్ చేసిన క్లైమాక్స్ ఎపిసోడ్‌తో ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే వినోదాత్మక కథతో ఈ సినిమా రూపొందిందని.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నామని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఛాయాగ్రహణం: నిజార్ షఫీ.

ప్రేమ.. కామెడీ.. సస్పెన్స్



మంజునాథ్

మంజునాథ్ హీరోగా అభిరామ్ గంటా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. దీన్ని వి.లక్ష్మీ దేవి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఇటీవలే హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మంజునాథ్ క్లాప్ కొట్టగా.. శేఖర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం దర్శకుడు అభిరామ్ మాట్లాడుతూ.. "ప్రేమ, కామెడీ, సస్పెన్స్, ఎమోషన్.. అన్నీ ఉన్న మంచి కమర్షియల్ చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. "కుటుంబ సమేతంగా చూడదగ్గ ఎంటర్‌టైనర్ ఇది. ఏప్రిల్ నుంచి చిత్రీకరణ ప్రారంభమవుతుంది" అన్నారు హీరో మంజునాథ్.

నవ్వులతో థియేటర్లు ఊగుతున్నాయ్!



శివాని, సుహాస్, నరేశ్, వంశీ నందిపాటి

"ఒత్తిడిలో ఉన్న వాళ్లకి 'హే బల్‌వంత్' మంచి మెడిసిన్ లాంటి సినిమా. హాయిగా నవ్విస్తూ మనసుల్ని తేలిక చేస్తుంది" అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. సుహాస్ - శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రాన్ని గోపీ అచ్చర తెరకెక్కించారు. బి.నరేంద్ర రెడ్డి నిర్మించారు. నరేశ్, స్రవంతి కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు నరేశ్ మాట్లాడుతూ.. "ప్రేక్షకుల నవ్వులతో థియేటర్లు ఊగిపోతున్నాయి. ఎవరూ సీట్లలో కూర్చోవడం లేదు. పడిపడి నవ్వుతున్నారు. వాళ్ల ఆనందం చూస్తుంటే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఓ కొత్త కాన్సెప్ట్‌తో దర్శకుడు చక్కటి బ్లాక్‌బస్టర్‌ని తీశారు. ఇలాంటి సినిమా, పాత్ర నాకు మళ్లీ రాదు" అన్నారు. "నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్ ఇది. అందరూ నవ్వుకుంటూ సినిమా చూస్తున్నారని చెబుతున్నారు" అన్నారు హీరో సుహాస్. ఈ కార్యక్రమంలో నరేంద్ర రెడ్డి, శివాని, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అక్షయ్ భూత్‌బంగ్లాలో.. మిథిల



మిథిల

గ్లామర్‌కు నటనను జోడించి ఆకట్టుకునే హీరోయిన్ మిథిలా పాల్కర్. విష్వక్ సేన్ సరసన 'ఓరి దేవుడా' చిత్రం అనంతరం.. మూడేళ్ల విరామం తర్వాత ఆమె తెలుగులో నటిస్తున్న సిరీస్ 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన ఈ సిరీస్‌తో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా త్వరలోనే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది. తాజాగా ఆమె.. తాను నటించిన 'భూత్ బంగ్లా'లో నటించినట్లు వెల్లడించారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఈ సినిమా ప్రచారపర్వంలో భాగంగా అక్షయ్‌కి సంబంధించిన ఓ షోలో పాల్గొంది మిథిల. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేస్తూ అక్షయ్.. "మిథిల సోషల్ మీడియా ద్వారా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఇప్పుడు ఎన్నో చిత్రాలలో నటిస్తోంది. త్వరలో ఆమె నాకు బాగా తెలిసిన ఓ నటుడితో కలిసి నటించబోతుంది. అతనెవరో కాదు.. నేనే"అంటూ ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తూ ఈ విషయాన్ని పంచుకున్నారు. అంతే కాదు ఆమె అద్భుతమైన నటి అని.. ఈ సినిమాలో తన సోదరి పాత్రలో కనిపించనుందని అన్నారు. దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఇప్పటి వరకూ టబు, వామికా గబ్బి, రాజ్‌పాల్ యాదవ్ నటిస్తున్నట్లే ప్రకటించింది చిత్రబృందం.

ఆ పరిస్థితులే ఇప్పుడు సహాయపడ్డాయి



శనయా కపూర్

గతేడాది 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' చిత్రంతో తొలిసారి తెరపై మెరిసింది సంజయ్ కపూర్ కుమార్తె, కథానాయిక శనయా కపూర్. దీని కన్నా ముందు ధర్మ ప్రొడక్షన్స్ రూపొందించిన 'బేధడక్'తో వెండితెరపై అడుగుపెట్టాల్సిన ఆమె.. కొన్ని కారణాలతో తన తొలి చిత్రం వాయిదా పడింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శనయా.. మొదటి ప్రాజెక్టు ఆగిపోవడం గురించి మాట్లాడుతూ.. అది తనపై ఎలాంటి ప్రభావం చూపలేదని అంటోంది. "ప్రతిదీ ఒక కారణం వల్లే జరుగుతుంది. ఇప్పుడు నేను వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ అనుభవం నాకు సంతోషంగా ఉంది. ఆ పరిస్థితులే ఈ రోజు నన్ను నటిగా తీర్చిదిద్దుకోవడంలో సహాయపడ్డాయి. సినిమా వాయిదా పడటం, కొన్ని ప్రాజెక్టులు చిత్రీకరణ పూర్తయ్యి.. విడుదల కాకపోవడం లాంటి అంశాలు నాకెన్నో విషయాల్ని నేర్పాయి. మా నాన్న ఎప్పుడూ పరిస్థితుల కన్నా నా కళపై దృష్టి పెట్టమని ప్రోత్సహించేవారు. కెమెరా ముందు నటించే అవకాశం రాకపోతే.. ఒక సన్నివేశాన్ని ఎంచుకొని ప్రేక్షకుల ముందు ప్రదర్శించాలని చెప్పేవారు. కొన్ని విషయాలు నియంత్రణకు మించినవని, వాటి గురించి బాధపడటంలో అర్థం లేదని సలహా ఇచ్చారు. ఆయన సలహాలే పాటిస్తున్నా"అని చెప్పుకొచ్చింది శనయా.

ఈనాడు బిజినెస్

అంతర్జాతీయ వృద్ధికి ఏఐ అండ

- వికసిత్ భారత్ లక్ష్యానికీ తోడ్పాటు
- ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉంది
- ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టలీనా జార్జివా



క్రిస్టలీనా జార్జివా

దిల్లీ: అంతర్జాతీయ వృద్ధిని కృత్రిమ మేధ (ఏఐ) 0.8 శాతం మేర పెంచుతుందని, 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో భారత్‌కు సాయపడుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఎండీ క్రిస్టలీనా జార్జివా పేర్కొన్నారు. అయితే ఉద్యోగాలు, ఆర్థిక స్థిరత్వానికి ఏఐ నుంచి గణనీయమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సాంకేతికతపై ఆశాభావం వ్యక్తం చేస్తూనే, ఏఐ ప్రభావాన్ని 'అతిగా ఊహించి చెప్పవద్దని' జార్జివా హెచ్చరించారు. ఏఐని ఒక 'మంచి లేదా చెడు శక్తి'గా మార్చకుండా, దాన్ని అభివృద్ధి చేయడం, నిర్వహించడం మధ్య సమతుల్యత పాటించాలని ఆమె సూచించారు. 'ప్రపంచ వృద్ధిని ఏఐ దాదాపు ఒక శాతం వరకు పెంచొచ్చు. మేము దాన్ని 0.8 శాతంగా అంచనా వేస్తున్నాం. మరిన్ని అవకాశాలు, ఉద్యోగాల సృష్టికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. భారత్‌కు కూడా ఇదే స్థాయిలో అవకాశాలను అందిస్తుందని భావిస్తున్నామ'ని ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో వెల్లడించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, ఏఐ వినియోగంలో వేగంగా ముందుకు వెళ్లే దేశాలకు ఏఐ గొప్ప అవకాశాలను కల్పిస్తుందని, వీటిని దేశాలు అందిపుచ్చుకోవాలని, అదే సమయంలో ముప్పులను దృష్టి ఉంచుకోవాలన్నారు.

అమెరికా- భారత్ భాగస్వామ్యం కీలకం: పిచాయ్



ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా ఏఐ ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడంలో అమెరికా- భారత్ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని, గూగుల్, మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆయన మాట్లాడుతూ, అమెరికా-భారత్ మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో రాబోయే సంవత్సరాల్లో ఇరుదేశాల మధ్య బలమైన టెక్ భాగస్వామ్యానికి గట్టి పునాది పడుతుందని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య అనుసంధానంగా సేవలు అందిస్తున్నందుకు గూగుల్ గర్విస్తోందని పిచాయ్ పేర్కొన్నారు. 'సరఫరా వ్యవస్థలు సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకోవడంపై పాక్స్ సిలికా దృష్టి పెడుతుంది. కీలక టెక్నాలజీల్లో వాణిజ్య భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తుంది. ఇరు దేశాల కార్యక్రమాలు, ఆవిష్కరణల కోసం మా బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నాయి' అని పిచాయ్ వివరించారు.

ఆరోగ్య రంగంలో భారీ మార్పులు
కిరణ్ మజుందార్ షా



బయోలాజికల్ ఇంటెలిజెన్స్, కృత్రిమ మేధలను కలిపితే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా పేర్కొన్నారు. ముందస్తు ఆరోగ్య అంచనా, రీజెనరేటివ్ సైన్స్, లైఫ్‌స్పాన్ మేనేజ్‌మెంట్‌లో అద్భుతమైన ఆవిష్కరణలకు దారితీయొచ్చని అంచనా వేశారు. గిగావాట్ శక్తితో పనిచేసే ఏఐ వ్యవస్థలతో పోలిస్తే, డేటా కేంద్రాలు మాదిరిగా బయోలాజికల్ వ్యవస్థలు పనిచేస్తాయని, తక్కువ శక్తితో సమాచారాన్ని ప్రాసెస్ చేస్తాయని అన్నారు.

భారత్‌కు అద్భుతమైన అవకాశం
క్వాల్‌కామ్ సీఈఓ



కృత్రిమ మేధ ఒక ప్రాథమికమైన మార్పును తీసుకొస్తుందని, కొత్త పరికరాలు, అనుభూతులు, సేవలను సృష్టిస్తూ.. భారీ అవకాశాలను అందిస్తుందని క్వాల్‌కామ్ అధ్యక్షుడు, సీఈఓ క్రిస్టియానో అమోన్ తెలిపారు. ఈ మార్పుల నుంచి ప్రయోజనం పొందడానికి భారత్‌కు ఇది ఒక 'అద్భుతమైన' అవకాశమని పేర్కొన్నారు. ఇంటర్నెట్ దశను దాటి నేరుగా మొబైల్ ఇంటర్నెట్ వైపు భారత్ దూసుకెళ్లిందని, ఏఐ విషయంలో ఇది మళ్లీ జరగొచ్చని అన్నారు. స్మార్ట్ సిటీల మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల విస్తృతి పెంచడం, విద్యా రంగంలో లెర్నింగ్ టూల్స్‌ను అందించడం, వ్యవసాయ రంగంలో మార్పులను ఏఐ తీసుకొస్తుందన్నారు.

డిజిటల్ కాలనీ ప్రమాదాన్ని నివారించాలి

విదేశీ వ్యవస్థలపై ఆధారపడే 'డిజిటల్ కాలనీ'గా మారకుండా ఉండాలంటే, భారత్ సొంతంగా ఫౌండేషనల్ ఏఐ టెక్నాలజీను నిర్మించుకోవాలని సర్వమ్ ఏఐ సహవ్యవస్థాపకుడు వివేక్ రాఘవన్ అన్నారు. 'జీవితంలో ప్రతి అంశాన్ని ప్రభావితం చేసే ప్రధాన సాంకేతిక ఏఐ. దీంతో మన దేశం తప్పనిసరిగా ఏఐని అభివృద్ధి చేయాలి' అని పేర్కొన్నారు.

మీడియా రంగంలో భారత్ వాటా రెట్టింపు

కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడం ద్వారా అంతర్జాతీయ మీడియా మార్కెట్‌లో భారత్ తన వాటాను రెట్టింపు చేసుకునే అవకాశం ఉందని జియోస్టార్ వైస్ ఛైర్మన్ ఉదయ్ శంకర్ పేర్కొన్నారు. సాంకేతిక మార్పులను అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా, వాటిని అందిపుచ్చుకోవాలని ఆయన పరిశ్రమ వర్గాలను కోరారు. ప్రపంచ మీడియా మార్కెట్ విలువ దాదాపు 3 లక్షల కోట్ల డాలర్లుగా ఉందని, 2029 నాటికి 3.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేశారు.

జపాన్ బ్యాంకులతో ఎస్‌బీఐ చర్చలు

ముంబయి: ఒక కంపెనీ ఇంకో కంపెనీని కొనడానికి నిధులను అందించే వ్యాపారం (అక్విజిషన్ బిజినెస్) నిమిత్తం జపాన్ బ్యాంకులతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) చర్చల్లో ఉంది. అక్విజిషన్ రుణాల కోసం చూసే కంపెనీలకు రూ.94,000 కోట్ల వరకు అందజేసే సామర్థ్యం తమకు ఉందని బ్యాంకు ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. కొనుగోలు ఒప్పందంలో 75% వరకూ రుణాలు ఇవ్వడానికి దేశీయ బ్యాంకులకు అనుమతినిస్తూ ఇటీవలే ఆర్‌బీఐ తుది మార్గదర్శకాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. సంక్లిష్ట కొనుగోలు లావాదేవీలకు ఎస్‌బీఐ దూరంగా ఉండాలని భావిస్తోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ రుణాలకు సంబంధించిన ప్రామాణిక నిర్వహణ ప్రక్రియల రూపకల్పనలో ఉన్నట్లు వివరించారు.

✦ మార్చి కల్లా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీఓకు సంబంధించి సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు కల్లా లిస్టింగ్ చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

మెడికవర్‌లో ఎయిర్ అంబులెన్స్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: భారత్ సహా, అంతర్జాతీయంగా రోగులను బదిలీ చేసేందుకు వీలుగా ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఎవర్‌గ్రీన్ హెల్త్‌కేర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మెడికవర్ హాస్పిటల్స్ కుదుర్చుకుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో త్వరలో ప్రారంభం కానున్న మెడికవర్ హాస్పిటల్‌లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఈ ఆసుపత్రిలో కొన్ని కీలక చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపింది. ప్రమాదం సమయంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, అత్యవసర ప్రతిస్పందన ప్రమాద ప్రదేశంలోనే మొదలవుతుందని మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ నయన్ శ్రీరాముల అన్నారు. ఇందులో భాగంగా వేగవంతమైన రవాణా కోసం ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందన్నారు. మెడికవర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ.. సమీకృత వైద్య సేవలందించడమే తమ లక్ష్యమన్నారు.

సరికొత్త టాటా పంచ్.ఈవీ

ప్రారంభ ధర రూ.9.69 లక్షలు



ముంబయి: టాటా మోటార్స్ తన పంచ్.ఈవీలో సరికొత్త వెర్షన్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. దీని ధర రూ.9.69 లక్షల నుంచి (ఎక్స్‌షోరూం, ముంబయి) ప్రారంభం అవుతుంది. బీఏఏఎస్ (బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్) కింద ప్రారంభ ధర రూ.6.49 లక్షలు కాగా.. బ్యాటరీకి ఈఎంఐ కిలోమీటరుకు రూ.2.60. ఈ కొత్త వెర్షన్ 40 కిలోవాట్ అవర్ బ్యాటరీతో లభ్యమవుతుంది. ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉండటంతో కేవలం 26 నిమిషాల్లోనే 20% నుంచి 80 శాతానికి ఛార్జ్ చేయొచ్చు. ఈ కారు రియల్ వరల్డ్ సీ75 రేంజ్ 355 కి.మీ. కాగా.. ఏఆర్ఏఐ సర్టిఫైడ్ రేంజ్ 468 కి.మీ.గా ఉంది.

కోడి గుడ్డు

21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వంద రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	530
తూ/ప గోదావరి	490
విశాఖపట్నం	500
చిత్తూరు	573

ఏపీలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ సోలార్ ప్లాంట్

దిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుత్ దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్‌లో తన 250 మెగావాట్ల సోలార్ పీవీ ప్రాజెక్టులో 158.4 మెగావాట్ల మేర పాక్షిక సామర్థ్యాన్ని ప్రారంభించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ అదనపు సామర్థ్యంతో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ మొత్తం ఇన్‌స్టాల్డ్ సామర్థ్యం 9151.08 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం కంపెనీ వాణిజ్య సామర్థ్యం 8,992.68 మెగావాట్లుగా ఉంది.

క్రిస్‌క్యాపిటల్ చేతికి నొవార్టిస్ ఇండియా

- లావాదేవీ విలువ రూ.1,446 కోట్లు!
- హైదరాబాద్ కేంద్రం కార్యకలాపాలు యథావిధిగా



ఈనాడు, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌కు చెందిన ఫార్మా సంస్థ నొవార్టిస్ ఏజీ భారత్‌లోని తన అనుబంధ సంస్థ నొవార్టిస్ ఇండియా లిమిటెడ్‌లో ఉన్న తన 70.68% వాటాను విక్రయించనుంది. ఈ మేరకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్రిస్‌క్యాపిటల్ (గ్రూపుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ లావాదేవీ విలువ రూ.1,446 కోట్లుగా అంచనా. ఈ వాటాల విక్రయం జరిగినప్పటికీ హైదరాబాద్‌లోని నొవార్టిస్ కార్పొరేట్ సెంటర్‌తోపాటు, దేశంలోని ప్రధాన కార్యకలాపాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని, యథావిధిగా కొనసాగుతాయని కంపెనీ స్పష్టం చేసింది. 2026 మూడో త్రైమాసికంలో ఈ లావాదేవీ ముగుస్తుందని కంపెనీ అంచనా వేస్తోంది. ఇందులో భాగంగా తనకున్న మొత్తం 1.74 కోట్ల షేర్లను విక్రయించనుంది. క్రిస్‌క్యాపిటల్ అనుబంధ సంస్థలైన వేవ్‌రైజ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (క్రిస్‌క్యాపిటల్ ఫండ్ ఎక్స్ టూ ఇన్వెస్టర్స్ పార్ట్‌నర్స్) ఈ షేర్లను సొంతం చేసుకోనున్నాయి.

120 రోజుల్లో పేరు మార్పు: ఈ లావాదేవీ పూర్తయిన తర్వాత నొవార్టిస్ ఏజీ తన ప్రమోటర్ హోదాను కోల్పోతుందని, క్రిస్‌క్యాపిటల్ (గ్రూపు సంస్థలు) కొత్త ప్రమోటర్లుగా బాధ్యతలు తీసుకుంటాయని తెలిపింది. ఆ తర్వాత 120 రోజుల్లోగా నొవార్టిస్ ఇండియా లిమిటెడ్ తన పేరును మార్చుకుంటుందని పేర్కొంది.

అంతర్జాతీయ వ్యూహానికి అనుగుణంగా: ఈ షేర్ల బదిలీ పూర్తయిన తర్వాత నొవార్టిస్ పూర్తిగా వినూత్న ఔషధాల సంస్థగా మారుతుందని, గ్లోబల్ వ్యూహానికి అనుగుణంగా దీర్ఘకాలిక వృద్ధి దిశగా అడుగులు వేస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ వాటాల విక్రయం కేవలం నమోదిత కంపెనీ నొవార్టిస్ ఇండియాకే పరిమితమని.. నొవార్టిస్ గ్రూపు అనుబంధ సంస్థ నొవార్టిస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌పీఎల్) ద్వారా భారత్‌లో తమ ప్రయాణం యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించింది. ఎన్‌హెచ్‌పీఎల్ కింద కమర్షియల్ విభాగంతో పాటు, హైదరాబాద్‌లోని నొవార్టిస్ కార్పొరేట్ సెంటర్, పరిశోధన-అభివృద్ధి బృందాలున్నాయి. ఈ బృందాలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 300కు పైగా ప్రదేశాల్లో క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. భారత్‌లో 9,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

ఓపెన్ ఆఫర్ ద్వారా..: ఈ లావాదేవీ నేపథ్యంలో సెబీ నిబంధనలకు అనుగుణంగా నొవార్టిస్ ఇండియా 26% వరకు వాటాల కోసం తప్పనిసరి ఓపెన్ ఆఫర్‌ను తీసుకొస్తుంది. ఇందులో భాగంగా కొనుగోలుదారులు.. ప్రజల నుంచి 64,19,608 షేర్లను కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.860.64 చొప్పున మొత్తం రూ.552.49 కోట్లను వెచ్చించనున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పంద నేపథ్యంలో శుక్రవారం బీఎస్ఈలో నొవార్టిస్ ఇండియా షేరు 20% పెరిగి, రూ.996.50 వద్ద స్థిరపడింది.

మూడేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు

బ్రిగేడ్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టుల నిర్మాణం కోసం రానున్న మూడేళ్లలో రూ.5,000 కోట్లను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో నివాస గృహాలు, వరల్డ్ ట్రేడ్ సెంటర్, ఫోర్‌స్టార్ కాంటినెంటల్ హోటల్, ఓరియన్ మాల్, మేనేజ్డ్ ఆఫీస్ కార్యాలయాలుంటాయని తెలిపింది. ఇటీవలే హెచ్‌ఎండీఏ నిర్వహించిన వేలంలో కోకాపేటలోని నియోపోలిస్‌లో 4.03 ఎకరాల స్థలాన్ని రూ.500 కోట్లతో కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ ప్రాంతంలో రెండో భారీ ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ మైసూర్, హైదరాబాద్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఎం.రాజేష్ వెల్లడించారు. వచ్చే ఏడాదికాలంలో 35 లక్షల చదరపు అడుగుల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. నివాస గృహ సముదాయాల కోసమే మూడేళ్లలో రూ.2,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. నియోపోలిస్, మోతీనగర్, సికింద్రాబాద్ వంటి కీలక ప్రాంతాల్లో ప్రాజెక్టులు రాబోతున్నట్లు తెలిపారు.

సార్వభౌమాధికారం అంటే వ్యూహాత్మక నియంత్రణ: యోట్టా

ఏఐలో సార్వభౌమాధికారం అంటే ప్రపంచానికి దూరంగా ఉండటం లేదా పూర్తి స్వయం సమృద్ధిని సాధించడం కాదని, కేవలం ఒక వ్యూహాత్మక నియంత్రణ అని యోట్టా డేటా సర్వీసెస్ ఎండీ, సీఈఓ సునీల్ గుప్తా పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలు పరస్పరం ఆధారపడటం అనివార్యమని ఉద్ఘాటించారు. చిప్స్ తయారీలో కొన్ని దేశాలు, ముడి వస్తువులు, డేటా, మోడళ్లు, ప్రతిభ, పెట్టుబడి వంటి అంశాల్లో మరికొన్ని దేశాలు రాణిస్తాయని, అందువల్ల సహకారం అనేది చాలా అవసరమని ఆయన వెల్లడించారు. ఏ ఒక్క దేశం లేదా కంపెనీ కూడా ఒక దేశం డిజిటల్ భవిష్యత్తును శాసించకుండా చూసుకోవడమే అసలైన సార్వభౌమాధికారమని అభిప్రాయపడ్డారు.

దిల్లీ డిస్కమ్ సరికొత్త ఆవిష్కరణ

విద్యుత్ డిస్కమ్ బీఎస్ఈఎస్, సరికొత్త ఆవిష్కరణ అయిన 'డిజిటల్ ట్విన్ ఆఫ్ ఏ పవర్ నెట్‌వర్క్'ను ప్రదర్శించింది. ఇది విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌కు ఒక 'గూగుల్ మ్యాప్'లా పనిచేస్తుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, ఆటోమేటిక్ ఫాల్ట్ రీస్టోరేషన్‌ను అందిస్తుంది. బీఎస్ఈఎస్ రాజధాని పవర్ లిమిటెడ్ (బీఆర్‌పీఎల్) పంపిణీ పరిధిలోని జనక్‌పురిలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఏఐ ఆధారిత ఆవిష్కరణను ప్రవేశపెట్టినట్లు బీఎస్ఈఎస్ అధికారి ఒకరు తెలిపారు.

అందుబాటు ధరలో కంప్యూట్ సామర్థ్యం



ప్రభుత్వం, దాతృత్వ సంస్థలు, ప్రైవేట్ రంగం కలిసి పనిచేసే నమూనాపై భారత్ దృష్టి పెడుతోందని, దీని ద్వారా అందరికీ అందుబాటు ధరలో కంప్యూటింగ్ సామర్థ్యాలు లభించేలా చూడవచ్చని కేంద్ర గణాంకాల కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు.

డెల్ 'ఏఐ ఇండియా బ్లూప్రింట్'

ఏఐ ఇండియా బ్లూప్రింట్‌ను డెల్ టెక్నాలజీస్ ఆవిష్కరించింది. భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లో ఏఐను ఒక ప్రధాన భాగంగా మార్చడానికి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు మద్దతుగా దేశ దీర్ఘకాలిక ప్రణాళికను కంపెనీ రూపొందించింది. మన దేశ ఏఐ వ్యవస్థను పైలట్ ప్రాజెక్టుల స్థాయి నుంచి దేశవ్యాప్తంగా విస్తరించే స్థాయికి తీసుకెళ్లడానికి ఒక నిర్మాణాత్మక విధానాన్ని డెల్ ప్రతిపాదించింది.

ఏఐ కంటెంట్‌కు తప్పనిసరి లేబెలింగ్ : వైష్ణవ్

దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)తో సృష్టించే కంటెంట్‌కు తప్పనిసరిగా, స్పష్టంగా లేబెలింగ్ ఉండాలన్న భారత్ నిర్ణయాన్ని పలు దేశాలు ప్రశంసించాయని ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఏఐ జెనరేటెడ్ అసభ్యకర, మోసపూరిత, డీప్‌ఫేక్ కంటెంట్ సామాజిక మాధ్యమాల్లోకి వస్తోన్న తరుణంలో శుక్రవారం కొత్త ఐటీ నిబంధనలను కేంద్రం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఏఐ కంటెంట్‌కు ఒక ఐడెంటిఫైయర్ లేదా ఎంబెడింగ్ పర్మినెంట్ మెటాడేటా ఉండాలి. చట్టవ్యతిరేక కంటెంట్‌పై నిషేధమూ విధిస్తారు. వినియోగదారు ఫిర్యాదుల పరిష్కార గడువును సైతం తగ్గించారు. కాగా, ఈ చర్యలపై వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ఏఐ సమిట్‌లో వైష్ణవ్ పేర్కొన్నారు. ఇదే తరహా నియంత్రణలను ఇతర దేశాలూ తీసుకోబోతున్నాయని ఆయన అన్నారు.

1.4 శాతానికి అమెరికా వృద్ధి రేటు

వాషింగ్టన్: అమెరికా స్థూల దేశీయోత్పత్తి నాలుగో త్రైమాసికంలో 1.4 శాతం మేర వృద్ధి చెందింది. జులై-సెప్టెంబరులోని 4.4 శాతం, అంతక్రితం త్రైమాసికంలోని 3.8 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువే. ప్రభుత్వ, వినియోగదారు వ్యయాలు తగ్గడంతో చివరి త్రైమాసికంలో తగ్గుదల కనిపించిందని అమెరికా ప్రభుత్వం తెలిపింది.

ఎగుమతులకు ఊతమిచ్చేందుకు మరిన్ని చర్యలు

ప్రకటించిన ప్రభుత్వం



దిల్లీ: దేశీయ ఎగుమతులకు ఊతమిచ్చేందుకు ఇ-కామర్స్ ఎగుమతిదార్లకు రుణ సహకారం సహా ఏడు చర్యలను ప్రకటించింది. రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌లో భాగంగానే ఈ చర్యలు ఉండనున్నాయి. కాగా... ఎగుమతి ప్రోత్సాహక మిషన్ కింద 10 అంశాలు ఉండగా, ఇప్పటికే మూడింటిని జనవరిలోనే ప్రభుత్వం అమలు చేసింది. డిజిటల్ మార్గాలను ఉపయోగించిన ఎగుమతిదార్లకు సహకారం అందించేందుకు.. వడ్డీ రాయితీలతో రుణ సదుపాయం, పాక్షిక రుణ గ్యారెంటీలను వాణిజ్య శాఖ ప్రకటించింది. డైరెక్ట్ ఇ-కామర్స్ క్రెడిట్ సదుపాయంలో 90 శాతం గ్యారెంటీతో రూ.50 లక్షల వరకు రుణ సహకారం అందివ్వనుంది. ఓవర్‌సీస్ ఇన్వెంటరీ క్రెడిట్ ఫెసిలిటీలో 75 శాతం గ్యారెంటీ కవరేజీతో రూ.5 కోట్ల వరకు రుణ సహకారం లభించనుంది. 2.75 శాతం వడ్డీ రాయితీ కూడా పొందొచ్చు. అయితే ఇందుకు ఒక్కో దరఖాస్తుదారుకు రూ.15 లక్షల వరకు వార్షిక పరిమితిని నిర్దేశించినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంఎస్ఎంఈలకు కూడా 2.75 శాతం వడ్డీ రాయితీని అందివ్వనుంది. ఆర్‌బీఐ/ ఐఎఫ్ఎస్‌సీఏ గుర్తింపు సంస్థల ద్వారా జరిపిన లావాదేవీల వ్యయాలపై ఈ సౌలభ్యం ఉంటుంది. ఒక్కో ఎంఎస్ఎంఈకి రుణ సహకార పరిమితి రూ.50 లక్షలుగా ఉండనుంది. పారదర్శకత, సకాలంలో పంపిణీ నిమిత్తం పూర్తిగా డిజిటల్ రూపేణా ఈ రుణాన్ని మంజూరు చేస్తారు. అంతర్జాతీయంగా టెస్టింగ్, పరిశీలన, సర్టిఫికేషన్ సహా ఇతర వాణిజ్య నిబంధనలను పాటించే విషయంలో అక్రిడేషన్ అండ్ కాంప్లియెన్స్ ఎనేబుల్‌మెంట్ ద్వారా ఎగుమతిదార్లకు సహకారం అందివ్వనుంది. అలాగే ఫెసిలిటేటింగ్ లాజిస్టిక్స్, ఓవర్‌సీస్ వేర్‌హౌసింగ్ అండ్ ఫుల్‌ఫిల్‌మెంట్ ద్వారా అంతర్జాతీయంగా గిడ్డంగులు, ఇ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్స్‌కు అనుసంధానం లాంటి మౌలిక వసతుల సదుపాయాన్ని పొందే వీలు కల్పించనుంది. ఈశాన్య, కొండ ప్రాంతాల్లోని ఎగుమతిదార్లకు లాజిస్టిక్స్ ఇంటర్‌వెన్షన్స్ ఫర్ ఫ్రైట్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రకటించింది.

నెమ్మదించిన కీలక రంగాల వృద్ధి

దిల్లీ: దేశంలోని 8 కీలక రంగాల ఉత్పత్తి, గత నెలలో రెండు నెలల కనిష్ఠమైన 4 శాతానికి నెమ్మదించింది. 2025 జనవరిలో 5.1 శాతం, 2025 డిసెంబరులో 4.7 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. ఈ ఏడాది జనవరిలో ముడిచమురు, సహజ వాయువు ప్రతికూల వృద్ధి నమోదు చేయగా, రిఫైనరీ ఉత్పత్తుల వృద్ధి స్తబ్దుగా ఉంది. బొగ్గు, సిమెంట్ ఉత్పత్తి వృద్ధి వరుసగా 3.1 శాతం, 10.7 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం జనవరిలో ఇవి 4.6 శాతం, 14.3 శాతంగా ఉన్నాయి. ఎరువులు, ఉక్కు, విద్యుదుత్పత్తి మాత్రం సానుకూల వృద్ధి సాధించాయి.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జనవరిలో 8 రంగాల ఉత్పత్తిలో వృద్ధి 2.8 శాతానికి పరిమితమైంది. 2024-25 ఇదే కాలంలో ఇది 4.5 శాతంగా నమోదైంది.

✦ గత నెలలో 8 రంగాల్లో ఏడు రంగాల వృద్ధి క్షీణించిందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. ఈ ధోరణులతో జనవరిలో పారిశ్రామికోత్పత్తి కూడా నెమ్మదించే అవకాశం ఉందన్నారు. 2025 డిసెంబరులో 7.8 శాతంగా ఉన్న ఐఐపీ వృద్ధి, జనవరిలో 5.5 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేశారు.

ఆన్‌లైన్‌లో నిషేధిత వైర్‌లెస్ పరికరాల విక్రయం

ఇ-కామర్స్ సంస్థలకు సీసీపీఏ నోటీసులు



దిల్లీ: చట్ట వ్యతిరేకంగా నిషేధిత వైర్‌లెస్ పరికరాలను విక్రయిస్తున్న ఆరు ఇ-కామర్స్ సంస్థలకు కేంద్ర వినియోగదారుల హక్కుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) నోటీసులు జారీ చేసింది. ఇందులో ఎవర్స్, ఇండియామార్ట్, ఎక్స్‌బూమ్, జావియత్ ఏరోస్పేస్, ఎయిర్‌వన్ రోబోటిక్స్, మావెరిక్ డ్రోన్స్ అండ్ టెక్నాలజీస్ సంస్థలున్నాయి. యాంటీ-డ్రోన్ సిస్టమ్స్, డ్రోన్ జామర్లు, జీపీఎస్ జామర్ల వంటి పరికరాలను తమ వేదికల ద్వారా విక్రయాలకు ఉంచినందుకు సీసీపీఏ ఈ చర్యలు తీసుకుంది. సాధారణ ప్రజలు వీటిని కలిగి ఉండటం, వినియోగించడం చట్టవిరుద్ధమనే విషయాన్ని దాచిపెట్టి, ఎవరైనా స్వేచ్ఛగా కొనుగోలు చేయొచ్చనే రీతిలో వినియోగదారులను తప్పుదోవ పట్టించారని, ఇది వినియోగదారుల రక్షణ చట్టం-2019 ఉల్లంఘన కిందకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ పరికరాల దిగుమతి లైసెన్సులు, అనుమతి పత్రాలు, రెండేళ్లుగా విక్రయించిన యూనిట్ల సంఖ్య, కొనుగోలుదారుల వివరాలను సమర్పించాలని ఆయా కంపెనీలకు సీసీపీఏ ఆదేశించింది.

'రిలీఫ్ వెల్‌నెస్' ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు

హైదరాబాద్ (బంజారాహిల్స్), న్యూస్‌టుడే: నేచురల్లే హెర్బల్ రెమిడీస్ సంస్థ సహజ మూలికలతో తయారు చేసిన 18 రకాల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులను రిలీఫ్ వెల్‌నెస్ పేరుతో ఆవిష్కరించింది. శుక్రవారం సినీ నటుడు మురళీ మోహన్, నటి కాజల్ అగర్వాల్‌తో కలిసి సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.డోలేంద్ర ప్రసాద్ వీటిని మార్కెట్లోకి విడుదల చేశారు. బెంగళూరులోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్ (సీ-క్యాంప్) సహకారంతో విస్తృత పరిశోధనలు నిర్వహించి, 'స్మాల్ మాలిక్యూల్ టెక్నాలజీ' ఆధారిత ఉత్పత్తులను తీసుకొచ్చినట్లు డోలేంద్ర ప్రసాద్ తెలిపారు. పదేళ్ల కాలంలో దాదాపు రూ.15 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు వివరించారు. దేశంలో హెల్త్ సప్లిమెంట్ మార్కెట్ ఏటా 15 శాతం వృద్ధి చెందుతోందని, ఈ వృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆరు నెలల్లో మరో 25 ఉత్పత్తులను తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

పుంజుకున్న సూచీలు

సెన్సెక్స్ ▲ 317 **82815** | నిఫ్టీ ▲ 117 **25571**



- నిఫ్టీ 25,550 పాయింట్ల ఎగువకు
- బ్యాంకింగ్, లోహ షేర్లలో కొనుగోళ్లు

ఎఫ్‌ఐఐ అమ్మకాలు.. రూ.934.61 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.2637.15 కోట్లు

గురువారం నాటి భారీ నష్టాల నుంచి స్టాక్ మార్కెట్ పుంజుకుంది. బ్యాంకింగ్, లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. ఏఐ సాంకేతికత, సెమీ కండక్టర్లు, కీలక ఖనిజాల సరఫరా విషయంలో సహకారం నిమిత్తం ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమిలో భారత్ చేరనుండటం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి రావొచ్చని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించడంతో మార్కెట్ సెంటిమెంటు బలపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 26 పైసలు తగ్గి 90.94 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.35% తగ్గి 71.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్, దక్షిణ కొరియా మినహా మిగతా దేశాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.89 లక్షల కోట్లు పెరిగి రూ.467.11 లక్షల కోట్లకు (5.14 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

నష్టాల్లోనే మొదలైనా..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 82,272.49 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 82,498.14) ప్రారంభమైంది. ఆ తర్వాత కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ ఒకానొక దశలో 83,132.08 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 316.57 పాయింట్ల లాభంతో 82,814.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 116.90 పాయింట్ల లాభంతో 25,571.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,379.75 వద్ద కనిష్ఠాన్ని, 25,663.55 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 187.95 పాయింట్లు, నిఫ్టీ 100.15 పాయింట్లు చొప్పున పెరిగాయి.

ఎనిమిదే డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 8 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ అత్యధికంగా 2.73 శాతం లాభపడగా.. ఎల్‌అండ్‌టీ 2.37%, హిందుస్థాన్ యునిలీవర్ 1.56%, బజాజ్ ఫైనాన్స్ 1.47%, పవర్‌గ్రిడ్ 1.44%, టాటా స్టీల్ 1.36%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.29% పెరిగాయి. మరోవైపు టెక్ మహీంద్రా 1.61%, ఇన్ఫోసిస్ 1.23%, ఎటర్నల్ 1.10%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.92%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.53% నష్టపోయాయి.

✦ బీఎస్ఈ రంగాల సూచీల్లో విద్యుత్, పీఎస్‌యూ బ్యాంక్, భారీ యంత్రపరికరాలు, ఇండస్ట్రియల్స్, లోహ రంగాలు రాణించగా.. ఐటీ సూచీ డీలాపడింది.

✦ బీఎస్ఈలో 2,265 కంపెనీల షేర్లు సానుకూల ధోరణిలో ముగియగా.. 1,917 కంపెనీల షేర్లు నష్టపోయాయి. 167 కంపెనీల షేర్ల ధరలో ఎటువంటి మార్పు లేదు.

✦ అస్సామ్‌లో క్వాల్‌కామ్ ఆటోమోటివ్ మాడ్యూల్స్‌ను తయారు చేసే నిమిత్తం అమెరికా సంస్థ క్వాల్‌కామ్ టెక్నాలజీస్‌తో **టాటా ఎలక్ట్రానిక్స్** ఒప్పందం కుదుర్చుకుంది.

✦ పంట సంరక్షణ విభాగానికి సంబంధించి తన దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాలను అనుసంధానం చేసి ఒక్కటే సంస్థ కిందకు **యూపీఎల్** తేనుంది. గ్రూపు వ్యవస్థను సరళీకృతం చేయడమే కాకుండా... అంతర్జాతీయంగా ఈ వ్యాపార వృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే లక్ష్యంతో ఈ చర్యను చేపట్టనుంది.

✦ పసిడి రుణాలు అందించే శాఖలను దాదాపు రెట్టింపు చేసి 500కు చేర్చినట్లు **ఇండస్‌ఇండ్ బ్యాంక్** తెలిపింది. వినియోగదార్లకు పసిడి రుణాల సేవలను మరింతగా అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని భావించి అదనంగా 245 శాఖలను జతచేసినట్లు పేర్కొంది.

ఐపీఓ సమాచారం

✦ ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) ధరల శ్రేణిగా రూ.216-227ను నిర్ణయించారు. ఐపీఓ ఫిబ్రవరి 25న ప్రారంభమై 27న ముగియనుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ రూ.583 కోట్లను సమీకరించాలని అనుకుంటోంది.

✦ గౌడియం ఐవీఎఫ్ పబ్లిక్ ఇష్యూకు మొదటి రోజు ముగిసేనాటికి 88 శాతం స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 1.37 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

యుద్ధానికి సై



● పోరు బాటలో అమెరికా, ఇరాన్

ఇరాన్ పక్షం రోజుల్లో దారికి రాకపోతే పోరు అనివార్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూంకరిస్తున్నారు. పెంటగాన్ అధికారులైతే ఆదివారం నుంచే యుద్ధం ప్రారంభం కావచ్చన్న సంకేతాలినిస్తున్నారు. పోరు అనివార్యమైతే ఎదుర్కొవడానికి ఇరాన్ కూడా సిద్ధమంటోంది. ఈ నేపథ్యంలో యుద్ధానికి రెండు దేశాలు తమ సన్నాహాలను దాదాపు పూర్తి చేసుకున్నాయి!

ముగిసిన మోహరింపు

ఇరాన్ విషయంలో వెనెజువెలా తరహా వ్యూహాన్నే ట్రంప్ అనుసరిస్తున్నారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను నిర్బంధించే ముందు కరీబియన్ తీరంలో యుద్ధ విమానాలు, నౌకలను మోహరించి ఆ దేశంపై ట్రంప్ ఒత్తిడి పెంచిన సంగతి తెలిసిందే. ఇరాన్‌పైనా దాదాపు అదే వ్యూహంతో అమెరికా ముందుకు వెళుతోంది.



అందుకే టెహ్రాన్‌తో చర్చలు జరుపుతూనే కీలక రక్షణ వ్యవస్థలను పశ్చిమాసియాలో మోహరించింది.

యూఎస్ఎస్ అబ్రహం లింకన్: ఈ విమాన వాహక నౌక ప్రస్తుతం అరేబియా సముద్రంలో ఉంది. దీన్ని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు ట్రంప్ తరలించారు. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి.

యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్.ఫోర్డ్: ప్రపంచంలోనే అతి పెద్ద విమాన వాహక నౌక. కరీబియన్ సముద్రం నుంచి ఇది పశ్చిమాసియాకు బయల్దేరింది. ఈ నౌకతో పాటు.. 5 వేల మంది సిబ్బంది ఇరాన్ తీరానికి చేరనున్నారు. తొమహాక్ క్షిపణులతో కూడిన ఐదు రక్షణ నౌకలు కూడా ఈ విమాన వాహక నౌకతో పాటు వస్తున్నాయి.

జలాంతర్గాములు: గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్లు, జలాంతర్గాములను ఇప్పటికే అమెరికా మోహరించింది. ఇవి దాడి చేయడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి.

ఫైటర్ జెట్‌లు: ఇటీవల కాలంల 50కి పైగా అదనపు ఎఫ్-35, ఎఫ్-22, ఎఫ్-16 జెట్‌లు పశ్చిమాసియాలోని వివిధ సైనిక స్థావరాల్లో అగ్రరాజ్యం మోహరించింది. డజన్ల కొద్దీ కేసీ-35, కేసీ-46 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లనూ రంగంలోకి దింపింది. సుదీర్ఘ శ్రేణి దాడులకు ఈ ట్యాంకర్లు చాలా కీలకం.

బి–2 స్టెల్త్ బాంబర్లు: గత ఏడాది జూన్‌లో ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడానికి ఈ బాంబర్లనే అమెరికా వినియోగించింది. ఆ సమయంలో ఇవి మిసోరి నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇరాన్‌పై విరుచుకుపడ్డాయి. ఈసారి డియాగో గార్షియా నుంచి వీటిని ఆపరేట్ చేయాలని అమెరికా భావిస్తోంది. అయితే ఇందుకు బ్రిటన్ అంగీకరించడం లేదు.

గగనతల రక్షణ వ్యవస్థలు:

ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లను ఎదుర్కొవడానికి పేట్రియాట్, థాడ్.. క్షిపణి రక్షణ వ్యవస్థలను రంగంలోకి దించింది. వీటిని సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈల్లో మోహరించింది.

దీటుగా స్పందిస్తున్న టెహ్రాన్

ఇరాన్ కూడా అమెరికా దాడి చేయడం అనివార్యమని భావిస్తోంది. అమెరికా షరతులకు అంగీకరించి ఒప్పందాన్ని కుదుర్చుకుంటే యురేనియం శుద్ధిని ఆపేయాలి. బాలిస్టిక్ క్షిపణుల సంఖ్యను తగ్గించుకోవాలి. వీటికి అంగీకరించడం కంటే స్వల్పకాలిక యుద్ధమే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని టెహ్రాన్ భావిస్తోంది. అందుకు తగ్గట్టే తన రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంటోంది.

✦ గతేడాది జూన్‌లో జరిగిన 12 రోజుల యుద్ధంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేశాయి. ఆ పోరులో పలు క్షిపణి కేంద్రాలను, వైమానిక స్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. వీటికి పూర్తిస్థాయిలో ఇరాన్ మరమ్మతులు చేసింది.

✦ అణుకేంద్రాల భద్రతపై ఇరాన్ ఎక్కువగా దృష్టి సారించింది. ఎందుకంటే జూన్‌లో జరిగిన యుద్ధంలో ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై అమెరికా భారీస్థాయిలో బాంబుల వర్షం కురిపించింది. ఈసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఇరాన్ తన గగనతల రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంది. అణుకేంద్రాల దగ్గర భద్రతనూ పెంచింది. ముఖ్యంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వల పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటోంది.

✦ సాయుధ దళాల్లోకి విశ్రాంత సైనికులను తీసుకొనే కార్యక్రమం ప్రారంభించింది.

✦ భారీస్థాయిలో క్షిపణులను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉంది. గతేడాది జూన్‌లో జరిగిన యుద్ధంలో ఈ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిస్థాయిలో ధ్వంసం చేయడంలో అమెరికా, ఇజ్రాయెల్ విఫలమయ్యాయి. అందుకే ఇరాన్‌తో జరిగిన అణు చర్చల్లో బాలిస్టిక్ క్షిపణుల అంశాన్ని అగ్రరాజ్యం తెరపైకి తీసుకొచ్చింది. వీటి సంఖ్యను పరిమితం చేసుకోవాలని షరతు పెట్టింది. ఇందుకు ఇరాన్ అంగీకరించలేదు.

✦ 12 రోజుల యుద్ధంలో ఇరాన్‌కు చెందిన 30 మంది జనరళ్లను, 19 మంది అణు శాస్త్రవేత్తలను హతమార్చాయి. అంతేకాదు..యుద్ధ సమయంలో సైనికాధికారులు ఎప్పటికప్పుడు సుప్రీం నేత అలీ ఖమేనీతో సంప్రదించడం కష్టమైంది. దీన్నుంచి పాఠాలు నేర్చుకున్న ఇరాన్ కొత్తగా జాతీయ భద్రతా మండలిని ఏర్పాటు చేసింది. అత్యవసర సమయాల్లో నిర్ణయం తీసుకొనే అధికారం స్థానిక గవర్నర్లకు ఇచ్చింది. అంతేకాదు.. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు దేశంలో చొరబడకుండా కఠిన చర్యలు తీసుకుంది. దేశద్రోహులపై గట్టిగా నిఘా పెట్టింది. దాదాపు 21 వేల మంది పౌరులను నిర్బంధంలోకి తీసుకుంది.

- నేషనల్ డెస్క్


గ్రహాంతర వాసుల సమాచారం విడుదల చేయండి

● అమెరికా సంస్థలకు ట్రంప్ ఆదేశం

వాషింగ్టన్: గ్రహాంతరవాసులు, గుర్తు తెలియని ఎగిరే పళ్లాలపై వెంటనే ప్రభుత్వ సంస్థల వద్ద ఉన్న సమాచారాన్ని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ అంశంపై ప్రజల్లో విపరీతమైన ఆసక్తి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రహాంతరవాసులు ఉన్న మాట నిజమేనని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. "గ్రహాంతరవాసులు, ఎగిరేపళ్లాలు (యూఏపీఓలు) నిజంగా ఉన్నాయా లేదా అన్నది నాకు తెలీదు" అని ట్రంప్ తన అధికారిక విమానం 'ఎయిర్‌ఫోర్స్ వన్'లో విలేకరులతో చెప్పారు. "గ్రహాంతర వాసులపై నాకెలాంటి అభిప్రాయమూ లేదు. ఆ విషయంపై నేనెప్పుడూ మాట్లాడను. చాలా మంది మాట్లాడతారు. గ్రహాంతర వాసులున్నారని చాలా మంది నమ్ముతారు" అని ట్రంప్ అన్నారు.

భారత్-పాక్ యుద్ధంలో కూలింది 11 విమానాలు

భారత్- పాకిస్థాన్ దేశాల మధ్య గతేడాది తలెత్తిన ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన జోక్యం వల్లే ఇరు దేశాల మధ్య యుద్ధం ఆగిపోయిందని పునరుద్ఘాటిస్తూ.. ఆ సమయంలో 11 యుద్ధ విమానాలు కూలాయని ఆయన వాషింగ్టన్‌లో జరిగిన బోర్డ్ ఆఫ్ పీస్ సమావేశంలో అన్నారు. గతంలో 8 విమానాలు నేలకూలాయని ఆయన చెప్పిన సంగతి తెలిసిందే.



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్

ఏఐ సదస్సులో 8 ఏళ్ల బుడతడు



ఇంటర్నెట్ డెస్క్: ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో 8 ఏళ్ల ఓ బుడతడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సదస్సులో అతి పిన్న కీనోట్ స్పీకర్‌గా నిలిచి అందర్నీ ఆశ్చర్యపరచడమే కాకుండా.. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌తోనూ భేటీ అయ్యాడు. ఈ చిచ్చరపిడుగు పేరు రణ్‌వీర్ సచ్‌దేవా. దిల్లీకి చెందిన అతడు.. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. నాలుగేళ్ల వయసు నుంచే సాంకేతిక అంశాల్లో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. కష్టమైన ఏఐ అంశాలను సులభంగా వివరిస్తుండటం అతడికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆరేళ్ల వయసు ఉన్నప్పుడే రణ్‌వీర్ సచ్‌దేవా టెక్నాలజీ, ఆవిష్కరణలపై టెడెక్స్ వేదికపై ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇప్పటికే చోటు సాధించాడు. గతంలో కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన ఓ జాతీయస్థాయి వేదికలోనూ ఏఐ, ఇతర అంశాలపై ప్రసంగించి ప్రశంసలు అందుకున్నాడు. రోజువారీ జీవితంలో ఏఐ పెరుగుతున్న ప్రాధాన్యంపై ఏఐ ఇంపాక్ట్ సదస్సులో సచ్‌దేవా మాట్లాడారు. ప్రాచీన భారతీయ తత్వాలను ఆధునిక సాంకేతికత ఎలా అనుసంధానిస్తుందనే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాడు.

ఆండ్రూ నివాసంలో కొనసాగుతున్న సోదాలు



లండన్: అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగంపై అరెస్టయిన బ్రిటన్ రాజ కుటుంబీకుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ ఇంట్లో పోలీసులు సోదాలు కొనసాగిస్తున్నారు. ఆండ్రూను తన 66వ జన్మదినంనాడే (గురువారం) అరెస్టుచేసిన థేమ్స్ వ్యాలీ పోలీసులు 11 గంటల పాటు ప్రశ్నించిన అనంతరం విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం నివాసముంటున్న నార్‌ఫోక్‌లోని వుడ్ ఫాం హౌస్‌లో సోదాలు పూర్తి చేశామని, అయితే గతంలో నివాసమున్న బెర్క్‌షైర్ రాయల్ లాడ్జిలో ఇంకా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన ఆండ్రూ 2001 నుంచి 2011 వరకూ బ్రిటన్ వాణిజ్య రాయబారిగా పనిచేసిన కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అభియోగం ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆయనపై మరిన్ని ఆరోపణలు బయటకు వస్తున్నాయి. 6-8 ఏళ్ల వయసున్న ఓ బాలికకు లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్ బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో విద్యుత్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని బ్రిటన్ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి.

'సర్' తర్వాత గుజరాత్‌లో 13.40 శాతం ఓట్ల తరుగుదల

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) అనంతరం గుజరాత్, లక్షదీవులు, పుదుచ్చేరిలలో అంతకు ముందుకన్నా 68.9 లక్షల మంది ఓటర్లు తగ్గిపోయారని ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసిన సమాచారం తెలియజేస్తోంది. ఓటరు జాబితా ప్రక్షాళన చర్యల్లో భాగంగా ఈ మూడు ప్రదేశాలూ ఇటీవల తుది జాబితాలను ప్రకటించాయి. గత అక్టోబరు 27న సర్ ప్రక్రియ ప్రకటించడానికి పూర్వం గుజరాత్‌లో, మిగిలిన రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 5.19 కోట్లు. తుది జాబితాలో ఈ సంఖ్య 4.50 కోట్లకు తగ్గింది. గుజరాత్‌లో సర్‌కు ముందు మొత్తం 5.08 కోట్ల మంది ఓటర్లుండగా కసరత్తు అనంతరం ఆ సంఖ్య 4.40 కోట్లకు తగ్గింది. ఆ రాష్ట్రంలో మొత్తం 68.12 లక్షల మంది ఓటర్లు తగ్గి పోయారు. ఇది మొత్తం ఓట్ల సంఖ్యలో 13.40 శాతం. లక్షదీవుల్లో జాబితా ప్రక్షాళన ప్రక్రియ చేపట్టడానికి ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 57,813. తుది జాబితాలో ఈ సంఖ్య 57,607కు తగ్గింది. పుదుచ్చేరిలో సర్‌కు పూర్వం ఓటర్ల సంఖ్య 10.21 లక్షలు కాగా కసరత్తు అనంతరం అది 9.44 లక్షలకు చేరింది. సర్ కసరత్తు బిహార్‌లో ఇప్పటికే పూర్తికాగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం కొనసాగుతోంది.

నాడు రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన

● లాలూను ఎద్దేవా చేసిన బిహార్ ఎమ్మెల్యే

పట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌పై గాయని, బిహార్ యువ ఎమ్మెల్యే మైథిలీ ఠాకుర్ తీవ్ర విమర్శలు చేశారు. లాలూ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో రాష్ట్రంలో ధృతరాష్ట్రుడి పాలన ఉన్నట్లు అనిపించేదన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడు రాజ్యం కోసం కాకుండా తన కుమారుడు దుర్యోధనుడి బాగు కోసమే ఆలోచించినట్లు.. లాలూ కూడా ప్రజల గురించి కాకుండా తేజస్వీ యాదవ్ రాజకీయ జీవితం కోసం తపించేవారని ఎద్దేవా చేశారు. ప్రజల బాధలు ఆయన కంటికి కనిపించేవి కావన్నారు. ఆమె బిహార్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. లాలూ పాలనలో రాష్ట్రం విద్యకు దూరమైందన్నారు. దానివల్ల ఎన్నో తరాలు ఉపాధి, అభివృద్ధి లేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నాయన్నారు. 2006లో విద్యార్థినులకు నీతీశ్ ఉచిత సైకిళ్లు ఇవ్వడం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో బాలికలు పాఠశాలలకు వెళ్లడం మొదలైందని పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభించినప్పుడు ప్రతిపక్షాలు ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎగతాళి చేశాయని.. ఇప్పుడు అదే పథకం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. నీతీశ్ పాలనలో రాష్ట్రంలో గూండాల ప్రభావం తగ్గిందన్నారు. ఎన్డీయే పాలనలో బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు.



సునీత యాత్ర.. ప్రమాదకర వైఫల్యమే

● నాసా నివేదిక



ఇంటర్నెట్ డెస్క్: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ 8 రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. సాంకేతిక సమస్యల కారణంగా నెలల పాటు సాగడంపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ- నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ 'ప్రమాదకర వైఫల్యమేనని' అంగీకరించింది. దానిని 'టైప్-ఏ' ప్రమాదంగా అభివర్ణించింది.

వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా.. 311 పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని ఆరోపించారు. "2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్టును ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు మొరాయించాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు" అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన నిబంధనలను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను టైప్-ఏ వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్లయింది.

ఏంటీ టైప్-ఏ ప్రమాదం..?

ఈ మిషన్‌ను నాసా 'టైప్-ఏ' ప్రమాదంగా ప్రకటించడం ఏరోస్పేస్ పరిశ్రమను షాక్‌కు గురిచేసింది. సాధారణంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లు ఈ వర్గీకరణలోకి వస్తాయి. 2003లో జరిగిన కొలంబియా షటిల్ ప్రమాదాన్ని 'టైప్-ఏ' ప్రమాదంగా వర్గీకరించారు. ఆ ఘటనలో భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో ఆ విషాదం చోటుచేసుకుంది.

2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు తొమ్మిది నెలల తర్వాత 2025 మార్చిలో వీరిద్దరూ సురక్షితంగా భూమిని చేరుకున్నారు.

నైజీరియాలో ఇస్లాం ముష్కరుల నరమేధం

● 33 మంది మృతి

అబూజా: నైజీరియాలో ఇస్లాం ముష్కరులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య నైజీరియాలోని ఓ జిల్లాలో సాయుధ ముఠా సభ్యులు జరిపిన దాడుల్లో 33 మంది ప్రాణాలు కోల్పోయారు. కెబ్బీ రాష్ట్రంలోని బియు ప్రాంతంలో బుధవారం ఈ దాడులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశువులను అపహరించే క్రమంలో మిలిటెంట్లు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. భద్రతా దళాలు ప్రస్తుతం ఆ ప్రాంతంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నాయి. సాయుధ మిలిటెంట్లను ఎదుర్కోవడంపై నైజీరియా సైన్యానికి శిక్షణ ఇచ్చేందుకు ఇటీవల 100 మంది అమెరికా సైనికులు ఆ దేశానికి రావడం గమనార్హం.

ప్రభుత్వ సలహాదారులకు కేబినెట్ ర్యాంక్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన పోచంపల్లి శ్రీధర్‌రావు (మాస్ కమ్యూనికేషన్స్), చందూరి సీతారామాంజనేయ ప్రసాద్ (దేవాదాయ)లకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పీజీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 21 సీట్ల మంజూరు

ఈనాడు, అమరావతి: పీజీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి వైద్య కళాశాలల ప్రతిపాదనల మేరకు మంజూరుచేసిన సీట్ల జాబితాను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)కి చెందిన మెడికల్ ఎసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (ఎంఏఆర్‌బీ) విడుదల చేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో కొత్తగా మంజూరుచేసిన, పెంచిన సీట్ల వివరాలు ప్రకటించింది. రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలల్లో ఎనిమిది కోర్సులకు 25 సీట్లు కోరితే.. 21 సీట్లు మంజూరుచేసినట్లు పేర్కొంది. వీటిలో విజయవాడలోని సిద్ధార్థలో ఎంసీహెచ్- యూరాలజీలో రెండు, గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో డీఎం- నెఫ్రాలజీ రెండు, కాకినాడలో రంగరాయ వైద్యకళాశాలలో ఎంసీహెచ్- ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్షన్ సర్జరీకి నాలుగు, తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలలో డీఎం- పీడియాట్రిక్ కార్డియాలజీకి రెండు, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంసీహెచ్- పీడియాట్రిక్ సర్జరీ నాలుగు మంజూరుచేసినట్లు వెల్లడించింది. విశాఖలోని గాయత్రి విద్యా పరిషత్తు వైద్యకళాశాలకు ఎంసీహెచ్- న్యూరోసర్జరీ రెండు, డీఎం- కార్డియాలజీ రెండు.. ఎన్ఆర్ఐ మెడికల్ సైన్సెస్‌లో ఎంసీహెచ్- యూరాలజీకి మూడు మంజూరు చేసినట్లు పేర్కొంది.

బాబర్ పేరుతో మసీదు నిర్మాణాన్ని అనుమతించరాదన్న పిటిషన్ తిరస్కరణ

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో బహిష్కృత టీఎంసీ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ చేపట్టిన బాబ్రీ మసీదు నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. భారత దేశంపైకి దండెత్తి వచ్చిన బాబర్ పేరుతో మసీదు నిర్మాణానికి అనుమతించరాదని పిటిషనర్ కోరారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టేందుకు తిరస్కరించింది. దీంతో పిటిషనర్ దానిని ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు తెలిపారు.



సమాధి తవ్వకం.. శవపేటిక తరలింపు

అమ్మానాన్నల సమాధులను ఒకేచోటుకు చేర్చిన కుమారుడు

మనుషులు భౌతికంగా దూరమైనా అనుబంధాలు, అనురాగాలు శాశ్వతమని కేరళకు చెందిన శిబు కురియకోస్ నిరూపించారు. ఊరు గాని ఊరులో 37 ఏళ్లుగా ఉన్న తన తండ్రి అలెగ్జాండ్రియోస్ శవపేటికను ఎట్టకేలకు సొంతూరు కొట్టాయంకు తెప్పించి గురువారం తల్లి సమాధి పక్కనే ఖననం చేయించారు. ఇందుకోసం శిబు ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు, చర్చిల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలుపెరుగని న్యాయపోరాటం చేశారు. అలెగ్జాండ్రియోస్ కుటుంబ పోషణ నిమిత్తం కొట్టాయం నుంచి 430 కిలోమీటర్ల దూరాన ఉన్న కాసరగోడ్‌లో ఉద్యోగం చేసేవారు. ఆ తర్వాత క్రైస్తవ మతబోధకుడిగా మారిన అలెగ్జాండ్రియోస్ 1989లో మృతిచెందగా, కాసరగోడ్‌లోనే ఖననం చేశారు. కుమారుడు శిబు వద్ద ఉంటున్న ఈయన భార్య ధంకమ్మ 2021లో చనిపోగా, కొట్టాయంలో అంత్యక్రియలు జరిగాయి. తల్లిదండ్రుల సమాధులు వేర్వేరుగా సుదూర ప్రాంతాల్లో ఉండటం శిబూను తీవ్ర మానసిక వేదనకు గురిచేసింది. ఎలాగైనా సరే తండ్రి శవపేటికను కాసరగోడ్ నుంచి కొట్టాయంకు తీసుకొచ్చి, తల్లి పక్కన ఖననం చేయించాలని శిబు సంకల్పం చేసుకున్నాడు. శవపేటికను ఒక శ్మశానవాటిక నుంచి మరొక శ్మశానవాటికకు తరలించడం అంత సులువైన విషయం కాదు. దీనికి రెండు చర్చిల అనుమతి కావాలి. కాసరగోడ్, కొట్టాయం జిల్లాల కలెక్టర్లు అనుమతించాలి. బంధువుల నుంచి సమ్మతి లేఖను తీసుకోవాలి. "దీని కోసం ఏడాది పాటు పోరాడాను. చివరకు నా కోరిక నెరవేరింది. కొట్టాయంలోని కొల్లాడ్ శ్మశానవాటికలో అమ్మ సమాధి పక్కనే నాన్నను ఖననం చేశాం" అని శిబు 'ఈటీవీ భారత్'తో ఉద్వేగంగా చెప్పారు.


బిచ్చగాడి ఖాతాలో రూ.లక్షలు మరణం తర్వాత వెలుగులోకి



లేఖరాజ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న వాలంటీర్లు

హరియాణాలోని అంబాలా నగరంలో ఓ యాచకుడి మరణం తర్వాత వెలుగులోకి వచ్చిన విషయం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. గత పదేళ్లుగా మూడు చక్రాల సైకిలుపై నగరంలో తిరుగుతూ భిక్షాటన చేస్తూ వచ్చిన లేఖరాజ్ అనే వృద్ధుడి బ్యాంకు ఖాతాలో రూ.లక్షలు ఉన్నాయని తేలడంతో నోరెళ్లబెట్టారు. అంబాలాలో నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద చిరిగిన దుస్తులు, నీరసించిన ముఖం, పాత సైకిలుతో కనిపించే లేఖరాజ్ స్థానికులకు సుపరిచితుడే. అతడి సైకిలు వెనుక ఒక చిన్న ట్రంకుపెట్టె కట్టేసి ఉండేది. భక్తులు, ప్రయాణికులు ఇచ్చే డబ్బు అలాగే కూడబెట్టి రూ.లక్షలు చేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్న లేఖరాజ్‌ను ఫిబ్రవరి 9న స్థానిక సామాజిక సంస్థ 'వందేమాతరం దళ్' ప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత ఆయన కన్నుమూశారు. ఆ సామాజిక సంస్థ సభ్యులే అంత్యక్రియలు చేశారు. అనంతరం పోలీసులు లేఖరాజ్ సామాన్లను తనిఖీ చేయగా.. ఇనుపపెట్టెలో రూ.50,000 విలువైన రూ.500 నోట్లకట్ట దొరికింది. దీనిపై బ్యాంక్ ఆఫ్ ఇండియా సీలు ఉంది. విడిగా రూ.16,120 మేర నోట్లు ఉన్నాయి. పెట్టెలో దొరికిన పాస్‌బుక్కు ఖాతాలో రూ.3,32,000 జమ చేసి ఉన్నాయి.

రామ్మూర్తి ఘనాపాఠి కన్నుమూత



రామ్మూర్తి ఘనాపాఠి

చంద్రగిరి, న్యూస్‌టుడే: తితిదే వేద పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ రామ్మూర్తి ఘనాపాఠి (72) కన్నుమూశారు. దేశంలో వేద వేదాంగాలు ఔపోసన పట్టిన అతికొద్దిమంది అత్యున్నత వేదపండితుల్లో ఆయన ఒకరు. తితిదే వేద పాఠశాలలో చదివి అక్కడే అధ్యాపకులుగా, ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి వందలమందిని వేద పండితులుగా తీర్చిదిద్దారు. ఉద్యోగ విరమణ అనంతరం చంద్రగిరి మండలం దిగువరెడ్డివారిపల్లిలోని స్వగృహంలో పిల్లలకు వేదం, శాస్త్రం, జ్యోతిషం నేర్పుతూ తుదిశ్వాస వరకు వేదసేవలో తరించారు. ఆయన శిష్యులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వేద పండితులుగా కొనసాగుతున్నారు. శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

వైకాపా ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా సురేంద్ర

ఈనాడు, అమరావతి: వైకాపా ఎస్టీ విభాగం (మైదాన ప్రాంతం) అధ్యక్షుడిగా రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గుండా సురేంద్రను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది.

ద్విదేశ పరిష్కారానికే మా మద్దతు

● పాలస్తీనా అంశంపై భారత్


దిల్లీ: పాలస్తీనా సమస్యకు ద్విదేశ పరిష్కారమే మార్గమని భారత్ పునరుద్ఘాటించింది. వెస్ట్‌బ్యాంక్‌లో అక్రమ నివాసాలను విస్తరించేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ 100కుపైగా దేశాలు, సంస్థలు చేసిన తీర్మానాన్ని సమర్థిస్తూ భారత్ ఈ ప్రకటన చేసింది. తొలుత ఈ తీర్మానానికి అనుకూలంగా 80కు పైగా దేశాలు స్పందించాయి. ఈ జాబితాలో భారత్ పేరు లేదు. తర్వాత వెలువడిన ప్రకటనలో భారత్ సహా మరో 20 దేశాల పేర్లు ఉన్నాయి.

✦ వాషింగ్టన్‌లో గురువారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్వహించిన గాజాపై నిర్వహించిన శాంతి మండలి సమావేశంలో భారత్ కూడా పాల్గొందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. పరిశీలకుడి పాత్రలో ఈ సమావేశానికి భారత్ హాజరైందని తెలిపారు. ✦ భారత్‌తో బంధాన్ని బలోపేతం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఈ నెల 25 నుంచి ఇజ్రాయెల్‌లో ప్రధాని మోదీ రెండు రోజులు పర్యటించనున్నారు. గురువారం ఓ కార్యక్రమంలో నెతన్యాహు మాట్లాడుతూ.. మోదీ పర్యటనను ప్రస్తావించారు. భారత్ శక్తిమంతమైన దేశమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మోదీ.. ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు.

మధ్యప్రదేశ్ పట్టణంలో మతపరమైన ఉద్రిక్తత

జబల్‌పుర్: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్ జిల్లా సిహోరా పట్టణంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలు పక్కపక్కనే ఉన్న ఆజాద్‌చౌక్ ప్రాంతంలో గురువారం రాత్రి 10 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఎవరూ గాయపడలేదని అధికారులు చెబుతున్నారు. అయితే శుక్రవారం పట్టణంలోని అధికభాగం దుకాణాలు మూసి ఉన్నాయి. రాత్రి హారతి కార్యక్రమం జరుగుతున్న సమయంలో తమ ప్రార్థనా స్థలానికి చెందిన ప్రవేశ ద్వారాన్ని కొందరు దుండగులు పగులగొట్టారని ఒక వర్గం చెబుతుండగా, పవిత్ర మాసం ప్రారంభ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలు, హారతి కార్యక్రమం ఒకేసారి ప్రారంభం కావడం ఉద్రిక్తతలకు దారి తీసిందని మరో వర్గం చెబుతోంది. పరిస్థితిని అదుపు చేసేందుకు బాష్పవాయు గోళాలు ప్రయోగించాల్సి వచ్చిందని ఎస్పీ సంపత్ ఉపాధ్యాయ చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ 49 మందిని అరెస్టు చేశామని అదనపు ఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు. ఇరు వర్గాలూ పరస్పరం రాళ్లు రువ్వుకున్నాయని, ఒక వర్గానికి చెందిన వారు మాత్రమే రాళ్లు రువ్వారనడంలో వాస్తవం లేదని జిల్లా కలెక్టరు రాఘవేంద్ర సింగ్ తెలిపారు.

సిపాయిల తిరుగుబాటు 1857 కంటే ముందుగానే గిరిజనులు ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. బ్రిటిష్ దోపిడీ విధానాలను నిరసిస్తూ, వారిని తమ గిరిజన ప్రాంతాల నుంచి తరిమివేయడానికి విఫలయత్నం చేశారు. ఆంగ్లేయ పాలన ప్రారంభం నుంచి అంతం వరకు భారత గిరిజన పోరాటం నిరంతరం కొనసాగింది. తమ వద్ద ఉన్న విల్లు బాణాలతో సామ్రాజ్యాధిపతులను ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. అసమానుల మధ్య జరిగిన ఈ పోరాటంలో వేలాదిమంది గిరిజనులు అమరులయ్యారు. గిరిజనులు అత్యంత ధైర్యసాహసాలతో పోరాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆంగ్లేయులు గిరిజన తిరుగుబాట్లను ఉక్కుపాదంతో అణిచివేశారు.



విల్లంబులే ఆయుధాలుగా.. ఆధిపత్యంపై అసమాన పోరు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

గిరిజన - రైతాంగ తిరుగుబాట్లు

ముఖ్యమైన గిరిజన పోరాటాలు

ఖాసీ: వీరు అస్సాంకు చెందిన గిరిజనులు. ఝూమ్ (పోడు) వ్యవసాయాన్ని నిషేధించడంతో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా 1829-32 మధ్య తిరుత్‌సింగ్, బార్‌మానిక్ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.

కోల్: ఆంగ్లేయుల చట్టాలు, ఆర్థిక దోపిడీ, గిరిజనుల సామాజిక ఆచార వ్యవహారాల్లో జోక్యాన్ని నిరసిస్తూ 1831-32 మధ్య కోల్ తెగ వారు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈ తెగ నివసించే అవటీ ప్రాంతాన్ని ఆంగ్లేయులు రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి వారిపై ఆంక్షలు విధించడంతో బుద్ధో భగత్ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.

ఖోండ్: ఒడిశాకు చెందిన గిరిజన తెగ. ఆంగ్లేయులు వీరి మత సంప్రదాయమైన నరబలులను నిషేధించారు. దీంతో 1846-60 మధ్య కాలంలో చక్ర బియాసి నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.

సంతాల్: బిహార్‌కు చెందిన ఈ తెగ 1855-56 మధ్య ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. ఈ తిరుగుబాటుకు సిద్ధు, అతడి సోదరుడు కన్హు నాయకత్వం వహించారు. గిరిజనేతరుల దోపిడీ, ఆంగ్లేయులు గిరిజనేతరులకు మద్దతివ్వడం ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణం. ఈ తిరుగుబాటును 'hul' అంటారు.

కచనాగ: వీరు అస్సాంకు చెందినవారు. ఆంగ్లేయుల సామ్రాజ్యాధిపత్యానికి వ్యతిరేకంగా 1882లో సంబుదాస్ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.

ముండా: వీరు ఝార్ఖండ్‌కు చెందినవారు. బిర్సా ముండా నాయకత్వంలో 1899-1900 మధ్య కాలంలో వీరు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించమని ముండాలపై క్రైస్తవ సంఘాలు ఒత్తిడి తీసుకురావడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ తిరుగుబాటును 'Ulgulan' అంటారు.

కొండదొరలు: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరు కొర్ర మల్లయ్య నాయకత్వంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా 1900లో తిరుగుబాటు చేశారు.

భిల్లులు: వీరు గోవిందగురు నాయకత్వంలో 1913లో తిరుగుబాటు చేశారు.

రంపా: దీనికి అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించారు. 1922-24 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఆంగ్లేయ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.

కిసాన్ సభల ఏర్పాటు

❖ 1918లో యునైటెడ్ ప్రావిన్స్ కిసాన్ సభను గౌరీశంకర్ మిశ్రా, ఇంద్ర నారాయణ ద్వివేది తదితరులు స్థాపించారు. ఈ రైతు సంఘం స్థాపనకు మదన్‌మోహన్ మాలవీయ సహకారం అందించారు. ❖ 1920లో అవధ్ కిసాన్ సభను బాబా రామచందర్ స్థాపించారు. జవహర్‌లాల్ నెహ్రూ దీని స్థాపనకు సహాయం అందించారు.

❖ 1928లో ఆచార్య ఎన్.జి.రంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాన్ని స్థాపించారు.

❖ స్వామి సహజానంద 1929లో బిహార్ కిసాన్ సభను స్థాపించారు. రాష్ట్ర స్థాయి రైతు సంఘాలు స్థాపించిన తర్వాత రైతు సంఘ నాయకులు జాతీయ స్థాయిలో రైతు సంఘ స్థాపన ఆవశ్యకతను గుర్తించారు. ఫలితంగా 1936లో లఖ్‌నవూలో ఆల్ ఇండియా కిసాన్ సభను స్థాపించారు. దీని తొలి అధ్యక్షుడు స్వామి సహజానంద.

రైతు ఉద్యమాలు

ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన మరో ముఖ్యమైన వర్గం రైతులు. దోపిడీ ధోరణితో ప్రవేశపెట్టిన బ్రిటిష్ ఆర్థిక విధానాలతో భారత రైతాంగం భారీగా నష్టపోయింది. ఫలితంగా 19, 20వ శతాబ్దాల్లో అనేక రైతాంగ పోరాటాలు కొనసాగాయి. 1858-1947 మధ్య కాలంలో 80 ప్రధాన రైతు ఉద్యమాలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగాయి.

నీలిమందు విప్లవం (1859–60): ఈ ఉద్యమం బెంగాల్‌లోని నాదియ జిల్లా గోవిందపూర్ గ్రామంలో ప్రారంభమై అనేక ప్రాంతాలకు విస్తరించింది. ఆంగ్లేయులు నీలిమందు పంటను పండించమని రైతులపై ఒత్తిడి పెంచడాన్ని నిరసిస్తూ రైతులు ఈ ఉద్యమం చేశారు. దిగంబర బిశ్వాస్, విష్ణు బిశ్వాస్ అనే సోదరులు దీనికి నాయకత్వం వహించారు. ◆ కలకత్తా నగరంలోని మేధావులు, Hindu Patriot పత్రిక సంపాదకుడు హరిశ్చంద్ర ముఖర్జీ ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. దీనబంధుమిత్ర అనే మేధావి నీలిమందు రైతుల కష్టాలను తెలుపుతూ 'నీల్ దర్పణ్' అనే ప్రముఖ బెంగాలీ నాటకాన్ని రచించాడు. ఈ ఉద్యమ ఒత్తిడితో ఆంగ్లేయులు 1860లో నీలిమందు పండించడాన్ని నిషేధించారు.

పబ్నా ఉద్యమం (1872–75): బెంగాల్‌లోని పబ్నా జిల్లాలో జమీందార్ల దోపిడీకి వ్యతిరేకంగా ఈ ఉద్యమం ప్రారంభమైంది. దీనికి కేశవచంద్రరాయ్, శంభునాథ్ పాల్, ఖుదీముల్లా నాయకత్వం వహించారు. ఈ ఉద్యమానికి మద్దతుగా 1874లో ఆర్.సి.దత్ Peasantry of Bengal అనే పుస్తకాన్ని రచించారు. 1875లో బెంగాల్ ప్రభుత్వం బెంగాల్ కౌలుదారీ చట్టం (Bengal Tenancy Act) చేసి రైతులకు కొంత రక్షణ కల్పించింది.

దక్కన్ అల్లర్లు (1875–79): మహారాష్ట్రలోని పూనా, అహమ్మద్ నగర్, సతారా, షోలాపూర్ జిల్లాల్లో కొనసాగిన రైతు ఉద్యమానికి దక్కన్ అల్లర్లు అని పేరు పెట్టారు. ఈ ఉద్యమం ప్రధానంగా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న గుజరాతీ, మార్వాడీ వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా కొనసాగింది. వీరినే షావుకార్లు అనేవారు. మహాగోవింద రనడె స్థాపించిన పూనా సార్వజనిక్ సభ ఈ ఉద్యమానికి మద్దతునిచ్చింది. ఈ ఉద్యమ ఒత్తిడితో ఆంగ్లేయులు 1879లో Deccan Agricultural Relief Act ద్వారా వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి రైతులకు ఉపశమనం కల్పించారు.

చంపారన్ సత్యాగ్రహం (1917): బిహార్‌లోని చంపారన్ జిల్లాలో నీలిమందుకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం. ఈ ప్రాంతంలో అమలవుతున్న తీన్‌కథియ (3/20) ప్రకారం ప్రతి రైతు సాగు చేస్తున్న భూమిలో 3/20వ వంతు తప్పనిసరిగా నీలిమందు కోసం కేటాయించాలి. రాజ్‌కుమార్ శుక్లా అనే చంపారన్ వాసి ఆహ్వానం మేరకు మహాత్మాగాంధీ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఇది భారతదేశంలో గాంధీజీ చేపట్టిన తొలి ఉద్యమం. భారత్‌లో గాంధీజీ తొలిసారిగా ఈ ఉద్యమంలోనే సత్యాగ్రహం చేపట్టారు. (1906లో తొలి సత్యాగ్రహాన్ని జాతివివక్షతను వ్యతిరేకిస్తూ దక్షిణాఫ్రికాలో చేపట్టారు)



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

928 Word of the Day

Conciliatory

Telugu meaning: శాంతిపూర్వక, స్నేహపూర్వక

English meaning: The word conciliatory (కన్సిలియాటొరీ) is an adjective that describes behaviour intended to pacify, calm, or resolve conflict between people.

Synonyms: Appeasing, Pacifying; ***Antonyms:*** Aggressive, Hostile

Usage: **1.** The manager adopted a conciliatory approach to resolve the dispute between the two employees without escalating the tension.

2. His conciliatory tone during the negotiations helped both parties reach a mutually beneficial agreement.

కరెంట్ అఫైర్స్



తుపానును కచ్చితంగా అంచనా వేసే ఆధునిక పరికరం 'వేవ్ ప్రొపెల్డ్ వర్టికల్ ప్రొఫైలర్ (డబ్ల్యూవీపీ)'ను చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) రూపొందించింది. సముద్ర పర్యవేక్షణ, తీర ప్రాంత కార్యకలాపాలకు సంబంధించిన డేటా పొందేందుకు దేశంలోనే మొదటిసారిగా అలల శక్తితో పనిచేసే 'డబ్ల్యూవీపీ'ని తయారు చేసినట్లు ఎన్ఐఓటీ పేర్కొంది. చెన్నై సముద్ర తీరంలో 50 మీటర్ల లోతున విజయవంతంగా దీన్ని పరీక్షించారు.



పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచిన జపాన్ ప్రధానమంత్రి సానే తకాయిచి 2026, ఫిబ్రవరి 18న రెండోసారి అధికార పగ్గాలు చేపట్టారు. ఇటీవల వెలువడిన పార్లమెంట్ దిగువసభ ఎన్నికల ఫలితాల్లో తకాయిచి నేతృత్వంలోని లిబరల్ డెమోక్రటిక్ పార్టీ మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది.



ఇండియా ఇంపాక్ట్ సమిట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని భారత మండపంలో 2026, ఫిబ్రవరి 19న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ సక్రమ వినియోగానికి 'మానవ్' (ఎంఏఎన్ఏవీ) విజన్‌ను ఆవిష్కరించారు. ఎం: నైతికత, విలువల వ్యవస్థ (మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్స్); ఏ: జవాబుదారీ పాలన (ఎకౌంటబుల్ గవర్నెన్స్), ఎన్: జాతీయ సార్వభౌమత్వం (నేషనల్ సావర్నిటీ); ఏ: అందుబాటు, సమ్మిళితం (యాక్సెసబుల్, ఇంక్లూజివ్); వీ: చెల్లుబాటు, చట్టబద్ధత (వ్యాలిడ్, లెజిటమేట్).



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విశాఖ తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయంలోని సముద్రిక ఆడిటోరియంలో 2026, ఫిబ్రవరి 19న 'మిలన్ - 2026'ను ప్రారంభించారు. భాగస్వామ్య దేశాలకు చెందిన నౌకాదళాల మధ్య పరస్పర సామర్థ్యాల పెంపు, స్నేహపూర్వక వాతావరణం మరింత పెంపొందించుకోవడానికి మిలన్ ప్రయత్నిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ సాంకేతికత - వ్యవసాయ రంగం


వ్యవసాయ రంగంలో జీవ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. పంటలను చీడపీడల నుంచి రక్షించేందుకు, అధిక దిగుబడికి, నాణ్యమైన వంగడాల రూపకల్పనకు ఇది ఎంతగానో తోడ్పడుతోంది. పశుసంరక్షణ కార్యక్రమాలు, ఫుడ్ ప్రాసెసింగ్‌లోనూ దీన్ని వినియోగించి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

వ్యవసాయ రంగంలో జీవ సాంకేతికతను 1990 నుంచి ప్రవేశపెట్టారు. అప్పటివరకు ఉన్న సంప్రదాయ వ్యవసాయ విధానాన్ని ఇది సమూలంగా మార్చివేసింది.

☛ వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి; చీడపీడలు, వ్యాధి నిరోధకత; అత్యంత పోషక విలువలు కలిగిన వంగడాలు; మరింత దిగుబడినిచ్చే పంటల రూపకల్పన మొదలైన నవీన ఆవిష్కరణలకు జీవ సాంకేతికత నాంది పలికింది.

పశు సంరక్షణలో జీవసాంకేతికత

☛ పశు సంరక్షణ కార్యక్రమాల్లో కూడా జీవ సాంకేతికతను ఉపయోగించి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. జీవాల నిర్వహణ, అధిక పాలను ఇచ్చే పశు సంపద సృష్టి, అత్యంత త్వరగా పెరిగే చేపలు మొదలైనవన్నీ జీవ సాంకేతికత ఫలితాలే.



బయో ఫెర్టిలైజర్స్ - వర్గీకరణ, ప్రయోగాలు - ఫలితాలు, వర్మీ కంపోస్ట్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఫిబ్రవరి 21 చరిత్రలో ఈనాడు

ఒక వ్యక్తి తన చిన్నతనంలో కుటుంబ సభ్యుల ద్వారా నేర్చుకునే భాషను మాతృభాష అంటారు. ఇది మనిషికి వ్యక్తిత్వంతోపాటు గుర్తింపును ఇస్తుంది. సంప్రదాయాలు, వారసత్వంలో లోతైన బంధాన్ని ఏర్పర్చడంలో సాయం చేస్తుంది. మెరుగైన అభ్యాసం, అవగాహనకు మాతృభాష వాడకం అవసరం. కేవలం సమాచారాన్ని తెలపడానికే కాకుండా మన సంస్కృతిలో భాగమైన మాతృభాష ఔన్నత్యాన్ని గుర్తించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 21న 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం'గా (International Mother Language Day) నిర్వహిస్తారు. భాషా వైవిధ్యాన్ని, అంతరిస్తోన్న భాషలను కాపాడటంతోపాటు బహుభాషా అభ్యాసాన్ని ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

మాతృభాష అవసరం

☛ మాతృభాష అనేది మన ప్రాథమిక భాష. మనం నివసిస్తోన్న సమాజంలోని వ్యక్తులను అనుసంధానించడానికి ఇది తోడ్పడుతుంది. ఏదైనా విషయంపై అవగాహన పెంపొందించుకోవడానికి లేదా జ్ఞాన సముపార్జనకు మాతృభాష అభ్యసనం చాలా ఉపయోగపడుతుంది.

☛ ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి ఎక్కువ భాషలు మాట్లాడగల సామర్థ్యం అవసరం. ఇందుకోసం అనేకమంది ప్రజలు తమ మాతృభాషను విస్మరించి విదేశీ భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సాంస్కృతిక గుర్తింపును కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

☛ పిల్లలు మాతృభాషలో నేర్చుకోవడం వల్ల అభిజ్ఞా వికాసం (cognitive development), విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు (critical thinking skills) మెరుగైనట్లు అనేక శాస్త్రీయ ఆధారాలున్నాయి.

☛ మాతృభాష ఎప్పటికీ తర్వాతి భాష అభ్యాసానికి పునాదిగా ఉంటుంది.



గణాంకాలు, యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌తో సహా ఆర్ఆర్‌బీ గ్రూప్ డి తదితర పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

సీఎస్ఐఆర్ - ఐఐసీటీలో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), వివిధ స్పాన్సర్డ్ ప్రాజెక్టులలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 13. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 24న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 200. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 24న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ప్రొఫెసర్ ఉద్యోగాలు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నోయిడా (ఈఎస్ఐసీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 18. ఇంటర్వ్యూ తేదీ 2026, ఫిబ్రవరి 25.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 21) చివరి తేదీ

▮ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో 46 మల్టీ-టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగాలు. పదో తరగతి/ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Time Speed & Distance

1. Ritika drove her car at an average speed of 60 km/hr for the first 90 km, and then at an average speed of 90 km/hr for the remaining 90 km. If she made no stops during the trip, what was her average speed (in km/hr) for the entire trip?

A) 72 B) 75 C) 78 D) 80

2. Stations P and Q are 360 km apart. A train starts from station P at 2 P.M. and travels towards Q at 60 km/hr. Another train starts from station Q at 3 P.M. and travels towards P at 90 km/hr. At what time do the two trains meet?

A) 4 P.M. B) 4 : 30 P.M. C) 5 P.M. D) 5 : 30 P.M.

3. A bus moves from station X towards station Y, which is 360 km away. One hour later, a car whose speed is in the ratio 4 : 3 with that of the bus starts from station X towards station Y. If the car reaches station Y, 1 hour earlier than the bus, find the speed of the bus (in km/hr).

A) 45 B) 48 C) 54 D) 60

4. Two boys move in opposite directions, one from P to Q and the other from Q to P. The boy from P reaches the destination in 20 minutes. The boy from Q stops on the way for 5 minutes and reaches his destination in 35 minutes. If the speed of the boy from P is 6 km/hr, then what is the speed (in km/hr) of the boy from Q?

A) 3 B) 4 C) 5 D) 6

5. Two trains of lengths 360 metres and 240 metres are moving towards each other at speeds of 144 km/hr and 72 km/hr, respectively. If the distance between the two trains is 600 metres, then in how many seconds will the trains completely cross each other?

A) 20 B) 25 C) 30 D) 35

6. A caterpillar of length 20 cm is crawling along a straight path with a speed of 3 cm/s. A beetle overtakes the caterpillar in 5 seconds. Assuming both move in the same direction along parallel paths, what is the speed (in cm/s) of the beetle?

A) 6 B) 7 C) 8 D) 9

7. Rohan drives his car 60 km at a speed of 60 km/hr and, for the next 1 hour, he drives it at a speed of 90 km/hr. Find his average speed (in km/hr) for the entire journey.

A) 70 B) 72 C) 75 D) 80

8. A person increases his speed by 50%. By doing so, he reaches his office 10 minutes earlier than usual. How much time (in minutes) does he usually take to reach his office?

A) 25 B) 30 C) 35 D) 40

9. Rohan drives his car 45 km at a speed of 60 km/hr and, for the next 1 hour 30 minutes, he drives it at a speed of 72 km/hr. Find his average speed (in km/hr) for the entire journey.

A) 68 B) 65.5 C) 69 D) 70

10. A man travelled a total distance of 180 km in 20 hours. He travelled partly on foot at 6 km/hr and partly by bicycle at 12 km/hr. What is the distance (in km) travelled by bicycle?

A) 120 B) 150 C) 90 D) 60

11. Rohit climbs up a hill at a speed of 4 km/hr and comes down at a speed of 6 km/hr. If the total time taken for the two-way journey is 10 hours, then what is the distance (in km) between the hilltop and the foothill?

A) 20 B) 22 C) 24 D) 25

12. If a student goes from his home to school at a speed of 12 km/hr, he reaches 10 minutes early. If he goes at a speed of 8 km/hr, he reaches 20 minutes late. What is the distance (in km) between his home and school?

A) 6 B) 8 C) 10 D) 12

13. A train can cover a certain distance in 4 hours. If its speed is increased by 20 km/hr, the journey time reduces by 1 hour. Find the initial speed of the train.

A) 40 km/hr B) 60 km/hr C) 80 km/hr D) 100 km/hr

14. A train takes 3 hours to travel from place P to Q at a speed of 60 km/hr. The same train then takes 2 hours to travel from Q to R at a speed that is 50% higher than its original speed. What is the average speed (in km/hr) of the train from place P to R?

A) 72 B) 75 C) 78 D) 80

15. A train can cover a certain distance in 2 hours. If its speed is increased by 20 km/hr, the journey time reduces by 30 minutes. Find the initial speed (in km/hr) of the train.

A) 40 B) 60 C) 80 D) 100

16. If Rakesh cycles at 18 km/h instead of 15 km/hr, he would have cycled 24 km more in the same time. What is the actual distance (in km) cycled by him?

A) 96 B) 108 C) 120 D) 144

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ 25వ ఆల్ ఇండియా మేజర్ పోర్ట్ కల్చరల్ మీట్ 2025-26ను జనవరిలో ఎక్కడ నిర్వహించారు? (ఈ సాంస్కృతిక సమావేశంలో దేశంలోని 9 ప్రధాన ఓడరేవులకు ప్రాతినిధ్యం వహిస్తూ 200 మంది కళాకారులు పాల్గొన్నారు.) **జ:** పారాదీప్

◆ రక్షణ, సాంకేతికత, ఖనిజ సహకారం, సెమీకండక్టర్స్, గ్రీన్‌ఎనర్జీ, ఆర్థిక సహకారం తదితర రంగాల్లో ఇటీవల భారత్‌తో ఏ దేశం ఒప్పందాలను కుదుర్చుకుంది? **జ:** జర్మనీ

◆ హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ 2026లో ఏ దేశ పాస్‌పోర్టు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైందిగా నిలిచింది? **జ:** సింగపూర్ (ఈ దేశ పౌరులు ప్రపంచంలోనే అత్యధికంగా 192 గమ్యస్థానాలకు వీసా రహిత లేదా వీసా-ఆన్-అరైవల్ యాక్సెస్‌ను కలిగి ఉన్నారు. 55 గమ్యస్థానాలతో భారత్ ఈ ర్యాంకింగ్స్‌లో 80వ స్థానంలో నిలిచింది.)

◆ 2026, జనవరిలో రెస్పాన్సిబుల్ నేషన్స్ ఇండెక్స్ (ఆర్ఎన్ఐ)-2026ను ఏ సంస్థ విడుదల చేసింది?
జ: వరల్డ్ ఇంటలెక్చువల్ ఫౌండేషన్ (నైతిక, పర్యావరణ, సామాజిక బాధ్యతలను ప్రమాణాలుగా తీసుకుని 154 దేశాలతో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఐఐఎం ముంబయి, డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌ల సహకారంతో డబ్ల్యూఐఎఫ్ రూపొందించిన ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచింది. భారత్ 16వ స్థానాన్ని దక్కించుకుంది.)

మరింత సమాచారం

TENTH Maths — Quadratic Equations

1. Represent the following situation in the form of quadratic equation: 4 Marks

The area of a rectangular plot is 528 m^2. The length of the plot (in metres) is one more than twice its breadth. We need to find the length and breadth of the plot.

Sol: Let the breadth of the rectangular plot be 'b'.
Then its length is $l = 2b + 1$
We know that area of rectangle is $A = l.b$
Given area of the plot is 528 m^2.
$528 = (2b + 1)b \Rightarrow 528 = 2b^2 + b \Rightarrow 2b^2 + b - 528 = 0$
Required equation to find length and breadth of the rectangular plot is $2b^2 + b - 528 = 0$.

2. Represent the following situation in the form of quadratic equation:

Rohan's mother is 26 years older than him. The product of their ages (in years) 3 years from now will be 360. We would like to find Rohan's present age.

Sol: Let Rohan's present age be 'x' years.
Rohan's mother is 26 years older than him.
So, Rohan's mother present age = x + 26 years.
In three years from now, Rohan's age is (x + 3) years.
His mother's age is (x + 26 + 3 = x + 29) years.
Their product is (x + 3)(x + 29)
By the sum, their product is 360.
$\therefore (x + 3)(x + 29) = 360$
$\Rightarrow (x^2 + 32x + 87) = 360$
$\Rightarrow x^2 + 32x + 87 - 360 = 0$
$\Rightarrow x^2 + 32x - 273 = 0$. $\therefore$ Required equation to find the present age of Rohan is $x^2 + 32x - 273 = 0$.

Final Exams-2026 IMPORTANT Q & A

3. Give two consecutive positive integers, sum of whose squares is 365.

Sol: Given sum of squares of two consecutive positive integers is 365. Let the two integers be x and x + 1
Then by the sum, $(x)^2 + (x + 1)^2 = 365$
$\Rightarrow x^2 + x^2 + 2x + 1 - 365 = 0$
$\Rightarrow 2x^2 + 2x - 364 = 0 \Rightarrow x^2 + x - 182 = 0$
$\Rightarrow x^2 + 14x - 13x - 182 = 0 \Rightarrow x(x + 14) - 13(x + 14) = 0$
$\Rightarrow (x + 14)(x - 13) = 0$
$\Rightarrow x = -14, x = 13$
Since the integers are positive, so, x = 13
The integers are 13 and 14.

More Imp Q & Ans



Dr. T.S.V.S. Suryanarayana Murty

సంక్లిష్ట బంధాలకు స్పష్టమైన రూపాలు!

రోజూ అనేకమంది వ్యక్తులు కలుస్తుంటారు. మరెన్నో రకాల వస్తువులు కనిపిస్తుంటాయి. వ్యక్తుల్లో బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు తదితరులు ఉంటారు. అదే రీతిలో వస్తువులూ పలు విధాలుగా ఉంటాయి. ఆ వ్యక్తులు, వస్తువులు, సమూహాల మధ్య సంబంధాలను అర్థం చేసుకోగలిగే సామర్థ్యాన్ని అభ్యర్థుల్లో అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో రీజనింగ్‌లో భాగంగా లాజికల్ వెన్ చిత్రాలపై ప్రశ్నలు అడుగుతుంటారు. వాటికి వేగంగా సమాధానాలను గుర్తించాలంటే సంబంధాల స్థితిని అంటే పూర్తి సంబంధం, పాక్షిక, అసలు లేకపోవడం అనే అంశాలను గ్రహించాలి. ప్రధానంగా ఆ మూడింటిపైనే వెన్ చిత్రాలు ఆధారపడి ఉంటాయి. సంక్లిష్ట సమాచారాన్ని వర్గీకరించడం, సమూహాల మధ్య సారూప్యతలు లేదా తేడాలను గుర్తించడం నేర్చుకోవాలి.

జనరల్ స్టడీస్ — రీజనింగ్


లాజికల్ వెన్ చిత్రాలు

లాజికల్ వెన్ చిత్రాలు అంశానికి సంబంధించి ప్రశ్నలు ప్రధానంగా రెండు అంశాలను ఆధారం చేసుకుని వస్తాయి. ఒకటి మూడు పదాలు ఇచ్చి వీటి మధ్య ఉండే సంబంధాన్ని వృత్తాల ఆధారంగా సూచించడం. మరొకటి కొన్ని రకాల అంశాలను వివిధ రకాలైన జ్యామితీయ పటాల్లో ఇచ్చి వాటి మధ్య ఉండే సంబంధాలపై ప్రశ్నలు అడగడం లాంటి ప్రశ్నలు ముఖ్యమైనవి.



మాదిరి ప్రశ్నలు

I. (1 - 4): కింది పటంలో త్రిభుజం టీ తాగేవారిని, వృత్తం కాఫీ తాగేవారిని, దీర్ఘచతురస్రం శీతల పానీయం తాగేవారిని సూచిస్తాయి. అయితే పటం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.



1. ఎంతమంది వ్యక్తులు టీ, శీతల పానీయం తాగుతూ, కాఫీ తాగరు?
1) 20 2) 17 3) 40 4) 10

వివరణ: △ = ✔ ▭ = ✔ ○ = ✘
త్రిభుజం, దీర్ఘచతురస్రంలో ఉంటూ, వృత్తంలో లేని సంఖ్యలను పరిగణించాలి.
రెండింటిలో ఉమ్మడిగా ఉన్న సంఖ్య = 17
జ: 2

2. శీతల పానీయాలు తాగేవారు ఎంత మంది?
1) 100 2) 92 3) 120 4) 122

వివరణ: శీతల పానీయాలు తాగేవారు అంటే దీర్ఘచతురస్రంలో ఉండే సంఖ్యలను పరిగణించాలి.
20 + 17 + 15 + 30 + 40 = 122 **జ:** 4


3. కేవలం కాఫీ మాత్రమే తాగేవారు ఎంతమంది?
1) 45 2) 60 3) 70 4) 30

వివరణ: త్రిభుజం, దీర్ఘచతురస్రం కాకుండా కేవలం వృత్తంలో ఉన్న సంఖ్యలను మాత్రమే పరిగణించాలి. ∴ 25 + 20 = 45
జ: 1

4. మూడింటిని తీసుకునేవారు ఎంత మంది?
1) 10 2) 20 3) 25 4) 15

వివరణ: త్రిభుజం, వృత్తం, దీర్ఘచతురస్రంలో ఉమ్మడిగా ఉన్న సంఖ్యను పరిగణించాలి.
∴ త్రిభుజం + వృత్తం + దీర్ఘచతురస్రం = 15 **జ:** 4

II. (5 - 6): కింది సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.



5. క్రమశిక్షణతో కూడిన క్రీడాకారులైన బాలురు ఎంత మంది?
1) 2 2) 3 3) 6 4) 7

వివరణ: □ = ✔ ○ = ✔ ▭ = ✔
వృత్తం, చతురస్రం, దీర్ఘచతురస్రంలో ఉమ్మడిగా ఉన్న సంఖ్య = 2
జ: 1


6. క్రీడాకారులైన బాలికలు ఎంత మంది?
1) 4 2) 3 3) 7 4) 1

వివరణ: త్రిభుజం, వృత్తంలో ఉమ్మడిగా ఉన్న సంఖ్యలను మాత్రమే పరిగణించాలి.
త్రిభుజం + వృత్తం = 4 + 3 = 7
జ: 3



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

III. 7. కింది పటంలో త్రిభుజం బాలికలను, చతురస్రం క్రీడాకారులను, వృత్తం కోచ్‌ను సూచిస్తుంది. అయితే కోచ్ కాని క్రీడాకారులైన బాలికలను ఏ అక్షరం సూచిస్తుంది?






1) P 2) Q 3) R 4) S

వివరణ: ○ = ✘ □ = ✔ △ = ✔
చతురస్రం, త్రిభుజంలో ఉమ్మడిగా ఉన్న అక్షరం = Q **జ:** 2

IV. 8. కింది పటం క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ ఆటలను ఆడే విద్యార్థులను తెలియజేస్తుంది.






పై పటం ఆధారంగా మూడు రకాల ఆటలను ఆడే విద్యార్థులు ఎవరు?
1) P + Q + R 2) V + T 3) S + T + V 4) S

వివరణ: కేవలం S అనే అక్షరం మాత్రమే మూడు రకాల చతురస్రాల్లో ఉమ్మడిగా ఉంది. **జ:** 4

V. (9 - 10): కింది పటం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.





9. కేవలం ఏదో ఒక భాషను మాత్రమే మాట్లాడేవారు ఎవరు?
1) L + M + O 2) I + J + K 3) K 4) I

వివరణ: కేవలం ఇంగ్లిష్ = I , కేవలం హిందీ = J, కేవలం తమిళం = K
∴ I + J + K **జ:** 2

10. మూడు రకాల భాషలను మాట్లాడేవారిని ఏ అక్షరం సూచిస్తుంది?
1) L 2) N 3) M 4) O

వివరణ: మూడు వృత్తాల్లో ఉమ్మడిగా ఉన్న అక్షరం = N **జ:** 2

ఉమ్మడి జాబితా సంధ్యామండలం!



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ప్రధాన అధికార కేంద్రాలుగా ఉండే భారత సమాఖ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వం ఏం చేయాలి, ఎవరి పరిధులు ఏమిటో రాజ్యాంగం స్పష్టంగా వివరించింది. బలమైన సమాఖ్య కోసం కేంద్రానికి అధిక అధికారాలను ఇస్తూనే, రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గకుండా జాగ్రత్త వహించింది. జాతీయ ప్రయోజనాల కోసం, ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర జాబితా, చట్టాలపై కేంద్రానికి నియంత్రణ ఉండే విధంగా వీలు కల్పించింది. శాసన అధికారాల విభజన కోసం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో చేర్చిన అంశాలు, ఇప్పటి వరకు వాటిలో జరిగిన మార్పుచేర్పులు, సంబంధిత రాజ్యాంగ సవరణలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. కేంద్ర, రాష్ట్ర శాసన సంబంధాలు, వివాదాలు, అధికార కేంద్రాలను సమన్వయం చేయడంలో సుప్రీంకోర్టు పాత్ర, వివిధ సందర్భాల్లో ఇచ్చిన తీర్పులను గుర్తుంచుకోవాలి.

ఇండియన్ పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

(శాసన సంబంధాలు)

1. కేంద్ర-రాష్ట్ర శాసన సంబంధాల గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?



   1) 11వ భాగం, ఆర్టికల్స్ 245 నుంచి 251
   2) 11వ భాగం, ఆర్టికల్స్ 245 నుంచి 255
   3) 11వ భాగం, ఆర్టికల్స్ 241 నుంచి 251
   4) 12వ భాగం, ఆర్టికల్స్ 243 నుంచి 255

2. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారాల విభజనను రాజ్యాంగంలోని ఎన్నో షెడ్యూల్ వివరిస్తుంది?
   1) 7వ 2) 8వ 3) 9వ 4) 11వ

3. కేంద్ర-రాష్ట్రాల మధ్య జరిగిన అధికారాల విభజనకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   1) ఉమ్మడి జాబితా, రాష్ట్ర జాబితా, అవశేష జాబితా, కేంద్ర జాబితా
   2) కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా, ఆదర్శ జాబితా
   3) కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా
   4) కేంద్ర జాబితా, ఫెడరల్ జాబితా, ఉమ్మడి జాబితా

4. కేంద్ర జాబితాకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఈ జాబితా ప్రారంభంలో 97 అంశాలు ఉండేవి.
   బి) ప్రస్తుతం 98 అంశాలు ఉన్నాయి.
   సి) జాతీయ ప్రాధాన్యం గల అంశాలు ఉంటాయి.
   డి) ఈ జాబితా అంశాలపై శాసనాలు రూపొందించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

5. అంతర్రాష్ట్ర వ్యాపార వాణిజ్యంపై పన్నులు విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తున్న 92(ఎ) అంశాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కేంద్ర జాబితాలోకి చేర్చారు?
   1) 6వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956
   2) 7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956
   3) 8వ రాజ్యాంగ సవరణ చట్టం, 1960
   4) 9వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956

6. కేంద్ర జాబితాలో ఉన్న అంశాన్ని గుర్తించండి.
   ఎ) పౌరసత్వం, బ్యాంకింగ్, నౌకాయానం, దేశరక్షణ.
   బి) విదేశీ వ్యవహారాలు, పోస్టాఫీసులు, టెలీకమ్యూనికేషన్స్.
   సి) కరెన్సీ, ప్రామిసరీ నోట్లు, అంతర్రాష్ట్ర నదీజలాలు.
   డి) జనాభా నియంత్రణ, శాంతిభద్రతలు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

7. రాష్ట్ర జాబితాకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఈ జాబితా ప్రారంభంలో 66 అంశాలు ఉండేవి.
   బి) ప్రస్తుతం 59 అంశాలు ఉన్నాయి.
   సి) ఈ జాబితాలోని అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం శాసనాలు రూపొందిస్తుంది.
   డి) ఇందులో ప్రాంతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలను పొందుపరిచారు.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి, డి

8. రాష్ట్ర జాబితాలో ఉన్న అంశాన్ని గుర్తించండి.



   ఎ) వినోదం, రోడ్డు రవాణా, శాంతిభద్రతలు.
   బి) వ్యవసాయం, సాగునీటి పారుదల, వైద్యం, ఆరోగ్యం.
   సి) వ్యవసాయేతర అంశాల ఎస్టేట్ భూములపై చట్టాలు చేయడం.
   డి) స్థానిక స్వపరిపాలన, జైళ్లు, మార్కెట్లు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

9. ఉమ్మడి జాబితాకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఈ జాబితాలో ప్రారంభంలో 47 అంశాలు ఉండేవి.
   బి) ప్రస్తుతం 52 అంశాలు ఉన్నాయి.
   సి) ఈ జాబితాలోని అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు శాసనాలు రూపొందిస్తాయి.
   డి) ఈ జాబితాలోని ఏదైనా అంశంపై శాసనం రూపొందించే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భిన్నాభిప్రాయం వస్తే కేంద్రం మాటే నెగ్గుతుంది.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

10. ఇందిరా గాంధీ ప్రభుత్వ కాలంలో రాష్ట్ర జాబితాలో ఉన్న ఐదు అంశాలను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి మార్చారు?



    1) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
    2) 41వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
    3) 36వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975
    4) 35వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975

11. రాష్ట్ర జాబితాలోని ఏ అంశాలను 1976లో ఉమ్మడి జాబితాలోకి మార్చారు?
    1) విద్య, అడవులు, పత్రికలు, తూనికలు-కొలతలు
    2) జనాభా నియంత్రణ, అడవులు, విద్య, తూనికలు-కొలతలు, వివాహం.
    3) తూనికలు-కొలతలు, విద్య, అడవులు, జనాభా నియంత్రణ, న్యాయ వ్యవహారాలు.
    4) అడవులు, విద్య, వివాహం విడాకులు, తూనికలు-కొలతలు, వారసత్వం.

12. ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాన్ని గుర్తించండి.




    ఎ) వివాహం, విడాకులు, పత్రికలు, ధరల నియంత్రణ
    బి) సామాజిక ఆర్థిక ప్రణాళికలు, ట్రస్టీలు, సామాజిక ఆర్థిక సంక్షేమం
    సి) సివిల్ ప్రొసీజర్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్
    డి) విదేశీ తీర్థయాత్రలు, నల్లమందు, అమ్మకం పన్ను
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

13. ఉమ్మడి జాబితా భావనను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
    1) అమెరికా 2) సోవియట్ రష్యా
    3) ఆస్ట్రేలియా 4) జర్మనీ

14. 'సంధ్యామండలం'గా దేన్ని పేర్కొంటారు?
    1) కేంద్ర జాబితా 2) రాష్ట్ర జాబితా
    3) ఉమ్మడి జాబితా 4) అవశిష్ట జాబితా

15. 'అవశిష్ట జాబితా'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) అవశిష్ట జాబితా అనే అంశాన్ని కెనడా రాజ్యాంగం నుంచి గ్రహించారు.
    బి) ఈ జాబితా ప్రారంభంలో 51 అంశాలు ఉండగా, ప్రస్తుతం 59 అంశాలు ఉన్నాయి.
    సి) ఈ జాబితాలోని అంశాలపై కేంద్రం శాసనాలు రూపొందిస్తుంది.
    డి) ఈ జాబితాలో ఉన్న అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనాలు రూపొందిస్తాయి.
    1) ఎ, సి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

16. ఏదైనా ఒక అంశం అవశిష్ట అంశమా? కాదా? అని ధ్రువీకరించే అధికారం రాజ్యాంగం ప్రకారం ఎవరికి ఉంది?



    1) పార్లమెంటు 2) రాష్ట్రపతి
    3) సుప్రీంకోర్టు 4) కేంద్ర ప్రభుత్వం

17. కేంద్ర ప్రభుత్వం రూపొందించే శాసనాలు దేశం మొత్తానికి వర్తిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే శాసనాలు సంబంధిత రాష్ట్ర భూభాగ పరిధికే వర్తిస్తాయని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
    1) 245 2) 246
    3) 247 4) 248

18. భారత ప్రభుత్వం రూపొందించే ఆదాయ పన్ను చట్టాలు భారతదేశంలో శాఖలు ఉన్న విదేశీ సంస్థలకు కూడా వర్తిస్తాయని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది?
    1) ప్రజ్ఞా వికాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
    2) రూఫ్ హుర్రా వర్సెస్ స్టేట్ ఆఫ్ పశ్చిమ బెంగాల్ కేసు
    3) వాడియా వర్సెస్ స్టేట్ ఆఫ్ బొంబాయి కేసు
    4) చంపకం దొరై రాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాసు కేసు

19. ఆర్టికల్ 246(ఎ)ను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగానికి చేర్చారు?
    1) 101వ రాజ్యాంగ సవరణ చట్టం, 2016
    2) 100వ రాజ్యాంగ సవరణ చట్టం, 2015
    3) 99వ రాజ్యాంగ సవరణ చట్టం, 2015
    4) 96వ రాజ్యాంగ సవరణ చట్టం, 2011


20. ఆర్టికల్ 246(ఎ) ద్వారా చేర్చిన అంశాన్ని గుర్తించండి.
    ఎ) వస్తువులు, సేవల (జీఎస్టీ) అంశంపై అవసరమైన చట్టాలు రూపొందించుకునే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది.
    బి) అంతర్రాష్ట్ర వ్యాపార వాణిజ్యంతో పాటు వస్తువులు, సేవల(జీఎస్టీ)కు సంబంధించి పార్లమెంటు పన్నులు విధిస్తూ ప్రత్యేక చట్టాలు చేయవచ్చు.
    సి) రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే సహాయక గ్రాంట్లకు ప్రత్యేక నియమావళిని రూపొందించవచ్చు.
    1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

21. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన శాసనాలను సమర్థంగా అమలుపరిచేందుకు పార్లమెంటు అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసుకోవచ్చని ఏ ఆర్టికల్ వివరిస్తుంది?
    1) 247 2) 248
    3) 249 4) 251

22. కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో లేని అంశాలు నూతనంగా వచ్చే అంశాలు 'అవశిష్ట అధికారాలు'. వీటి గురించి రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ వివరిస్తుంది?
    1) 243 2) 244 3) 248 4) 242

23. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 249, 250 ప్రకారం రాష్ట్ర జాబితాలోని అంశాలపై రూపొందించిన శాసనాలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వాలు శాసనాలు రూపొందించకూడదు అని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
    1) 251 2) 355
    3) 357 4) 359

24. భారత ప్రభుత్వం విదేశాలతో కుదుర్చుకున్న ఒడంబడికలను అమలు చేసేందుకు అవసరమైన చట్టాలను పార్లమెంటు రూపొందిస్తే, వాటిని రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాలని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?



    1) 250 2) 252
    3) 253 4) 255

25. సుప్రీంకోర్టు తొలిసారిగా ఏ కేసు సందర్భంగా 'కలరబుల్ లెజిస్లేషన్' సిద్ధాంతాన్ని పేర్కొంది?
    1) నారాయణ్‌దేవ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఒరిస్సా
    2) పీపుల్స్ యూనియన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
    3) నందినీ శతపతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక
    4) ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా

26. ప్రభుత్వం రూపొందించిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం తీర్పు ఇచ్చినప్పుడు అదే చట్టాన్ని మరొక రూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఏ విధంగా పేర్కొంటారు?
    1) డాక్టరిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టెన్స్
    2) డాక్టరిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్
    3) డాక్టరిన్ ఆఫ్ అనదర్ లెజిస్లేషన్
    4) డాక్టరిన్ ఆఫ్ డిటెర్మినేషన్ యాక్ట్

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-4; 5-1; 6-1; 7-2; 8-3; 9-4; 10-1; 11-3; 12-2; 13-3; 14-3; 15-1; 16-3; 17-1; 18-3; 19-1; 20-2; 21-1; 22-3; 23-1; 24-3; 25-1; 26-2.